ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య సమాఖ్య (ఎపిసిడిడి)
101, కిషన్ రెసిడెన్సీ, శ్యామ్‌లాల్ బిల్డింగ్ ఏరియా,
బేగంపేట్, హైదరాబాద్
ఆంధ్రప్రదేశ్ 500 016
ఇండియా

ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ (ఐడిఎస్)
యూనివర్సిటీ ఆఫ్ ససెక్స్, బ్రింగ్‌టన్ బిఎన్ 39 ఆర్.ఇ, యు.కె.
టెలిఫోన్: 44(0) 1273 606261
ఫ్యాక్స్: 44(0) 1273 691647
ఇ మెయిల్: IDS@IDS.AC.UK
వెబ్‌సైట్: www.IDS.AC.UK

ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఐఇడి)
3 ఎండ్స్‌లీగ్ స్ట్రీట్, లండన్ డబ్ల్యుసి 3 హెచ్ ఒడిడి, యు.కె.
టెలిఫోన్: 44(0)20 7388 2117
ఫ్యాక్స్: 44(0)20 7388 2826
ఇమెయిల్: INFO@IIED.ORG
వెబ్‌సైట్: www.IIED.ORG

నేషనల్ బయోడైవర్సిటీ స్ట్రాటజీ అండ్ యాక్షన్‌ప్లాన్ (ఎన్‌బిఎస్‌ఎపి)
నేషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్
మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్స్
పర్యావరణ్ భవన్,
సిజిఓ కాంప్లెక్స్, లోధీరోడ్
న్యూఢిల్లీ - 110 003
ఇండియా








# ప్రజాతీర్పు

## ఆంధ్రప్రదేశ్ ఆహార వ్యవసాయ భవితవ్యం పై పౌర న్యాయస్థానం / భవిష్యత్ ఊహాచిత్రాల వర్క్‌షాప్

మిచ్ఛెల్ పింబర్ట్ అండ్ టామ్ వేక్‌ఫర్డ్

IDS Institute of Development Studies Sussex

iied International Institute for Environment and Development

NATIONAL BIODIVERSITY STRATEGY & ACTION PLAN

UNIVERSITY OF HYDERABAD


అమ్మాజి


అంజమ్మ


ఆనందమ్మ


బేబి


గీత


దానమ్మ


గణేశా


బాయక్క


దేవనమ్మ


లక్ష్మమ్మ


నర్సమ్మ


ఫిలిప్


మంగాయమ్మ


మరియమ్మ


పాపారావు


రామయ్య


శామయ్య


శాంతమ్మ


కోటరత్నమ్మ

# ప్రజాతీర్పు

## ఆంధ్రప్రదేశ్ ఆహార వ్యవసాయ భవితవ్యం పై పౌర న్యాయస్థానం / భవిష్యత్ ఊహాచిత్రాల వర్క్‌షాప్

మిఛెల్ పింబర్ట్, టామ్ వేక్‌ఫీల్డ్

ఐడిఎస్ ఐఐఇడి ఎన్‌బిఎస్‌ఎపి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

## నిర్వాహకులు

ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య సమాఖ్య (ఎపిసిడిడి)

ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్, యుకె

ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, యు కె

జాతీయ జీవ వైవిధ్య వ్యూహ, కార్యాచరణ ప్రణాళిక (ఎన్‌బిఎస్‌ఎపి)

హైదరాబాద్ విశ్వవిద్యాలయం

## సమావేశకర్తలు

*గోపరాజు సుధ*

గ్రామీణ జీవనాధారాల కార్యక్రమం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

*కవితా కురుగంటి*

ప్రోగ్రామ్స్ విభాగం, యాక్షన్ ఎయిడ్, ఇండియా

*వినోద్ పావరాల*

కమ్యూనికేషన్ ప్రోగ్రామ్, హైదరాబాద్ విశ్వవిద్యాలయ్

## సమన్వయ బృందం

*డాక్టర్ మిచెల్ పింబర్ట్, ఐఐఇడి*

ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఐఇడి) లండన్‌లో ఉన్న ఒక స్వతంత్ర పాలసీ పరిశోధనా సంస్థ. ప్రధానంగా పర్యావరణానుకూల, సుస్థిరాభివృద్ధికి దోహదపడే విధానాల పై పరిశోధన సాగిస్తోంది.

*డాక్టర్ వినోద్ పావరాల,* హైదరాబాద్ విశ్వవిద్యాలయం

హైదరాబాద్ విశ్వవిద్యాలయంవారి కమ్యూనికేషన్ ప్రోగ్రామ్ ప్రతిష్టాత్మకమైన సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో భాగం. ఈ స్కూల్‌ను అభివృద్ధి కమ్యూనికేషన్ రంగంలో అంతర్జాతీయ స్థాయి సంస్థగా గుర్తించారు.

*పి.వి. సతీష్, ఎపిసిడిడి*

ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య సమాఖ్య (ఆంధ్రప్రదేశ్ కోయిలేషన్ ఫర్ డిఫెన్స్ ఆఫ్ డైవర్సిటీ- ఎపిసిడిడి) రాష్ట్రం భవిష్యత్తు కోసం అందుబాటులో ఉన్న వివిధ వ్యవసాయాభివృద్ధి విధానాలను చర్చిస్తూ, సుస్థిరాభివృద్ధినీ, సామాజికంగాన్యాయమైన భవిష్యత్తునూ కోరుకునే వేదిక.

*డాక్టర్ టామ్ వేక్‌ఫర్డ్, ఐడిఎస్*

బ్రిటన్‌లోని ససెక్స్ యూనివర్సిటీలో ఉన్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ (ఐడిఎస్) అభివృద్ధిరంగంలో భాగస్వామ్య పరిశోధనకు పేరుపొందిన కేంద్రం.

## ఆతిథ్యం

డిడిఎస్ కృషి విజ్ఞాన కేంద్ర
మెదక్ జిల్లా, ఆంధ్రప్రదేశ్

## నివేదిక రచయితలు

డాక్టర్ మిచెల్ పింబర్ట్, ఐఐఇడి

డాక్టర్ టామ్ వేక్‌ఫర్డ్, ఐడిఎస్

## కృతజ్ఞతలు

వీడియోల అనువాదంలోను, వాటి ఇంగ్లీషు రాతప్రతులు తయారుచేయడంలోను సహాయం చేసిన సునంద విక్రమ్‌కు, బన్సురీ తనూజాకు కృతజ్ఞతలు. ఈ నివేదికను ఎడిట్ చేసినందుకు, సకాలంలో దీన్ని ప్రచురించేందుకు తోడ్పడినందుకు కింబెర్లీ క్లార్క్‌కు కృతజ్ఞతలు. సమన్వయ బృందంలోని అనేక మంది సభ్యులు ఈ నివేదిక మునుపటి ప్రతులను చదివి విలువైన సూచనలు చేశారు. వారి సహాయానికి కృతజ్ఞతలు.

Production by **BOOKSLINE**, *publishing for better life*, a venture of SRAS Publications, Hyderabad.
Tel : 040-55618506, 23356210

# ప్రజాతీర్పు

## ఆంధ్రప్రదేశ్ ఆహార వ్యవసాయ భవితవ్యంపై పౌర న్యాయస్థానం/ భవిష్యత్ ఊహాచిత్రాల వర్క్‌షాప్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆహార వ్యవసాయ విధానాలకు సంబంధించిన 'విజన్ 2020' వల్ల అధికంగా ప్రభావితులయ్యే ప్రజలు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునేందుకు ఒక మార్గంగా 'ప్రజాతీర్పు'కు రూపకల్పన చేయడం జరిగింది. వచ్చే రెండు దశాబ్దాల కాలంలో అనుసరించవలసిన అభివృద్ధి వ్యూహంగా విజన్ 2020ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించింది. దీనికి ప్రపంచబ్యాంకు, బ్రిటన్‌కు చెందిన అంతర్జాతీయ అభివృద్ధి విభాగం (డిఎఫ్ఐడి) పాక్షికంగా నిధులందిస్తున్నాయి.

ప్రజాతీర్పు ప్రక్రియలో భాగస్వాముల మధ్య స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో జరిగిన విస్తృతమైన చర్చ నుంచి 'ప్రజాతీర్పు' మెథడాలజీ రూపొందింది. ఈ భాగస్వాములలో కమ్యూనిటీ సంస్థలు, డెవలప్‌మెంట్ ఎన్‌జీవోలు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు ఉన్నారు. ఒక పౌర న్యాయస్థానం (సిటిజన్స్ జ్యూరీ), ఒక భవిష్యత్ ఊహాచిత్రాల వర్క్‌షాప్ - ఈ రెండింటితో కూడినదే 'ప్రజాతీర్పు'. వచ్చే 20 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ ఆహార, వ్యవసాయ రంగాల అభివృద్ధికి అనుసరించగలిగిన వివిధ మార్గాల మీద తీసిన మూడు వీడియో చిత్రాలు ఈ కార్యక్రమానికి అనుబంధంగా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటినుంచి చిన్న, సన్నకారు రైతాంగం నుంచి జ్యూరీ సభ్యులను తీసుకోవడం జరిగింది. వీరిలో అత్యధికులు దళితులు, ఆదివాసీలు. జ్యూరీ సభ్యులలో మహిళలే మెజారిటీ. అనేక మంది సాక్షులను విచారించి సేకరించిన సమాచారం ఆధారంగా జ్యూరీ సభ్యులు తమ సంప్రదింపులను సాగించారు. వారు విచారించిన సాక్షులలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి, ఒక బహుళజాతి వ్యవసాయ రసాయనాల కంపెనీ (సింజెంటా) నుంచి, యూనివర్సిటీల నుంచి, స్థానిక ఎన్‌జీవోల నుంచి, ప్రభుత్వ సలహామండలులనుంచి, కమ్యూనిటీ ఎన్‌జీవోల నుంచి ప్రతినిధులున్నారు.

జ్యూరీ సభ్యులు చేసిన విధానపరమైన సిఫారసులు ఎంత ముఖ్యమైనవో, ప్రజాతీర్పు అనుసరించిన భాగస్వామ్య ప్రక్రియ అంత ముఖ్యమైనది. జ్యూరీ సభ్యులు తమ జ్ఞానానికి ఆమోదం సంపాదించడానికి, విధాన నిర్ణేతల అపోహలను ప్రశ్నించడానికి తగిన అవకాశం పొందేందుకు వీలుగా సమావేశకర్తలు అనేక పద్ధతులు అనుసరించారు. పనికి వచ్చే మాటలు ఏవీ తమ దగ్గర లేవని అనుకుని వచ్చినవాళ్లు, వెళ్లేటప్పుడు తాము ప్రయోజనకరమైన దోహదం చేయగలమన్న నమ్మకంతో వెళ్లారు. అభిప్రాయ సేకరణలు, ప్రశ్నావళులకు సమాధానాలు సేకరించే పద్ధతి, బహిరంగ సభలు, ఫోకస్ గ్రూప్, మీటింగులు - ఈ పద్ధతుల్లో దేని ద్వారానూ సాధించలేనంత గాఢమైన లోచూపును, ఆసక్తిని వారు పొందగలిగారు. ఉదాహరణకు: జన్యుమార్పిడి వంటి సాంకేతికతలలో ఉండే అవకాశం ఉన్న ప్రమాదం గురించి, ప్రయోజనం గురించి చర్చిస్తున్నప్పుడు, ప్రజాతీర్పులో పాల్గొన్నవారు కేవలం వాదోపవాదాలను వినడంతో సరిపెట్టుకోలేదు, వారు ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాలతో ఆ సాంకేతికతలను పోల్చి చూడగలిగారు. గ్రామీణ భవిష్యత్తుల గురించి ప్రతి ఒక్క ఊహాచిత్రమూ ఆర్థిక, సామాజిక పర్యావరణ వ్యవస్థల పరస్పరాధారిత వ్యవస్థగా చూడవచ్చు. పౌర సాధికారత, సంప్రదింపులు, అందరినీ కలుపుకుపోవడం - అన్న ప్రక్రియలు ప్రజాస్వామ్యాన్ని మరింత సంపన్నం చేస్తాయని, నిర్ణయాధికారం ఉన్నవారు తమ చర్యలకు బాధ్యత వహించేటట్టు చేస్తాయని ప్రజాతీర్పు ప్రక్రియ నిర్ధారించింది.

స్పెషలిస్టుల కంటె ప్రజాతీర్పరుల కథనాలలోనే ఎక్కువ వైవిధ్యం ఉన్నది. ఎంతకంటె, వివిధ అంశాల మధ్య ఉన్న సరిహద్దులను జ్యూరీ సభ్యులు పెద్దగా పట్టించుకోలేదు. ఒక రంగానికి మరొక రంగానికి మధ్య ఉన్న సరిహద్దుల వల్ల మసకబారే ఉద్రిక్తతల విషయంలో జ్యూరర్లు కొంతమేరకు ఎక్కువ లోచూపుతో, విశాల హృదయంతో వ్యవహరించగలిగారు. ప్రజా తీర్పు సభ్యుల మధ్య అనేక అభిప్రాయభేదాలున్నాయి. అయినప్పటికీ, అంతిమ ప్రకటన విషయంలో విస్తృతమైన అంగీకారం కనిపిస్తుంది. అటువంటి ఏకాభిప్రాయం వ్యక్తమయ్యే ఈ ప్రకటన చూడండి:

**మేం వ్యతిరేకిస్తున్నాము**

- ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న వారి జనసంఖ్య శాతాన్ని 70 నుంచి 40కి తగ్గించే ప్రతిపాదనను.
- భూకమతాల స్థిరీకరణను, గ్రామీణ ప్రజలను నిర్వాసితులను చేయడాన్ని
- కాంట్రాక్టు వ్యవసాయాన్ని
- కార్మికులను ఉపాధినుంచి తప్పించే యాంత్రీకరణను
- విటమిన్ ఎ బియ్యం, బిటి పత్తితో సహా జి ఎమ్ పంటలను
- మందుమొక్కల మీద, వాటి ఎగుమతి మీద అదుపు కోల్పోవడాన్ని

**ఇంకా మేం కోరుకుంటున్నాము**

- స్వావలంబన కోసం ఆహారం, వ్యవసాయం ఉండాలని: వనరుల మీద కమ్యూనిటీకి పట్టు ఉండాలని
- నేల ఆరోగ్యాన్ని, పంట వైవిధ్యాన్ని, చెట్లు పశువుల రకాలను కొనసాగించాలని, దేశీయ పరిజ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యం, స్థానిక వ్యవస్థలు - వీటి ద్వారా ముందుకుసాగాలని.

విజన్ 2020, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతాంగ జీవనాధారాలను దెబ్బతీస్తుందా, మెరుగు పరుస్తుందా అంటే, మా అభిప్రాయంలో నర్మదా డ్యామ్ లేదా హరిత విప్లవం సాంకేతికతలు చేసినంత మేలు లేదా కీడు చేస్తుంది. ప్రజా తీర్పు ఫలితాలకు ప్రతిస్పందించి, గ్రామీణ భవిష్యత్తులకు సంబంధించి తమ తమ విధానాలలో అంతర్లీనంగా ఉన్న అభిప్రాయాలను సమీక్షించవలసిందిగా భారతదేశంలోనూ, అంతర్జాతీయంగా ఉన్న విధాన నిర్ణేతలను, ప్రభావశాలురైన వ్యక్తులను కోరుతున్నాము. ఆ సమీక్షలో ఇటువంటి మరికొన్ని సరికొత్త ప్రక్రియలు కూడా భాగంగా ఉండాలి.

# విషయ సూచిక


| | |
|---|---|
| పరిచయం | 1 |
| సంప్రదింపుల ప్రజాస్వామ్యం పౌర సాధికారత | 2 |
| ప్రజాతీర్పు | 6 |
| ప్రజాతీర్పు : జ్యూరీ తీర్పు, విజన్ | 15 |
| ప్రజాతీర్పు ప్రక్రియ- మూల్యాంకనం | 36 |
| ప్రజాతీర్పు విస్తృత ప్రాధాన్యం - కొన్ని విమర్శనాత్మక ఆలోచనలు | 56 |
| అనుబంధం | 68 |

# పరిచయం

వ్యవసాయం, భూవినియోగం, మార్కెటింగ్ అంశాల మీద తన వైఖరి గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునరాలోచన చేస్తున్నది. రాష్ట్ర ఆహార వ్యవస్థ భవిష్యత్తుపై ప్రభుత్వ ఆలోచనా సరళిని వ్యూహపత్రాలు, విజన్ 2020 డాక్యుమెంట్ ప్రతిబింబిస్తున్నాయి. ఈ విజన్ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం 1999 రిపబ్లిక్ దినోత్సవం నాడు విడుదల చేసింది. పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించగలిగే భవిష్యత్తును ఈ డాక్యుమెంటు సంకల్పిస్తున్నది. ఈ పత్రం రాష్ట్రంలో కేవలం ఆహార, వ్యవసాయ విధానాల్లోనే కాక మొత్తం సామాజిక, ఆర్థిక జీవనానికి సంబంధించిన అన్ని రంగాల్లో మార్పు తేవాలని ప్రతిపాదిస్తున్నది. మానవవనరులను నిర్మించాలని, చోదకరంగాల (గ్రోత్ ఇంజిన్స్) వంటి అధిక సామర్థ్యమున్న రంగాల మీద దృష్టి కేంద్రీకరించాలని, రాష్ట్రవ్యాప్తంగా పరిపాలనలో మార్పు తేవాలని విజన్ డాక్యుమెంటు లక్ష్యంగా పెట్టుకున్నది (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 1999). ఈ సమగ్ర దృక్పథానికి ఆచరణరూపం ఇవ్వడం, రాష్ట్ర ప్రభుత్వ పేదరిక నిర్మూలన వ్యూహంతో గాఢంగా ముడిపడిఉన్నది. ఈ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అనేక విదేశీ అభివృద్ధి సంస్థలు సహాయం చేస్తున్నాయి. ఈ సంస్థలలో ప్రపంచ బ్యాంకు, బ్రిటన్ ప్రభుత్వ విదేశీ సహాయ మంత్రిత్వ శాఖ (డిఎఫ్ఐడి) ప్రధాన దాతలుగా ఉన్నాయి.

రాష్ట్రంలోని 7కోట్ల మంది జనాభాలో 70 శాతం మంది వ్యవసాయ రంగంలోనే పనిచేస్తున్నారు (www.andhrapradesh.com). ఆహార విధానంలో మౌలిక, తీవ్రమైన మార్పులను విజన్ 2020లో ప్రతిపాదించారు. కానీ ఈ విధాన రూపకల్పనలో, భవిష్యత్తు చిత్రాన్ని తయారుచేయడంలో (జివో ఎపి 200 ఎ, 2000, 2001 ఎ) చిన్న రైతులు, గ్రామీణ ప్రజల భాగస్వామ్యం కరువైంది. జీవనాధారాల భద్రత, వ్యవసాయ జీవ వైవిధ్యం, స్థానిక ఆహార, ఆర్థిక వ్యవస్థల మీద విజన్ 2020 ప్రభావం గురించి స్థానికంగా, రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. విజన్ 2020లో ప్రజలతో మరింతగా సంప్రదించవలసిన అంశాలను గురించి అంతర్జాతీయ దాతలు, రాష్ట్రంలోని అధికార్లు కూడా ప్రస్తావిస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే బ్రిటన్‌కు చెందిన పర్యావరణ, అభివృద్ధి విషయాల అంతర్జాతీయ సంస్థ (ఐఐఇడి), అభివృద్ధి అధ్యయన సంస్థ (ఐడిఎస్) రాష్ట్రంలో ఆహార వ్యవస్థల భవిష్యత్తు విషయంలో ఉన్న విధానపరమైన అవకాశాల గురించి మరింత హెచ్చు స్థాయిలో ప్రజాచర్చ జరగాలని భావించాయి. సంబంధిత పక్షాలతో సహా ఎక్కువ మంది పాలుపంచుకునే 'భాగస్వామ్య ప్రక్రియ'ను ఐఐఇడి, ఐడిఎస్ రూపొందించి, నిర్వహించాయి.

రాష్ట్రంలో ఆహార, వ్యవసాయ వ్యవస్థల భవిష్యత్తు పై జరిగిన పౌర న్యాయస్థానం పేరు 'ప్రజా తీర్పు'. ఆరురోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమం - సంప్రదింపులతో కూడిన ప్రజాస్వామ్య ప్రయోగం. ఇందులో రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుంచి సన్నకారు మనుగడలు సాగిస్తున్న పౌరులకు  భాగస్వామ్యం కల్పించడం జరిగింది. మెదక్ జిల్లా, జహీరాబాద్ తాలూకా, అల్గోల్ గ్రామంలోని భారత ప్రభుత్వ కృషి విజ్ఞాన కేంద్రంలో 2001, జూన్ 25 నుంచి జూలై 1వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరిగింది.

సంప్రదింపులతో కూడిన ప్రజాస్వామ్యం కోసం, పర్యావరణం, జీవనాధారాల, ఆహార వ్యవస్థల భవిష్యత్తుకోసం ఏర్పడిన ఈ అంతర్జాతీయ సహకార ప్రయత్నంలో అనేక జాతీయ భాగస్వాములు కూడా ఉన్నారు. వీరిలో జీవవైవిధ్యరక్షణకు ఆంధ్రప్రదేశ్ సంఘటన (ఆంధ్రప్రదేశ్ కోయిలేషన్ ఇన్ డిఫెన్స్ ఆఫ్ డైవర్సిటీ), హైదరాబాద్ విశ్వవిద్యాలయం, జీవవైవిధ్యానికి వ్యూహరచన, కార్యాచరణ కోసం ఏర్పడిన అఖిల భారత జాతీయ ప్రణాళిక (నేషనల్ బయోడైవర్సిటీ స్ట్రాటజీ అండ్ యాక్షన్ ప్లాన్-ఎన్‌బిఎస్ఎపి) ఉన్నారు.

ప్రజాతీర్పు పరస్పర సంప్రదింపుల ప్రక్రియ, అందరికి కలుపుకునే ప్రక్రియ. ఈ ప్రక్రియలోని ముఖ్యాంశాలను ఈ నివేదిక క్లుప్తంగా పేర్కొంటుంది. ఈ క్రింది అంశాలను పాఠకులను వివరిస్తుంది.

- ప్రజాతీర్పులో రాష్ట్రంలోని ఆహార, వ్యవసాయ విధానాల భవిష్యత్తు గురించి పరస్పర సంప్రదింపులకు అవకాశాన్ని, అధిక భాగస్వామ్యాన్ని కల్పించడానికి అనుసరించిన పద్ధతుల (మెథడాలజీ) గురించి
- ప్రజాన్యాయస్థానం తీర్పు భవిష్యత్తు దృశ్యం
- ప్రజాతీర్పు బలాలు, లోపాలు, వాటి మదింపు
- ప్రజాస్వామ్య బద్ధపాలనలో, ఆహార విధానాలు, జీవనాధారాలు, పర్యావరణ విధానాలు భవిష్యత్తులో ప్రజాతీర్పు ప్రాధాన్యం గురించి విమర్శనాత్మక పరిశీలన

# 1. సంప్రదింపుల ప్రజాస్వామ్యం పౌర సాధికారత

## 1.1 సంప్రదింపులతో కూడిన, అధిక భాగస్వామ్యాన్ని సాధ్యం చేసే ప్రక్రియలు

పరస్పర సంప్రదింపులతో కూడిన, అందరినీ కలుపుకోవడానికి ప్రయత్నించే ప్రక్రియను 'డిప్' (డెలిబరేటివ్ అండ్ ఇన్‌క్లూజివ్ ప్రాసెస్) అంటున్నారు. చారిత్రకంగా నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లభించనివారికి నిర్ణయాధికారం కల్పించడానికి ఈ ప్రక్రియను ఒక సాధనంగా సంపన్న దేశాలలో, వర్ధమాన దేశాలలో వినియోగిస్తున్నారు. సంప్రదాయ ప్రజాస్వామిక పద్ధతులకు అనుబంధంగా, పాత సంప్రదింపు రూపాలను దాటి అనేక కొత్త కొత్త భాగస్వామ్య ప్రక్రియలు గత రెండున్నర దశాబ్దాలుగా రంగంమీదికి వచ్చాయి. ప్రజాన్యాయస్థానాలు, బస్తీ ఫోరమ్‌లు, ఏకాభిప్రాయ సాధనా సదస్సులు, భవిష్యత్తు ఊహాచిత్ర వర్క్‌షాప్‌లు, బహుళ ప్రమాణాల మేపింగ్, భాగస్వామ్య గ్రామీణ సమాచార సేకరణ, దీర్ఘకాలిక పథక రచనచేయడం, సంప్రదింపులతో కూడిన పోలింగ్ మొదలైనవి ఈ ప్రక్రియలో భాగమైనవే. వివరంగా చూపినప్పుడు వీటిలో ఒకదానికి మరొకదానికి మధ్య చాలా తేడా ఉండవచ్చును. కానీ వీటన్నటి మధ్యా ఉమ్మడిగా ఉన్న లక్షణం ఏమిటంటే- సంప్రదింపులు, అధిక భాగస్వామ్యం కోసం ఉపయోగించే లక్షణాలను స్వీకరించడమే.

### బాక్స్ 1. సంప్రదింపులు ప్రక్రియ - అధిక భాగస్వామ్య ప్రక్రియలు (డిప్స్): కొన్ని ముఖ్య లక్షణాలు

**చర్చ సంప్రదింపుల ద్వారా ప్రజలను కలుపుకోవడంలోని కొన్ని అంశాలు.**

1. 'సంప్రదింపులు' (డెలిబరేషన్)ను 'జాగ్రత్తతో కూడిన పరిశీలన'గా నిర్వహించారు. లేదా ఒక అంశానికున్న అనుకూల, ప్రతికూల కారణాల చర్చగా కూడా నిర్వచించారు.
2. 'ఇతరులను కలుపుకు పోవడం' ( ఇన్‌క్లూషన్) అంటే కార్యక్రమంలో ఇతరులను కూడా భాగస్వాములను చేయడం. అనేక సామాజిక పాత్రధారులను క్రియాశీలంగా భాగస్వాములను చేయడం మీదనే నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో అందరినీ కలుపుకోవడం ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ఈ ఇన్‌క్లూషన్ అన్నది - ఇంతకాలంగా, ఈ ప్రక్రియలనుంచి వెలిగా ఉంచినవారిని కలుపుకుపోవడం గురించి నొక్కిచెబుతుంది.
3. 'సంప్రదింపులు - ఇతరులను కలుపుకుపోవడం' (డిప్) అన్న ప్రక్రియలో సామాజిక సంబంధం తప్పనిసరి. సాధారణంగా పాత్రధారుల మధ్య ముఖాముఖి సమావేశాలు ఉంటాయి.
4. చర్చ, వాదాలలో భాషపై ఆధారపడవలసి ఉంటుంది. అది కూడా లిఖిత భాష కంటె మౌఖిక, దృశ్య భాషా నిర్మాణాల మీదనే సాధారణంగా ఆధాపరడతాము.
5. ఈ ప్రక్రియలో పాలుపంచుకునేవారు వేరువేరు అభిప్రాయాలు కలిగి ఉంటారని, వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని 'డిప్' భావిస్తుంది.
6. పాల్గొనేవారు విభిన్న దృక్పథాల వెలుగులో, కొత్త సత్యాల నేపథ్యంలో తమ వైఖరులను పదే పదే మదింపు చేసుకునేందుకు వీలుగా డిప్స్ రూపొందాయి.
7. అంతిమంగా తీసుకునే నిర్ణయం విలువ కన్నా, చర్చల రూపమే ఎక్కువ విలువైనదిగా, డిప్స్ తరచు పరిగణిస్తుంది. సమస్యలను జనసామాన్యంలో ఉండే హేతుబుద్ధి ద్వారా, అవగాహనను పెంచే పరస్పర సంభాషణల ద్వారా పరిష్కరించాలని డిప్స్ భాగస్వాములు భావిస్తారు. ఏకాభిప్రాయం కోరుకోకపోయినా, పరస్పర అవగాహన ద్వారా పరిష్కారాన్నే డిప్స్ ఇష్టపడుతుంది.
8. అంతిమంగా నిర్ణయాలు తీసుకోవడం కానీ, నిర్ణయాలు తీసుకోగలిగే వైఖరిని సాధించడం గానీ లక్ష్యాలు అయినప్పటికీ, ఆ క్రమంలో నిదానంగా, వివేచనాత్మకంగా, తగినంత విశాల హృదయంతో చర్చ జరగడం ఆవశ్యకం.

విధానాల అమలు, ప్రణాళికారచన మొదలైన అంశాలలో స్థానిక ప్రజలను ప్రభావం చేయడానికి జరిగిన కొన్ని ఇటీవలి ప్రయత్నాలు ఇవి:

- డెన్మార్క్‌లో పట్టణ ప్లానింగ్‌పై భవిష్యత్ ఊహాచిత్రం గురించిన వర్క్‌షాప్‌లు, ఏకాభిప్రాయ సదస్సులు.
- జన్యు మార్పిడి చేసిన జీవుల (జిఎంవోల) పై కర్నాటకలో ప్రజా న్యాయస్థానం.
- విషపూరిత వ్యర్థపదార్థాలను పారవేసే స్థలంపై స్విట్జర్లాండ్‌లో ఏకాభిప్రాయ సదస్సు, చర్చలతో కూడిన పోలింగ్
- బహుళ ప్రమాణ విశ్లేషణతో సహా 'పౌర దూరదృష్టి' (సిటిజన్స్ ఫోర్‌సైట్) - భవిష్యత్ ఊహాచిత్రం గురించి బ్రిటన్‌లో నిర్వహించిన కార్యక్రమం.
- భూ కమతాల విధానం(ల్యాండ్ టెన్యూర్) పై, జాతీయ వనరుల చట్టంపై విధాన నిర్ణయాలను తెలిపేందుకు గినియా, మడగాస్కర్‌లలో శీఘ్ర గ్రామీణ పరిశీలన (ఆర్ ఆర్ ఏ), భాగస్వామ్య గ్రామీణ పరిశీలన (పిపిఏ)ల వినియోగం.

సంప్రదింపుల, అధిక భాగస్వామ్య ప్రక్రియను వినియోగించడం గత దశాబ్దకాలంగా సంపన్నదేశాల్లో, పేద దేశాలలో రెంటిలోనూ గణనీయంగా పెరిగింది. అనేక సామాజిక, రాజకీయ ధోరణుల ఫలితం ఇది.

## 1.2 రాజకీయ మార్పు

ఎన్నికైన ప్రజాప్రతినిధుల బాధ్యతా స్వీకరణ మీదనే ఆధారపడిన 'ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం' పౌరులలో అత్యధికభాగం ప్రయోజనాలను కాపాడడంలో తరచు విఫలమై విమర్శలకు గురి అవుతోంది. అటు అభివృద్ధి చెందిన దేశాలలో, ఇటు అభివృద్ధిచెందుతున్న దేశాలలో కూడా అట్టడుగు వర్గాల వారికి తగిన భాగస్వామ్యం లభించడం లేదు. పేదల సంఘటిత శక్తి తరచు బలహీనంగా ఉంటున్నది. ఓట్ల కోసం వారిని సమీకరించి, వారి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పే సంస్థలు ఆ బాధ్యత నెరవేర్చడం లేదు. ప్రాతినిధ్య ప్రజాస్వామిక వ్యవస్థలు పేదల, మధ్యాదాయవర్గాలలోని అనేకుల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి. ప్రపంచ బ్యాంకు 'ప్రపంచ అభివృద్ధి నివేదిక 2001' కోసం రూపొందిన 'పేదలతో సంప్రదింపులు' అన్న నివేదికలో 23 దేశాల్లో జరిగిన భాగస్వామ్య పరిశోధన గురించి ఇలా వ్యాఖ్యానించారు:

ప్రపంచ వ్యాప్తంగానే పేదల దృష్టినుంచి చూసినప్పుడు పరిపాలన సంక్షోభంలో పడింది. అనేక సంస్థలు, వ్యవస్థలు పేదల జీవితంలో కీలకమైన, విస్తృతమైన భూమిక పోషిస్తుండగా, పరిపాలనలో పేదలకు భాగస్వామ్యం లేకుండా పోయింది. కేంద్రప్రభుత్వాలు కానీ, స్థానిక ప్రభుత్వాలు కానీ పేదల అవసరాలకు స్పందించడం లేదు, వారి విషయంలో జవాబుదారీగా ఉండటం లేదు. పేదలమీద ప్రదర్శితమయ్యే అహంకారాన్ని, నిర్లక్ష్య వైఖరిని ఈ నివేదిక పూస గుచ్చింది. తమకు ఎదురయ్యే అన్యాయం, అవమానం, అవినీతి, నేరం వీటన్నిటి విషయంలో సహాయాన్ని ఆశించే పరిస్థితే లేదు. ఏమంత న్యాయమైన నియమాలు కానప్పటికీ పేదలు ఇప్పటికీ ఆయా ప్రభుత్వ సంస్థలతో కలసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారు, అయితే పేద స్త్రీ పురుషులకు ఆ సంస్థల మీద విశ్వాసం లేదు.

కొన్ని దేశాలు, ముఖ్యంగా సంపన్నదేశాలు, 'డిప్'ను ఒక ప్రజాస్వామిక సాధనంగా, చారిత్రకంగా నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లభించనివారికి నిర్ణయాధికారం కల్పించడానికి వీలుకల్పించే పద్ధతిగా పరిగణిస్తున్నారు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం, సంప్రదాయిక మార్గాల కన్నా మరింత ముందుకు వెళ్లి అణగారినవారి గళాన్ని వినిపించడానికి ఇది అవకాశం కల్పిస్తుందని గుర్తించారు. 'సత్‌పరిపాలన' మీద, పౌరసమాజాన్ని బలోపేతం చేయడం మీద ఇవాళ డోనర్లు అధిక ఆసక్తి చూపుతున్నందున, 'డిప్'ను వర్ధమాన దేశాలలో విధాననిర్ణయాలలో వినియోగించడం మీద కూడా ఆసక్తి పెరిగింది.

వివిధ భాగస్వామ్య ప్రక్రియల మీద విస్తృతమైన ఆసక్తి పెరగడానికి సంపన్న, పేద దేశాలలోని పౌరసమాజ సంస్థలే కారణం. కాలక్రమంలో ఈ సంస్థలు విధానాల విషయంలో ప్రభావశీలమైన ప్రచారాన్ని నిర్వహించగలిగాయి. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో, మానవ అవసరాల కోసంవినియోగించే టెక్నాలజీలను పర్యావరణ సుస్థిరతను దృష్టిలో పెట్టుకుని రూపొందించడంలో పౌరుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సంస్థలు వాదిస్తూ వచ్చాయి. 'డిప్'ల ద్వారా నిర్ణయాలు తీసుకోవడం మెరుగుపడుతుందని ఈ సామాజిక సంస్థలు వాదిస్తున్నాయి. విధానాల రూపకల్పన, అమలు రెండూ కూడా న్యాయంగా, ప్రభావవంతంగా, సమర్థంగా, సుస్థిరంగా జరుగుతాయని ఆ సంస్థలు చెబుతున్నాయి.

## 1.3 ప్రొఫెషనల్ సమర్థత మరియు సైన్సు మీద విశ్వాసరాహిత్యం

'డిప్స్' మీద ఆసక్తి పెరగడానికి వృత్తి నైపుణ్యం మీద, సైన్సు మీద ప్రజలలో పెరిగిన అవిశ్వాసం, అనుమానం, అగౌరవమే కారణం. ప్రభుత్వ విధాననిర్ణయాలలో శాస్త్రీయ నైపుణ్యం భాగస్వామ్యం బలంగా ఉండి, ప్రభుత్వ వ్యవస్థల మీద ప్రజలలో అవిశ్వాసం ఉన్న దేశాలలో 'డిప్స్' మీద ఆసక్తి మరింత ఎక్కువగా ఉన్నది. సేవలను అందించడంలో, వాటి సారాంశంలో, వాటి రూపకల్పనలో పాశ్చాత్యశాస్త్ర విజ్ఞానం ముఖ్య పాత్ర నిర్వహిస్తున్నది. ఉదాహరణకు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల విషయంలో సేవలు ఏమిటి, ఎలా అందించాలి అన్నది నిర్ణయించేది సైన్సే. అలాగే, పౌరులు నివసించే,

పనిచేసే, విశ్రాంతి సమయాన్ని గడిపే వాతావరణాన్ని రూపొందించే టెక్నాలజీకి ప్రాతిపదిక శాస్త్రవిజ్ఞానమే. అందువల్ల విధాన నిర్ణయాలలో సైన్సు పాత్ర అనేక రూపాలలో - శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లుగా, వైద్యులుగా, పట్టణప్లానర్లుగా - ఉంటుంది, సామాజిక, ఆర్థిక, పర్యావరణ అంశాలలో విధాననిర్ణేతల ఎంపికకు అవసరమైన రకరకాల నిర్ణయాలు చేస్తుంది. ఈ సైంటిఫిక్ నైపుణ్యం జోక్యం ప్రజాస్వామ్య రాజకీయ నిర్ణయాలను తోసి రాజంటుంది. ఫలితంగా అనేక అంశాలలో నిగూఢమైన సాంకేతిక నిర్ణయాలదే పైచేయి అవుతుంది. (బహ్లెర్ 2002).

**సైన్సు నైపుణ్యం మీద ప్రజల నమ్మకం మరింత చెదిరిపోవడానికి కారణాలు:**

- పారిశ్రామిక దేశాల్లో, పారిశ్రామికానంతర దేశాల్లో ప్రజలు 'సైన్సు'ను ఒక ప్రత్యేక జ్ఞానానికి చిహ్నంగా గుర్తించడం మానేశారు. సైన్సుకి సంబంధించిన వివాదాల్లో నిపుణుల భిన్నాభిప్రాయాలు ఇవాళ ప్రజల ముందుకు వస్తున్నాయి. ఒకే సమస్యను ఎదుర్కొన్న సైంటిస్టులు ఒకే నిర్ధారణకు వస్తారన్న అభిప్రాయం బలహీనపడింది.

- సైన్సును 'మూర్తీభవించిన విలువలు'గా పరిగణించే రాడికల్ విమర్శల పరిచయం పెరుగుతుండడం వల్ల ప్రజలలో సైన్సు గురించిన అవగాహన ప్రభావితమవుతోంది. సిద్ధాంతాలు, చికిత్సావిధానాలు, సాఫ్ట్‌వేర్, సంస్థలు, వ్యవస్థలు - వీటన్నిటిలో సైన్సు ఒక విలువల సమాహారంగా రాడికల్ విమర్శకులు గుర్తిస్తున్నారు. ఈ విలువలన్నీ భావజాలాల, ప్రాపంచిక దృక్పథాలలో భాగాలే. సాధారణ పౌరులను ప్రభావితం చేసే సాంస్కృతిక, ఆర్థిక సంఘర్షణలు, వైరుధ్యాలు, రాజీలు మొదలైనవన్నీ శాస్త్రవేత్తలను కూడా ప్రభావితం చేస్తాయి.

- సైన్సు ఆధారిత సామాజిక, సాంకేతిక పరిణామాల వల్ల తమకు ప్రమాదం ఉన్నదని ప్రజలే భావిస్తున్నారు. బిఎస్ఇ. జిఎం ఓ ల మీద ఇటీవల యూరప్ దేశాల పరిణామాలు సైన్సు నైపుణ్యం మీద ప్రజల నమ్మకాన్ని పూర్తిగా తగ్గించాయి. ప్రభుత్వాలలోని సైన్సు నిపుణులకు, పారిశ్రామిక వాణిజ్య ప్రయోజనాలకు మధ్య లాలూచీలు ఉన్న సంగతి తెలుస్తున్న తరువాత ఈ అపనమ్మకం రెట్టింపు అవుతోంది. నిపుణులని భావిస్తున్నవారే ప్రజారోగ్య, సామాజిక, పర్యావరణ అంశాలలో సంక్షోభాలకు దోహదం చేస్తున్నప్పుడు జనంలో అనుమానం మరింతగా పెరుగుతోంది.

సంపన్న, పేద దేశాలలో సైన్సునైపుణ్యం పట్ల, ప్రభుత్వ సంస్థల పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఈ అపనమ్మకాన్ని అధిగమించడానికి, విధానాల రూపకల్పనలో మరింతగా సంప్రదింపుల పద్ధతిని, అధిక భాగస్వామ్యాన్ని ఆశ్రయించాలన్న సూచన తరచు ఎదురయ్యింది. సైన్సుకున్న ప్రత్యేక నైపుణ్యం, దాని విలువనూ గుర్తిస్తూనే, సమస్యాంశాలను, పరిష్కారాలను గుర్తించడంలో ప్రజాదృక్పథాన్ని ప్రత్యామ్నాయ మార్గంగా స్వీకరించాలి. డిప్స్‌ల ద్వారా చర్చలలో బహుళ దృక్పథాలు రంగంమీదికి వస్తాయని, సైన్సు-విధాన ప్రశ్నలకు సంబంధించిన అనిశ్చితాంశాలమీద మెరుగైన అవగాహన సాధ్యపడుతుందని డిప్స్ ప్రచారకులు అంటున్నారు. సైన్సు, టెక్నాలజీల మీద ప్రజాస్వామిక నియంత్రణను డిప్స్ విస్తృతం చేయగలగడం కూడా ఎంతో ముఖ్యమైన అంశం.

## 1.4 అనిశ్చితి మరియు సంక్లిష్టత

ఆయా కార్యాచరణ ప్రణాళికల పర్యవసానాల అంచనా వేయ లేకుండానే కొత్త సాంకేతిక నైపుణ్యాలు, విధాన ప్రక్రియల ప్రవేశం జరుగుతోంది. సమస్యలు, వ్యవస్థలు మరింత సంక్లిష్టం, అస్థిరం కాగానే అనిశ్చితి మోతాదు కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పర్యావరణ అనిశ్చితులు, సాంకేతిక నైపుణ్యం తాలూకు సవాళ్ళు మరింత సమస్యాత్మకంగా వుంటాయి. పర్యావరణగతి, దాని ఫలితాలు సాధారణంగా సంక్లిష్టంగానూ, దీర్ఘకాలికంగానూ ఉంటాయి కాబట్టి - మరింత సమస్యాత్మకమైన సవాళ్ల ఎదురవుతాయి. వాతావరణంలో మార్పు, లేదా జన్యుమార్పిడిచేసిన జీవులకు, పర్యావరణానికి నడుమ జరిగే ప్రతిచర్యలు వంటి జీవభౌతిక ప్రక్రియల్లో అసమతుల్య గతి, మోతాదు మించిన అనిశ్చితి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. జీవ వాతావరణం మీద జెనిటిక్ ఇంజనీరింగ్ దీర్ఘకాలిక ప్రభావాలను అంచనా వేయడం ప్రస్తుతం సైన్సు శక్తికి మించినది. పర్యవసానాల అవకాశాలు, అంశాలే మనకు తెలియనపుడు, మనకేది తెలియదో మనకే తెలియనపుడు ఖర్చు ప్రయోజనాలను లెక్కించే సాంప్రదాయిక పద్ధతుల ద్వారా, ప్రమాదాలను మదింపువేసే పాతపద్ధతుల ద్వారా ఏది క్షేమమో ఏది కాదో ఎలా తేల్చుకోగలం? వారి అజ్ఞానం ఎంతో స్పెషలిస్టులకే తెలియని పరిస్థితి ఇది.

ఈ నేపథ్యంలో చూసినప్పుడు నిపుణులు కానీ, స్పెషలిస్టులు కానీ ఎక్కువ సమాచారం అందుబాటులో ఉన్నవారయితే కావచ్చును కానీ, మంచిచెడ్డలను నిర్ణయించడంలో తక్కిన ప్రజా సమూహాల కంటె ఎక్కువ సామర్థ్యం ఉన్నవారేమీ కాదు. సమస్య గురించి, దాని పరిష్కారం గురించి ఉన్న అభిప్రాయాలు విలువలకు సంబంధించినవి, సమాజంలో ఈ విలువలు, అభిప్రాయాలు భిన్నత్వంతో కూడి ఉంటాయి.

## 1.5 మానవ హక్కులు, సామాజిక న్యాయం మరియు సాధికారత

విధాన రూపకల్పన, టెక్నాలజీల రూపకల్పన సంప్రదింపులతో అధికభాగస్వామ్యంతో జరిగినపుడే మానవ హక్కులు, న్యాయం,

ప్రజాస్వామ్య జవాబుదారీతనం వర్ధిల్లుతాయని డిప్స్ సమర్థకులు చెబుతున్నారు. సానుకూల వాతావరణం కల్పించినప్పుడు, ప్రజా న్యాయస్థానాలు, భవిష్యత్ చిత్రపట వర్క్‌షాపులు, ఇతర భాగస్వామ్య విధానాలు నోరులేనివారికి నోరిస్తాయి. సమాజం, పర్యావరణం, ఆర్థిక జీవితం గతికి సంబంధించి నిర్ణయాలు తీసుకొనే 'మానవ హక్కు'ను పౌరులుగా తాము పొందడానికి స్త్రీ పురుషులకు, పిల్లలకు ఈ డిప్ పద్ధతి వీలు కల్పిస్తుంది.

విధానాలనీ, టెక్నాలజీని కేవలం ఉపయోగించుకొనే వారిగానో, ముందుగానే నిర్ణయించిన ఉత్పత్తులకు వినియోగదార్లుగానో మాత్రం ప్రజలను చూడడం ఇక కుదరదు. పైగా వారు వారి జీవితాలను ప్రభావితం చేసే వాస్తవికతను మలచుకునే వారవుతారు. ఈ వాదనకు ప్రధానంగా మానవ హక్కుల అంతర్జాతీయ డిక్లరేషన్ బలం చేకూరుస్తున్నది. వైవిధ్యాన్ని, పరస్పర సహానుభూతిని, మంచితనాన్ని ప్రదర్శించే న్యాయమైన, స్వేచ్ఛాయుతమైన సమాజం ముఖ్య ఆశయాలు - ప్రత్యక్ష పౌర సాధికారత, ప్రత్యక్ష పౌర ఆచరణ. సంప్రదింపులతో కూడిన, అధిక భాగస్వామ్యాన్ని సాధ్యం చేసే ప్రజాస్వామ్య దృక్పథం కూడా ఆ విలువలనే ప్రతిధ్వనిస్తున్నది.

# 2. ప్రజాతీర్పు ప్రక్రియ

## 2.1 పౌర జ్యూరీ ఎందుకు ? ఎలా పనిచేస్తుంది?

### 2.1.1 ఎందుకు?

పౌరుల అభిప్రాయాలకు 'ప్రాతినిధ్యం' వహించేందుకు రాజకీయరంగంలోని వారికి అనేక మార్గాలున్నాయి. అందులో ప్రముఖమైనది ప్రజాభిప్రాయసేకరణ. ఎన్నికలు సమీపించే సమయంలో సమాచారసాధనాలన్నీ ఒపీనియనపోల్స్ నిర్వహించడానికి పోటీపడతాయి. 'రోడ్డుమీద' తారసపడే ఓటర్ల తక్షణ ప్రతిస్పందనల ఆధారంగా, ప్రధాన రాజకీయపక్షాలలో ఎవరివైపు ఎక్కువున్నారో ప్రాతినిధ్య ఓటును అభిప్రాయసేకరణలు ప్రతిఫలిస్తాయని పత్రికలు, టీవీచానెల్స్ చెబుతాయి. ఏ కొద్దిమంది స్పందనలో (వెయ్యికన్నా తక్కువ) అందరి అభిప్రాయాల ప్రాతినిధ్యంగా భావించలేమనీ వ్యాఖ్యాతలు తరచు పేర్కొంటారు. తగినన్ని గణాంకాలు లేని ప్రజావైఖరుల సర్వేని విధాననిర్ణేతలు విశ్వసించకూడదని కొందరు అంటుంటారు.

ప్రజాప్రాతినిధ్యానికి సంబంధించిన రెండో సంప్రదాయం - 1215లో మాగ్నాకర్టా సూచించింది. 'స్వేచ్ఛగా జీవిస్తున్న ఏ వ్యక్తినైనా అతడి భూభాగంలోని చట్టాల ప్రకారం అధికారంలోని వ్యక్తుల తీర్పుకు లోబడి తప్ప బంధించడానికి, నిషేధించడానికి, బహిష్కరించడానికి, శిక్ష విధించడానికి వీలు లేదని' మాగ్నాకార్టా చెబుతోంది. దీని వల్లనే జ్యూరీ ద్వారా విచారణ జరిపే విధానం మొదలై ఇప్పటికీ అమెరికా, ఇంగ్లండ్‌లతోపాటు ఇతర యూరప్ దేశాలు, రష్యా, బ్రెజిల్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో కొనసాగుతోంది. హత్యా నేరం మోపబడ్డ ఒక వ్యక్తి నిర్దోషిత్వాన్ని, దోషిత్వాన్ని ఓ పన్నెండు మంది ఎంపికచేసిన వ్యక్తులు (జ్యూరీ సభ్యులు) నిర్ణయించడం సాధారణ విషయమైపోయింది. ఈ పన్నెండు మంది జనాభాకు గణాంకపరంగా సరైన ప్రాతినిధ్య నమూనా ఖచ్చితంగా కాలేరు. అయినా విచారణలో వాది, ప్రతివాదుల సాక్ష్యాలను విన్న తర్వాత జ్యూరీసభ్యులు పౌరులందరి వివేకాన్ని, అభిప్రాయాలకు న్యాయంగా ప్రాతినిధ్యం వహించగలరన్న అవగాహన దానిలో ఉన్నది.

ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తాయి. అయితే ఆ చట్టాలను ఉల్లంఘించిన సందర్భాలలో నిర్దోషిత్వాన్ని, దోషిత్వాన్ని నిర్ణయించే అధికారం జ్యూరీ వద్దనే వున్నది. ప్రజాస్వామ్య వ్యవస్థలకు జ్యూరీల అవసరం ఉన్నది. ఒక సీనియర్ బ్రిటిష్ న్యాయమూర్తి జ్యూరీ గురించి ఈ కింది విధంగా వ్యాఖ్యానించారు.

"జ్యూరీ అంటే ఒక చిన్న పార్లమెంటు లాంటిది... ఏ నియంతా పాలితుడి స్వేచ్ఛను పన్నెండు మంది చేతిలో వదిలిపెట్టలేడు. జ్యూరీ విచారణ ద్వారా న్యాయం చెప్పే సాధనమే కాదు, రాజ్యాంగ విభాగం కన్నా విలువైనది, స్వేచ్ఛను ప్రసరింప చేసే కాంతి వంటిది". (డెవ్లిన్ 1996)

పౌరులకే అధికారాన్నివ్వడంలో కానీ, ప్రజలు తమకు తామే గొప్ప పాలకులు అన్న నిజాన్ని చెప్పడంలో కానీ జ్యూరీకి ఏ ప్రభుత్వ సంస్థా సాటిరాదు అని అమెరికాకు చెందిన న్యాయవాది ఒకరు ఇటీవల వ్యాఖ్యానించారు.

ప్రజల అభిప్రాయాల ప్రాతినిధ్యానికి సంభంధించి భిన్న మైన దృక్కోణాల ఆధారంగానే అభిప్రాయ సేకరణ, జ్యూరీ ఆచరణలోకి వచ్చాయి. భిన్న ప్రాంతాల, భిన్న రంగాల నుండి సేకరించిన అభిప్రాయాల సంఖ్యకు గుణకారాలను జోడించి, గణాంకబద్ధమైన అభిప్రాయప్రాతినిధ్యంగా చూపిస్తారు. కానీ, జ్యూరీలోని సూత్రం వేరు. ఈ 'ప్రజాతీర్పు' వెలువరించిన సిటిజన్ జ్యూరీ ఏర్పాటుతో సహా జ్యూరీ పద్ధతి ఏమిటంటే, ఒక ప్రాతిపదికలేకుండా కొందరు జ్యూరీసభ్యులను ఎంపికచేసి, వారిమధ్య పరస్పరసంప్రదింపులకు ఆస్కారం కల్పించి తుదితీర్పును వినడం. వారు తీసుకున్న నిర్ణయం అన్ని కోణాల్లో ఆలోచించినదీ, చర్చలు, తర్జన భర్జనలకు అవకాశమిచ్చిన మీదట తీసుకున్నది కావడం వల్ల వారిచ్చిన తీర్పు - ఏమీ ఆలోచించని ఓ వేయి మంది పౌరుల నుండి రాబట్టిన జవాబు కన్నా సరైనది. చర్చలో పాల్గొన్నవారు తమ అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించిందుకు వీలుగా ఈ విధానం రూపొందించారు. ఈ అభిప్రాయాలు కూడా ఇతరులతో సంప్రదింపులు జరిపిన తరువాత ఏర్పరచుకున్నవే. మార్కెట్ అధ్యయనాల్లో ఎంచుకున్న విధానాలకు భిన్నంగా జీవితాల్లో చాలా నిర్ణయాలు (టీ తాగడ్ నుండి, పిల్లలు కనడం వరకు) సంప్రదింపులు జరిపిన తరువాత, సంబంధిత వ్యక్తులతో సునిశిత

తర్జన భర్జనల అనంతరం తీసుకున్నవే. అందుకే అభిప్రాయ సేకరణలు (కొన్ని సామాజిక అధ్యయన విధానాలు) పౌరుల అభిప్రాయాలకు దర్పణం కాలేవు. ఇతరులతో సంభాషణ, చర్చల అనంతరం తెలివిడితో కూడిన నిర్ణయానికి వచ్చే అవకాశాన్ని అవి పౌరులకు ఇవ్వలేకపోవడమే అందుకు కారణం. అందుకే సిటిజన్ జ్యూరీలు 'గుణాత్మకమైనవి' మాత్రమే కాని గణాంకాల ప్రాతినిధ్యం కాదన్న వారి వ్యాఖ్య గణాంకాలకే వర్తిస్తుందే తప్ప ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి కాదని అర్థం చేసుకోవాలి.

## బాక్స్ 2 పౌర జ్యూరీ విధానం

**పౌర న్యాయస్థానం - పద్ధతి**

కమ్యూనిటీ సమస్యలను చర్చించడానికి అప్పటికప్పుడు పౌరుల నేతృత్వంలోని 'ప్రజాకోర్టు'లను ఉపయోగించే పద్ధతి కనీసం 18వ శతాబ్దం నాటి ఇంగ్లండులో ఉన్నట్టు చరిత్రకారులు రాశారు. (థాంప్సన్, 1963). బ్రిటన్ అంతర్యుద్ధం సమయంలో లెవలర్స్, డిగ్గర్స్ అనే రెండు గ్రూపులు లీగల్ జ్యూరీల్లో సభ్యులుగా ప్రముఖులకే కాక సాధారణ ప్రజలను కూడా అనుమతించాలని వాదించాయి.

న్యాయసూత్రాలను ప్రభుత్వం కాక సాటి పౌరులు అమలుచేయాలన్న భావన 'కామన్ లా'లో అంతర్భాగమై పోయింది. దీనిని తరువాతి కాలంలో లుడ్డైట్స్ వంటి ఉద్యమ గ్రూపులు తిరిగి రంగంమీదికి తెచ్చాయి. వీరే పందొమ్మిదవ శతాబ్దం తొలి దశాబ్దాలలో పారిశ్రామిక యంత్రాల ముక్కలను 'సమష్టికి ప్రమాదకారి' పేరుతో ప్రజాకోర్టుల్లో బోనులో నిలబెట్టారు. (ఫూల్గర్ 1997).

'సిటిజన్ జ్యూరీ'గా రికార్డయిన మొదటి సంఘటన 1974లో మిన్నసోటాలోని జెఫర్‌సన్ సెంటర్‌లో జరిగింది. అమెరికాలో 1974 నుండి 1999 మధ్య కాలంలో కనీసం 30 స్థానిక, రాష్ట్ర, జాతీయ స్థాయి జ్యూరీలను జెఫర్‌సన్ సెంటర్, పబ్లిక్ ఎజెండా ఫౌండేషన్, నేషనల్ ఇష్యూస్ ఫోరం నిర్వహించాయి. ఆరోగ్య సంస్కరణలు, బడ్జెట్ ప్రాధాన్యతలు, పర్యావరణ సమస్యల నుండి, స్థానిక స్కూళ్లలో వసతుల కొరత వరకూ అనేక అంశాలను వారు ఈ జ్యూరీల్లో చర్చించేవారు.

1996లో బ్రిటన్ పౌర జ్యూరీలు మొదలైనప్పటి నుండి కనీసం 100 జ్యూరీలు అనేక అంశాల మీద - ఆరోగ్య సంరక్షణలో రేషనింగ్ మొదలుకొని, విద్యావిధానం, టి.వి.లో కార్యక్రమాలలో వ్యక్తమవుతున్న అభిరుచుల వరకు నిర్వహించారు. బ్రిటన్‌లో జ్యూరీ జర్మను 'ప్లానింగ్ సెల్స్', అమెరికాలోని సిటిజన్ బ్యూరో నమూనాల నుంచి రూపుదిద్దుకుంది. బ్రిటిష్ జ్యూరీలకు, యూరప్‌లోని ఇతర దేశాల జ్యూరీలకు అనేక పోలికలున్నాయి. ఈ ప్రక్రియను అనుసరించేటప్పుడు యూరప్‌లోని జ్యూరీలలో వైవిధ్యాన్ని కూడా పాటించారు.

పౌర జ్యూరీలను బ్రెజిల్, బ్రిటన్, జర్మనీ, భారత్, న్యూజిలాండ్, కెనడా, ఆస్ట్రేలియా సహా అనేక దేశాల్లో నిర్వహిస్తున్నారు. అమెరికా వెలుపల రకరకాల, విభిన్నమయిన గ్రూపులు జ్యూరీలను నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వాలు, స్థానిక యంత్రాంగాలు వారి చర్యలకు ఆమోదం కోసం నిర్వహిస్తే, ఆయా సమస్యల మీద పనిచేసేవారు తమ వాదనకు విస్తృతమైన సహకారాన్ని, తమ పోరాటానికి అవగాహనతో కూడిన జనసమర్థన పొందడానికి జ్యూరీలు నిర్వహిస్తున్నారు. భాగస్వామ్య పాలన, ప్రజాస్వామిక ప్రత్యక్ష విధానాల గురించి లోతుగా తెలుసుకునేందుకు సామాజిక అధ్యయన కారులు జ్యూరీని ఉపయోగిస్తున్నారు.

పౌర న్యాయస్థానంలో పౌరులకు ప్రాతినిధ్యం వహించే ఒక బృందం ప్రజాప్రాముఖ్యం కలిగిన ఒక అంశం గురించి పరిశీలించడానికి మొత్తంగా 30 నుంచి 50 గంటల పాటు సమావేశమవుతారు. పన్నెండు నుంచి ఇరవై మంది సభ్యులున్న జ్యూరీ ప్రజలకు సూక్ష్మ రూపంగా వ్యవహరిస్తుంది. వారు అనేకమంది స్పెషలిస్టు సాక్షులను విచారిస్తారు. వారు చెప్పింది విని తమలో తాము సంప్రదింపులు జరుపుకుంటారు. విచారణల ఆఖరిరోజున, జ్యూరీ సభ్యులు తమ సిఫారసులను నిర్ణయాధికారులకు, ప్రజలకు తెలియపరుస్తారు.

**ఇతర భాగస్వామ్య పద్ధతులకు భిన్నంగా పౌర జ్యూరీలలో అనేక విశిష్ట అంశాలున్నాయి.**

- బహిరంగంగా అందరినీ పిలిచి రమ్మని అడగడం కాకుండా, ఇందులో పాల్గొనే వారిని ఒక క్రమపద్ధతిలో ఎంచుకుంటారు.
- సాక్షుల నుండి పొందిన సమాచారాన్ని నిశితంగా పరిశీలించేందుకు జ్యూరీ సభ్యులకు అవకాశం ఉంటుంది.
- చర్చిస్తున్న సమస్య విషయంలో లోతుగా ఆలోచించి, సంప్రదింపులు జరపడానికి సభ్యులకు అవకాశం ఉంటుంది. ఇందుకు సమావేశకర్త (ఫెసిలిటేటర్) సహాయం కూడా లభిస్తుంది.
- జ్యూరీ సభ్యులుగా వున్నవారు, చర్చల్లో పాల్గొన్న వారు భవిష్యత్తుకు సంబంధించి కొన్ని నిర్ధారణలను లేదా కొన్ని భవిష్యత్ దృశ్యాలను రూపొందించవలసి ఉంటుంది.

### 2.1.2 జ్యూరీ ఎంపిక

అమెరికా, బ్రిటన్‌లో నిర్వహించే జ్యూరీల కోసం సభ్యులుగా ఓటర్ల జాబితాలోని ఆయా రంగాలకు, ప్రాంతాలకు చెందిన వారి పేర్లను ఎంచుకుంటారు (కూట్, లినగాన్ 1997). అయితే ఈ ఓటర్ల జాబితాలు సక్రమంగా, సంపూర్ణంగా లేవని, పేదరికంలో నివసిస్తున్న ప్రజలున్న దేశాల్లో వారికి ప్రాతినిధ్యం వహించే బృందాన్ని ఎంపిక చేయడానికి ఈ పద్ధతి సరైనది కాదని భావించారు. తూర్పు గోదావరి జిల్లాలోని అనేక ఆదివాసి ప్రాంతాల్లో (ఇద్దరు జ్యూరీ సభ్యుల స్వస్థలం) నాలుగేళ్ళుగా ఏ స్థాయిలోనూ ఎన్నికలు జరగలేదు. అక్కడ ఎటువంటి ఓటర్ల జాబితాలూ లేవు.

'ప్రజాతీర్పు'కు జ్యూరీని కర్నాటకలో జ్యూరీ ఎంపిక అనుసరించిన విధానంతోనే ఎన్నుకున్నారు (వేక్‌ఫర్డ్ 1999). ఈ విధానంలో జ్యూరీ సభ్యులను ఎంచుకోవడానికి స్వతంత్ర రీసర్చర్లను నియమించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన రీసర్చర్లకు జ్యూరీ సభ్యుల ఎంపిక బాధ్యతను అప్పగించారు. వీరంతా ప్రజాభాగస్వామ్య అభివృద్ధి కార్యక్రమాలు, కమ్యూనికేషన్ అంశాల్లో శిక్షణ పొందినవారే.

చాలా మంది పేదల పేర్లే లేకుండా తయారైన అవకతవకలతో కూడిన ఓటర్ల జాబితాల నుండి జ్యూరీ సభ్యులను ఎంచుకొనే విధానాలకన్నా ఈ విధానం సన్నకారు, చిన్నరైతులకు ఎక్కువ ప్రాతినిధ్యానికి వీలు కల్పిస్తుంది, సంఖ్యాపరంగా ఈ జ్యూరీ సభ్యులు తక్కువే కావచ్చు గాక.

మేం ప్రారంభించిన కార్యక్రమం గణాంకాల ఆధారితమైన మార్కెట్ అధ్యయనం కాదు, ఇది సాధికారతకు ముడిపడి వున్న కార్యాచరణ - అధ్యయనం. ఈ దృక్కోణంతో పరిశీలిస్తే ఆయా గ్రూపులు, అందులో చురుకైన సమస్యలను గురించి వారు ముమ్ముందు ఆలోచించదల్చుకున్నారా లేదా అనే విషయం తెలుసుకోవడమే. ఇందువల్ల చర్చలకు అవకాశమిచ్చే గ్రూపుల సమయా సమయాల్లో మాట్లాడేందుకు వారికి వీలుంటుంది. జ్యూరీలో సభ్యులుగా ఉన్నవారు, జ్యూరీలో విచారణలో పాల్గొన్నవారు స్థానిక గ్రూపుల్లో సభ్యులో లేక వాటితో సంబంధం ఉన్నవారే. అంటే అభిప్రాయ సేకరణలో తమ జవాబులు చెప్పే వారిలో వీరు బొత్తిగా ఏమీ తెలియని వారైతే కాదు. జ్యూరీలో పాల్గొనడానికి తగిన అవగాహన వారికి ఏదో స్థాయిలోనైనా ఉంది.

జ్యూరీ ఎంపిక గురించి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, కమ్యూనికేషన్ విభాగం అధ్యయనం చేపట్టింది. భాగస్వామ్య పద్ధతిలో క్షేత్ర అధ్యయనం చేయడానికి గ్రూప్‌గా ఎల్.వి.వి. నాథ్, ఏలూరు సునీత, నవీన్, ఎం. జానయ్య, రోజ్‌లిన్ సుప్రియ, కె.కృష్ణశంకర్, పి.శ్రీనివాస్ వెళ్లారు. అధ్యయనాన్ని డాక్టర్ వినోద్ పావురాల సమీక్షించారు. ఈ బృందం గ్రామీణ ప్రాంతాలకు చెందిన పౌరులను ఇంటర్వ్యూ చేసింది. గ్రామీణుల పేర్లను ఈ క్రింది సంస్థల కమ్యూనిటీ గ్రూపుల నుంచి రాబట్టారు.

- డిజిఐఎస్ సహాయమందించే కార్యక్రమాలు (డిజిఐఎస్ - డచ్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ)
- అగ్రికల్చర్ మాన్ & ఎన్విరాన్‌మెంట్ (ప్రభుత్వేతర సంస్థ)
- ఎపిసిడిడి (సుస్థిర వ్యవసాయం అంశంపై పనిచేస్తున్న ఎన్‌జీవోల గ్రూపు)
- యక్షి (ఆదివాసీలతో పనిచేస్తున్న ఎన్‌జీవో)
- గిరిజన దీపిక (ఆదివాసులే నడుపుతున్న సాధికారతా సంఘటన)
- ఆంధ్రప్రదేశ్ దళిత కార్మికులసంఘం

### బాక్స్ 3. ఆంధ్రప్రదేశ్‌లో రైతాంగం

విస్తీర్ణంలోను, జన సంఖ్యలోను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారతదేశంలో ఐదో స్థానంలో ఉన్నది. ఇక్కడ నూటికి 70 మంది వ్యవసాయంలోనే ఉన్నారు. అన్ని సామాజిక వర్గాల వారి నుంచి ప్రతినిధులుండాలని జ్యూరీ ఎంపిక ప్రక్రియ ప్రయత్నించలేదు. ఉద్దేశపూర్వకంగా చిన్నసన్నకారు రైతుల విషయంలో, భూమిలేని వ్యవసాయ కార్మికుల విషయంలో సానుకూల వివక్ష చూపించింది. ఈ వర్గాల వారి దగ్గర 35 శాతం భూమి మాత్రమే ఉన్నది. అంటే మొత్తం కోటి హెక్టార్ల సాగుభూమిలో ఈ వర్గాల దగ్గర 35 లక్షల హెక్టార్ల భూమి మాత్రమే ఉన్నది. వ్యవసాయంలో ఉన్న సుమారు కోటి కుటుంబాలు దగ్గర సుమారు 2 కోట్ల పాడి, వ్యవసాయ పశువులు, కోటి యాభైలక్షల గొర్రెలు మేకలు, 7,50,000 పందులు, 6 కోట్ల 50 లక్షల కోళ్లు ఉన్నాయి. పాడి పశువులలో నూటికి 70 చిన్న, సన్నకారు రైతుల దగ్గర, భూమిలేని కార్మికుల దగ్గరా ఉన్నాయి. గొర్రెలు, మేకలు, పెరటికోళ్ల పెంపకం నిర్వహిస్తున్నది ప్రధానంగా భూమిలేని ఆదివాసీలు, సంప్రదాయ పెంపకందారులైన కురుములు, గొల్లలు, దళితులు. పాడి, వ్యవసాయ పశువుల మంద సంఖ్యకు వ్యక్తిగత భూ ఆస్తికి సంబంధం ఉన్నది. భూకమతం సైజు పెరుగుతున్న కొద్దీ మంద సైజు పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వ్యవసాయ పరిస్థితులలోను, వ్యవసాయ పనులలో, ఆహార తయారీలో స్త్రీలు నిర్వహించే పాత్ర పెద్దది. పశువుల పెంపకంలో నూటికి ఎనభై వంతు పని ఆడవాళ్లే చేస్తారు.

కొన్ని పేర్లు, చిరునామాలు సేకరించిన అధ్యయన బృందం గ్రామాలకు వెళ్లి విస్తృతమైన ఇంటర్వ్యూలు నిర్వహించింది. జ్యూరీ సభ్యులను ఎంపిక చేయడంలో దళితులు, ఆదివాసీలు, మహిళా రైతులకు వారు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. జ్యూరీ ఎంపికకి వారు పాటించిన ప్రాతిపదికలేమంటే;

- దారిద్ర్యపు రేఖకు దిగువన కానీ, దారిద్ర్యపురేఖకు సమీపంలో గానీ నివసిస్తున్న చిన్న, సన్నకారు రైతులు
- ఎటువంటి స్థిర రాజకీయ అభిప్రాయాలు లేని విశాల దృష్టి కలవారై ఉండాలి. ఎన్జీవోలకు, రాజకీయపక్షాలకు ఎటువంటి సంబంధంలేనివారై ఉండాలి.
- చర్చలలో పాలుపంచుకోగలగి ఉండాలి.

వీటితో పాటు పట్టణాలకు చెందిన ఒకరిని కూడా జ్యూరీలోకి ఎంపిక చేసుకున్నారు. ఈ వ్యక్తి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగ దారుడై ఉండి, తన జీవన భృతికి వ్యవసాయం మీద ఆధార పడకుండా ఉండేట్టు చూశారు. అయితే, (వ్యవసాయంతో సంబంధం లేని) పట్టణ ప్రజల అభిప్రాయాలందరికీ ఆమె ప్రాతినిధ్యం వహించలేకపోవచ్చు, కానీ ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలు, విజ్ఞానాన్ని ఇతరులు పరిగణనలోకి తీసుకోవడం వల్ల చర్చలు మరింత పరిపుష్టమౌతాయన్నది స్పష్టం. (ఈ రకంగా పట్టణ, గ్రామీణ దృక్కోణాలను కలగలపిన జ్యూరీ ఒక ప్రక్రియ ఇంగ్లండులో జరిగింది. వివరాలకు చూడండి - నేషనల్ కన్స్యూమర్ కౌన్సిల్ 2002లో జరిగింది).

ప్రజాస్వామ్యయుతంగా జరిగే చర్చల్లో కొంతమేరకు భావ వ్యక్తీకరణ చాకచక్యంగా, స్పష్టంగా ఉండడం అవసరమైనందున బహిరంగ వేదిక మీద మాట్లాడడానికి ఇబ్బంది ఉన్నదేమో ఒకటికి రెండుసార్లు సరిచూసి జ్యూరీ సభ్యులను ఎంచుకొమ్మని బృందానికి సూచించడం జరిగింది.

జ్యూరీ సభ్యత్వాన్ని పొందేందుకు వారి సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు జ్యూరీ సభ్యులుగా ఎన్నుకోదలచినవారిని ఈ కింది విషయాలు అడిగారు.

- వారి భూమి విస్తీర్ణం
- వారి కులం / స్థానిక తెగ
- సాధారణంగా పండించే పంటలు
- ఎంత పశుసంపద ఉంది
- ప్రత్యామ్నాయ జీవనాధారమార్గాలు

అధ్యయనకారులు జ్యూరీ సభ్యులను ఎంచుకోవడానికి 'స్నోబాలింగ్' (అట్కిన్‌సన్, ఫ్లింట్ 2001) విధానాన్ని అనుసరించారు. దీని ప్రకారం స్వయంగా కమ్యూనిటీ వర్కర్లను జ్యూరీకి ఎన్నుకోకుండా వారి ద్వారా జ్యూరీ సభ్యులను ఎంపిక చేసుకోవడానికి ప్రయత్నించారు. ఈ గ్రూపులతో పనిచేయడం వల్లనే చిన్న, సన్నకారు రైతులను సరిగ్గా ఎంపికచేసుకోవడం లీసర్చర్లకు సాధ్యమైంది. అధికార సమాచార వనరులను ఉపయోగించు కోవడం ద్వారా అది సాధ్యమయ్యే విషయం కాదు.

జ్యూరీ ఎంపిక బృందం కర్నూలు, చిత్తూరు, కడప, తూర్పుగోదావరి, గుంటూరు, విజయనగరం, పశ్చిమ గోదావరి, మెదక్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పర్యటించింది.

జ్యూరీలో పాల్గొనేవారి ప్రయివసీకి మేం భంగం కలిగించ దల్చుకోలేదు. వారిని పేరు, జిల్లాపేర్లతోనే గుర్తించాం. వారి స్వగ్రామాల గురించి కానీ, వారిని అధ్యయనకారులతో కలిపిన సంస్థ గురించి కానీ ఈ నివేదికలో, ఇతర బహిరంగ పత్రాలలో పేర్కొనలేదు.

### 2.1.3. సాన్నిహిత్యం ఏర్పరుచుకోవడం

జ్యూరీ సభ్యుల మధ్య సాన్నిహిత్యం, పరస్పర నమ్మకం కుదర్చడం సమావేశకర్తల కీలకమైన బాధ్యత, ఈ ప్రక్రియలో ఎటువంటి సంకోచం లేకుండా పాల్గొనేలా చూసేందుకు వారితో ఒక రోజు గడపడం అవసరం. జ్యూరీ సభ్యులకు ఇటువంటి అనుభవం చాలా కొత్తది. జ్యూరీ సభ్యుల్లో బెరుకు పోగొట్టడంతో పాటు, జ్యూరీ విచారణలో సాక్షులుగా ఉన్నవారు తమ నైపుణ్య పరిజ్ఞానమే ఎక్కువ కీలకమన్నట్టు మాట్లాడినప్పటికీ, జ్యూరీసభ్యులు తమ అనుభవాలు విజ్ఞానం కూడా సరైనవీ, విలువైనవన్న విశ్వాసాన్ని కలిగించడానికి సమావేశకర్తలు ప్రయత్నించారు.

జ్యూరీ సభ్యుల్లో చాలామంది, కేవలం ప్రాంగణానికి మొదటిరోజునే వచ్చారు. కొంతమంది మాత్రం ఒకరోజు ముందు వచ్చారు. వారికి అక్కడి వాతావరణంతో ముందే పరిచయం ఏర్పడింది.

మొదటిరోజు మొదటిపూట జరిగిన సెషన్‌లో అందరూ పాల్గొన్నారు. సమావేశకర్తలు (సెక్షన్ 2.5 చూడండి) జ్యూరీ ప్రక్రియ కోర్టుగదిలో విచారణలానే ఉంటుందని వివరించారు. మొదట సాక్షులు చెప్పింది జ్యూరీ సభ్యులు వింటారు, తర్వాత తమ చర్చలు జరుపుతారు. చివరి రోజున తమ తీర్పు ఇస్తారు. వచ్చినవారిలో కొంతమంది యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ జ్యూరీ సభ్యులుగా నిర్ధారించినవారు కారు, జ్యూరీ సభ్యులుగా ఎంపికై వారితో పాటు ప్రయాణం చేసి వచ్చినవారు. వీరిని పరిశీలకులుగా వుంచారు. వీరు ప్రతిరోజూ జ్యూరీ జరుగుతున్న విధానం గురించి గమనించి తమ అభిప్రాయం చెప్పాలి.

మొదటిరోజు సాయంత్రం 19 మంది జ్యూరీ సభ్యులను 'ప్రజాతీర్పు' పౌరన్యాయమూర్తులుగా ప్రమాణం చేయించారు. తరువాత వీరు సమావేశకర్తలతో కలసి, సాన్నిహిత్యం పెంపొందించుకునే

కార్యక్రమం మొదలైంది. రెండుగంటలపాటు ఈ కార్యక్రమం సాగింది. 'ప్రజాతీర్పు'కు హాజరవుతున్నవారి హడావిడికి దూరంగా ఒక సమావేశం హాల్‌లో వీరు కలుసుకున్నారు.

ఒకరినొకరు పరిచయం చేసుకోవడానికి ఒక పిల్లోగేమ్ (దిండు ఆట) ప్రవేశపెట్టారు. దిండును తమ శక్తి కొద్దీ వారు గదిచుట్టూ విసిరారు. దిండు మీద పడినవారు తమ వివరాలను చెప్పి, అందరికీ తమను తాముపరిచయం చేసుకున్నారు. పేరు, జిల్లా, గ్రామం, పెళ్లయిందీ లేనిదీ, కుటుంబం, విద్యార్హతలు, భూమి, సాగునీటి సదుపాయం, పంటలు తదితర వివరాలు వారు చెప్పాలి. పరిచయం చేసుకుంటున్నవారిని ఇతరులు ప్రశ్నలు అడగవచ్చు. వివరాలను తెలుసుకోవచ్చు. ఈ సెషన్ పూర్తయ్యేసరికి వారిలో ఆత్మవిశ్వాసం ఏర్పడింది. సంభాషణకు సంసిద్ధమయ్యారు. అయిదు రోజుల ప్రక్రియలో పాల్గొనేందుకు కూడా తయారయ్యారు. ఇంటి దగ్గర తమ పిల్లల మీద, కుటుంబ సభ్యుల మీద బెంగ పెట్టుకున్నవారు తమ బాధను ఇతరులతో పంచుకున్నారు. వారందరూ ఇళ్ల దగ్గర ఎన్నో పనులను వదిలి వచ్చారు. బిజీగా ఉండే సీజన్ అది. అయితే, ప్రజాతీర్పు కూడా ఎంతో అవసరమైనదేనని, కీలకమైనదని గుర్తించి వారిక్కడికి వచ్చారు.

ఈ సెషన్‌ను కెమెరాలు, రికార్డింగులు లేకుండానే నిర్వహించారు. ఒకరితో ఒకరు సఖ్యంగా కలుపుగోలుగా ఉండడానికి అవకాశం కల్పించే సెషన్‌గా మాత్రమే నిర్వహించారు. తమకేదైనా అవసరమైతే సమావేశకర్తలను అడగమని జ్యూరీసభ్యులకి చెప్పారు. దీనితో తమతోపాటు వచ్చిన బంధువులు, స్నేహితులకు తాము దూరంగా ఉండాల్సివచ్చిందన్న బెంగ వారికి తీరిపోయింది. కొందరైతే హాయిగా పాటలు పాడడం ప్రారంభించారు.

చివరకు 'ప్రజాతీర్పు' గురించి జ్యూరీ సభ్యులకు వివరించారు. తరువాత రోజుల కార్యక్రమాల గురించి చెప్పారు. తమ నిర్ణయాలు తీసుకోవడం జాగ్రత్తగా, నిష్పక్షపాతంగా, అన్ని అభిప్రాయాలను వినవలసిన అవసరం గురించి వారికి చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ స్థితిగతుల గురించి మీడియో ద్వారా, నిపుణులు, సాక్షులు ఇచ్చే సాక్ష్యాల ద్వారా మూడు రకాల భవిష్యత్ ఊహాచిత్రాలను వివరిస్తామని, అందులో ఒక మార్గాన్ని లేదా ఒకమార్గంలోని రెండు మూడు అంశాలను వారు ఎంచుకో వచ్చునని నిర్వాహకులు వారికి వివరించారు. రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతుల తరఫు తీర్పును వాటిని పరిశీలించిన మీదట చివరి రోజున వారు ఇవ్వాలి.

జ్యూరీ సభ్యులను ఎలా ఎంపికచేశారో నిర్వాహకులు వివరించారు. వారు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జ్యూరీ విచారణ సందర్భంగా 'మీడియా' కూడా ఉంటుందని, దీని వల్ల ఏమైనా ఇబ్బంది అనిపిస్తుందేమోనని నిర్వాహకులు జ్యూరీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అయితే, మీడియాతో తమకు ఇబ్బంది లేదని జ్యూరీ సభ్యులు చెప్పారు.

కొన్ని గంటల విరామం తరువాత వారు మూడు భవిష్యత్ ఊహాచిత్రాల వీడియోలను చూడడానికి ఉపక్రమించారు. సమాచారం గురించి వారు చర్చించుకోవాలనే ఉద్దేశంతో కాక, వీడియోలు తీసిన విధానం గురించి వారు తెలుసుకోవడానికి వాటిని ప్రదర్శించారు. వీడియో చిత్రాలను అందులోని సమాచారాన్ని వారు అర్థంచేసుకున్నారు. వీడియో ప్రదర్శనకు జ్యూరీ సభ్యులు బాగా ప్రతిస్పందించారు. తాము చూస్తున్న ప్రతిదృశ్యం మీదా వారు వ్యాఖ్యానించారు.

మరునాటి ఉదయం, 'జ్యూరీ' మొదటి రోజు ఆరోజు కార్యక్రమం వివరాలను తెలుసుకునేందుకు తాము అంతకు ముందు అంగీకరించిన నియమాలను మరోసారి గుర్తుచేసుకోడానికి కలుసుకున్నారు.

## 2.2 సినేరియా వర్క్‌షాప్ :

### భవిష్యత్తు పై మూడు దృశ్యాలు

భవిష్యత్తుపై మూడు దృశ్యాలను వీడియోలలో, ఆ దృశ్యాల గురించిన ఆలోచనావిధానకర్తల అభిప్రాయాలతోను జ్యూరీసభ్యుల ముందు ఉంచారు. నాలుగురోజుల పాటు జ్యూరీ 13 మంది ప్రత్యక్ష సాక్షులను ప్రశ్నించింది. వీరిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ ఉద్యమాల అంతర్జాతీయ సమాఖ్య భారతీయ విభాగం ప్రతినిధులు, ప్రపంచంలోనే అతి పెద్ద బయోటెక్నాలజీ కార్పొరేషన్ 'సిన్‌జెంటా' ప్రతినిధులు కూడా ఉన్నారు. తమకు వివరించిన మూడు దృశ్యాలలో ఏది తమకు ఎక్కువ అవకాశాలను కలిగిస్తుందో, రానున్న 20 సంవత్సరాలలో తమకు జీవనాధారాల అవకాశాలను, ఆహారభద్రతను ఏది కల్పిస్తుందో జ్యూరీ సభ్యులు నిర్ణయించుకోవలసి ఉంటుంది.

**భవిష్యత్తు దృశ్యం 1: విజన్ 2020.** ఆ దృశ్యాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. దీనికి ప్రపంచబ్యాంకు సహాయం కూడా ఉంది. యాంత్రీకరణ, ఆధునికీకరణ త్వరగా జరగాలని, చిన్న కమతాలను కలిపి స్థిరపరచాలని విజన్ 2020 ప్రతిపాదిస్తుంది. వ్యవసాయంలో ఫుడ్‌ప్రాసెసింగ్ ఉత్పత్తిని పెంచే సాంకేతిక విధానం ప్రవేశపెట్టి దీనితో 2020 నాటికి వ్యవసాయం మీద ఆధారపడి జీవించేవారి శాతాన్ని 70 నుంచి 40కి తగ్గించాలని చెబుతుంది. డిఎఫ్ఐడి కూడా ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నిధులందించే ఉద్దేశాన్ని వెల్లడించింది. (డిఎఫ్ఐడి 2001)

**భవిష్యత్తు దృశ్యం2 : ప్రకృతి వ్యవసాయం ద్వారా, ఎగుమతుల ద్వారా వాణిజ్యపంటలను పండించి అభివృద్ధిని సాధించడం**. IFOAM, అంతర్జాతీయ వాణిజ్యకేంద్రం (యుఎన్ సిఎడి/ డబ్ల్యుటివో) ప్రతిపాదనల మీద ఆధారపడిందే ఈ దృశ్యం. పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాన్ని జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ముడిపెట్టడం దీని ఉద్దేశం. వాతావరణ తులన ప్రమాణాలకు సరిపోయే, తక్కువ ధర కల సేంద్రియ ఉత్పత్తులను కోరుకునే సంపన్న దేశాలలో సూపర్ మార్కెట్లలో డిమాండ్‌లకు తగ్గట్టుగా ఈ దృక్కోణం ఉంటుంది.

**భవిష్యత్తు దృశ్యం 3: స్థానిక ఆహారవ్యవస్థలు.** గ్రామీణులకు మరింత స్వావలంబన, వ్యవసాయానికి తక్కువ బయటి వనరుల-పెట్టుబడుల అవసరం, స్థానిక ఆహార ఉత్పత్తి, మార్కెట్లు, స్థానిక ఆర్థిక వ్యవస్థలని పునర్నిర్మించడం ఇందులోని ప్రధాన అంశాలు. కేవలం ఉత్పత్తి మిగులుతోనే ఎగుమతులు, స్థానికంగా ఉత్పత్తి చేయనివే దిగుమతులు అనేవి ముఖ్యఅంశాలు. ఈ దృక్పథానికి మహాత్మాగాంధీ రచనలు, స్థానిక / ఆదివాసీ సంస్థలు ఈ దృశ్యానికి మద్దతునిస్తున్నాయి. వివిధ 'దృశ్యాల' మీద వీడియోలు ప్రతి 'దృశ్యం' లోని జీవనంలో ప్రధాన లక్షణాలను, ఆ విధాన కర్తలు వూహించిన విధంగా చూపించాయి. ఈ వీడియో సమాచారాన్ని టెలివిజన్ ట్రస్ట్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (టివిఇ), బిబిసి, డెవలప్‌మెంట్ పర్‌స్పెక్టివ్స్ (హైదరాబాద్) నుంచి తీసుకున్నారు. అవసరమైనప్పుడు కొత్త దృశ్యాలను రాష్ట్రంలోని గ్రామీణ పట్టణ ప్రాంతాలలో చిత్రీకరించారు.

ప్రతి వీడియోలోను ఆయా విధానాలను, ఆయా వుద్దేశాలతో రాష్ట్రాన్ని ముందుకు నడపాలనుకుంటున్న సంస్థల వివరాలను చిత్రీకరించారు.

ఈ మూడు వీడియోల్లోని సమాచారమంతా ఐఐఇడిలోని సుస్థిర వ్యవసాయ, గ్రామీణ ఉపాధి కార్యక్రమం మీద ఆధారపడ్డాయి. ఆహారం, వ్యవసాయం, భవిష్యత్తుపై స్క్రిప్టులను విధానపత్రాల (ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం గురించి ప్రభుత్వ విజన్ 2020 డాక్యుమెంట్ వంటివి) విశ్లేషణ ఆధారంగా రూపొందించారు. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో గ్రామీణ సమాజాల్లో వస్తున్న మార్పుల అనుభవాలు కూడా ఈ స్క్రిప్టులకు ఆధారం. భవిష్యత్తులో అమలు కాగల అవకాశాలున్న విధానాల ఆధారంగానే తయారైనప్పటికీ ఈ వీడియోలో భవిష్యత్తుపై తెలివిగల అంచనాలు, ఆదర్శప్రాయమైన నమూనాలను ప్రదర్శించారు.

భవిష్యత్తు'దృశ్యానికి' సంబంధించిన సరైన, అర్థవంతమైన అవగాహన జ్యూరీ సభ్యులలో కలిగించడానికి వీడియోను ఉద్దేశపూర్వకంగా ఉపయోగించారు. మూడు వీడియోల్లో అంచనాలు, పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. పరిస్థితులలోని మార్పులను అర్థంచేసుకోవడం ద్వారా రాష్ట్రంలో ఆహార, వ్యవసాయ భవిష్యత్తు సరిగ్గా ఆలోచించడానికి, అనుసరించడానికి జ్యూరీ సభ్యులకు అవకాశం దొరికింది (బాక్సు 4లో చూడండి).

తొలి కథనాల్లో అభివృద్ధి 'దృశ్యాల'ను చూపారు. ఆ దృశ్యాల జీవితం ఎలా ఉంటుందో సరిగ్గా చూపడానికి వీడియో దర్శకులు ఐఐఇడితో కలసి పనిచేశారు. ఈ మూడు దృశ్యాలను తులనాత్మకంగా పరిశీలించడానికి ఆదృశ్యాలను క్రమపద్ధతిలో ఈ కింది అంశాల ఆధారంగా వివరించారు.

- ఆర్థిక ఉత్పత్తి - ప్రాకృతిక సమతుల్యత (ఇకాలజీ)
- ఆహార మార్కెటింగ్ - ప్రాకృతిక సమతుల్యత
- ఆహారం - ఆర్థిక వ్యవస్థ
- ఆహారం - కమ్యూనిటీ
- పాలన - ఆహారభద్రత

ప్రతి వీడియోకు 'కరెంట్ అఫైర్స్' అంశాన్ని జతచేయడం ద్వారా మరింత నిబద్ధతను అందించారు. ముప్పైనిమిషాల నిడివి గల ప్రతి వీడియో సంక్షిప్తసారాన్ని 'అనుబంధం1' లో చూడవచ్చు.

పౌరన్యాయమూర్తుల బృందంలో, భవిష్యత్ ఊహాచిత్రాల వర్క్‌షాప్‌లో చర్చలకు అందరికీ ప్రాతినిధ్యం కల్పించే ప్రక్రియలో వీడియోలు ముఖ్యమైన భాగం. మరింత విస్తృతమైన వివరణను, ప్రతి దృక్కోణం ప్రధాన లక్షణాలను జ్యూరీ సరిగ్గా అంచనా వేసేందుకు అవి ఉపకరిస్తాయి. ఎటువంటి భవిష్యత్తు కావాలి, ఎటువంటి భవిష్యత్తు సాధ్యపడుతుంది - వంటి ప్రశ్నలపై ఆలోచనను నిపుణులైన సాక్షులు తమ ప్రెజెంటేషన్స్ ద్వారా రేకెత్తించారు.

## 2.3 సాక్షులు

ఒక్కొక్క భవిష్యత్తు దృశ్యాన్ని అందులోని విధానాలని సమర్థించేందుకు సామర్థ్యం, ఆసక్తి గల వాళ్లని సాక్షులుగా ఎన్నిక చేయడం డెలిబిరేటివ్ పద్ధతికి చాలా అవసరం. సాక్షుల ఎంపికకి ఈ కింది అంశాలు ఆధారం

- సమాజంలోని అన్ని రంగాలు, అన్ని గ్రూపులకు చెందిన ప్రతినిధులు.
- సాక్షులు - వారు పనిచేస్తున్న సంస్థలు విశ్వసనీయ మైనవి అయి ఉండాలి, ఆయా సమస్యల మీద దీర్ఘకాలం పనిచేస్తున్న చరిత్ర కలిగి ఉండాలి.
- సాక్షులు - వారు పనిచేస్తున్న సంస్థలు ఈ ప్రక్రియలో పాల్గొనడానికి సంసిద్ధతను వ్యక్తం చేయాలి, ఇందుకోసం వారికి ముందుగానే సమాచారం అందిస్తారు. వారి పాత్ర, హక్కులు, బాధ్యతల గురించి వారికి ముందుగానే వివరిస్తారు.

### బాక్స్ 4 ఆంధ్రప్రదేశ్ ఆహార, వ్యవసాయ భవితవ్యాన్ని దర్శించడం: మూడు దృశ్యాలు

- భవిష్యత్ దృశ్యం (విజన్) అంటే ఆలోచనలను భవిష్యత్తులోకి సారించి, మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందో ఒక అంచనా పొందడం. ప్రతి ఒక భవిష్యత్ దృశ్యం కూడా ఒక ఆహార - వ్యవసాయ భవితవ్యపు రాజకీయ, సామాజిక, పర్యావరణ, ఆర్థిక వ్యవస్థలన్నిటి సమగ్ర దృష్టిని అందిస్తుంది. "విధాన నిర్ణయం దీర్ఘకాలికంగా ఎటువంటి ఫలితాలను ఇస్తుంది. నా తరువాతి తరం దీని వల్ల ఎటువంటి ఫలితం పొందుతుంది?" వంటి ప్రశ్నలకు సమాధానమివ్వడానికి తగిన చిత్రణను ప్రతి ఒక్క భవిష్యత్ దృశ్యంలోనూ అందించడం జరిగింది.
- అన్ని భవిష్యత్ దృశ్యాలూ దృశ్యపరంగా ప్రదర్శించడానికి వీలైనవి. ఆంధ్రప్రదేశ్ ఆహార - వ్యవసాయ భవితవ్యాన్ని సమర్థంగా, కళ్లకు గట్టినట్టు చెప్పడానికి వీడియోను ఉద్దేశపూర్వకంగా ఎంచుకోవడం జరిగింది. కమ్యూనికేషన్ సాధనంగా వీడియో అన్నది భవిష్యత్ దృశ్యాలకు సంబంధించిన స్పష్టమైన రూపురేఖలను అందించడంలో అక్షరాస్యులు, నిరక్షరాస్యులు ఇద్దరికీ అర్థవంతంగా ఉపకరిస్తుంది. వ్యవసాయం, ఆరుబయలు క్షేత్రాలు, ప్రజల జీవితాలు - అన్నీ కూడా రంగురంగులలో, సరైన అర్థవంతమైన పద్ధతిలో ప్రేక్షకులకు అందించి, ప్రతి ఒక్క భవిష్యత్ దృశ్యం విషయంలో వారి ఊహాశక్తిని మరింత పెంపొందించడానికి వీడియోలను రూపొందించారు.
- ఇక్కడ వివిధ ఆహార వ్యవస్థలకు సంబంధించిన సంస్థాగల నిర్మాణాలకు, విధానాలకు, సమాజం మీద వాటి ప్రభావానికి, పర్యావరణానికి ఉన్న అంతస్సంబంధాన్ని వెలికి తేవడానికి ఈ భవిష్యత్ దృశ్యాలు సాధనాలుగా ఉపకరిస్తాయి.
- ఆంధ్రప్రదేశ్‌లో ఆహార వ్యవసాయ విధానాల భవితవ్యానికి సంబంధించిన భిన్నమయిన భవిష్యత్ దృశ్యాలను అందించడం ద్వారా గొప్ప చర్చకు అంకురార్పణ జరుగుతుంది. కొత్త ఆలోచనలకు ప్రేరణ లభిస్తుంది. పాత ఆలోచనల గురించిన పునరాలోచన జరుగుతుంది
- భవిష్యత్ దృశ్యాలు నిర్వహించే ఒక విలువైన పని - ప్రత్యామ్నాయ చట్రాలను, ప్రతిపాదనలను అందించడం భవిష్యత్ దృశ్యాలు సంబంధిత అనేక అంశాలలో ఎంతో విశాలమైన దృష్టిని, విమర్శనాత్మకమైన ఆలోచనలకు అవకాశం ఇస్తాయి.
- భవిష్యత్ దృశ్యాలు - అనుకూల ప్రతికూల ప్రతిస్పందనలు రెంటినీ కలిగిస్తాయి. భవిష్యత్ దృశ్యాలను తరచి చూడడం వల్ల, శోధించడం వల్ల ఆహార వ్యవసాయాల భవితవ్యాలలో ఏది తమకు వాంఛనీయమో, సమాజ అంతిమ లక్ష్యాలకు ఏది శ్రేయస్కరమో ఎంపిక చేసుకోవడానికి వీలు అవుతుంది.

- సాక్షులు - సామాన్యులైన ప్రేక్షకులకు తమ దృక్పథాన్ని ఎటువంటి పత్రాలు, డిస్‌ప్లే బోర్డులు, ఇతర దృశ్యసాధనాల సాయం లేకుండానే వివరించగలిగి ఉండాలి.
- సాక్షులు - భవిష్యత్ దృశ్యం నేపథ్యంలో ఒకే సమస్య గురించి మాట్లాడేందుకు నిపుణులైన సాక్షులు అంగీకరించినవారై ఉండాలి. ఉదాహరణకు విజన్ 2020 నేపథ్యంలో జిఎంటి వంటి టెక్నాలజీల పర్యవసానాలు.
- తమ దృక్పథాన్ని వివరించిన తరువాత కూడా అక్కడే ఉండి, ఇతర పరిశీలకులతో సంభాషించడానికి, జ్యూరీ ప్రక్రియను అర్థంచేసుకోవడానికి వారు అంగీకరించాలి.

ప్రతి జ్యూరీ సభ్యుడితో ప్రత్యక్షంగా మాట్లాడేందుకు సాక్షి అంగీకరించి ఉండాలి. క్రాస్ ఎగ్జామినేషన్‌కు సిద్ధంగా ఉండాలి (సాక్షుల పేర్లు, వివరాలు విడిగా బాక్సులో చూడవచ్చు)

సమావేశకర్తలు ఖచ్చితమైన సమయపాలన చేయడానికి ప్రతి సాక్షి సహకరించాలి. సాక్షి ప్రసంగం 35 నిమిషాలకు మించకూడదు. అనువాదం సమయం అదనం. దీని తరువాత 40 నిమిషాల పాటు (అనువాదం సమయం మినహాయించాలి). జ్యూరీసభ్యులతో చర్చలు జరిపాలి. ఈ చర్చలలో ప్రశ్నలు, జవాబులు, వివరణలు వుంటాయి.

## 2.4 జ్యూరీ సభ్యుల పాత్ర

మూడు దృశ్యాలను పరిశీలించి జ్యూరీ తమ పరిజ్ఞానం, ప్రాధాన్యాలు, లక్ష్యాల ఆధారంగా ప్రయోజనాలను, నష్టాలను బేరీజువేసింది. సాక్షుల వివరణలను కూడా ఇందుకు పరిగణనలోనికి తీసుకున్నది. భవిష్యత్తు దృశ్యాలలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవచ్చు లేదా రెండు మూడు దృశ్యాలలోని కొన్ని కొన్ని అంశాలను కలగలిపి తమ సొంత దృశ్యాన్ని తయారుచేయవచ్చు.

### బాక్స్ 5 ప్రజాతీర్పులో స్పెషలిస్టు సాక్షులు

1. ఎం.కె.అక్బల్‌రావు
   ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ
   డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ డైరెక్టర్
2. ప్రొఫెసర్ ఎం.వి.రావు
   ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్
3. పి.చెంగల్‌రెడ్డి
   ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల అధ్యక్షుడు
4. డా. కె.పి.సి.రావు
   నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చి
   మేనేజ్‌మెంట్, హైదరాబాద్
5. డాక్టర్ అలెగ్జాండర్ డానియల్స్
   ఐ.ఎఫ్.ఓ.ఎమ్-ఆసియా ప్రధాన కార్యదర్శి
6. డాక్టర్ శివరామకృష్ణ
   ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులతో పనిచేస్తున్న కల్చరల్
   ఆంత్రోపాలజిస్ట్
7. డాక్టర్ సాగరి రామ్‌దాస్
   ఆంత్ర - డైరెక్టర్, పశుసంపద నిపుణురాలు
8. డాక్టర్ పార్థా దాస్‌గుప్తా
   సింజెంటా సీడ్స్ ఆసియా - పసిఫిక్
9. డాక్టర్ దేబశిష్ బెనర్జీ
   మీరట్‌లోని సిసిఎస్ యూనివర్సిటీలో వృక్షశాస్త్రం,
   మాలిక్యులర్ బయాలజీ విభాగం మాజీ అధిపతి
10. మైకేల్ హార్ట్
    ప్రెసిడెంట్, స్మాల్ అండ్ ఫ్యామిలీ ఫాం అలయెన్స్,
    బ్రిటన్
11. కోలిస్ హైన్స్
    బ్రిటన్‌లోని ఇంటర్నేషనల్ ఫోరమ్ అసోసియేట్
12. డాక్టర్ టి.ఎస్.ప్రకాష్,
    ఆగ్రో బయోడైవర్సిటీ గ్రూప్ ఆఫ్ నేషనల్ యోడైవర్సిటీ
    స్ట్రాటెజీ యాక్షన్ ప్లాన్ (ఎన్‌బిఎస్‌ఎపి)
    వ్యవసాయం ప్రొఫెసర్
13. కె.శ్రీనివాస్
    రాజకీయార్థిక వ్యాఖ్యాత, జర్నలిస్టు

భవిష్యత్ ఊహాదృశ్యాలంటే భవిష్యత్తులో ఉన్న అవకాశాల దృశ్యాలే. జ్యూరీ సభ్యుల్లో విమర్శను, కొత్త దృశ్యాల ప్రతిపాదనను, కార్యాచరణ ప్రతిపాదనను ప్రేరేపించడానికి అవి ఉద్దేశించినవి. తాము ఎన్నుకున్న దృశ్యాన్ని అమలుచేసే కార్యాచరణ ప్రతిపాదనను రూపొందించడం కూడా జ్యూరీ ముఖ్యవిధి. చిన్న గ్రూపుల సమావేశాల్లో, ప్లీనరీలో కూడా కార్యాచరణ ప్రతిపాదనలను చర్చించారు.

## 2.5 సమావేశకర్తలు

ఉత్తమ ప్రమాణాలు కల సమావేశనిర్వహణ ఈ ప్రక్రియకు ఎంతో అవసరం. తెలుగు మాట్లాడే ముగ్గురు సమావేశకర్తలను ఇందుకు ఎంచుకున్నారు. ప్రజాతీర్పు ప్రక్రియ మొత్తం గురించి వారికి ముందుగానే వివరించారు.

మంచి భాషా పరిజ్ఞానం, భావ వ్యక్తీకరణ శక్తి ప్రధాన ప్రాతిపదికలుగా ఈ సమావేశకర్తల ఎంపిక జరిగింది. జ్యూరీ సభ్యులు మొత్తం రాష్ట్రం అంతటినుంచి వచ్చినవారు, తెలుగు మాట్లాడేవారు. గ్రామాల్లో పరిస్థితులు గురించి, జీవనాధారాల స్థితిగతుల గురించి తెలిసి ఉండడం, భిన్న నేపథ్యాల నుంచి వచ్చిన ప్రజలతో వ్యవహరించగలిగిన సామర్థ్యం, సమన్వయపరచడంలో సమావేశనిర్వహణలో గ్రామీణ స్థాయి అనుభవం, ప్రభుత్వం గురించిన పౌర సమాజం గురించి అవగాహన- ఇవన్నీ కూడా సమావేశకర్తకు అవసరమైన అర్హతలు జ్యూరీలోని స్త్రీపురుష ప్రాతినిధ్యానికి తగ్గట్టుగా ఇద్దరు స్త్రీసమావేశకర్తలను, ఒక పురుష సమావేశకర్తను ఎంపికచేశారు.

**సమావేశకర్తలు;**

- గోపరాజు సుధ (ఆంధ్రప్రదేశ్ రూరల్ లైవ్‌లీహుడ్ ప్రోగ్రామ్ - ఎపిఆర్ఎల్‌పి)
- కవితా కురుగంటి (యాక్షన్ ఎయిడ్)
- డాక్టర్ వినోద్ పావురాల (హైదరాబాద్ యూనివర్సిటీ కమ్యూనికేషన్ ప్రోగ్రామ్)

పౌరజ్యూరీకి సంబంధించి అన్ని ఏర్పాట్లను ఒక ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ సహాయంతో చేపట్టారు. వారి ఏర్పాట్లు సమావేశకర్తలకు ఎంతగానో ఉపకరించాయి. జ్యూరీ సభ్యుల అవసరాలను, సమాలోచన ప్రక్రియమీద దృష్టి కేంద్రీకరించడానికి వారికి వీలయింది.

## 2.6 సమీక్షాబృందం (ఓవర్‌సైట్ ప్యానెల్)

జ్యూరీ భవిష్యత్ ఊహాచిత్ర వివరణ వర్క్‌షాప్‌ను సమీక్షాబృందం సమీక్షించింది. వీరంతా జ్యూరీలోలేని పరిశీలకులు, ఈ ప్రక్రియ మీద ఆసక్తి ఉన్నవారు. మొత్తం ప్రక్రియ విశ్వసనీయతను, నిజాయితీని నిర్ధారించడమే ఈ ప్యానెల్ విధి. వివిధ రంగాలకు చెందిన భిన్న ప్రయోజనాలనాశించే వ్యక్తులను ఈ ప్యానెల్‌లో చేర్చుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో 'స్టేక్ హోల్డర్' అర్థాన్ని మరింత విస్తృతం చేశారు. ప్రస్తుతం ఉన్న సామాజిక, ఆర్థిక ప్రభావం వల్ల అణగారిపోయినవారి ప్రతినిధులను కూడా ఇందులోచేర్చారు.

ప్యానెల్‌కు సుప్రీంకోర్టుమాజీ ప్రధాన న్యాయమూర్తి పి.బి.సావంత్ అధ్యక్షత వహించారు. ప్యానెల్‌లో అంతర్జాతీయ నిధుల సంస్థల, పౌరసంస్థల, గిరిజన సంస్థల ప్రతినిధులు ఉన్నారు.

## 2.7 స్థలం మరియు ఏర్పాట్లు

ప్రజాతీర్పు కార్యక్రమానికి మెదక్‌జిల్లాలోని కృషి విజ్ఞానకేంద్రాన్ని వేదికగా తీసుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల వివరణలు, క్రాస్ ఎగ్జామినేషన్ ప్లీనరీ హాల్లో జరిగాయి. పౌర జ్యూరీ ఆంతరంగిక సమాలోచనల కోసం చర్చల కోసం కె వి కె లో మరికొన్ని గదులున్నాయి. జ్యూరీ సభ్యులు, స్పెషలిస్టుసాక్షులు, సమావేశకర్తలు, సమీక్షాబృందం సభ్యులు కెవికెలోనే బసచేశారు. ఇతర పరిశీలకులు సమీప పట్టణమైన జహీరాబాద్‌లోని హోటళ్లలో విడిదిచేశారు. బసకోసం విడివిడిగా చేసిన ఏర్పాట్ల వల్ల జ్యూరీ సభ్యులంతా ఒకచోట మిగిలిన గ్రూపులకు దూరంగా ఉండే వీలు కలిగింది. దీనివల్ల పరిశీలకులు, సాక్షులు కూడా జ్యూరీ సభ్యుల అభిప్రాయాలను ఇతరత్రా ప్రభావితం చేయగల అవకాశం తగ్గిపోయింది.

## 2.8 వీడియో ఆర్కైవ్‌లు

ప్రజాతీర్పులోని వివిధ పాత్రధారుల ఇంటర్వ్యూలతో సహా మొత్తం పౌర జ్యూరీ ప్రక్రియను, భవిష్యత్ ఊహాచిత్రాలను హైదరాబాద్ యూనివర్సిటీకి చెందిన సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ కమ్యూనికేషన్స్ విభాగం డిజిటల్ వీడియోలో డాక్యుమెంటరీగా మలిచింది.

ప్రజాతీర్పు ఇంగ్లీషు తెలుగు రాతప్రతులు, వీడియో ఆర్కైవ్ సూచికతో 26 వీడియో టేపుల రెండు ప్రతులను సిద్ధంచేశారు. ఒకటి బ్రిటన్‌లోని ఐఐఇడిలో, మరొకటి హైదరాబాద్ యూనివర్సిటీలో భద్రపరిచారు.

## 2.9 మీడియా పాత్ర

ప్రజాతీర్పు ప్రక్రియను జాతీయ, అంతర్జాతీయ ప్రేక్షకులకు, పాఠకులకు తెలియజెప్పేందుకు తగిన ఏర్పాట్లు జరిగాయి. అనేక మీడియా బృందాలను ఆహ్వానించారు. కార్యక్రమం ముందు, తరువాత కూడా పత్రికలకు, ఇతర మీడియా సంస్థలకు సంబంధిత సమాచారాన్ని అందించారు.

### బాక్స్ 6. పర్యవేక్షక బృందం - ప్రజాతీర్పు

పౌర న్యాయస్థానం ప్రక్రియ ఎంత న్యాయంగా జరిగిందో, అది ఎంత విశ్వసనీయమో మదింపు వేసినది. ఈ పర్యవేక్షక బృందం. ఈ బృందం సభ్యులు వీరు:

జస్టిస్ పి.బి.సావంత్
చైర్మన్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి)
ఫరీద్‌కోట్ హౌస్,
న్యూఢిల్లీ

పౌల్ టెర్ వీల్
ఫస్ట్ సెక్రటరీ
అడ్వయిజర్ డెవలప్‌మెంట్ అండ్ ఎన్విరాన్‌మెంట్
డిజిఐఎస్
నెదర్లాండ్ రాయబార కార్యాలయం
న్యూఢిల్లీ

సావిత్రి
గిరిజన దీపిక
అడ్డతీగల
తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

వై.దివంజులు నాయుడు
కో ఆర్డినేటర్, ఎఎమ్ ఇ
ఆంధ్రప్రదేశ్

సందీప్ చాచ్రా
ప్రాంతీయ డైరెక్టర్
యాక్షన్ ఎయిడ్
హైదరాబాద్

# 3. ప్రజా తీర్పు : జ్యూరీ తీర్పు, విజన్

## 3.1 తీర్పు

జ్యూరీ తీర్పు పూర్తిపాఠం అనుబంధం 3 లో ఇచ్చాము. ఇక్కడ తీర్పులోని కొన్ని ముఖ్యభాగాలను (పెద్ద అక్షరాలతో ఉన్నవి) ఇస్తున్నాము. చర్చలలో జ్యూరీ సభ్యులు, సాక్షుల మాట్లాడిన మాటలను కొన్నిటిని యథాతథంగా ఇక్కడ ఉటంకిస్తున్నాము. (చిట్టచివరి పత్రికా సమావేశంలో జ్యూరీ ప్రతినిధులుగా చెప్పిన మాటలను యధాతథంగా ప్రస్తావిస్తునపుడు మాత్రం వాటి ముందు 'ం' గుర్తు ఉంచాం). చివరిలో తీర్పు మీద వివరణ, ప్రస్తావనకు వచ్చిన వివిధ అంశాలపై సంక్షిప్త చర్చ కూడా ఈ భాగంలో ఉన్నాయి.

### 3.1.1. స్వావలంబన

**మేం కోరుకునేది :**

- స్వావలంబన కోసం ఆహారం, వ్యవసాయం. వనరుల మీద కమ్యూనిటీ నియంత్రణ
- తక్కువ పెట్టుబడులు అవసరమయ్యే వ్యవసాయ విధానాలు

ప్రజాతీర్పు ప్రక్రియ ఆరంభం నుంచి చివరిదాకా జ్యూరీ సభ్యుల దృష్టి అంతా ఒక ప్రధానాంశం మీద కేంద్రీకృతమైవుంది. తమ వ్యక్తిగత అనుభవం మీద, నైపుణ్యం మీద, వనరుల మీద ఆధారపడటానికి వీలుకల్పించే వ్యవసాయ విధానాన్ని వారు కోరుకుంటున్నారు. వివిధ పంటరకాల రూపంలో జీవవనరులను, నేలానీరూ వంటి సహజ వనరులను నిర్వహించుకోవడం కూడా ఈ విధానంలో భాగం. తమ వ్యవసాయం ఎట్టి పరిస్థితుల్లోను నగదు మీద ఆధారపడ కూడదని వారు కోరుకుంటున్నారు.

జ్యూరీ సభ్యులు అందరూ వేర్వేరు స్థాయిల పేదరికంలో జీవిస్తున్న వారు. ఎంతో కష్టపడి సంపాదించుకున్న డబ్బును వారు విత్తనాల మీదా (సాధారణంగా ఎక్కువ దిగుబడినిచ్చే రకాలు), ఆ విత్తనాలకు పోషణ కోసం ఖరీదైన, నమ్మకం లేని ఎరువులూ పురుగుల మందుల మీదా ఖర్చు చేయడం వారికి ఇష్టం లేదు. వీరిలో చాలా మంది ఈ విషయంలో చేదు అనుభవాలున్నాయి. హరితవిప్లవ విధానాలు సృష్టించిన సమస్యల్లో భాగంగా - కొందరు ఇప్పటికీ అప్పుల చట్రం నుంచి బైటకు రాలేకపోతున్నారు.

'ప్రజా తీర్పు'లో 'అప్పులేని ధాన్యాలు, ఖర్చులేని పంట' అన్న మాట తరచుగా వినిపించింది. ఇది సభ్యులందరి ఏకాభిప్రాయం కాకపోవచ్చును కానీ, దాదాపు అందరూ - ఒకరు కాకపోతే మరొకరు దాదాపు ప్రతీ చర్చలోనూ ఈమాట వాడుతూనేవున్నారు.

నిపుణుల్లోకరైన శ్రీనివాస్ మాటల్లో వాళ్ళ భయాలు ప్రతి ధ్వనించాయి. ఆయన ఇలా అన్నారు ;

'చిన్నతరహా వ్యవసాయానికి ప్రస్తుతం ఎటువంటి అభివృద్ధి అవకాశాలూ లేవు. చిన్న తరహా వ్యవసాయానికి ప్రోత్సాహం కానీ, మద్దతు కానీ లేదు. అది స్వయం సమృద్ధి సాధించే అవకాశాలు కూడా కనిపించడం లేదు'.

తన, తన తోటి జ్యూరీ సభ్యుల తీర్పును మరింత విస్తృతంగా వివరిస్తూ, అమ్మాజీ ఈ విషయాలు చెప్పారు.

మా సొంత వ్యవసాయాన్ని, మా సొంత పంటరకాలను, మా సొంత పెరటిఎరువులతో కొనసాగించాలనుకుంటున్నాము. ఈ పద్ధతుల ద్వారా స్వయంసమృద్ధిని సాధించాలనుకుంటున్నాము.

పంటలు పండించుకోడానికి మేం స్థానిక వనరులపైనే ఆధారపడదల్చుకున్నాం తప్ప, మా భూముల్లో సాగుకు ఎరువులు, పురుగుమందులు వాడే ఉద్దేశం మాకు లేదు.

మేం మా సొంత భూమిని, మా పశువులను ఉపయోగించి మా పంటలే పండించుకోదల్చుకున్నాం.

మా సొంత వ్యవసాయ విధానాల్లో కొనసాగుతూ, పాత పంటలను పండిస్తూ, మా విత్తనాలను కాపాడుకోవాలని కోరుకుంటున్నాం.

### 3.1.2 రసాయనాలు

**మేం కోరుకుంటున్నది:**

- విషపూరితమైన రసాయనిక క్రిమిసంహారకాలు అవసరం లేని వ్యవసాయ విధానం
- ఒకే రకం చెట్లతో (ఉదాహరణకు - యూకలిప్టస్ వంటివి) ప్లాంటేషన్‌లు వద్దు. రకరకాల వృక్షజాతుల సహజ స్థానిక అడవులు కావాలి.

జ్యూరీలోని రైతులు, మహిళా వినియోగదారులు వ్యవసాయంలో రసాయనాల వాడకంపై ప్రత్యేకంగా ఆందోళన వెలిబుచ్చారు.

విషపూరిత క్రిమిసంహారకాలు ప్రతిరోజు తమ మీద సాధారణ స్థాయి నుంచి తీవ్రస్థాయి ప్రభావాన్ని చూపిస్తున్నాయని అనేక మంది జ్యూరీ సభ్యులు చెప్పారు. రసాయన ఎరువులను విస్తృతంగా వాడటంవల్ల ఆహారనాణ్యత లోపిస్తోందని కొందరు వివరించారు. అందరూ కూడా, క్రిమిసంహారకాల విషవలయంలో చిక్కుకుని అప్పులపాలైపోయిన రైతులగురించీ, ఆత్మహత్యలు చేసుకున్నరైతుల గురించీ ప్రస్తావించారు. ప్రభుత్వ విధానాలు సామాజికంగా, పర్యావరణ పరంగా బాధ్యతారహితంగా ఉన్నాయని జ్యూరీ వ్యాఖ్యానించింది. ఈ అంశం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్-డిప్యూటీ కమీషనర్‌కూ, కర్నూలుకు చెందిన ఒక మహిళారైతుకూ మధ్య జరిగిన సంభాషణలో మరింత స్పష్టంగా కనిపించింది.

దీవెనమ్మ ;- అర్థంపర్థం లేకుండా వాడుతున్న క్రిమిసంహారకాలవల్ల మా ఆరోగ్యాలు దెబ్బతింటే ఏంచేయాలి? కొన్నిసార్లు అవి చేస్తున్న హానివల్ల మా ప్రాణాలే పోతున్నాయ్! మీరు అందుకు నష్టపరిహారం ఇస్తారా? తమ క్రిమిసంహారక మందులు కొనమంటూ మమ్మల్ని ఒప్పించడానికి మా గ్రామాల్లోకి వస్తున్న ఆ జీపుల మాటేమిటి? వాళ్లని మీరెందుకు ఆపలేకపోతున్నారు?

అక్బల్‌రావు (సమాధానమిస్తూ) ;- ఈ క్రిమిసంహారకాలు సిగరెట్ల వంటివి. జనం వాటికి అలవాటుపడిపోయి ఇంకా ఇంకా వాడుతుంటారు. అప్పుడు అవి వాళ్ల ఆరోగ్యానికి ప్రమాదకరంగా పరిణమిస్తాయి. వాటికి అలవాటుపడవద్దని వాళ్లని చైతన్యవంతం చేయాలి. తమ ఉత్పత్తులు అమ్ముకోడానికి గ్రామాలు తిరుగుతున్న కంపెనీలను మేం ఏ విధంగానూ ఆపలేం. వాళ్ళు మిమ్మల్ని మోసగించారని అనిపిస్తే మీరు పోలీస్‌లకు ఫిర్యాదు చేయండి.

(తరువాత అదే సంభాషణలో...)

దీవెనమ్మ ;- పంటనష్టం కనుక జరిగితే కంపెనీ నుంచి డబ్బు వాపసు ఇప్పించడం గురించి మీరు ఆలోచిస్తున్నారు. బాగానే ఉంది. కానీ, వీటిని (క్రిమిసంహారకాలు) వాడటం వల్ల జరిగే ప్రాణనష్టం మాటేమిటి?

అక్బల్‌రావు (సమాధానమిస్తూ); మేం చేయగలిగిందేమీ లేదు. అంతా ఆ భగవంతుడి చేతుల్లో ఉంది.

కానీ, ఈ క్రిమిసంహారకాలనేవి విజన్ 2020 నిర్దేశించిన ఆధునీకరణ ప్రక్రియలో అంతర్భాగమని ప్రొఫెసర్ ఎమ్.వి.రావు అంటున్నారు.

ఇంతకు ముందు మీలో ఒకరు క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువుల దుష్ప్రభావాల గురించీ, అప్పుల బారిన పడటం గురించీ ప్రస్తావించారు. అయితే, వాటిని వినియోగించకుండా పూర్తిగా మనం ఆపలేం. పంటకు కొంత రక్షణ ఉండాలి.... విజన్ 2020 వంటి డాక్యుమెంటును రూపొందించడం రాష్ట్రంలో మొట్టమొదటిసారి. ......ప్రపంచబ్యాంకు ఇస్తున్న రుణాలను వ్యవసాయ రంగం ఆధునీకరణకు ఉపయోగిస్తారు.

ఈ రకమైన ధోరణులు తప్పనిసరి అని జ్యూరీ సభ్యులు భావించడం లేదు. వాళ్ళు తెగుళ్ళ నివారణ, ఎరువుల వినియోగానికి సంబంధించి మరింత సమర్థవంతమైన, క్షేమకరమైన ప్రత్యామ్నాయ విధానాల గురించి మట్లాడుతున్నారు. వాళ్ళు చెబుతున్న విధానాల్లో అధికభాగం దేశీయపరిజ్ఞానం, దేశీయ యాజమాన్య పద్ధతుల మీద ఆధారపడినవే. వ్యవసాయిక రసాయనాల విచ్చలవిడి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న విధానపరమైన ప్రోత్సాహకాలను, సబ్సిడీలను మార్చవలసిన అవసరం ఉన్నదని జ్యూరీసభ్యులు తమ సంప్రదింపులలో నొక్కిచెప్పారు. విశాఖపట్టణం జిల్లాకు చెందిన ఒక మహిళారైతు ఈ అభిప్రాయాన్ని ఇంకా చక్కగా విశ్లేషించింది.

అమ్మాజీ: రసాయనిక ఉత్పాదకాలు తెచ్చే చేటు గురించి మాకు అవగాహన ఉంది. మేం వాటిని ఆపేస్తాం.... సబ్సిడీల కారణంగా ప్రజలు రసాయనిక వ్యవసాయం మీద మొగ్గచూపుతున్నారు. ఇది (ప్రస్తుత వ్యవసాయపద్ధతి) తండ్రీ కొడుకుల కంపెనీ వంటిది. తండ్రి చక్కెర అమ్మితే, కొడుకు చీమలను అమ్ముతాడు. చివరికి చీమలన్నీ పంచదారను తినేస్తాయి.

సాక్షులుగా వచ్చిన నిపుణుల్లో ఒకరు విధానాల్లోనూ, ఆర్థికపరమైన ప్రోత్సాహకాల్లోనూ మార్పులు జరగాలన్న అభిప్రాయాన్ని ప్రకటించారు.

డాక్టర్ కె.పి.సి. రావు: సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం లేదు. ప్రభుత్వం రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులకు మాత్రమే సబ్సిడీ ఇస్తున్నందువల్ల రైతులు తప్పనిసరిగా రసాయనిక వ్యవసాయ విధానాలను అనుసరించవలసి వస్తున్నది. మార్పు అవసరం చాలావుంది. ప్రభుత్వ వ్యవస్థల్లోనూ, విదానాల్లోనూ మార్పులు తేవాల్సిన అవసరం ఉంది.

మరింత వైవిధ్యపూరితమైన, సుస్థిరమైన వ్యవసాయాన్ని, ఎరువులు క్రిమిసంహారకాలు విత్తనాలు వంటి బయటి పెట్టుబడులను సాధ్యమైనంత తక్కువ వినియోగించే వ్యవసాయాన్ని అనుసరించడానికి, వ్యవసాయంలోను, పశుపోషణలోను ప్రమాదకరమైన, ఖరీదైన రసాయనాల వాడకాన్ని తగ్గించే విధంగా ప్రోత్సాహకాలు ఇవ్వడానికీ దగ్గరి సంబంధం ఉన్నది. రసాయనిక ఎరువులు, పురుగుమందులు ఎప్పుడూ వాడుతూ ఉండాల్సి వచ్చే ఒకే రకమైన పంటల విధానం కంటె, వైవిధ్యం వున్న పంటలు అడవుల నుంచి లభించే రక్షణ, పర్యావరణ భద్రతా ఎక్కువ అనుకూలమైనవి. ప్రభుత్వ విధానాలు ఎరువులు, క్రిమి సంహారకాలు, విత్తనాలు వంటి వాటిని పంపిణీ చేసేవారికి కాక

రైతులకు ప్రయోజనకరంగా ఉన్న పక్షంలో చిన్న, సన్నకారు రైతులు అందరికీ క్షేమకరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించగలరని జ్యూరీ విశ్వాసాన్ని వెలిబుచ్చింది. తీర్పులో జ్యూరీ అభిప్రాయం స్పష్టంగా ఉంది:

నరసమ్మ :- రసాయనిక ఎరువుల వినియోగానికి మేం వ్యతిరేకం.

అంజమ్మ :- మీ ఆహారం కోసం మీరు రైతులమీద ఆధారపడి ఉన్నారు కదా, మీకు నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి మా సొంత విధానాల్లో మమ్మల్ని ఎందుకు వ్యవసాయం చేసుకోనివ్వరు? విషపూరితమైన ఆహారం తింటే మీ ఆరోగ్యం చెడిపోయి ఆసుపత్రులకు సొమ్మంతా వదిలిపోతుంది. మీరు మా గురించి పట్టించుకొని మాకు తగినన్ని వనరులు కల్పిస్తే, మీకు కావలసినంత ఆహారాన్ని, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాం.

మా పంటల కోసం మేం స్థానిక వనరులమీదే ఆధారపడాలని కోరుకుంటున్నాం. మా భూముల్లో సాగుకోసం ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడటం మాకు ఇష్టం లేదు.

## 3.1.3 : యాంత్రీకరణ :

**మేం వ్యతిరేకిస్తున్నాం :**

- కార్మికులకు పనిలేకుండాచేసే యాంత్రీకరణను

రాష్ట్ర వ్యవసాయ రంగంలో అమెరికాలోని ప్రైమరీ - తరహా యాంత్రికీకరణ జరపాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విజన్ - 2020లోని ప్రధానాంశం.

దీని మద్దతుదారుల్లో ఒకరూ, సాక్షిగా వచ్చిన నిపుణుడూ అయిన ప్రొఫెసర్ యమ్.వి. రావు విజన్ 2020ని మూడు పదాల్లో వివరించారు "యాంత్రికీకరణ మరియు ఏకీకరణ (భూకమతాలు)".

జ్యూరీ సభ్యులు యంత్రాలను సైద్ధాంతికంగా వ్యతిరేకించక పోయినా, యంత్రాల వినియోగం వల్ల పెద్దరైతుల కమతాల్లో పనిచేసే కూలీల జీవితాలపై పడే ప్రభావం గురించి మాత్రం ఆందోళన వ్యక్తపరచారు. ధనిక రైతులు యంత్రాలను వినియోగించిన పక్షంలో అతి ముఖ్యమైన తమ ఆదాయ మార్గం దెబ్బతింటుందని వారు అన్నారు.

వాళ్ళు వెలిబుచ్చుతున్న మరో ఆందోళన ఏమిటంటే, దున్నడం, రవాణా వంటి పనుల్లో విస్తృతంగా జరుగుతున్న యంత్రాల వినియోగం వల్ల నేల ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం ఉంటోంది. ఇప్పుడే రాష్ట్రంలో సహజ ఎరువుల నుంచి కృత్రిమ ఎరువులకు మార్పు జరిగిన ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో పశుసంపద చాలా తగ్గిపోయింది. ఎరువు ఖరీదు క్రమంగా పెరుగుతున్నప్పటికీ పశువులు అంతరిస్తున్నాయి. దున్నడం, సరుకు రవాణా కూడా యంత్రాల ద్వారా జరిగిన పక్షంలో ఇప్పటివరకూ నిర్వహిస్తున్న ఈ రెండు పాత్రలూ కూడా మాయమై చివరకు అవి గ్రామాల నుంచే అదృశ్యమైపోయే పోయే పరిస్థితులు వస్తాయి. అందుబాటులో ఉన్న ఎరువుని వాడుకోలేని పరిస్థితి వల్ల నేల సామర్థ్యం దెబ్బతింటుందన్న బాధ నరసమ్మ వాదనలో కనిపించింది. అయితే, ఆమె బాధని అక్బల్‌రావు పట్టించుకునే ప్రయత్నంచేయలేదు. అధిక యాంత్రీకరణకూ, పాడిపశువుల అంతర్థానానికి మధ్య ఉన్న సంబంధం ఆయన గుర్తించినట్టుగా కనిపించలేదు. అధిక ఉత్పత్తి వల్ల ఆదాయాలు పెరిగినా ఆ ఫలితాలు సన్నకారు రైతులవరకూ చేరుకునే అవకాశం తక్కువని, వారికి పనికూడా పోతుందని ఆయన గమనించలేదు.

నరసమ్మ : మేం యంత్రాలను వాడాలని, వ్యవసాయానికి అందువల్ల మేలు జరుగుతుందని మీరు అంటున్నారు. అసలు మేము వాటిని ఎందుకు వినియోగించాలి? ఒకవేళ ఆ పని చేస్తే మాకు (కూలీలుగా మాకు ఉపాధి) కూలి దొరకదు. అందుకు బదులుగా మీరు మాకు సాగుకోసం వీలుగా ఎద్దులను ఇవ్వండి. మాకు ఎరువు దొరుకుతుంది మేం దానిని మా పంటలు పండించడానికి వాడుకుంటాం.

అక్బల్‌రావు : నానాటికీ జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. మీరు ఇతర (కూలీలుగా కాక) ఉపాధులు వెతుక్కుని వ్యాపారం వంటి ఇతర రంగాల్లోకి విస్తరించాలి. నేను ఇంతకుముందు చెప్పినట్టు (ఈరోజు) ప్రతీ వందమందిలో 70 మంది వ్యవసాయంపైనే ఆధారపడివున్నారు. యాంత్రాలు పని వేగంగా పూర్తయ్యేట్టు చేయడంతో పాటు ఉత్పత్తిని కూడా పెంచుతాయి.

కొంత సమయం తరువాత ఆయనే : వంద రోజులు పట్టే పనిని ట్రాక్టర్లు ఒక్కరోజులో చేయగలవు. మనకు అవి తప్పనిసరిగా ఉండాలి. కాకపోతే, మీరు ఎద్దుబళ్ళు వాడటం కొనసాగించవచ్చు.

కూలీల మీద చేసే ఖర్చును తగ్గిస్తాయి కనుక వాటితో పాటు మనకు ట్రాక్టర్లు తప్పకుండా అవసరం.

నరసమ్మ : మనం గనుక యంత్రాలు వాడితే నేల దాని సామర్థ్యం కోల్పోతుంది ?!

అక్బల్‌రావు : పశువుల్ని పెంచుకోవద్దనీ, దానిని ఆపేయమని మిమ్మల్ని ఇప్పుడు ఎవరడుగుతున్నారు!? మీరు పశువుల్ని పెంచుకోండి, ఆ ఎరువునీ వాడుకోండి. రెండిటికీ తేడా ఉంది, రెండూ మీకు అవసరమే! ఆ విషయం అలా ఉంచితే, ఇప్పటివరకు జరిగిన యాంత్రికీకరణ కేవలం ఒక శాతం మాత్రమే.

తీర్పును ప్రకటిస్తూ, అమ్మాజీ మిగతా జ్యూరీ సభ్యుల అభిప్రాయాలను ఈ విధంగా పేర్కొంది.

మాకు యంత్రాలు, ట్రాక్టర్లు వద్దు.

ప్రస్తుత వ్యాఖ్యని ప్రధాన తీర్పు భాగం (పైన)తో కలిపి చూసినప్పుడు కూడా దీనిని మనం సన్నకారు రైతులు వ్యవసాయ యంత్రాల ఎప్పుడూ వాడబోమని ప్రకటించినట్టుగా భావించనవసరం లేదు. వాళ్ళు వ్యతిరేకిస్తున్నది విజన్ 2020లో చెప్పినటువంటి కార్మికులను దెబ్బతీసే నేల ఆరోగ్యాన్ని పాడుచేసే యంత్రీకరణ విధానాలను మాత్రమే.

## 3.1.4. నీరు

**మేం ఆశిస్తున్నది**

- మా సాగునీటి చెరువులను పునరుద్ధరించడం
- కరువు కాలంలో సాగునీరు
- చిన్న రైతులకు సమిష్టి నిర్వహణ వనరులుగా బోరుబావులు
- మంచినీటి చెరువుల పునరుద్ధరణ, దేశీయ నీటి యాజమాన్య విధానాలు
- తగిన నీటి పారుదల

తాగునీరు, సాగునీరు తగినంత అందుబాటులో లేకపోవడం జూరీ సభ్యుల ప్రధాన ఆవేదన. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ వినియోగంలో ఉన్న భూమిలో 60 శాతం వర్షాధారమైనదే. కొందరు సభ్యులు ప్రత్యేకించి మెట్ట ప్రాంతాల్లోనూ, కొన్ని ఇతర జిల్లాల్లో బోరు బావుల విస్తృత వినియోగం కారణంగా భూగర్భ జలమట్టం తగ్గిపోయి నీరుదొరుకని దుస్థితి ఏర్పడిందని ఆందోళన వెలిబుచ్చారు. కర్నూలు జిల్లాలో నీటి ఎద్దడి కారణంగా ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను దీవెనమ్మ వివరించింది.

రైతులు భయంకరమైన నీటి ఎద్దడి ఇప్పడు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో బోర్ల వాడకం బాగా ఎక్కువైపోవడం వల్ల భూగర్భ జలమట్టం ఏ స్థాయికి పడిపోయిందంటే, జనం ఇప్పడు ప్రతిరోజూ నీళ్ళు కొనుక్కోవలసి వస్తోంది. నీళ్ల లేని కారణంగా జనం తమ పశువుల్ని అమ్మేసుకుంటున్నారు.

నీటి ఎద్దడి ఉన్నప్పటికీ పంటలను పండించగలిగే సాంకేతిక పరిష్కారాలేవీ లేవని - కోస్తా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక రైతుకూ, సింజెంటా ప్రతినిధికీ మధ్య జరిగిన ఈ సంభాషణ స్పష్టంచేస్తున్నది.

శాంతమ్మ: వానల్లేవు...., అందువల్ల పంటలూ లేవు... మీరు ఏమంటారు?

డాక్టర్ దాస్‌గుప్తా (జవాబు చెబుతూ): కరువు తాకిడిని తట్టుకుని నిలబడే పంటలు కరువు పరిస్థితులను కొంతకాలం తట్టుకుని నిలబడగలవు. అయితే ఏకంగా రుతుపవనాలే లేని పరిస్థితిని మాత్రం కాదు.

ఎందుకూ కొరగాకుండా వదిలిపెట్టేసిన గొలుసు చెరువులను పునరుద్ధరించడం, దేశీయ నీటి నిర్వహణ విధానాలను అమలు చేయడం అవసరమని జ్యూరీ స్పష్టం చేసింది. ఈ దేశీయ నీటి పరిరక్షణ విధానాలు చక్కని సూత్రాల ఆధారంగా ఉన్నాయని, నేటి అవసరాలకు అనుగుణంగా వాటిని వినియోగించుకోవాలని జ్యూరీ భావించింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఆంధ్రప్రదేశ్‌లోని చాలా ప్రాంతాల్లో బోరుబావుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయినప్పటికీ బోరుబావి పరిజ్ఞానం మీద ఇక్కడ వ్యతిరేకత కనిపించలేదు. వ్యక్తిగతమైన బోరుబావి కంటే సమిష్టి యాజమాన్యంలో బోరుబావులను నిర్వహించుకునే విధానానికి మారడం, ఇంకా అటువంటి సరయిన సాగునీటి నిర్వహణ చర్యలు చేపట్టడం అవసరమని జ్యూరీ సభ్యులు సూచించారు. జ్యూరీ అభిప్రాయాలను అంజమ్మ ఈ విధంగా క్లుప్తీకరించింది.

- మాకు నీరు, బోరుబావుల అవసరం ఉంది. పంటలకు కావలసినంత నీరు లభించడానికి వీలుగా చెరువులు, కుంటల్లో పూడిక తీయాలి.

నీటి సరఫరాను సుస్థిరపరచాలన్న జ్యూరీ సిఫారసుకు మరోచోట కొన్ని సూచనలు చేసారు. తక్కువ నీరు అవసరమైన చిరు ధాన్యాలు, తృణధాన్యాల వంటి పంటల నీటి అధిక వినియోగాన్ని నివారించవచ్చునన్నది ఆ ప్రతిపాదన (కింద చూడండి).

## 3.1.5 సాంప్రదాయిక అధ్యయన విధానాలు

**మేం కోరుతున్నది**

- దేశీయ వ్యవసాయం - పూడిక మన్ను, పెరటి ఎరువులు, పాత వంగడాలు, మెరుగుపరచిన విత్తనాలు, మిశ్రమ పంటలు / రొటేషన్ పంటలు, పంట నుంచి సేకరించిన విత్తనాలు, విత్తనాల ఎంపిక మీద అధికారం మొదలయినవన్నీ కలగలసిన వ్యవసాయ విధానం
- అనేక రకాలైన, వైవిధ్య పూరితమైన పంటలు, పశువుల నిర్వహణ

జీవవైవిధ్యం ప్రాతిపదికగా ఉండే దేశీయ వ్యవసాయ విధానాలకు, భూ వినియోగ వ్యవస్థలకు జూరీ సభ్యులు పాధాన్యం ఇచ్చారు. పంటల విధానంలో వైవిధ్యం ప్రకారం ఒకటి నుంచి రెండు ఎకరాల కమతం సాధారణంగా 8 నుంచి 12 రకాల పంటలకు ఆశ్రయం కల్పిస్తుంది. ఒక్కో పంటరకంలో జన్యువైవిధ్యం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు సేద్యం చేసే క్షేత్రాల్లో స్థానిక పరిస్థితులకు అనుకూలమైన, వైవిధ్య పూరితమైన పశు సంపద (కోళ్ళు, గొర్రెలు, మేకలు, పందులు, పశువులు) కూడా జ్యూరీ కోరుకుంటున్న వ్యవసాయిక విధానాల్లో కీలకమైన పాత్ర

నిర్వహిస్తాయి. మంచి సేంద్రియ ఎరువుకి పశుసంపద అవసరం, సేంద్రీయ ఎరువు వాడకం మంచి పశుపోషణకీ, ఆరోగ్యకరమైన పంటలకీ, పశువులకీ, మనుషులకీ కూడా ముఖ్యం అని జ్యూరీ సభ్యులు భావించారు.

జ్యూరీ తరఫున విశాఖపట్నం జిల్లాకు చెందిన అమ్మాజీ మాట్లాడుతూ, రైతులు స్వతంత్ర నిర్ణయాధికారాన్ని ప్రతిఫలించే విధంగా, పటిష్టపరచే విధంగా ఉత్పాదక వ్యవస్థలు ఉండాలని అన్నారు.

- మేం మా సొంత విధానాల్లో వ్యవసాయం చేసుకుంటూ, సంప్రదాయిక ఎరువులతో మా పంటలు మేం పండించు కుంటూ స్వయం సమృద్ధంగా ఉండాలని కోరుకుంటున్నాం.

దేశీయ వ్యవసాయిక విధానాలు, వాటికి ఆధారభూతమైన సంప్రదాయిక జ్ఞానం పర్యావరణానికి అనుగుణంగా ఉండడమే కాక, అందులో నష్టం సంభవించే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయన్న విషయం జ్యూరీ సభ్యులకు స్పష్టంగా తెలుసు. అంతేకాదు, వైవిధ్య పూరితమైన వ్యవసాయం, నేల వినియోగం వంటి విషయాల్లో సామర్థ్యాన్ని పూర్తిస్థాయి వినియోగంలోకి తేవాలంటే ప్రభుత్వ విధానాల్లో, సాంకేతిక దృక్పథంలో నిర్ణయాత్మకమైన మార్పు జరగాలన్న విషయం కూడా వీరికి తెలుసు. తగిన శిక్షణ, పరిశోధనలతో పాటు పాడిపశువుల పునః ప్రవేశం కోసం కూడా ప్రభుత్వ సహకారాన్ని వారు కోరుతున్నారు. జ్యూరీ తీర్పును సంక్షిప్తమైన మాటల్లో వెలిబుచ్చుతూ, గుంటూరుకు చెందిన ఫిలిప్ ఈ విషయంలో ప్రభుత్వం ఏం చేయాలో ఇలా చెప్పాడు.

మేం సాంప్రదాయిక విధానాల్లో సాంప్రదాయిక పంటలు పండించుకోవాలని కోరుకుంటున్నాం. ఇందుకోసం మాకు శిక్షణతో పాటు పశువులను కూడా సమకూర్చాలి.

చిన్నకమతాల వారి అవసరాలను, అలాగే సన్నకారు రైతుల అవసరాలను (అంటే కరువు ఎద్దడిని తట్టుకునే పశువులు, పాలదిగుబడి, జీవనోపాధిలో వైవిధ్యం వగైరా) ముఖ్యంగా మెట్ట భూముల్లోనూ, మెరక ప్రాంతాల్లోనూ సేంద్రీయ ఎరువుల వినియోగం ద్వారా మట్టిలో జీవాన్ని పెంచడం, ఆరోగ్యకరమైన వ్యవసాయ - పర్యావరణ వ్యవస్థలను ఏర్పరచడం ద్వారా తీర్చవచ్చని జ్యూరీ భావిస్తోంది (సెక్షన్ 3.1.14 చూడండి).

## 3.1.6 దేశీయ విజ్ఞానం - సంప్రదాయాలు :

**మేం కోరుతున్నది**

- మా సంస్కృతికి తగిన వ్యవసాయ విధానాలు (పండుగలతో ముడిపడిఉన్న చెట్లు, పంటలు, పశువులతో సహా)
- దేశీయ విజ్ఞానాన్ని గుర్తించి గౌరవించడం, ఆవిష్కరణలను ఆహ్వానించడం
- ఏ పంటలు పండించాలో కమ్యూనిటీస్థాయిలో ప్రణాళిక వేసుకోవడం
- ధరలు, మార్కెటింగ్, మార్కెట్ - ఈ మూడింటి మీద స్థానికమయిన యాజమాన్యం, ఈ మూడు స్థానికంగా అందుబాటులో ఉండడం, ఈ మూడింటి మీద స్థానికమయిన నియంత్రణ ఉండడం
- దేశీయమైన వనరుల నిర్వహణాపద్ధతులలో తిరిగి శిక్షణ

దాదాపు 70 శాతం మంది జనాభా వ్యవసాయంలోనూ, సహజవనరుల నిర్వహణలోనూ ఉన్నందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో దేశీయ విజ్ఞానం అపరిమితంగా ఉంది. అడవులు, వ్యవసాయం, పశుపోషణ, సాగునీటి నిర్వహణ, ఆరోగ్యం వంటి విషయాల్లో అనేక కొత్త కొత్త ఆలోచనలు అమలు జరిగాయి. జ్యూరీ సభ్యుల విషయంలో కూడా ఈ పరిజ్ఞానం స్పష్టంగా కనిపించింది. సాక్షిగా వచ్చిన నిపుణులను ప్రశ్నిస్తున్నప్పుడు

వారు తమ అనుభవాలను, జ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని ప్రశ్నించడంతో పాటు, చాలా మంది నిపుణులు ప్రజల జ్ఞానాన్ని, మేధో సంబంధమైన తోడ్పాటును ప్రశంసించక తప్పని పరిస్థితి కలగడం విచిత్రం.

డాక్టర్ టి.ఎస్. ప్రకాష్ : సంప్రదాయ రైతులు దేశీయ పరిజ్ఞాన విధానాల్లో నిష్ణాతులు, వారికి అమోఘమైన వివేచన, వ్యవహార జ్ఞానం ఉన్నాయి. సంప్రదాయిక వ్యవసాయం మౌలికంగా దేశీయ, వ్యవహార జ్ఞానాల మీద ఆధారపడి ఉంటుంది. వారికి ఈ అనుభవం చాలా ఉంది. ఇందుకు భిన్నంగా హరిత విప్లవ వ్యవసాయం వీరికి ఏమీ తెలియదనే భావిస్తుంటుంది. దుక్కి దున్నడం, విత్తడం, సస్యరక్షణ చర్యలు, నూర్పిళ్ళు వంటి విషయం వారికి తెలియచెప్పాలనుకుంటుంది. రైతులకు ఏమీ తెలియదని అనుకోవడం వల్ల ప్రతిదీ శాస్త్రీయ సంస్థల నుంచి క్షేత్రాలకూ, రైతులకూ బదిలీ కావాలని భావిస్తుంది. సంప్రదాయిక వ్యవసాయం రైతుకు చాలా విషయాలు తెలుసునని భావిస్తుంది. రైతులకు తెలిసినదానిపైనా, వారికి ఉన్నదానిపైనా ఆధారపడివుంటుంది. రైతులు, మహిళలు, పశుపోషకులు, గ్రామీణ ప్రజలందరి వినూత్నమైన ఆలోచనలపైనా, సృజనాత్మకతపైనా వేళ్ళూనుకున్న విధానాలు ఇవి. ఇది మీ స్వయంశక్తి. మీరు ఏమిటో, మన వ్యవసాయ విధానం ఏమిటో మీకు తెలియడానికే ఈ మాటలు చెబుతున్నారు.

డాక్టర్ అలెగ్జాండర్ డేనియల్స్ : మేం దాదాపు వెయ్యి సామెతలు సేకరించాం. అవన్నీ సేంద్రీయ వ్యవసాయంతో సంబంధం ఉన్నవే.

మన (భారతీయ) సంస్కృతిలో అంతర్లీనంగా సేంద్రియ వ్యవసాయ లక్షణాలు ఉన్నాయి.

కీలకమైన సాక్షులను జ్యూరీ విచారిస్తున్నప్పుడు అనేక సందర్భాల్లో సాంకేతికనైపుణ్యమే సర్వస్వంగా భావించేవారి ఆలోచనాధోరణి ఎట్లా ఉంటుందో అక్కడున్నవారందరికీ తెలిసివచ్చింది. గ్రామీణ ప్రజల జ్ఞానాన్ని ఎంత తప్పగా అర్థంచేసుకుంటారో నిరసనభావంతో చూస్తారో, ఏమాత్రం విలువివ్వకుండా ఎలా కొట్టిపారేస్తారో అక్కడి వారికి అర్థమైంది (46వ పేజీ ?, బాక్స్-7 చూడండి). ప్రజా సమూహాలు ఆవిష్కరించిన పశువైద్య విధానాలు ఏ విధంగా నిర్లక్ష్యానికి లోనవుతున్నాయో వివరిస్తూ సాక్షిగా వచ్చిన ఒక స్పెషలిస్టుసాక్షి ఇలా వ్యాఖ్యానించారు.

డాక్టర్ సాగరి రాందాస్ : రైతులకు అందుతున్న పశువైద్య సహాయం చాలా తక్కువగా ఉంది. అంటురోగాల నుంచి కాపాడే చర్యలేవీ వారికి అందుబాటులో లేవు. వైద్య ఖర్చులన్నీ రైతులే భరించుకోవాలన్నది ఉద్దేశం. ప్రభుత్వ సహకారం ఈ విషయంలో చాలా తక్కువగా ఉంది. అది ఎంతమాత్రం చాలదు. పశువుల ఆరోగ్య రక్షణకు, చికిత్సలకు దేశీయ విధానాలపై మనం శ్రద్ధ చూపడం లేదు. వాటిని ప్రోత్సహించడం కానీ, ఆచరించడం కానీ జరగడం లేదు. కానీ మనం మరోవక్క ఎగుమతుల గురించి మాట్లాడుతున్నాం (పశు ఆరోగ్య సంరక్షణలో దేశీయ జ్ఞానాన్ని ప్రోత్సహించడంలో ప్రభుత్వ వైఫల్యం గురించీ, మరోవైపు ప్రభుత్వం ఔషధ మొక్కల ఎగుమతిని ప్రోత్సహించడం గురించి చెబుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు).

ఆంధ్రప్రదేశ్‌లో ఆహారం, వ్యవసాయం భవితవ్యం కోసం జ్యూరీ చేసిన సూచనల్లో అనేకం వాటిని దేశీయ జ్ఞానం, నిర్వహణ విధానాల ఆధారంగా కొనసాగే స్థానిక వ్యవస్థలుగా గుర్తించడం, ఆ విధంగా బలోపేతం చేయడాన్నే కోరుతున్నాయి. (తదుపరి సెక్షన్లు చూడండి). దేశీయ విజ్ఞానంలోని సాంస్కృతిక/ ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించడం, ఇప్పటివరకూ కోల్పోయిన వాటిని మళ్ళీ సాధించుకుని, వాటిని సందర్భానుసారం చేయడం జ్యూరీ అంతిమతీర్పులోని ప్రధానాంశం. మెదక్ జిల్లాకు చెందిన అంజమ్మ ఇలా అన్నది.

- సంప్రదాయిక వ్యవసాయ విధానాలు కొనసాగించడానికి మాకు మరింత శిక్షణ అవసరం.
- మేం అనాదిగా వస్తున్న విధానాల్లోనే సంప్రదాయక పంటలు పండించాం.
- ఒక చిన్న కమతం గురించి 10 రకాల విత్తనాలను ఉత్పత్తి చేయగలిగాం.
- మా పంటలూ, పండుగలూ మాకు ప్రాణంతో సమానం.

## 3.1.7. విత్తనం

**మేం కోరుతున్నది**

- స్వావలంబన
- ధాన్యంనుంచి ఎంపికచేసి భద్రపరచుకున్న విత్తనాల పునర్వినియోగ హక్కు

జ్యూరీలో వ్యవసాయం చేస్తున్న సభ్యులందరికి విత్తనాలను భద్రపరచుకోవడం, వాడుకోవటం తెలిసిన విషయమే. బాయక్క వంటి కొందరు అధిక వుత్పత్తి రకాలతో ప్రయోగాలు చేసి, వాటి విత్తనాలను భవిష్యత్ అవసరాలకు దాచుకోవడం సాధ్యపడదని గ్రహించారు. అధిక వుత్పత్తి రకాలతో ఉన్న అనేక సమస్యల్లో ఇదొకటి. అయితే, ఇటువంటి సమస్యల గురించి విత్తనాల అమ్మకందార్లు ఏ సలహాలూ ఇచ్చినట్టు కనిపించలేదు.

ఖరీదైన ఎరువులు, క్రిమిసంహారకాల వాడకం కారణంగా, స్థానిక పరిస్థితులకు అనువుగాని పంటలను ప్రోత్సహించిన ఫలితంగా, నాణ్యత లేని విత్తనాల కారణంగా బాయమ్మ సొంతజిల్లా అయిన వరంగల్‌లో 500 మంది దాకా రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యకు పాల్పడిందీ మరొక స్పెషలిస్టు సాక్షి శ్రీనివాస్ అప్పటికే వివరించి ఉన్నారు.

ఈ కొత్తరకం విత్తనాలు వాడితే అపర కుబేరులైపోతారంటూ విత్తన కంపెనీల ప్రతినిధులు చెప్పిన మాటల్నీ, ఇచ్చిన హామీలనీ కొందరు నిరుపేద, నిరక్షరాస్యులైన రైతులు ఏ విధంగా నమ్మిందీ దీవెనమ్మ వివరించింది. ఇప్పటికే బాగా దెబ్బతినివున్న చిన్న రైతుల ప్రయోజనాలు కాపాడాలంటే ఈ కొత్త విత్తనాల అమ్మకాలను నియంత్రించడం కానీ, కొన్ని సందర్భాల్లో నిషేధించడం కానీ జరగాలనీ, అప్పుడు మాత్రమే తానూ, తన తోటి రైతులు వాటి బారినుంచి బైటపడగలుగుతామని ఆమె వ్యాఖ్యానించింది.

మార్కెట్‌లో కొత్త విత్తనాలు అందుబాటులో ఉంటే వాటిమీద ఆశ కలగటం సహజం. అవి అందుబాటులో లేకుండా చూసినప్పుడే మా మాదిరి రైతులు సొంత విత్తనాలు వాడుకుంటారు. కొత్త విత్తనాలు వాడి కాస్తంత డబ్బు సంపాదించుకోవాలన్న ఉత్సుకత నుంచి మమ్మల్ని మేం నియంత్రించుకోవడం ఎలా?

అనేక రకాల సాంప్రదాయిక విత్తనాలు ఇప్పటికీ లభిస్తున్నాయని విన్న దీవెనమ్మ ఒక సూచన చేస్తూ 'సంప్రదాయ విత్తనాలు ఎక్కడనుంచి తెచ్చుకోవాలో మాకు తెలియాల్సిన అవసరం ఉంది' అని వ్యాఖ్యానించింది. ఆమె తోటి జ్యూరీ సభ్యులూ, పొరుగు జిల్లా గుంటూరుకు చెందిన కోటరత్నమ్మ ఇందుకు స్పందనగా 'మేం సాంప్రదాయిక విత్తనాలు సేద్యం చేస్తూనే ఉన్నాం. అయితే మాకు దక్కుతున్న ధర ఏమాత్రం గిట్టుబాటయ్యేది కాదు' అని

ప్రకటించింది. మరొక సభ్యుడు పాపారావు ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తూ 'వాటిని అమ్ముకోవడానికి అసలు దగ్గర్లో మార్కెట్టే లేదు' అన్నాడు.

తన తోటి జ్యూరీ సభ్యుల ఆలోచనా కోణాన్ని ఆధారంగా చేసుకొని నరసమ్మ ఈ విధంగా తీర్పు చెప్పింది.

- పాతపంటలను పండించుకోవడానికి, మాపొలాల్లో సేకరించిన విత్తనాలను భద్రపరిచి వాడుకోవడానికి మేం మా సొంత వ్యవసాయ పద్ధతులనే అనుసరించాలని కోరుకుంటున్నాయి.

## 3.1.8. జన్యు మార్పిడి

**మేం వ్యతిరేకిస్తున్నవి**

- జన్యుమార్పిడి పంటలు- విటమిన్-ఎ బియ్యం, బిటి పత్తి.
- పనికిమాలిన సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, పరిశోధనలపైన డబ్బు వృధా చేయడం. ఈ పరిశోధనలకి బదులుగా మేం మా విజన్ సాధించడానికి ఆ డబ్బును మళ్ళించవచ్చు.

ప్రజాతీర్పు జ్యూరీ తన కార్యక్రమాల్లో మరే ఇతర విషయాలకన్నా ఎక్కువగా జన్యుమార్పిడి పంటల గురించిన సాక్ష్యాలు విన్నది. ఇద్దరు మాలిక్యులర్ బయోలజిస్టులు (ప్రొఫెసర్ డి.యమ్. రావు, డా॥ దేబాశీష్ బెనర్జీ), ఒక అధికారి (అక్బర్‌రావు), ఒక విత్తనాల కంపెనీ అధికారి (డా॥ పార్థా దాస్‌గుప్తా), పెద్ద రైతుల లాబీ గ్రూపు నాయకుడు (చెంగల్‌రెడ్డి) తమ వాదనలు వినిపించారు.

జ్యూరీ సభ్యులెవరూ కూడా అంతకుముందు జన్యుమార్పిడి పంటలగురించి వినివుండలేదు. అయినప్పటికీ వాదోపవాదాలు పూర్తయ్యేసరికి వాళ్ళకు ఈ విషయంపై బలమైన నిర్ణయాలు తీసుకోగలిగినంత అవగాహన కలిగిందన్నారు. జ్యూరీకి సమర్పించిన సాక్ష్యాల్లో ఈ కింది భాగాలు చూస్తే అంతిమంగా వచ్చిన తీర్పు మనకు బోధపడుతుంది.

చెంగల్‌రెడ్డి జన్యుమార్పిడి పంట పరిజ్ఞానానికి అనుకూలంగా ఉన్నప్పటికీ వాటిని 'తెల్లవాడి' పరిశోధనాశాలలనుంచి వస్తున్నవిగా అభివర్ణించారు. అయితే, తెల్లవాడు అనేక సాంకేతిక పరిజ్ఞానాలు తెచ్చాడనీ, 'విద్య' ప్రజలను అభివృద్ధి పథంలో నడవటానికి దోహదంచేసిందనీ, అలాగే జ్యూరీలో ఉన్న రైతులు జన్యుమార్పిడి లాంటి కొత్తరకం వ్యవసాయ పరిజ్ఞానాన్ని పయత్నించి చూసి ఆ తరువాత వాటికి అనుకూలమా, వ్యతిరేకమా అనేది నిర్ణయించుకోవాలన్నారు.

టెక్నాలజీని వ్యతిరేకించడం సరైన పద్ధతి కాదు. మీరు సాంప్రదాయిక విధానాలు, పద్ధతులకే కట్టుబడి ఉండదల్చుకున్నారా? కానీ, మీరు జబ్బుపడితే ముందు ఇంగ్లీషు డాక్టరు దగ్గరకే (అల్లోపతి) వెడతారు. సంప్రదాయమందుల కోసం ఎదురుచూస్తూ కూర్చోరు. వెంటనే ఓ ఆసుపత్రికి వెళ్ళి చికిత్స చేయించుకుంటారు. ఇటువంటి సందర్భాల్లో ఈ టెక్నాలజీ మీకు ఇష్టమే! అవునా? - మీరు మీ పిల్లలను స్కూలుకు వెళ్ళమని చెబుతారా, లేక మీతోపాటే వ్యవసాయం చేయడానికి రమ్మంటారా? పిల్లలకి చదువు వద్దని చెప్పడం తప్పకాదా? ప్రతీ తల్లిదండ్రీ తమ పిల్లలు చదువుకోవాలనీ, వ్యవసాయం కాక డాక్టరుగానో, ఇంజనీరుగానో స్థిరపడాలనీ, ప్రభుత్వోద్యోగాలు చేయాలనీ కోరుకుంటారు.

ప్రస్తుతం ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రతీదీ మంచి అనో, చెడ్డదనో నిర్ధారించే పరిస్థితి లేదు. ఏదీ కళ్ళకు కట్టినట్టుగా స్పష్టంగా ఉండదు. మీ ఇంట్లో కరెంటు వుండాలనీ, రేడియో, టీవీ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు వుండాలనీ, అత్యంత ఆధునికమైన వస్తువులతో మీ ఇల్లు నిండాలనీ కోరుకుంటూంటారు. ఇవన్నీ కూడా ఆ 'తెల్లవాడు' ఇచ్చినవే. మీరు వేసుకున్న బట్టలూ, మీ జేబులో వున్న పెన్నూ వాడివే. అవన్నీ కూడా టెక్నాలజీ కారణంగా ఆవిర్భవించినవే. సమాజంలోని ఇతర వర్గాలవారు ఈ టెక్నాలజీ వల్ల బాగుపడుతుండటం కూడా మీకు తెలుసు. డాక్టర్లు, ఇంజనీర్లు, కంప్యూటర్ ఇంజనీర్లు వగైరా వగైరా వర్గాలవారు ఈ టెక్నాలజీ వల్ల లాభపడి జీవితంలో ఎంతో అభివృద్ధి సాధించారు.

మీరు టెక్నాలజీని ప్రశ్నించండి, దానిని పరీక్షించండి, దాని ఉపయోగాల గురించి తెలుసుకోండి. ఆ తరువాత దానిని ఆమోదించాలా, తిరస్కరించాలా అన్నది నిర్ణయించండి. ఆ టెక్నాలజీ ఇంకా మీ గడప తొక్కకముందే తల అడ్డంగా ఊపేయాలని మీరు ముందే నిర్ణయించుకుంటే అంతకంటే విచారించాల్సిందేమీ లేదు. మొదట మీ గురించి మీరు ఆలోచించండి..., ఏది మీకు లాభిస్తుందో చూసుకోండి.

చెంగల్‌రెడ్డి జ్యూరీ సభ్యులను స్వీయ ప్రయోజనాల గురించి ఆలోచించమని విజ్ఞప్తి చేస్తే, డాక్టర్ పార్థాదాస్‌గుప్తా సైన్స్‌మీద విశ్వాసం ఉంచాల్సిందిగా కోరారు.

ఏదైనా సవాలు ఎదురయితే, మనుషులు దానిని ఎదుర్కొనడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తాడు. శారీరకంగా, మేధోపరంగా ప్రయత్నాలు చేసి ఆ సవాలుని అధిగమించడానికి కృషిచేస్తాడు. అంతిమంగా విజయం సాధించడానికి ఒక కిలోమీటరు నదిని దాటడం అసాధ్యమని ఈరోజు అనుకుంటే, ఆ నదిని దాటే మార్గాల్ని మనం తరువాత కనుక్కుంటాం. మనిషి ఆలోచనా శక్తికి ఉన్న గొప్పతనం ఇది. అన్ని శాస్త్రాలకూ తల్లివంటిది మేధస్సు. ఇప్పుడు మనమంతా ఒక గ్రామంలో కూచునివున్నా, ఒక శక్తివంతమైన వీడియో కెమెరా, ఓ డిజిటల్ సిస్టిమ్ మనపక్కనున్నాయి. మనిషి నిరంతరం

ఆలోచిస్తూండటం వల్ల ఏదో ఒకటి కొత్తగా ఆవిష్కారమౌతూనే వుంటుంది. అందువల్ల సవాలుని ఎదుర్కోవాల్సి వచ్చిన ప్రతిసారీ మనం అందుకు పరిష్కారం వెతుక్కుంటున్నాం.

ప్రతీ టెక్నాలజీకి, ప్రతీ జ్ఞానానికీ, ప్రతీ సైన్సుకీ దాని పరిమితులు దానికి ఉంటాయి. అది మీకు చాలా ఇవ్వచ్చు కానీ, అంతకు మించి ఇవ్వలేదు. మీరు ఒక టెక్నాలజీ పరిమితికి చేరుకున్నప్పుడు, మేం మరో పద్ధతి కోసమో, పరిజ్ఞానం కోసమో పరిశోధనలు చేసి ఆ అడ్డంకిని దాటే మార్గాన్ని కనుక్కుంటాం. గ్రెగార్ జాన్‌మెండల్ ప్రసాదించిన జ్ఞానంతో, వందేళ్ళుగా సాంప్రదాయిక వంగడాల తయారీ (classicbreedina) విధానంలో దిగుబడిని పెంచుకున్నాం. ఒక ఎకరంలో రాదగిన బార్లీ / వచ్చే అవకాశం వున్న దిగుబడిని 2 టన్నుల నుంచి 12 టన్నులకు పెంచుకున్నాం. అయితే ఈ విధానానికి పరిమితులున్నాయనీ ఇంతకు మించి ముందుకు పోలేమని శాస్త్రవేత్తలే గ్రహించారు.

ఉత్పత్తి పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పేందుకు డాక్టర్ దాస్‌గుప్తా మాల్థూస్ సిద్ధాంతర తరహా వాదనని ఉపయోగించుకున్నారు. ఆ తరువాత ఆయన ప్రస్తుతం తిండిలేనివారికి ప్రత్యక్షంగా మేలు చేకూర్చే వివిధ రకాల జన్యుమార్పిడి పంటల గురించి వివరించారు. ఆకు ఎండు తెగుల్ని తట్టుకనే జన్యుమార్పిడి వరి, కీటకాలను తట్టుకునే పత్తి, మొక్కజొన్నలు, మూలాన్ని నాశనం చేసే తెగులు తట్టుకునే సోయా చిక్కుడు ఆయన చెప్పిన జాబితాలో కొన్ని: అంతర్లీనంగా ఉన్న ఈ అద్భుతమైన లకణాల వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు.

క్రిమినిరోధకం, ఫంగల్ జబ్బుల నిరోధకం, వైరల్ జబ్బుల నిరోధకం, సలెనిటీ (ఉప్పదేరిపోవడం) నిరోధకం, వర్షాభావ నిరోధకం, ఎక్కువ తక్కువ ఉష్ణోగ్రతల నిరోధం.

'ఉత్పత్తి నాణ్యత' పెంచే కొన్ని లక్షణాల గురించి చెబుతూ అటువంటి రకాలను ఆయన వివరించారు. "ఒక గింజలో పిండిపదార్థం, ప్రోటీన్, కొవ్వు ఉంటే మనం దానిని మరింత బలవర్ధకంగా మార్చడానికి దాని అమినో ఆసిడ్ స్వరూపంలో మార్పులు చేస్తాం. నూనె గింజ అయిన పక్షంలో దాని కొవ్వు ఆమ్లాల నిర్మాణ స్వరూపంలో మార్పులు తెస్తాం. ఒకవేళ తిండి గింజ అయితే, అందులో కొన్ని విటమిన్లు లోపిస్తే ఆ విటమిన్లతో దానిని పరిపుష్టం చేస్తాం".

తరువాత ఆయన 'గోల్డెన్ రైస్' గురించి విపులీకరించారు. 'విటమిన్-ఏ' తో సమృద్ధం చేసిన ఈ గోల్డెన్ రైస్‌తో ఉన్న ప్రయోజనాల గురించి ప్రొఫెసర్ రావు కూడా వివరించారు.

ప్రజలు పాలిష్ చేసిన బియ్యం తినడానికి అలవాటుపడిపోయారు. ఈ కారణంగా చాలా పోషక పదార్థాలు కోల్పోతున్నాం. ఇప్పుడు జన్యుమార్పిడి వంటి కొత్త టెక్నాలజీ వల్ల వరిలో విటమిన్-ఏ వంటి అన్ని పోషకపదార్థాలూ ఉంటాయి. అటువంటి బియ్యం అందుబాటులో ఉండటం వల్ల ఇక విటమిన్-ఏ లోపం అంటూ ఉండదు. రైతులు ముందుకు వచ్చి దానిని పండించాలి.

జన్యుమార్పిడి పరిజ్ఞానం వల్ల రైతులు ఇక క్రిమి సంహారిణులు వాడాల్సిన అవసరం కూడా ఉండదు అని ప్రొఫెసర్ రావు సూచించారు.

జన్యుమార్పిడి విధానం ప్రవేశపెట్టటంలో ఉన్న ప్రమాదాల గురించి ప్రధానంగా చర్చించిన ఏకైక సాక్షి డాక్టర్ దేబాశీష్ బెనర్జీ. ఆయన ఇందుకు అనేక ఉదాహరణలు చెబుతూ, ప్రపంచంలో అత్యధికంగా పండిస్తున్న జన్యుమార్పిడి పంట - బిటి పత్తి గురించి ప్రత్యేకంగా వివరించారు.

కొన్ని సంస్థలకు చెందిన (మోన్‌శాంటో) శాస్త్రవేత్తలు క్రిమిసంహారిగా పనిచేసే బిటి విషాన్ని (బాక్టీరియా రసాయనం) జన్యువుగా సంక్రమింపజేసేందుకు కృషి చేశారు. తత్ఫలితంగా బిటి జన్యువు ఉన్న ఓ జన్యు మార్పిడి పంట ఆవిర్భవించింది. ఈ రకం పత్తి ఆకులు, కాయ, కాండం కూడా బిటి విషాన్ని ఉత్పత్తి చేస్తాయి. ఇది ఎంతో ఆశ కలిగించింది. బిటి పత్తి వల్ల ఇంక పురుగు మందులు వాడాల్సిన అవసరం ఉండదని ప్రచారంజరిగింది. రైతులు సంతోషించారు. పర్యావరణ శాస్త్రవేత్తలు, ఎకాలజిస్టులు కూడా ఇంక పురుగుమందులు వాడక్కర్లేదని సంతోషించారు. కానీ, చివరకు జరిగిందేమిటి? కేవలం రెండేళ్ళలో పచ్చ పురుగు (Boll) అన్ని రూపాల్లో ఉన్న బిటి విషానికి వ్యతిరేకంగా నిరోధక శక్తిని పెంచుకున్నది. అంటే, ఈ పురుగులు బిటి పత్తి కాయను కూడా తినేయడం జరిగింది. అమెరికా రైతులు తీవ్ర నిరాశా నిస్పృహల్లో మునిగిపోయారు. ఇక పేద రైతుకు ఒరిగిందేమిటి?

ఈ పేద రైతు బిటి పత్తి, ఉత్పత్తి చేస్తున్న కంపెని - మోన్‌శాంటో దగ్గరకు వెళ్ళి - ఇక ఏం చేయమంటారు ? అని అడుగుతాడు. మోన్‌శాంటో, దాని శాస్త్రవేత్తలూ "ఇప్పుడు నువ్వు చేయాల్సింది - కొంత బిటి లేని పత్తిని కూడా కొనడం - అని చెబుతారు". ఎందుకు సార్ ? నేను ఇప్పటికే బిటి పత్తి కొంటున్నాను కదా? బిటి లేని పత్తి కొనడం ఎందుకు?" అని అడుగుతాడు. అప్పుడు ఆ శాస్త్రవేత్త "చూడూ, మొత్తం పత్తి మొక్కలన్నీ బిటి పత్తే అయిన పక్షంలో పచ్చపురుగులన్నీ ప్రతినిరోధక శక్తిని పెంచుకుంటాయి. మనకు ఆశక్తిలేని పురుగులు కూడా ఉండాలి" అంటాడు. రైతు బుర్ర తిరిగి పోయి అయోమయంలో పడతాడు. "మీరు చెబుతున్నదేమిటో నాకు ఒక్కముక్క అర్థం కాలేదు" అంటాడు. అప్పుడు ఆ శాస్త్రవేత్త చిరునవ్వు నవ్వి "ఈ మొక్క విషానికి తట్టుకోలేక చచ్చిపోగలిగే పురుగులు కొన్ని మనకు కావాలి. అన్ని పురుగులూ విషానికి వ్యతిరేకంగా నిరోధక శక్తిని సంపాదించేసుకోకూడదు. అందువల్ల

నువ్వు చేయాల్సింది ఇదిగో ఈ బిటి రకం కాని పత్తి వేయి. దీనిమీద నిరోధకత లేని పురుగు కూడా బతుకుతుంది. ఇవి నిరోధక శక్తి వున్న పురుగులతో సంయోగిస్తాయి. అంటే ఎప్పటికీ కూడా నిరోధకశక్తిలేని పురుగుల సంతతికి మనకు లోటుండదు" అంటాడు. రైతు ఓసారి బుర్ర విదుల్చుకుని "అది సరే! మరి ప్రతినిరోధక శక్తి పరిపూర్ణంగా ఉన్న పచ్చ పురుగు మాటేమిటి?" అని ప్రశ్నిస్తాడు. "అందుకు నువ్వు క్రిమిసంహారిణిని వాడాల్సిందే. మళ్లీ మళ్లీ వాడుతూ అంతకు ముందు కన్నా బలమైనా మందుని ప్రయోగించాల్సిందే" అంటాడు శాస్త్రవేత్త. ఇప్పడిక అసలు దృశ్యం చూడండి. ఈ పేదరైతు బిటి పత్తి కొనాలి, బిటి రకం కాని పత్తి కొనాలి, మళ్లీ పురుగుమందులు కొనాలి. దీనివల్ల లాభించేది ఎవరికి? కంపెనీలకి. అందువల్ల, నిజంగా ఇప్పడు జరిగిందేమిటి? 'పర్యావరణానుకూల' నినాదంతో కంపెనీ చివరికి బాగుపడింది.

వ్యవసాయరసాయనాలను తయారుచేసే బహుళజాతి సంస్థల బాధ్యతారాహిత్యాన్ని ప్రస్తావిస్తూ, ఇప్పటికే దరిద్రంలో మగ్గుతున్న రైతుల జీవనాధారాలను పణంగా పెట్టి ఈ కంపెనీలు లాభాల కోసం ప్రయత్నిస్తున్నాయని డాక్టర్ బెనర్జీ తీవ్రంగా విమర్శించారు. జన్యు మార్పిడి పంటలవల్ల ఉపాధి అవకాశాలు బాగా దెబ్బతింటాయనీ - రైతు స్వావలంబన నాశనమైపోతుందనీ, అంతకు ముందు కొందరు సాక్షులు వ్యక్తపరచిన బాధను ఈయన కూడా పంచుకున్నారు.

కలుపు నాశని, ప్రతిరోధక లక్షణం ఉన్న రకాలను ప్రవేశపెట్టిన మొట్టమొదటి కంపెనీల్లో మోన్‌సాంటో ఒకటి. ఇతర కంపెనీలు కూడా ఈ రకమైన జన్యుమార్పిడి పంటలను ప్రవేశపెట్టాయి. భారతదేశంలో కలుపునాశని అవసరం గురించి అర్థం చేసుకోవడం కొంచెం కష్టం. ఎందుకంటే, సాధారణంగా మనం పత్తి, సోయా చిక్కుడు వగైరా రకాలను పండిస్తున్నప్పడు చిన్న కమతాల్లో కలుపు మొక్కలు తొలగించడానికి పశువుల్ని ఉపయోగిస్తాం. మధ్యప్రదేశ్‌లో కూడా ఈ విధంగానే జరుగుతోంది. పెద్ద పెద్ద కమతాలున్న హర్యానా, పంజాబ్, (పశ్చిమ) ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కలుపునాశని అవసరం గురించి మనం అర్థం చేసుకోగలం. దీని ఉద్దేశం ప్రధానంగా కార్యకర్త మీదా, ఉపాధి కల్పనమీద డబ్బు వృధా చేయకపోవడం. కానీ, రసాయనాల మీద మాత్రం ఖర్చు చేయడం. ఇదే అసలు లాజిక్. ఒక హెలికాప్టర్ అద్దెకు తెచ్చుకుని కలుపునాశని మందు చల్లేయడం అన్నది అమెరికా వ్యవసాయ విధానం. ఇందువల్ల మంచి ఫలితాలు వచ్చాయా? కొందరికి ఈ మార్పు ఆనందాన్నే ఇచ్చింది. అమెరికా రైతులు బాగా ఆనందంగా ఉన్నారు. వాళ్ళు ఇప్పడు కార్మికులమీద పైసా ఖర్చుపెట్టనక్కరలేదు. కలుపు నాశని నుంచి తట్టుకునే రకాలు వచ్చేశాయి కనుక ఇక సమస్యే లేదు. కాని ఓసారి తిరకాసు ఏమిటో చూడండి. కలుపునాశనిని తట్టుకునే లక్షణం ఉన్న జన్యుమార్పిడి పంటను ఎందుకు అభివృద్ధి చేశారు? కలుపు మొక్కల సమస్య విస్తృతంగా ఉన్నందువల్ల కాదు. ఉదాహరణకు నేను 'జు' అనే కలుపునాశనిని తయారుచేశాను. ఈ రసాయనం కలుపు మొక్కలను చంపేస్తుంది. నేను మరో పక్క 'A' అనే కలుపునాశనిని తట్టుకునే లక్షణం ఉన్న ఓ మొక్కను అభివృద్ధి పరుస్తాను. అంటే రైతు కలుపునాశని నిరోధక శక్తి వున్న విత్తనాన్నీ, మరో పక్క కలుపునాశనిని (అదే కంపెనీ నుంచి) కూడా కొంటాను. కంపెనీకి విపరీతంగా లాభాలు వస్తాయి.

గోల్డెన్ రైస్ వల్ల చెబుతున్నంత స్థాయిలో ప్రయోజనం లేదనీ, శరీరానికి ఒక రోజు అవసరమయ్యే విటమిన్ - ఏ కోసం చాలా ఎక్కువ స్థాయిలో ఈ బియ్యాన్ని వాడవలసి వస్తుందని ఆయన అన్నారు. జన్యుమార్పిడి పంటలకు కొన్ని ప్రత్యామ్నాయాలను ఆయన సూచించారు - వీటిని మధ్యప్రదేశ్‌లో ఆయన పనిచేస్తున్న ఎన్జీవో అమలు చేస్తోంది.

ప్రత్యామ్నాయాలు లేకుండా కేవలం విమర్శలు చేయడం వల్ల ప్రయోజనం లేదు. సుస్థిరమైన మెట్ట వ్యవసాయమే ప్రత్యామ్నాయం. మేం ఇప్పడు చేస్తున్నది అదే. మధ్యప్రదేశ్‌లోని దేవాస్ జిల్లాలో 'సమాజ్ ప్రగతి సహయోగ్' వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. దీనిలో చాలా ముఖ్యమైనది వ్యవసాయాభివృద్ధి కార్యక్రమం. మా ప్రాంతం మెట్ట ప్రాంతం. అందువల్ల మేం చేస్తున్నదేమంటే, వ్యవసాయ విశ్వవిద్యాలయాల నుంచి తెచ్చుకున్న హైబ్రీడ్ రకాలతో పాటు సాంప్రదాయ రకాల పంటలు కూడా వాడుతున్నాం. సాంప్రదాయిక రకాలను ఉపయోగించి సంకర జాతులను ఉత్పత్తి చేయడం కూడా జరుగుతోంది. వీటికి తక్కువ ఎరువు, చాలా తక్కువ స్థాయిలో క్రిమిసంహారక మందులు సరిపోతాయి. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు వీటిని అభివృద్ధి పరుస్తున్నాయి. ముఖ్యమైన విషయం ఏమిటంటే వీటి విత్తనాలను మనం మళ్లీ మళ్లీ వాడుకోవచ్చు. ఈ కార్యక్రమం వల్ల మా గ్రామంలో ఆహార భద్రత ఏర్పడింది. గత ఏడాది విపరీతమైన నీటి ఎద్దడి ఏర్పడినా నీటిమట్టం ఒక మీటరు ఎత్తు పెరిగింది.

చాలా మంది జ్యూరీ సభ్యులు ఈ అధిక ఉత్పత్తి రకాల కంటే, కొత్తగా చెబుతున్న జన్యుమార్పిడి పంటలకంటే తాము అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలే విశ్వసనీయమైనవని అర్థం చేసుకున్నారు. వాళ్ల అభిప్రాయాలను దీవెనమ్మ ఇలా వ్యక్తం చేసింది.

గతంలో మేం మా వ్యవసాయాన్ని మా పద్ధతుల్లో (దేశీయ) చేసుకున్నప్పడు మేం తగినంత ఉత్పత్తి చేసుకోవడంతో పాటు సుఖంగా బతకడానికి కావల్సినంత తిండి, బట్టలూ కూడా దక్కేవి. కానీ ఆ తరువాత మేం రసాయనిక వ్యవసాయంలోకి దిగాం. ఈ పద్ధతుల్లో దిగుబడులు బాగా ఉంటాయనీ, ఉత్పత్తి అధికంగా వుంటుందనీ వాళ్ళు హామీలు కురిపించారు. దాంతో మేం ఆ రకం

వ్యవసాయానికి లొంగాం. కానీ క్రమంగా మా పెట్టుబడులు పెరిగిపోయాయి. మరింత ఎక్కువ ఎరువులు, పురుగు మందులూ కొనుక్కుంటూ పంటకి పోయవలసి వస్తోంది. ఈ రకంగా నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడయిపోయాయి. మరోపక్క, ఈ రసాయనాల కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ప్రారంభమై, కీళ్లనొప్పుల వంటివి శాశ్వతంగా ఉండిపోయాయి. ఇప్పుడు మీరు మరో కొత్త రకం వ్యవసాయం - జన్యుమార్పిడి పంటలు వచ్చాయని చెబుతున్నారు. ఏవో కొత్త రకాలు సృష్టించామని కూడా అంటున్నారు. అవి మనం తినడానికి నచ్చినవో కావో మాకు తెలియదు. రసాయనిక వ్యవసాయం దయవల్ల మేం సొంతంగా ఉత్పత్తి చేసుకున్న పశువుదాణా కూడా ఎరువు ప్రభావం మిగిలివుండటం వల్ల పశువులకు ఆహారంగా పనికిరాకుండా పోయింది. హైబ్రిడ్ దాణా మా పశువులకు రుచించడం లేదు. ఇప్పుడు మీరు జన్యుమార్పిడి పంటల గురించి చెబుతున్నారు. కేవలం ఓ ఆకు తినగానే పురుగు చచ్చిపోతుందని అంటున్న ఈ రకాలు మాకు ఏ హానీ చేయవనీ, ఇవి విషపూరితాలు కావనీ, మమ్మల్ని పశువుల్ని చంపమని ఎలాచెప్పగలరూ. మనకు ఆహారంగా పశువులకు దాణాగా ఇవి ఏ మాత్రం కీడు చేయవని ఎలా చెబుతారు? ఇవన్నీ మమ్మల్ని వేధిస్తున్న నిజమైన అనుమానాలు. ఈ కొత్త వాటికంటే మన స్వంత వ్యవసాయ విధానాలే ఎంతో క్షేమకరమని నేను కచ్చితంగా చెప్పగలను.

బెనర్జీ తన వాదన వినిపించకముందే, జన్యుమార్పిడి పంటల మీద క్రిమి సంహారక మందులు చల్లనక్కర్లేదంటూ ప్రొఫెసర్ రావు వ్యాఖ్యానించినప్పుడు జ్యూరీ సభ్యుడు ఒకరు ఓ అనుమానం వ్యక్తం చేశాడు (కెమెరా ముందు కాక, విడిగా కవితాకురుగంటితో మాట్లాడుతూ), "ఒకవేళ ఇదే కనుక నిజమనుకుంటే పురుగు మందుల కంపెనీలు ఈ జన్యుమార్పిడి పంటలను ఎందుకు రానిస్తాయి?" అని ప్రశ్నించారు. గతంలోతమకు పురుగుమందులు అమ్మిన కంపెనీలే ఇప్పుడు తమకు జన్యుమార్పిడి పంటలను అంటగట్టడానికి ప్రయత్నిస్తున్నాయన్న విషయంలో వారికి ఏ అనుమానాలూ లేవు.

దాస్‌గుప్తా తన సాక్ష్యంలో భాగంగా ఒక కీలకమైన వ్యాఖ్య చేశారు. ప్రజల మౌలికమైన 'పేదరికస్థితిలో మార్పులేకున్నా వారి పోషకాహార లోపాన్ని నివారించగలిగినవాడు' గోల్డెన్‌రైస్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.

"మీరు మీ పిల్లలకు అన్నంతో పాటు కొద్దిగా ఆకుకూరలు, పళ్ళు, పప్పుదినుసులు, క్యారట్ వగైరా... వగైరాలు ఇవ్వండి" - అని ఈ పోస్టర్ చెబుతుంది. అయితే, ఆసియాదేశాల్లోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా తీర ప్రాంతాల్లో అత్యంత నిరుపేదలున్నారు. వాళ్లలో చాలా మందికి ఒకపూట అన్నం - కేవలం అన్నం - దొరికితే చాలా అదృష్టవంతుల కింద లెక్క. కొద్దిగా ఉప్పు వేసుకుని దానినే తింటారు. వాళ్ళు కూరలు, పళ్ళు వంటివి కొనలేరు. నేనిప్పడు మాట్లాడుతున్నది అటువంటి వాళ్ళు వాడే బియ్యం గురించి, అటువంటి వారు ఉపయోగించే వరిని జన్యుమార్పిడి ద్వారా మరి కొంచెం బీటాకెరోటిన్ కలిగి ఉండేదిగా మార్చగలిగినప్పుడో, కేవలం అన్నం తినడంతో, వాళ్ల ఆర్థికపరిస్థితిలో ఏ మార్పు తేకుండా, పిల్లలు మంచి ఆరోగ్యంతో ఉంటారు.

జ్యూరీ సభ్యుడు ఒకరు బయోటెక్నాలజీ పరిశోధనల మీద కోట్లు ఖర్చు చేస్తున్నందుకు ఆగ్రహించాడు.

మీ పరిశోధనలమీద అనేక కోట్లు ఖర్చు చేయడం ఎందుకు? అది మా రైతుల జీవితాలను కూడా నాశనం చేస్తోంది. రైతులకు తామేం చేయాలో బాగా తెలుసు. వాళ్లకు కావల్సినంత పరిజ్ఞానం ఉంది. దయుంచి రైతులను వారి మానాన వారిని వదిలేయండి. లేదా మీరు ఖర్చు పెడుతున్న దానిలో సగం ఇవ్వండి. ఎందుకంటే దానివల్ల వారు ఇంకా మేలు చేయగలుగుతారు.

జన్యుమార్పిడి పరిజ్ఞానం చాలా ప్రమాదకరమని దీవెనమ్మ చాలా బలంగా విశ్వసించింది. దయుంచి ఈ జ్ఞానాన్నంతా తీసుకు పోయి, ఆ కాగితాలు, లెక్కలూ వగైరా సామాగ్రితో సహా సముద్రంలో కలిపేయండి. అప్పడు మాత్రమే అది మళ్లీ టీవీల్లోనూ, పేపర్లలోనూ కనిపించదు అన్నదామె.

తోటి జ్యూరీ సభ్యుల తీర్పును ముగింపు సమావేశంలో ఫిలిప్, అంజమ్మ ఈ విధంగా వివరించారు.

- ఫిలిప్:- మాకు జన్యుమార్పిడి పంటలు వద్దు.
- అంజమ్మ:- జన్యుమార్పిడి పంటలు కానీ, బిటి పత్తి కానీ మాకు అక్కర్లేదు. అవన్నీ కొత్త విత్తనాలు. మేం వాటిని ఎప్పడూ సాగుచేయలేదు. పొగాకు, పత్తి మేం ఎన్నడూ పండించలేదు.

## 3.1.9 చిన్న కమతాలను ఏకంచేయడం - భూమి లేకపోవడం

**మేం కోరుతున్నది**

- మా కోసం పని చేసుకుంటున్న భూమి మాది కావడం
- భూమి మీద హక్కు, అడవుల మీద హక్కులు
- భూములపునర్‌పంపిణీకి పథకాలు

వ్యవసాయంమీద, భూమిమీద ఆధారపడి ఉన్న ఉత్పత్తి కార్యక్రమాల్లో ఉన్న వ్యవసాయిక కుటుంబాల సంఖ్యను తగ్గించడం, భూ కమతాలనూ సంఘటిత పరచడం వంటి విజన్ - 2020 ప్రణాళికలను జ్యూరీ తీవ్రంగా వ్యతిరేకించింది. 81 శాతం కమతాలు

చిన్న, సన్నకారు రైతుల చేతుల్లో ఉంటూ, 5 ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న కమతాలు అధికంగా ఉన్న ఒక రాష్ట్రంలో ఇటువంటి ప్రణాళికలు రూపొందించడం నేరంగా జ్యూరీ భావించింది. వ్యవసాయాభివృద్ధి పైన ప్రభుత్వానికి సలహాదారుగా ఉన్న ఓ సీనియర్ ప్రభుత్వాధికారి ప్రొఫెసర్ ఎమ్.వి. రావు చెప్పిన కారణాలు జ్యూరీ ఆమోదించలేదు.

మీ కమతాలు చాలా చిన్నవి. ఎంత చిన్నవంటే కనీసం మీ ఎద్దులు కూడా అటూ ఇటూ తిరగలేవు. కమతాలు చిన్నగా, దూర దూరంగా ఉండటం వల్ల పెట్టుబడి పెట్టే సామర్థ్యం ఉన్నప్పటికీ, ఆధునికమైన టెక్నాలజీని మీరు ఉపయోగించుకోలేక పోతున్నారు. కమతాలను సంఘటిత పరిచే విధానం వల్ల మీరు ఆధునిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా అమలుచేయడంతోపాటు లాభాలు కూడా సంపాదించుకోవచ్చు. సామర్థ్యం బాగా పెరిగి ఉత్పత్తి అధికమవుతుంది. పెద్ద పెద్ద కమతాల్లో యంత్రాల వాడకం ఎంతో సులువు. మీరు మీ లాభాలను ఇతర రైతులతో పంచుకోవచ్చు.

అంజమ్మ (జవాబు చెబుతూ) : మళ్లీ దెబ్బతినేది చిన్న, సన్నకారు రైతులే. బడా రైతులు లాభాలను చంకన పెట్టుకుపోతారు.

స్పెషలిస్టు సాక్షి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్‌లో విజేతలూ, పరాజితులు అన్ని ప్రాంతాలలోను ఒకే విధంగా ఉండరంటూ, ప్రాంతీయ అసమానతల పరిస్థితిని వివరించారు.

రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో - తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రాల్లో మొత్తం 23 జిల్లాలున్నాయి. ఆశ్చర్యం కోల్పోవడమన్నది మూడు ప్రాంతాల్లోనూ ఒకేవిధంగా ఉంటుందని మీరు అనుకుంటున్నారా? ఎట్టి పరిస్థితుల్లోనూ కాదు. వెనుకబడిన ప్రాంతాలైన తెలంగాణ, రాయలసీమ వారే ప్రధానంగా దెబ్బతింటారు. మిమ్మల్నెవరూ మీ భూముల్ని వదిలిపెట్టి పొమ్మనరు. కానీ, పరిస్థితులే మీ చేత ఆ పని చేయిస్తాయి. మీ భూమిలో మీరు పని చేసుకోవడానికి పెట్టుబడి పెట్టే సామర్థ్యం లేక చివరకు మీరు మీ భూములు అమ్ముకుని పోతారు. ఇటువంటి పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఏ విధమైన సహాయం చేయడానికీ ముందుకు రావడం లేదు. ఎందుకంటే, వాళ్లకి వాళ్ల పథకాన్ని (విజన్ - 2020, ప్రపంచబ్యాంకు మద్దతును ప్రస్తావిస్తూ) అమలు చేయడం మీదే దృష్టి వుంది.

అత్యధికశాతం గ్రామ ప్రజల జీవనాధారాలకు, సాంస్కృతిక జీవనానికీ - భూమి, అడవులు, నీరు అందుబాటులో ఉండటానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని జ్యూరీ స్పష్టంగా అభిప్రాయ పడింది ఆంధ్రప్రదేశ్‌లో చిన్న కమతాలను లాభదాయకంగా, సుస్థిరంగా మలచలేని పక్షంలో ఎటువంటి సామాజిక ప్రణాళిక కూడా సుస్థిరంగా పనిచేయదని వారు అభిప్రాయపడ్డారు. తమ చేతకానితనం గురించి చింతిస్తున్న పరిస్థితుల్లో వారికి ఓ 'అమెరికన్ కల'ని ఆశ పెడుతున్న ఓ సాంకేతిక నిపుణుడు ఎదురుగా కనిపించారు.

అంజమ్మ :- ఈ రోజు మీరు మమ్మల్ని అందలం ఎక్కిస్తున్నారు. అయితే, కింద పడేయడానికి ఎంతోకాలం పట్టదు. అప్పుడు మా పరిస్థితి ఏమిటి ? మళ్లీ భయంకరమైన సమస్యల బారిన పడి చివరకు ఆత్మహత్య కూడా చేసుకోవాల్సి వస్తుందేమో !? ప్రొఫెసర్ ఎమ్.వి. రావు: అమెరికాలో మొత్తం జనాభాలో కేవలం 2 శాతం మంది మాత్రమే వ్యవసాయం మీద ఆధారపడుతున్నారో మనం కూడా అలా కావాలి.

భూమి, ఇతర ఉత్పాదక ఆస్తుల అందుబాటు వల్ల సాధ్యపడే సాంస్కృతిక హక్కు, గౌరవంగా జీవించే హక్కులనే జ్యూరీ కోరుకుంది. పాశ్చాత్య అభివృద్ధి నమూనాల ఆధారంగా తయారైన విధానాలను జ్యూరీ తిరస్కరించింది. భూ పంపకం అసమానంగా ఉండటం మార్పు సాధ్యపడని ఓ వాస్తవంగా జ్యూరీ అంగీకరించ లేదు. ఈ పరిస్థితి మారాల్సిందేనని స్పష్టంచేసింది. భూసంస్కరణల ద్వారా, జీవనోపాధులకు అత్యంత ఆవశ్యకమైన సహజవనరుల అందుబాటు, వినియోగ నియంత్రణాధికారాలు అప్పగించడం ద్వారా న్యాయం జరగాలని జ్యూరీ కోరింది. భూసంస్కరణల విధానాలు అమలుచేయడం, బంజరు భూములూ, నిరుపయోగంగా ఉన్న భూములపై హక్కులు ఇవ్వడం వంటి కీలకమైన అంశాలు జ్యూరీ ప్రకటించిన 'విజన్' లో ఉన్నాయి.

అంజమ్మ :- సాగుచేయని భూముల్ని నిరుపేద రైతులకు కేటా యించాలి. అడుగు భూమి కూడా లేని నిరుపేదలకు ఇవి దక్కాలి.

దీవెనమ్మ :- కొండ పక్కల ప్రాంతాల్లో ఇప్పటివరకూ వ్యవసాయానికి ఉపయోగించని ఎంతో భూమి బంజరుగా పడివుంది. ప్రభుత్వం ఆ భూమి మాకెందుకు కేటాయించకూడదు? ప్రభుత్వానికి ఎలాగూ ఆ భూమి నుంచి ఆదాయం రావడం లేదు కదా!?

పత్రికలవారు, అధికార పరిశీలకుల సమక్షంలో జ్యూరీ ప్రకటించిన తీర్పులో సమ న్యాయం, ఉత్పాదక వనరులపై ప్రత్యక్ష నియంత్రణ హక్కు ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి.

అంజమ్మ : కమతాలను స్థిరపరచడాన్ని, కాంట్రాక్టు వ్యవసాయం కోసం మా భూముల్ని మా నుంచి లాక్కుపోయే ఆలోచనను మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.

ఫిలిప్ : భూమిలేని వారికి భూములు ఇవ్వాలి. అలాగే, పట్టాలు లేని వారికి వాటిని అందచేయాలి.

అంజమ్మ : మేం మా భూముల్ని వదులుకునే ప్రసక్తే లేదు. మేం వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేది లేదు. అవి మా చేతుల్లోనే ఉంటాయి.

### 3.1.10 ఆశ్రయం పోవడం / ఉపాధిలేకపోవడం

**మేం వ్యతిరేకిస్తున్నది**

- కమతాలను సంఘటితం చేయడం, గ్రామీణ ప్రజలను నిరాశ్రయులను చేయడం.

చిన్న, సన్నకారు రైతులపైన ప్రతిపాదిత విజన్ - 2020లోని కొన్ని దుష్ప్రభావాల గురించి ఇంతకు ముందు కొన్ని విభాగాల్లో వివరించడం జరిగింది. రానున్న దశాబ్దాల్లో వ్యవసాయ రంగంలో చాలా తక్కువ మంది రైతులే ఉండాలన్న వాదనలో విజన్ 2020కి అనుకూలంగా ఉన్న సాక్షులు ఏమాత్రం నీళ్ళు నమలలేదు. ఈ సిద్ధాంతం కారణంగా చిన్న, సన్నకారు రైతులు తమ కమతాలకు దూరం కావడం తప్పనిసరి. ఈ ప్రక్రియనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'స్వచ్ఛందంగా కమతాల రద్దు' (వాలంటరీ లిక్విడేషన్)' గా పిలిచింది.

ప్రొఫెసర్ రావు తన సాక్ష్యంలో ఈ విధంగా సూచించారు. "మన దేశంలో 65 శాతం ప్రజలు వ్యవసాయంమీద ఆధారపడివున్నారు. వ్యవసాయంలో అంతమంది జనాభా ఉండటం మనకు వద్దు. మనం ఇతర ఉపాధుల్లోకి వెళ్ళాలి. అమెరికాలో రెండు శాతం జనాభా మాత్రమే ఆదాయం కోసం వ్యవసాయంమీద ఆధారపడి వుంది. మనం కూడా ఆ విధంగా మారాలి" అన్నారు. ప్రొఫెసర్ రావు. "వ్యాపారం, రవాణా వంటి ఇతర రంగాల్లోకి మారండి" అని ఆయన రైతులను ప్రోత్సహించారు.

అయితే, మరోసాక్షి శ్రీనివాస్ మాత్రం ఇది రాష్ట్రంలోని తెలంగాణా వంటి నిరుపేద మెట్టప్రాంతాల్లోని ప్రజల దారిద్ర్యం, నిరక్షరాస్యతలను దృష్టిలో పెట్టుకొని చేసిన సూచనేనా? అని అనుమానపడ్డారు.

తెలంగాణ వంటి వెనుకబడిన ప్రాంతాల రైతుల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఒక అవాంఛనీయమైన ప్రణాళిక ఉంది. మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఈ ప్రాంతంలో అక్షరాస్యత శాతం చాలా తక్కువ. ఒకసారి మీరు భూములు కోల్పోతే ఉపాధి లేకుండా పోతారు. మీతోటి రైతులకు మంచి ఉద్యోగాలు వచ్చే అవకాశాలు లేవు. ఎందుకంటే మీకు మంచి చదువులేదు. దానితోపాటు నైపుణ్యం (వ్యవసాయేతర ఉద్యోగాలకు అవసరమయ్యే) కూడా లేదు. ప్రభుత్వం మిమ్మల్ని (కొందరిని) నాలుగోరకం (దినసరి వేతనంలో - తక్కువ వేతనంతో) పనివాళ్ళుగా తమ పరిశ్రమల్లో ఉపాధి చూపించదల్చుకుంది. ఎందుకంటే వాళ్ళు అనేక పరిశ్రమలు ఈ ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేయాలనుకుంటున్నారు - వాటికి శ్రామికులు అవసరం. విజన్ 2020 నుంచి లాభపడేది చాలా తక్కువ మంది - ఈ విషయం మీరు గుర్తించాలి.

ప్రొఫెసర్ రావును ప్రశ్నిస్తూ అంజమ్మ - చాలా మంది జ్యూరీ సభ్యులు 'తమ కుటుంబాన్ని పోషించుకోవడానికి కూలి పని మీద ఆధారపడాల్సివస్తున్నద'ని చెప్పింది.

కూలి పని దొరకని రోజు మేం పస్తులుండక తప్పదు. ఆ పని దొరకాలంటే మేం పెద్ద రైతుల దయాదాక్షిణ్యాల మీద ఆధార పడతాం. ఇటువంటి పరిస్థితుల్లో - కమతాలను సంఘటితం చేస్తే - మళ్ళీ బడా రైతులదే పైచేయి అవుతుంది. కమతాలు సంఘటితమైన పక్షంలో - ప్రతీ కుటుంబంలో ప్రతీవారూ కూడా భూస్వామి దగ్గరకు పోయి కూలిపని కోసం అర్థించవలసివస్తుంది - ఎందుకంటే మా సొంత భూముల నుంచి తిండి గింజలు సంపాదించుకునే అవకాశాలు ఇక వుండవు కనుక.

ప్రొఫెసర్ రావు తన జవాబులో - విజన్ 2020 చిన్న, సన్నకారు రైతులకు కొన్ని కష్టాలు తెచ్చి పెడుతుందనీ, ప్రణాళిక అమలు ప్రారంభమైన చాలా ఏళ్ళవరకూ ఇవి కొనసాగుతుంటాయనీ ఒప్పుకున్నట్టు కనిపించింది. "నిరుద్యోగ సమస్యలు తగ్గుతాయి, కానీ అందుకు కొంత సమయం పడుతుంది."

తన తోటి జ్యూరీ సభ్యుల తీర్పును అంజమ్మ ప్రకటిస్తూ, భూమికి దూరం కావడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని చిన్న, సన్నకారు రైతులమీద మరింత తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఆందోళన చెందారు. ఇప్పటికే రాష్ట్రంలో జరుగుతున్న ఆత్మహత్యల రేటు ఇందువల్ల మరింత పెరుగుతాయన్నది అంతర్లీనంగా ఆమె భావం.

మాలో నాలుగోవంతు మందిని (2 కోట్ల మంది) తొలగించాలని మీరు అంటున్నారు. రైతులకు ఇక దిక్కేమిటి? మీరు వాళ్ళని వ్యవసాయానికి దూరంగా విసిరేస్తే ఇక వారి బతుకేమిటి? వాళ్ళు బతికుండి చేసేదేమిటి?

### 3.1.11 న్యాయమైన మార్కెట్లు

**మేం కోరుతున్నది**

- సేంద్రియ వ్యవసాయం కోసం ఉత్పాదకాలకు సబ్సిడీ - పశువుల ఎరువు / సహజ క్రిమి సంహారకాలు / సాంప్రదాయిక రకాలతో సహా.
- ఉత్పత్తులకి స్థానిక మార్కెట్లు, ఉత్పాదకాలకి స్థానిక ఏర్పాట్లు.
- ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) - మా రేషన్ కార్డులు తీసుకుపోవద్దు.
- 'అంత్యోదయ' (నిరుపేదల కోసం PDS) మా వరకూ చేరాలి
- మా కష్టానికి, ఉత్పత్తికీ తగిన ప్రతిఫలం

పేదరిక నిర్మూలనకూ, ఆహార భద్రతకూ మార్కెట్ నిర్దేశిత అభివృద్ధి శరణ్యమన్న ప్రకటనలను జ్యూరీ అపనమ్మకంగా చూసింది. తన అనుమానాలను నిర్మొహమాటంగా వ్యక్తంచేసింది. గత రెండు మూడు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని కుదిపేస్తున్న అనేక సంక్షోభాలను జ్యూరీ గుర్తుచేసుకుంది. ఆత్మహత్యలు

చేసుకున్న రైతులందరూ చిన్న, సన్నకారు రైతు కుటుంబాలవారే. వీళ్ళు ఎదుర్కుంటున్న సమస్యలు పరిష్కరించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి గానీ, ఉత్పత్తి పెంచడానికి గానీ ఎటువంటి ప్రయత్నాలూ జరగలేదు. ప్రభుత్వ సలహాదారు ప్రొఫెసర్ ఎమ్.వి. రావు ఇలా అన్నారు.

మీరు ఉత్పత్తి చేసిన ఆ పది క్వింటాళ్ళూ కొనుక్కోడానికి ఎవరూ మీ దగ్గరకు రారు (మీరే వెళ్ళి మార్కెట్ / కొనుగోలుదారుడిని వెతుక్కోవాలి). అదే ఆ ఉత్పత్తి కనుక పెద్ద మొత్తాల్లో ఉంటే - అంటే, ఓ వంద ఎకరాల్లో పండిస్తే - ఓ ట్రాక్టర్ మీ కోసం వచ్చి ఉత్పత్తినంతా తీసుకెడుతుంది - మార్కెటింగ్ సులువవుతుంది.

మార్కెట్ ఆధారిత పరిష్కారాలు చిన్న రైతుల సమస్యలను పరిష్కరిస్తాయనీ, ఆకలి తీరుస్తాయన్న వాదనలు జ్యూరీ సభ్యుల అనుభవానికి అనుగుణంగా లేవు. వరంగల్ జిల్లాకు చెందిన పాపారావు, సాక్షిగా వచ్చిన నిపుణుడుతో (సింజెంటా ప్రతినిధి) అన్న మాటలు ఈ భావాన్ని వ్యక్తపరుస్తున్నాయి.

"మీరు దేశంలో ఆహార కొరత గురించి మాట్లాడుతున్నారు. నేను ఒక ఏడాది ప్రభుత్వం సూచించిన పంటకోసం ఓ వడ్డీ వ్యాపారి నుంచి 36 శాతం వడ్డీకి రుణం తీసుకున్నాను. మొదటి ఏడాది దిగుబడి బాగా వచ్చింది. అయితే, పంట ఉత్పత్తి, అమ్మే సమయానికి మార్కెట్‌లో ధర ఎంత దారుణంగా పడిపోయిందంటే ఏదో ఒక రేటుకు అమ్ముకోడానికి కూడా నేను ధైర్యం చేయలేకపోయాను. ఇక్కడ నాబోటి పేద రైతులు బోలెడంత ధాన్యంతో మూడేళ్ళపాటు అమ్ముకునే దిక్కులేక కమతంలో కూచుంటే, మీరేమో దేశంలో ఆహారకొరత ఉందని చెబుతున్నారు. నేను నా అప్పు ఎలా తీరుస్తానో, వచ్చే ఏడాది కోసం విత్తనాలు ఎలా కొంటానో మీరే చెప్పండి!"

"నువు చెప్పింది మీ జిల్లాలో బహుశా కరెక్టే కావచ్చు. కానీ నేను చెబుతున్నదంతా ప్రపంచ పరిస్థితికి సంబంధించిన నిజాలు" అన్నారు డాక్టర్ పార్థా దాస్‌గుప్తా.

మార్కెట్ అన్యాయంగా ఉండటమే ఈ సమస్యలకు ప్రధాన కారణమని జ్యూరీ భావించింది. విజన్ - 2020 ఈ విషయాన్ని విస్మరిస్తోంది. ఎందుకంటే, ఎగుమతి మార్కెట్‌లు సిద్ధంగా అందుబాటులో ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ రైతులు జాతీయంగా, అంతర్జాతీయంగా పోటీ తట్టుకోగలరని ఈ 'విజన్' భావిస్తోంది. సాక్షిగా వచ్చిన నిపుణుడు డాక్టర్ కె.పి.సి.రావు ప్రకారం, అస్థిరమైన మార్కెట్లు చివరకు పేదవారికే అన్యాయం చేస్తాయి.

ఉత్పత్తి పెరుగుతుంది, అలాగే మార్కెట్‌లో ఉత్పత్తుల మిగులు ఎక్కువవుతుంది. అయితే, దీనివల్ల ధరలు పడిపోతాయి. మార్కెట్లు రైతుకు మంచి ప్రతిఫలం ఇవ్వవు.

భారత ప్రభుత్వం కోటా పరిమితులను ఎత్తేయడం, టారిఫ్ నియంత్రణలను తొలగించడం వంటి మార్కెట్ అస్థిరతకు దోహదం చేసిన అంశాలను కూడా జ్యూరీ చర్చించింది. చవుకగా ఉత్పత్తి చేసిన ఆహారపదార్థాలు దిగుమతి అయి భారతీయ మార్కెట్‌ను ముంచెత్తడం వల్ల కలుగుతున్న దుష్ప్రభావాలను కూడా జ్యూరీ సభ్యులు గుర్తించారు. సాక్షిగా వచ్చిన నిపుణుడు చెప్పిన ఒక ఉదాహరణ ఇది.

కొలిన్ హైన్స్ :- వందలకొద్దీ వస్తువుల దిగుమతికి భారతదేశం తలుపులు తెరిచింది. అమెరికా దగ్గర భారీస్థాయిలో జన్యుమార్పిడి సోయా ఉంది. దానిని ఆ దేశం యూరోప్‌కు అమ్ముకోలేదు. అందువల్ల భారత్ నియంత్రణలు సడలించి, సుంకాలు తగ్గించడంతో విదేశీ వంటనూనె దేశీయ మార్కెట్‌లోకి వెల్లువెత్తింది. ఇది, కొన్ని అంచనాల ప్రకారం దేశంలోని 50 లక్షల మంది వ్యవసాయదారులనూ, 30 లక్షల మంది అనుబంధ వృత్తులవారినీ తీవ్రంగా దెబ్బతీసింది.

న్యాయబద్ధంగా వ్యవహరించే, సరైన నియంత్రణ ఉన్న మార్కెట్ల అవసరాన్ని జ్యూరీ నొక్కి చెప్పింది. స్థానిక ఆర్థిక వ్యవస్థలు జవజీవాలతో ఉండేట్టు ప్రభుత్వం సహాయపడాలని జ్యూరీ సభ్యులు కోరారు. సేంద్రీయ మరియు తక్కువ పెట్టుబడుల వ్యవసాయం, వాళ్ళు కోరుకునే నేల సంరక్షణల కోసం సరయిన మార్కెట్లు కావాలని ఆశిస్తున్నారు. తమ పంటకు సరైన ధర దొరికే మార్కెట్లు దానితోపాటు అందుబాటులో ఉన్న ఆహారనరవరాలు సమన్వయంతో పంపిణీ కావడానికి వీలుగా జవాబుదారీతనం, సరైన నిర్వహణ ఉన్న ప్రజాపంపిణీ వ్యవస్థ ఉండాలన్నది వారు ఆశిస్తున్న ఏర్పాటు. ఉత్పత్తిదారులకూ, వినియోగదారులకూ మధ్య నేరుగా సంబంధం వుండేలా విస్తృతమైన స్థానిక మార్కెట్లు ఉండాలన్నది వారు ఆశిస్తున్న ఏర్పాటు. జ్యూరీలో వినియోగదారుల ప్రతినిధి అయిన గీత స్థానిక మార్కెట్లకి వున్న ఆర్థిక లాభాలని నొక్కి చెప్పారు.

ఒక కిలో టమాటాలను ఏజెంట్లు కిలో యాభై పైసలకు కొన్నారనుకుందాం. వాళ్ళు దానిని కిలో 10 రూపాయలకు అమ్ముతున్నారు. ఉత్పత్తి బయటకు పోకుండా స్థానికంగానే ఉండాలి. రైతులకూ వినియోగదారుడికీ నేరుగా సంబంధం ఉండాలి.

తూర్పు గోదావరి జిల్లాకు చెందిన నరసమ్మ జ్యూరీ సభ్యుల తరఫున మాట్లాడుతూ ఈ ఆందోళన వెలిబుచ్చింది.

మార్కెట్లలో మా పంటలకు సరైన ధరలు రావడంలేదు. మార్కెట్లు నేరుగా అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. తక్కువ ధరకు మా పంటకొని, దానినే విపరీతమైన ధరకు తిరిగి మాకు అమ్ముతున్నారు.

### 3.1.12 అవినీతి / అన్యాయమైన ధర

**మేం ఆశిస్తున్నది**

- మా పనికీ, పంటకీ తగిన పతిఫలం

**మేం వ్యతిరేకిస్తున్నది**

- కాంట్రాక్టు వ్యవసాయం

అవినీతి, బలవంతుల దురాశ పేదల బతుకులు చక్కదిద్దడంలో ప్రధాన అడ్డంకులుగా తయారైనాయి. ప్రభుత్వం మీద ప్రొఫెసర్ ఎమ్.వి. రావుకు ఉన్న నమ్మకంతో విసిగెత్తిపోయి చిత్తూరు జిల్లాకు చెందిన ఆనందమ్మ ఇలా అన్నది.

"ఒకవేళ వాళ్ళు (ప్రభుత్వం) సహాయంగా మీ వంటి వారితో మాకు ఏమైనా పంపిస్తే అవి మాకు చేరనే చేరవు. డబ్బు కానీయండి, బట్టలు కానీయండి, అవి మా దాకా రావు. దళారీలే వాటిని దోచుకు తింటారు. వాళ్లంతా అవినీతి పరులు. మా కోసం ఏమైనా డబ్బు వస్తే, దానిని మీరు మీదనుకుని మింగేస్తారు"

ఇందుకు ప్రొఫెసర్ ఎమ్.వి. రావు స్పందిస్తూ ప్రభుత్వంలో అవినీతి ఉందనీ, "దానిని నిర్మూలించాలి" అనీ ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్‌కు అందుతున్న విదేశీ సహాయం పెద్దలకే దక్కుతున్న వాస్తవంపై జ్యూరీ తన బాధ వ్యక్తం చేసింది. మెదక్ జిల్లాకు చెందిన అంజమ్మ మాటల్లో:

- "మా అభివృద్ధి కోసం కోట్ల కొద్దీ డబ్బు పంపిస్తున్నామని మీరు అంటారు. కానీ అది మాదాకా ఎప్పుడూ రాదు. ఈ డబ్బు మా తోటి పేదలకు అందితే ఎంతో ఆనందిస్తాం"

తూర్పు గోదావరి జిల్లాలోని ఆదివాసీ ప్రాంతంనుంచి వచ్చిన నరసమ్మ ప్రభుత్వం చేస్తున్న అన్యాయం గురించి జ్యూరీ మనసులో ఉన్న బాధను తన మాటల్లో ఇలా చెప్పింది.

- "ఉచితంగా గోధుమలు ఇస్తామని ప్రభుత్వం ఎన్నోసార్లు ప్రమాణం చేసింది. కానీ, ఆ సూచనలే కనిపించడం లేదు. చివరకు కిరోసిన్, బియ్యం కూడా ఎక్కువ ధరకే అమ్ముతున్నారు"

మార్కెట్లు అన్యాయంగా ఉన్న ఇటువంటి పరిస్థితుల్లో కాంట్రాక్ట్ వ్యవసాయం తమకు ఏవిధంగా మేలు చేస్తుందో జ్యూరీకి అర్థం కాలేదు. చిన్న చిన్న కమతాలను సమీకరించి పెద్దకమతాలుగా మార్చడం కోసం, కాంట్రాక్టు వ్యవసాయం కోసం తమ భూములను తమనుంచి తీసుకునే ఆలోచనలోనే అవినీతి, అన్యాయం ఉన్నాయని జ్యూరీ భావించింది. అన్నిటికీ మించి, కాంట్రాక్టు వ్యవసాయం తమ స్వతంత్రతని ఏ విధంగా నాశనం చేస్తుందో కూడా జ్యూరీ చూడగలిగింది. భూమిని నేరుగా తమ ఆధీనంలో వుంచుకునే వ్యూహం మారిపోయి, 'స్వతంత్రులైన రైతుల'తో కాంట్రాక్టు కుదుర్చుకోవడం ద్వారా ఉత్పత్తి ప్రక్రియలను నియంత్రించాలన్న కార్పొరేషన్ల కొత్త వ్యూహం వల్ల తమ స్వతంత్రత ఏ విధంగా నాశనం చేస్తుందో కూడా జ్యూరీ చూడగలిగింది. భూమిని నేరుగా తమ ఆధీనంలో వుంచుకునే వ్యూహం మారిపోయి, స్వతంత్రులై రైతులతో కాంట్రాక్టు కుదుర్చుకోవడం ద్వారా ఉత్పత్తి ప్రక్రియలను నియంత్రించాలన్న కార్పొరేషన్ల కొత్త వ్యూహం వల్ల తమ స్వతంత్రత ఏ విధంగా ఉంటుందో వారు అంచనా వేయగలిగారు. చిన్న, సన్నకారు రైతులు పంటలచీడ పీడల గురించీ, సమస్యల గురించీ తలబద్దలు కొట్టుకుంటూ, పశువులు చచ్చిపోతే కష్టాలు, నష్టాలు భరిస్తూ వుంటే, కంపెనీ మందులు అమ్ముకుంటూ, ఉత్పత్తిని ఓడలకెత్తుతూ, హోల్‌సేల్ లావాదేవీలు చూసుకుంటూ లాభాలు సంపాదిస్తూంటుంది.

జ్యూరీ సభ్యులందరి తరపునా మాట్లాడుతూ అంజమ్మ చివరకు ఇలా ముగించింది.

- "కాంట్రాక్ట్ వ్యవసాయం ఆలోచనే మాకు నచ్చలేదు. దీనివల్ల మాకు వీసమెత్తు ప్రయోజనం లేదు. ఎంత కష్టపడినా మాకు లాభం లేకపోవడంతో పాటు, లాభాల్లో సమాన భాగం పొందే అవకాశం కూడా లేదు"

### 3.1.13 : పరపతి, రుణ సదుపాయం

**మేం కోరుతున్నది**

- తగినంత వశునంపద, నీటి వనరులు మాకు అందుబాటులో ఉంచినంత కాలం వ్యవసాయానికి రుణాలే అక్కర్లేదు.

దేశంలోని మిగతా సన్నకారు రైతుల మాదిరిగానే ప్రభుత్వ సంస్థలనుంచి పరపతిని సంపాదించడం జ్యూరీ సభ్యులకు కూడా ఎంతో కష్టమైన పని. ధనిక రైతులు ఇటువంటి ప్రయోజనాలను చక్కగా ఉపయోగించుకుంటుంటే, పేదరైతులు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో వడ్డీవ్యాపారిని ఆశ్రయించక తప్పడం లేదు. వాళ్లు విపరీతమైన వడ్డీలు వేసి వీరి నడ్డి విరగ్గొడుతున్నారు. కొన్ని చోట్ల ఈ వడ్డీ వ్యాపారులే ఏజెంట్లుగా ఉండటం వల్ల రైతు తప్పనిసరిగా తన పంటకు కావల్సిన సరుకులు కొనుక్కోవడంతో పాటు, తరువాత తన పంటని కూడా అతడికే తప్పనిసరిగా అమ్మాల్సివస్తున్నది. ఒకవేళ సకాలంలో డబ్బు అప్పు తీర్చని పక్షంలో రైతు తన భూమిని వదులుకోవాల్సిన పరిస్థితులు కూడా ఉన్నాయి. సామయ్య ఇందుకు ఒక ఉదాహరణ చెప్పాడు.

"నేను 36 శాతం వడ్డీకి డబ్బు అప్పుతెచ్చుకుని పంట ప్రారంభించాను. పంటకు కావాల్సిన ఖరీదైనవన్నీ... ఎరువులూ, డి.ఏ.పి. (డై

అమ్మోనియం ఫాస్ఫేట్ ఎరువు), యూరియా ఇంకా చాలా చాలా... కొనాల్సివచ్చింది. గత మూడేళ్ళుగా మంత్రిగారేమో పంటకు తగిన ధర లేదని చెబుతూనే ఉన్నారు. మరోపక్క నాకు డబ్బు అప్పిచ్చిన మనిషి వెంటనే బాకీ తీర్చేయమంటూ పీకలమీద కూర్చున్నాడు. నేను పండించిన పంటకు ధర లేదని మంత్రి చెబుతుంటే, నేను నా అప్పు ఎలా తీర్చాలి?

డాక్టర్ దాస్‌గుప్తా ఈ ప్రశ్నకు ఆశ్చర్యపోయినట్టుగానో, కదిలి పోయినట్టుగానో అనిపించలేదు.

"ఈ దేశంలో చాలా మంది రైతులు నువ్వు అనుభవిస్తున్న సమస్యే అనుభవిస్తున్నారు. నువ్వు చెప్పిన విషయం చాలా ముఖ్యమైనది, మనందరం ఆందోళన చెందాల్సింది. నువ్వు చాలా ఎక్కువ వడ్డీ రేటుకు అప్పు తెచ్చావు. కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే మనకంటే ముందున్న దేశాలు ఇటువంటి సమస్యలను పరిష్కరించుకున్నాయి. వడ్డీరేటు మీద నియంత్రణలున్నాయి. దాని ప్రకారమే రైతులు అప్పుతెచ్చుకుంటారు. అయితే 36 శాతం వడ్డీ చాలా దారుణం, దుర్మార్గం అది నేరం కూడా, రైతుకిచ్చే అప్పులమీద వడ్డీ రేట్లు సముచితంగా ఉండాలి. ఇటువంటి సమస్యలు మనం పరిష్కరించవలసి ఉంది."

వడ్డీ వ్యాపారులు, దళారీలు, తద్వారా రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడాల్సిందేనన్న ఒత్తిళ్ళూ కలిసి అల్లుకున్న ఈ వ్యవస్థమీద తన టెక్నాలజీలు ఏ విధమైన ప్రభావం చూపిస్తాయో డాక్టర్ దాస్‌గుప్తా చర్చించకపోయినా, ప్రొఫెసర్ రావు మాత్రం - వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలు తీసేసుకుంటే ఇటువంటి సమస్యలను అధిగమించవచ్చునని సూచించారు.

"ప్రస్తుతం మీరు మధ్యవర్తులతో అనేక సమస్యలు పడుతున్నారు. (దీనిని పరిష్కరించాలంటే) రైతులకూ, కంపెనీలకు నేరుగా సంబంధం ఉండాలి."

మీ శాఖ ఇప్పటికే బాగా ఉన్నవారికి పరపతి ఎందుకు కల్పిస్తోంది? అని నరసమ్మ అక్బల్‌రావును ప్రశ్నించింది.

"మీ ప్రభుత్వం ట్రాక్టర్లు కొనుక్కోవడానికి అండగా నిలబడుతుంది కానీ ఎద్దులబండి కొనుక్కోవడానికి ఎందుకు డబ్బులివ్వదు? మా గ్రామంలో ఇంతకు ముందు 10 ట్రాక్టర్లు ఉండేవి. ఇప్పుడవి 20 అయ్యాయి. పెద్దరైతులు పెద్ద రుణాలు తీసుకుని ట్రాక్టర్లు కొనుక్కుంటారు. కానీ, మాకు చిన్న చిన్న రుణాలు కూడా దక్కవు."

చిన్న రైతులు చిన్న చిన్న రుణాల విషయం గురించి అక్బల్‌రావు జవాబు చెప్పడం మానేసి ట్రాక్టర్ల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు (సెక్షన్ 3.1.3 చూడండి).

పెద్ద రైతులూ, ఇంకా శక్తివంతమైన రైతులూ, దళారీలు తమ బలాన్ని, అధికారాన్ని దుర్వినియోగం చేసే అవకాశాలు బాగా వున్నాయనీ, అందువల్ల ఈ పరిస్థితిని మార్చడానికి విధానాలు మార్చి, నిందితులను శిక్షించాలని డాక్టర్ కె.పి.సి. రావు అభిప్రాయపడ్డారు.

"ఈ నమ్మకద్రోహులను (సహకార సంఘాల వైఫల్యానికి కారకులు) - అటు రైతులూ, ఇటు దళారీలనూ తప్పకుండా శిక్షించాలి. ఇతర రాష్ట్రాల్లో ఒకవేళ రైతులు మోసగిస్తే, కమ్యూనిటీ దానిని తీవ్రంగా ఖండిస్తుంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో అలా జరగడం లేదు. సామాజిక చైతన్యం, కట్టుబాటు ఇక్కడ తక్కువ. అందుకే వ్యవస్థలో ఉన్న అన్యాయాన్ని ఎదిరించే బలం లేకుండా పోతుంది. ఇక్కడ డబ్బు దిగమింగినవాడికే గౌరవం దక్కుతోంది."

తమ తోటి జ్యూరీ సభ్యుల తీర్పును వివరిస్తూ ఫిలిప్, అంజమ్మ మళ్ళీ చిన్న రైతుల సమస్య గురించి ప్రస్తావించారు. పెద్ద రైతులకు దక్కుతున్న రుణాలు, సబ్సిడీలు చిన్న రైతులకు దక్కకపోవడం గురించి వాళ్ళు జ్యూరీ అభిప్రాయాన్ని ఇలా చెప్పారు.

ఫిలిప్ : రైతులకు సహాయపడటానికి సహకార సంఘాలు ఉన్నాయి. కానీ వాటివల్ల మాకు జరుగుతున్న మేలు చాలా తక్కువ. మాకు అప్పు దొరకదు.

అంజమ్మ : మాకు సబ్సిడీలు దక్కవు, బ్యాంకు రుణాలూ రావు.

## 3.1.14 : పశుసంపద / ఎరువు

**మేం ఆశిస్తున్నది**

- మా వ్యవసాయంలో పశు సంపద పాత్ర కొనసాగుతూనే వుండాలి (మేకలతో సహా)
- నేల సారాన్ని కాపాడే పద్ధతులు కొనసాగాలి (పశుసంపద / కమతంలో కూడబెట్టిన సహజ ఎరువు / మిశ్రమ పంటలు / నేలక్షయాన్ని నివారించడానికి ఇతర మొక్కలను నాటడం / వేప దిమ్మ / వేరుశనగ ఊకలను వినియోగించడంతో సహా)

నీటి లభ్యత తగ్గిపోవడం, దాణా లభించకపోవడం వంటి కారణాలతో పాటు, పశువుల సంఖ్య పెంచేందుకు ఒకే రకమైన విధానాలు వుండటంతో పశుసంపద జన్యు వైవిధ్యం తగ్గిపోవడానికి కారణాలు. దీనితోపాటు వ్యవసాయ పశువులు తగ్గడం, సహజ ఎరువులు, జీవనోపాధులు కుటుంబ ఆస్తులు పోవడం జరిగింది.

ఎంతో విలువైన స్థానిక పశుజాతులు (ఒంగోలు, దియోని పశువులు, దక్కనీ గొర్రె, అసీల్ కోళ్ళు వగైరా) దాణా లేక కబేళాకు తరలిపోతున్నాయి. అయినా, ఎగుమతికోసం విజన్ 2020 అత్యధిక పాలదిగుబడిని ఆశిస్తూ, అందుకు మేత వనరులను విపరీతంగా పెంచడానికి సంకల్పించింది (ఇప్పటికే పశువుల దాణా కోసం

ఉద్దేశించిన పంటల విస్తీర్ణం పెంచడం, మొక్కజొన్న, సోయా చిక్కుడు వంటి ప్రధాన దాణా పంటలకోసం కాంట్రాక్టు వ్యవసాయం ప్రవేశపెట్టడం). పశుజాతిపై నిపుణురాలు, సాక్షి అయిన డాక్టర్ సాగరి రాందాస్ ఇలా అడుగుతున్నారు.

" మీ భూముల నుంచి మేత అందించని ప్రభుత్వం మిమ్మల్ని అడుగుతోంది. మీకేమో చిన్న కమతాలున్నాయి. మీరు కడుపు నింపుకుంటారా? పశువుల కడుపు నింపుతారా? ఆ పని మీరు చేయగలరా? ఎవరికైతే 40, 50, 60, ఎకరాల భూమి ఉందో వాళ్ళు మాత్రమే తమ భూమి నుంచి దాణా అందించగలరు. ఇంతకు ముందు మనం పండించిన పంచలు (ఆహార ధాన్యాలు, కాయ ధాన్యాలు, జొన్న రకాలు వగైరా) మన పశువులకు మేత కూడా ఇచ్చేవి. ఇప్పుడు మనం వాటిని పండించటం మానేసి, పత్తి, పొగాకు వంటివి పండించాల్సి వస్తోంది. ఇక మేత ఎక్కడి నుంచి వస్తుంది?"

దీవెనమ్మ కర్నూలు జిల్లాలో తన అనుభవాన్ని చెబుతూ, రసాయనిక పదార్థాల ద్వారా దాణా ఉత్పత్తిని అధికం చేయడం వల్ల ఇప్పటికే మేతలో పోషక విలువలు బాగా తగ్గిపోయాయని జ్యూరీకి గుర్తుచేసింది. విజన్ 2020 ప్రణాళికలు ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తాయి.

"వ్యవసాయంలో మందులు ఎక్కువగా వాడటం వల్ల ఎరువుల ప్రభావం ఉండిపోయి మా పొలంలో తయారైన దాణాయే మా పశువులకు పనికిరాకుండా పోయింది. అధిక ఉత్పత్తి వంగడాల రకం దాణా మా పశువులకు ఏమాత్రం రుచించడం లేదు."

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటా తాము చూసిన పరిస్థితి ఆధారంగా, పశుసంపద అభివృద్ధి కోసం విజన్ 2020 ప్రణాళికలు సమాజ ప్రయోజనాలకు, పర్యావరణానికి అనుకూలమైనవని జ్యూరీ విశ్వసించడం లేదు. పొలంలో పనిచేయగలిగే ఎద్దుల సంఖ్య బాగా తగ్గిపోవడంతో వ్యవసాయ పనులు విపరీతంగా ఉన్న కాలంలో కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. చాలా మంది రైతులు తమ భూములను ఎద్దులు లేని కారణంగా పడావుగా పెడుతున్నారు. మేత లేకపోవడం, పశు జనాభా తగ్గిపోవడం వల్ల సహజ ఎరువుకు విపరీతమైన కరువు ఏర్పడింది. అందువల్ల సహజ ఎరువులే వాడాలని అనుకున్నప్పటికీ రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో, కాలుష్యాన్ని కలిగించే రసాయనిక ఎరువులు వాడక తప్పడం లేదు.

అన్నిటికీ మించి, అర్థం పర్థంలేని పశువుల అభివృద్ధి కార్యక్రమాలు, పేదలకు ఎంతో ముఖ్యమైన పశువుల విషయంలో వివక్ష చూపడం వంటివి ఆంధ్రప్రదేశ్‌లో పశు సంబంధిత జీవనోపాధులు దెబ్బతినడానికి కారణమైనాయి. ఉదాహరణకు, స్థానిక పశువులలో సంకరజాతి జర్మ్‌ప్లాజమ్‌తో వుత్పత్తి పెంచాలన్న ప్రభుత్వ విధానం కారణంగా రైతులకు ఆర్థికంగా లాభదాయకం కాని పాడిపశువులు ఆవిర్భవించాయి. అభివృద్ధి పరచిన ఈ సంకరజాతులు తగినంత నీరు, బలమైన దాణా, ఆరోగ్య వసతులు, సంరక్షణ వంటివి లభించినప్పడే అధిక పాలదిగుబడిని ఇస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అధికశాతం రైతులు ఇంత ఖరీదైన వసతులు కల్పించలేరు, వాటికోసం ఖర్చుచేయలేరు.

రాష్ట్రంలో మేకల పెంపకాన్ని నిషేధించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనలు జీవవైవిధ్యాన్ని దెబ్బతీయడమే కాక, పేదవారికి మరింత నష్టం కలిగిస్తాయి. మేకల పెంపకం అనేక ఆదివాసీ, దళిత, దిగువ కులాల కుటుంబాలకు ప్రధాన ఆదాయవనరు. చాలా కుటుంబాలు దీనిమీదే ఆధారపడివున్నాయి.

కొద్ది సంఖ్యలో పశువులు ఉన్న వారి అవసరాలను, బాధలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై తన ఆందోళన వెలిబుచ్చుతూ ఫిలిప్ ఇలా అన్నాడు.

"ప్రభుత్వ ఆసక్తి అంతా మాంసం ఉత్పత్తికోసం అనేక ఫ్యాక్టరీలు ఏర్పాటుచేయాలనుకోవడంలోనే ఉన్నట్టు కనిపిస్తోంది. ఒక పక్క ప్రభుత్వం పాల దిగుబడి బాగా పెంచాలని అంటుంది. మరోవైపు కొద్దిమంది రైతులకే అండగా నిలబడుతుంది. ఎన్.జి.వో.లు పాల ఉత్పత్తి విషయంలో చిన్నకారు, సన్నకారు రైతులకు అండగా నిలబడాలి. అప్పడు మేం(కనీసం) స్థానికంగా ఉన్న, దేశి జాతులను కాపాడటంలో సహకరించగలం."

పశుసంపదలో ఉన్న వైవిధ్యం ఇప్పటికే కనుమరుగవుతున్న తరుణంలో, విజన్ 2020లో ప్రతిపాదించిన వ్యవసాయ విధానం దీనిని మరింత నాశనం చేస్తుందని జ్యూరీ విశ్వసించింది. వారి అభిప్రాయం ప్రకారం జీవనోపాధులకూ, సుస్థిరమైన వ్యవసాయానికీ అత్యావశ్యకమైన స్థానిక జంతుజాతులను పరిరక్షించాలి. సమీకృత వ్యవసాయము, దేశీయ విధానాలలో పశువులు పోషక పదార్థాల సైకిల్‌లో భూసారాన్ని కాపాడటంలోను ముఖ్యపాత్ర వహిస్తాయి. ఇటువంటి కొన్ని ముఖ్యాంశాలను జ్యూరీ తన తీర్పు వివరణలో తెలియచెప్పింది.

అమ్మాజీ :- మేం మా సొంత వ్యవసాయం చేసుకునే పరిస్థితిలోనే ఉండాలని కోరుకుంటున్నాం. పొలాల నుంచి సంపాదించుకున్న సహజ ఎరువులతో మా పంటలు మేమే పండించుకుని స్వంతంగా బతకాలనుకుంటున్నాం.

సహజ ఎరువుల్ని వాడుతూ పంటలు పండించుకోవాలన్నది మా ఉద్దేశం. ఆ విధంగా మేం మాకు రోగాలు తెచ్చి పెట్టే విషాలకు బలికాదల్చుకోలేదు.

ఫిలిప్ : మేం సాంప్రదాయిక విధానాల్లో సాంప్రదాయిక పంటలే

పండిస్తాం. ఇందుకు మాకు శిక్షణతోపాటు పశువులు కూడా అందచేయాలి.

### 3.1.15 సహజ, దేశీయ వ్యవసాయ విధానాలకు ఆర్థిక సహాయం దక్కాలి.

**మేం కోరుతున్నది :**

- సేంద్రీయ వ్యవసాయ ఉత్పాదకాలకు సబ్సిడీలు (సహజ ఎరువు / సహజ క్రిమిసంహారక మందులు / సాంప్రదాయిక రకాలు సహా)

ప్రస్తుతం ఉన్న సబ్సిడీ విధానం వల్ల సహజ ఎరువులు, విభిన్న మైన పంటల విధానం నుంచి కృత్రిమ ఎరువులు - మందులు - ఏక పంట సంస్కృతి పరిస్థితి ఏ విధంగా మారిందో చాలా మంది జ్యూరీ సభ్యులకు వ్యక్తిగత అనుభవం ఉంది.

విజన్ 2020లో అంతర్భాగంగా ఉన్న హైటెక్ ప్యాకేజీని కొంతమంది సాక్షులు బలపరిస్తే, కొంతమంది - ముఖ్యంగా డాక్టర్ డేనియల్, డాక్టర్ కె.పి.సి.రావ్ సేంద్రియ (సహజ) వ్యవసాయ పద్ధతుల వల్ల కలిగే అపారమైన ప్రయోజనాల గురించి ప్రస్తావించారు. భారతదేశానికి సహజ వ్యవసాయ పద్ధతుల్లో ఉన్న అపారమైన అనుభవాన్ని, జ్ఞానాన్ని డాక్టర్ డేనియల్ వివరించారు.

'మన సంస్కృతిలోనే అంతర్భాగంగా సహజ వ్యవసాయ లక్షణాలున్నాయి. వాస్తవానికి సహజ వ్యవసాయ భావనలు భారతదేశం నుంచి అమెరికాకు విస్తరించి అక్కడినుంచి యూరోప్‌కు పాకాయి. ఇప్పుడు మళ్ళీ మన దేశంలో ఇది ప్రచారంలో ఉంది. మనకు సహజ వ్యవసాయానికి సంబంధించిన అద్భుతమైన జ్ఞానం, ఆధునికమైన విధానాలు ఉన్నాయి. సహజ పంటల కోసం మనం స్వంతంగా ఉత్పాదకాలు రూపొందించుకోగలిగే స్థాయి మనది. మనం ఈ విషయాన్ని గుర్తించి స్థానిక కమ్యూనిటీలు తమ వ్యవహారాలు తాము నిర్వహించుకోగలిగితే అప్పుడు మనం సమస్యలు పరిష్కరించుకోగలం. మనం (భారతరైతులు) ప్రపంచంలోనే అత్యధికంగా సహజ వ్యవసాయం చేసేవాళ్లం. కానీ దాదాపు 60 వేల హెక్టార్లు మాత్రమే గుర్తింపు పొందింది.'

ఆంధ్రప్రదేశ్‌లో సహజ వ్యవసాయానికి వాస్తవంగా ఉన్న అవకాశాల గురించి డాక్టర్ కె.పి.సి. రావు బాగా వివరించారు.

హరిత విప్లవం కానీ లేక పోతే, పరిస్థితులు ఎంత దారుణంగా ఉండేవంటే తిండి కోసం జనం ఒకరినొకరు చంపుకుని ఉండేవారు. అయితే, ప్రధానలోపం ఏమిటంటే జొన్న, మొక్కజొన్న వంటి ధాన్యాలకు ప్రోత్సాహం లేకుండా పోయింది.

అలాగే, సహజవ్యవసాయానికి కూడా ప్రోత్సాహం కరువైంది. ప్రభుత్వం కేవలం రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులకు మాత్రమే సబ్సిడి ఇవ్వడంతో రైతులు తప్పనిసరిగా రసాయనాలతో వ్యవసాయం చేయడం మొదలుపెట్టాల్సి వచ్చింది. ప్రభుత్వ విధానాల్లోనూ, పరిస్థితుల్లోనూ మార్పు రావాల్సిన అవసరం ఉంది.

రసాయనాలు వినియోగించని వ్యవసాయ పద్ధతుల విషయంలో జ్యూరీ సభ్యుల సంతృప్తి, ఆదే బాటలో కొనసాగడానికి వీలుగా తమకు మరింత సహకారం కావాలన్న వారి అభిప్రాయాలు గత సెక్షన్లలో (3.1.1, 3.1.2, 3.1.3, 3.1.5) వివరించడం జరిగింది.

### 3.1.16. విజన్ 2020 ప్రస్తుత ప్రతిపాదనలు వ్యతిరేకించడం

**మేం వ్యతిరేకిస్తున్నది :**

- ఆంధ్రప్రదేశ్‌లో భూమిని నమ్ముకుని జీవనం గడుపుతున్న వారి శాతాన్ని 70 నుంచి 40 కి తగ్గించాలన్న ప్రతిపాదన.

ఆంధ్రప్రదేశ్‌లో ఆహారం, వ్యవసాయానికి సంబంధించి విజన్ - 2020లో చేసిన ప్రతిపాదనలను, అమెరికా, యూరప్‌లలో ఇదే బాటలో నడిచిన వారి అనుభవాలతో జ్యూరీ పోల్చి చూడగలిగింది. బ్రిటన్‌లోని కార్న్‌వాల్‌కు చెందిన మైఖేల్ హార్ట్ సాక్షిగా వచ్చిన ఒక చిన్న రైతు.

"అప్పట్లో అంటే 1947 లో - మా పార్లమెంట్ చేసిన 1947 - వ్యవసాయ చట్టం అమలుకు వచ్చింది. ఇది దాదాపుగా విజన్ 2020కి దగ్గరగా ఉంటుంది. దీనివల్ల 1947 నుంచి 1996 మధ్యకాలంలో మేం బ్రిటన్‌లో సుమారు 3 లక్షల మంది రైతులను పొలాలనుంచి కోల్పోయాం. మీ దృష్టిలో ఇది పెద్ద సంఖ్య కాదని నాకు తెలుసు. అయితే 1947లో బ్రిటన్‌లో కేవలం 5 లక్షల మంది రైతులే ఉండేవారు. ఆ చట్టం ప్రధానలక్ష్యం - తక్కువ రైతులు, యంత్రాలతో ఎక్కువ పని - విస్తృతమైన పంట. ఈ మొత్తం వ్యవహారం ప్రధానోద్దేశం బ్రిటన్‌కు మరింత ఆహారం సమకూర్చడం. (అయితే) ఉత్పత్తి విపరీతంగా పెరిగినా, పనిచేసే కార్మికుల సంఖ్య విపరీతంగా తగ్గినా వ్యవసాయంలో ఉన్న మిగతా కుటుంబాలకు కూడా ఏ మాత్రం డబ్బు దక్కే అవకాశాలు లేని స్థితికి వ్యవసాయం చేరుకుంది. విస్తృతమైన స్థాయిలో, వ్యవసాయం జరిగింది. కానీ మేం పర్యావరణాన్ని పాడుచేశాం. అడవుల్ని దెబ్బతీశాం. ఇప్పుడు మేం బ్రిటన్‌లో ప్రతి ఏటా నీటి నుంచి రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల్ని వేరు చేయడానికి భారీ ఎత్తున డబ్బు ఖర్చు చేస్తున్నాం. ఈ విధంగా వ్యవసాయాన్ని ఉధృతం చేసే ప్రయత్నంలో మేం గ్రామీణ జీవితాన్ని తేరుకోలేని విధంగా దెబ్బ తీశాం. మా విధానం వల్ల, ఇంతకు ముందు చెప్పినట్టుగా మేం అనేకమంది రైతులను వారి కమతాల నుంచి పోగొట్టుకున్నాం.

చివరి రెండేళ్ళలోనే 40 వేల మంది రైతుల్ని కోల్పోయాం. వాళ్ళలో చాలా మందికి ఇప్పటికీ పనిలేదు. ఎగుమతి కోసమని పండిస్తున్న ఆహారానికి మార్కెట్ ఎక్కడుందో మిమ్మల్ని మీరే ఓ సారి ప్రశ్నించుకోండి. దాని విలువెంతో కూడా ప్రశ్నించుకోండి."

చిన్న కమతాలను పెద్దవిగా సంఘటితం చేయడం, యాంత్రీకరణ వంటి చర్యల వల్ల భూములు పోతే ఆ పరిస్థితి ఎంతటి అనాథత్వానికి, అన్యాయానికి, ఉపాధి భద్రత లేకుండా పోవడానికి దారితీస్తుందో భారతదేశంలోని కొన్ని ఇతర ప్రాంతాల అనుభవాలు చెబుతున్నాయి. సాక్షిగా వచ్చిన నిపుణుడు దానిని ఇలా వివరించారు.

శ్రీనివాస్ :- ఒకసారి మీరు మీ భూముల్ని కోల్పోతే నిరుద్యోగులైపోయినట్టే, పని నైపుణ్యం లేని ఈ రైతులకు మంచి ఉద్యోగాలు వస్తాయన్న ఆశే అనవసరం. ప్రభుత్వం వారిని నాలుగోరకం పనివారుగా తమ పరిశ్రమల్లో చేర్చాలని ఆలోచిస్తోంది. ఏర్పాటు చేయదల్చుకున్న పరిశ్రమలకు ఎలాగూ పనివారు కావాలి. ఇది వెనుకబడిన ప్రజల కోసం తయారైన విధానం కాదు. పేదలకూ, స్త్రీలకూ, దళితులకు కూడా సంబంధించినది కాదు. ఇది అగ్రకులాల వారికీ, అభివృద్ధి చెందిన ప్రాంతాలకీ ఉపకరించేది, బహుశా అగ్రకులాల్లోని మగవారు మాత్రమే దీనిని (విజన్ - 2020) ఆమోదిస్తారేమో!"

వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడాని ఉద్దేశించిన విజన్ 2020తో ప్రణాళికల్లోని ఆలోచనల వాస్తవికతను జ్యూరీ ప్రశ్నించింది. (ఈ నివేదికలోని ముందు సెక్షన్లు ఈ విషయాన్ని మనకు స్పష్టం చేశాయి). ప్రభుత్వం ఈ విషయంలో అతిశయోక్తిగా వ్యవహరిస్తుదన్న జ్యూరీ అనుమానాలను సాక్షులుగా వచ్చిన నిపుణులు ఖరారు చేశారు.

డాక్టర్ కె.పి.సి.రావ్ : 'ఉత్పత్తి పెరుగుదల 6 శాతం ఉంటుందని వాళ్ళు అంటున్నారు. అయితే, ఇందుకు శాస్త్రీయమైన ఆధారాలు లేవు.

విజన్ 2020 ఉద్దేశాలు జ్యూరీ సభ్యులకు స్పష్టంగా అర్థమైనాయి. ఒక సభ్యుడు ఇలా వ్యాఖ్యానించాడు.

ఫిలిప్ : "వాళ్ళు (ప్రభుత్వం) మాకు చేసిందేమీ లేదు. ఎన్నికల సమయంలో వాళ్ళు మా ఓట్ల కోసం వస్తారు మద్యం పంచుతారు. స్వయం సహాయ గ్రూపులు ఏర్పాటు చేసుకోండని చేసుకోండని చెబుతారు. విజన్ 2020 ద్వారా డబ్బు సంపాదించడానికి వాళ్ళు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ఇప్పటిదాకా వాళ్ళు మా కోసం పెట్టిందేమీ లేదు."

కొన్ని సమయాల్లో జ్యూరీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. తమ భవిష్యత్తును ఊహిస్తూ, దానిని అంచనా వేసుకోవడంలో వారు మునిగిపోయారు. బ్రిటన్ రైతుల కష్టాల గురించి మైఖేల్ హార్ట్ చెబుతుంటే వీళ్ళంతా తమను ఆ స్థితిలో ఊహించుకుంటూ, ఆయన చెబుతున్నది చాలా శ్రద్ధగా విన్నారు. వాళ్ళ శరీర కదలికలు, తల ఆడించడం, కళ్ళు తిప్పడం వంటివి వాళ్లు ఎంతగా లీనమైపోయారో తెలియచెప్పాయి.

ఒకరైతు మరొక రైతుతో మాట్లాడినట్టు నేను మీతో మాట్లాడతాను. చాలా సమస్యలు, నేను ఇంతకు ముందు అన్నట్టుగా ఒకటే. మేం ఎదుర్కొంటున్న సమస్యలే మీకూ ఉన్నాయి. మాకూ చాలా తక్కువ ధర ముడుతుంది. చాలా మంది రైతులు కనీసం బతకడం కూడా సాధ్యపడక ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇక్కడున్నట్టుగానే మాక్కూడా చాలా మంది నిపుణులు, మంత్రులు ఉంటూ, సలహాలు చెబుతూ, విధానాలు తయారు చేస్తుంటారు. అంతేకాదు, ఇక్కడ జరుగుతున్నట్టుగానే వాళ్ళు ఎప్పుడూ కూడా మా దగ్గరకు వచ్చి మాతో మాట్లాడి, మా సమస్యలు తెలుసుకోవడం కూడా ఉండదు. మాకు కావాల్సిందేమిటో, తాము చేయాల్సిందేమిటో, మేం ఆశిస్తున్నదేమిటో తెలుసుకునే ప్రయత్నం జరగనే జరగదు.

ఆదాయాల పంపకం అన్యాయంగా ఉన్న స్థితినుంచి అమానవీయమైన స్థాయికి విజన్ 2020 ఏ విధంగా మారుస్తుందో జ్యూరీ సభ్యులకు స్పష్టంగా అర్థమైంది. వాళ్ళు విజన్ 2020ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. (అనుబంధం 3 చూడండి)

ప్రైవేటీకరణ, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు, వాణిజ్యం - పెట్టుబడుల నిబంధనల ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా విలీనం అవుతున్న ఆంధ్రప్రదేశ్‌లో సామాన్యుడికి కానీ, భూమికి కానీ భవిష్యత్తు ఉన్నట్టు వారికి అనిపించలేదు.

## 3.1.17 : ఆరోగ్యం, సంక్షేమ విధానాలు

**మేం కోరుతున్నది**

- ప్రజాపంపిణీ వ్యవస్థ - (PDS) - మా రేషన్ కార్డులు లాక్కోవద్దు
- 'అంత్యోదయ' (నిరుపేదల కోసం ఉద్దేశించిన ప్రజాపంపిణీ వ్యవస్థ) మాకూ దక్కాలి
- నాణ్యమైన, క్షేమకరమైన ఆహారం (విషపదార్థాల ప్రభావం లేనిది)
- పోషక విలువలున్న వివిధ రకాల ఆహారం

**మేం వ్యతిరేకిస్తున్నది**

- ఆహారం విషయంలో స్వావలంబన లేని కారణంగా, దానిని కొనుగోలు చేయడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఆతిథ్యం ఇచ్చే అదృష్టాన్ని కూడా కోల్పోవడం. ఈ పరిస్థితిని వ్యతిరేకిస్తున్నాము.

అభివృద్ధికి సంబంధించిన భవిష్య పథకాలలో సామాజిక, ఆరోగ్య ప్రభావాల గురించి సాక్షులు పెద్దగా మాట్లాడకపోయినా, జ్యూరీ సభ్యులు తమంతట తాము అనేక అంశాలు ప్రస్తావించారు.

హైబ్రిడ్ రకాలు ఎక్కువగా పెరగడం వల్ల ఆహారనాణ్యత క్రమంగా పడిపోవడం గురించి దీవెనమ్మ చేసిన వ్యాఖ్యాలు ఇప్పటికే సెక్షన్ 3.1.8లో వివరించడం జరిగింది.

మరో జ్యూరీ సభ్యురాలు బేబీ, విటమిన్ - ఎ బియ్యంతో పేదల ఆరోగ్యం మెరుగుపరచవచ్చునంటూ డాక్టర్ దాస్‌గుప్తా ఇచ్చిన హామీలపై స్పందిస్తూ, హరిత విప్లవ పంటలు తెచ్చిన ఆరోగ్య సమస్యలపై తన అనుభవాలను వివరించింది.

ముప్పయ్యేళ్ల కిందట మన పెద్దలు సాంప్రదాయిక వ్యవసాయ విధానాల్లో పంటలు పండించేవారు. వాళ్ళు ఎంతో ఆరోగ్యకరమైన ఆహారం తిని మనకు జన్మనిచ్చారు. మనం పెరిగి పెద్దయ్యేసరికి ఈ పద్ధతులన్నీ పోయాయి. అంతా రసాయనాలు ఉపయోగించే వ్యవసాయమే. ఈ రకం వ్యవసాయంలో అనేక రకాల మందులు - కొన్ని పౌడర్లు, కొన్ని ద్రవాలు - చల్లుతూ, రకరకాల ఎరువులు వాడుతున్నాం. ఇప్పుడు 30 ఏళ్ళు వచ్చేసరికే మా పని మేం చేసుకోలేకుండా తయారయ్యాం. బరువులెత్తలేకపోతున్నాం. సరిగా వంగలేకపోతున్నాం. ఇంకా ఎన్నో ఆరోగ్య సమస్యలు. రసాయనాలతో చేస్తున్న వ్యవసాయమే ఇంతటి భయంకరమైన స్థితికి దారితీస్తే, జన్యుమార్పిడి పంటలు మాకు హాని చేయవనీ, మా శక్తినీ, మా ఆరోగ్యాన్నీ చివరకు మా బతుకుల్నే దెబ్బతీయవని మీరు ఎలా చెప్పగలరు?

డాక్టర్ దాస్‌గుప్తా ఇచ్చిన జవాబు, ప్రజల చక్కని ఆరోగ్యం - చురుకుగా పనిచేయగల సామర్థ్యానికీ, సగటు జీవిత కాలానికీ ఉన్న తేడా విషయంలో అయోమయంలో పడవేసేట్టుగా ఉంది.

'నిజానికి ముప్పయ్యేళ్ల క్రితం కంటే ఇప్పుడు ప్రజలు ఎక్కువకాలం జీవిస్తున్నారు. మా తాతగారి కాలంలో ఎవరూ కూడా 65 ఏళ్ళు దాటి బతకలేదు. మా నాన్నగారి కాలానికి వచ్చేసరికి బహుశా ఆ సగటు 80 ఏళ్లకు చేరివుంటుంది. భారతీయుల జీవితకాలం పెరిగింది. అలాగే మొత్తం ప్రపంచమంతా ప్రజల సగటు ఆయుర్దాయం పెరిగింది. బహుశా మీరు గుర్తించే వుంటారు, 30 ఏళ్ల క్రితం కంటే మీ గ్రామంలో ఇప్పుడు ఎక్కువమంది వృద్ధులు జీవించి ఉంటున్నారు...'

బెనర్జీ సాక్ష్యం విన్న తరువాత జ్యూరీ సభ్యులు, హైబ్రిడ్ రకాల వ్యవసాయ విధానాల దుర్వినియోగం కారణంగా కుటుంబాల్లో ఎటువంటి దుష్ప్రభావాలు కలిగాయో ప్రస్తావించారు. ఇప్పుడు చాలా మంది ఆహారపంటలు పండించకపోవడం వల్ల, అతిథులను భోజనానికి రమ్మని పిలిచే పరిస్థితి లేకుండా పోయిందని ఒకరు వ్యాఖ్యానించారు. ఇంతకుముందు, పొలాల్లో ఆహారపంటలుండేవి, కోతలయ్యాయంటే, తినడానికి సిద్ధంగా ఉన్నప్పుడు అంతా కొనుక్కోవాల్సి వస్తున్నది కనుక అతిథులు కూడా మారువడ్డించకే భోజనం ముగించాల్సివస్తోంది. అంజమ్మ తాను గమనించిన ఒక సామాజిక మార్పు గురించి ఇలా చెప్పింది.

'మీరు హైబ్రిడ్ రకాలు ప్రవేశపెట్టారు, రసాయనాలు వాడాల్సిన వ్యవసాయ పద్ధతులు చెప్పారు. ప్రస్తుతం మేం అప్పుల్లో కూరుకుపోయివున్నాం. ఇప్పుడు మళ్ళీ మనం జన్యుమార్పిడి పంటలగురించీ, ఆ తరహా వ్యవసాయం గురించి మాట్లాడుకుంటున్నాం. మనం ఎటు పోతున్నామో, ఎటువంటి వ్యవసాయాన్ని మనం ఎదుర్కోబోతున్నామో నాకు అర్థం కావడం లేదు. మనమూ, మన ముందు తరాల వారూ పెళ్ళయిన తరువాత తల్లిదండ్రులైనాం. కానీ మన పిల్లలూ, మనుమలూ పెళ్లికాక ముందే తల్లిదండ్రులైపోవాలను కుంటున్నారు. జన్యుమార్పిడి టెక్నాలజీని, అటువంటి మిగతా టెక్నాలజీలను మనం రద్దు చేసుకోకపోతే, మనం ఎటుపోతామో చెప్పలేం. మనం అటువంటి టెక్నాలజీలను వాడనేకూడదు.'

ఆహారధాన్యాలను సబ్సిడీపై అందించే ప్రజాపంపిణీ వ్యవస్థ (PDS) చాలా మంది జ్యూరీ సభ్యులకు ఒక పెద్ద జీవనాధారం. వాళ్లలో నిరుపేదలకు 'అంత్యోదయ' ద్వారా చవుకగా ఆహారపదార్థాలు అందుతున్నాయి.

జ్యూరీ తీర్పును చెబుతూ అంజమ్మ ఇలా వ్యాఖ్యానించింది.

- మాకు రేషన్ కార్డులు కావాలి. అవి మా దగ్గర ఎప్పటికీ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

నరసమ్మ ఇలా చెప్పింది

- వేం సహజ ఎరువులు వాడుతూ, పంటలు పండించుకోవాలని అనుకుంటున్నాం. ఆ విధంగా మేం విషపదార్థాలు తెచ్చి పెట్టే రోగాలకు బలికాకుండా ఉండగలుగుతాం.

## 3.1.18 ఎగుమతి - ఆధారిత అభివృద్ధి

**మేం వ్యతిరేకిస్తున్నది**

- ఔషధమొక్కలపైన - వాటి ఎగుమతి అజమాయిషీ కోల్పోవడం

ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికాభివృద్ధి జరగాలంటే ఆహార ఉత్పత్తుల ఎగుమతే శక్తివంతమైన మార్గంగా విజన్ 2020 భావిస్తోంది. సహజ వనరులు పుష్కలంగా ఉండటం, వ్యవసాయ పంటలకు విస్తృతమైన వైవిధ్యం ఉండటం, తక్కువ ఖర్చుకు కార్మిక శక్తి లభించడం వంటి కారణాల వల్ల రాష్ట్రానికి అదనంగా కొన్ని లాభకరమైన అవకాశాలు

ఉన్నాయని ప్రభుత్వ ప్రతినిధి (సాక్షిగా వచ్చిన నిపుణుడు) వ్యాఖ్యానించారు.

ప్రొ॥ ఎమ్.వి. రావు; 'ఆంధ్రప్రదేశ్‌కు ఎగుమతి సామర్థ్యం విస్తృతంగా ఉందని స్వాట్-SWOT (Strengths, Weakness, Opportunities, Threats) విశ్లేషణలో తేలింది. మామిడి, పొగాకు పంటలో రాష్ట్రం ముందంజలో ఉంది. రొయ్యలు, మంచినీటి చేపలు, జీడిపప్పు, పాల ఉత్పత్తులు, నూనెగింజల దిమ్మలు, పసుపు, వచ్చిమిరప, చక్కెర, జొన్న, ఔషధ మొక్కలు, ఆముదం, చింతపండు వగైరా ఉత్పత్తులను ఎగుమతి చేయవచ్చు. విత్తన ఉత్పత్తిలో కూడా రాష్ట్రం అగ్రగామి. విత్తనాల ఎగుమతికి చాలా అవకాశాలు ఉన్నాయి. వీటి ఎగుమతి ఆర్థికంగా బాగా లాభిస్తుంది. సహజ వ్యవసాయానికి వీలు ఉండటం వల్ల ఆ ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశాలున్నాయి. ముందుగా సిద్ధం చేసిన ఆహార పదార్థాలను ఎగుమతి చేయడం కూడా సాధ్యమే. రైతులను మనం ఎగుమతులకు వీలుగా ప్రోత్సహించాలి.

ఆకలి, తిండిలేకపోవడం వంటి సమస్యల పరిష్కారానికి మనం చేస్తున్న ప్రయత్నాలు ఉపకరించాలి. మనకు విపరీతమైన సహజవనరులున్నాయి. వాటిని సమర్థవంతంగా ఉపయోగించుకుని లాభాలు ఆర్జించాలి. 2020 నాటికి రాష్ట్రంలో అనేక మార్పులు వస్తాయి. ఆకలి, పస్తులు పడుకోవడం, అనావృష్టి వంటివి ఉండవు.'

మార్కెట్ అవకాశాలకు సంబంధించి తమకున్న విస్తృత అనుభవం ఆధారంగా చాలా మంది జ్యూరీ సభ్యులు ఈ ఆర్థిక సిద్ధాంతం విలువనీ, విజన్ 2020 కుమ్మరిస్తున్న హామీలను బాహాటంగానే అనుమానించారు. జ్యూరీ సభ్యుల్లో ఒకరు ఇలా అన్నారు.

దీవెనమ్మ ;- తిండిగింజల ఎగుమతి గురించే ఎప్పుడూ మాట్లాడుతుంటారెందుకు? ముందు మనం మన కడుపులు నింపుకోవడం గురించీ, మన కుటుంబ సభ్యుల కడుపు నింపడం గురించీ మాట్లాడుకుని, ఆ తరువాతే కేవలం ఎగుమతి కోసం పండించే పంటల గురించి మాట్లాడాలి. ఎవరి కోసమో లారీల కొద్దీ తిండిగింజలు తరలించితే మనం ఇక్కడ తిండి లేకుండా మాడిపోమా?

ఇతర దేశాల్లో ఎగుమతులే లక్ష్యంగా తయారైన విధానాలు రైతులను ఎంతగా దెబ్బతీశాయో జ్యూరీ విన్నది. ఇతర దేశాలతోనూ, ప్రాంతాలతోనూ పోల్చుకుని తమకున్న 'ప్రత్యేకమైన అవకాశాల' ఆధారంగా వ్యవసాయాన్ని ఉధృతం చేస్తే సమాజంపై దాని దుష్ప్రభావం ఏ విధంగా ఉంటుందో బ్రిటన్‌కు చెందిన ఈ సాక్షిగా వచ్చిన నిపుణుడు వివరించారు.

మైఖెల్ హార్ట్ ; 'ఎగుమతులకోసం ఉత్పత్తి చేయమని మమ్మల్ని కూడా ఒత్తిడి చేశారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ జరుగుతున్నది ఇదే. ఎగుమతి కోసం పంటలు పండించడం గురించి అమెరికాని ఉదాహరణగా తీసుకుని చెప్పకుంటే బాగుంటుంది. నాకు అక్కడ ఎంతోమంది మిత్రులున్నారు. వాళ్లంతా రైతులే. 1996లో అమెరికా ప్రభుత్వం ఒక చట్టం తెచ్చి రైతులు తాము పండించగలిగినంత పండించమని కోరింది. అమెరికా ఆహార అవసరాలు తీరగా అధికంగా వున్న 'మిగులు' ఉత్పత్తిని ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేయడం జరుగుతుంది. ఇదీ ఆ కొత్త విధానం ఉద్దేశం. అయితే, అమెరికా ప్రభుత్వం ఆశించినట్టుగా జరగలేదు. ఆ ప్రయోగం దారుణంగా విఫలమై అనేక మంది రైతులు దివాళా తీశారు. కొంతమంది ఆత్మహత్య చేసుకున్నారు. మీ దగ్గరా, నా దగ్గరా ఉన్న భూముల కంటే చాలా పెద్ద భూములు వారి దగ్గరున్నాయి. అటువంటివారే ఈ విషయంలో ఘోరంగా దెబ్బతింటే మీరు కానీ, నేను కానీ దానిని విజయవంతం చేయగలమా? మనం ఇక్కడ మరిచిపోతున్న విషయం ఏమిటంటే మనం రైతులమే కానీ, ఎగుమతి దారులం కాము. నేనిప్పటిదాకా ఏదీ ఎగుమతి చేయలేదు. మీరు కూడా ఆ పని చేసివుండరని నా నమ్మకం. నేను ఏది అమ్మినా దేశంలో సాధారణ ధరకే అమ్ముతాను. ఒకవేళ అదికానీ ఎగుమతి అయితే దాన్ని ఎగుమతిదారుడు, పెద్ద పెద్ద అంతర్జాతీయ కంపెనీలు విపరీతంగా లాభపడి సొమ్ముచేసుకుంటాయి తప్ప రైతు కాదు.

ఆహార ధాన్యాల ఎగుమతి, వ్యవసాయానికి కావలసిన పురుగులమందులు, ఎరువుల వంటి వాటికోసం వెలుపలి మార్కెట్లపైన ఆధారపడటం వల్ల తామెంతగా పరాధీనం అవుతున్నామో ఒక జ్యూరీ సభ్యురాలు వివరించింది. బయోటెక్నాలజీ, ఆహార విధానంపై ప్రభుత్వ సీనియర్ సలహాదారుగా ఉన్న వ్యక్తిని దీవెనమ్మ ఇలా ప్రశ్నించింది.

'మేం పండిస్తున్నదంతా రాష్ట్రం కోసం. కానీ మీరు దానిని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. కానీ మాకు వచ్చేవన్నీ చాలా ఖరీదుగా ఉంటున్నాయి. యంత్రాల కారణంగా మేం కరెంటు బిల్లులు పెద్ద మొత్తాల్లో కట్టుకోవాల్సి వస్తోంది. యంత్రాల కారణంగా రైతుల్లో మగవారికీ, ఆడవారికీ కూడా పనిలేకుండా పోయింది. మేం ఎలా ముందుకు పోగలం?'

ప్రస్తుత విధానాల వల్ల వ్యవసాయం లాభించే వృత్తి కాదని అంటూ ప్రొఫెసర్ రావ్ ఈ సలహా కూడా ఇచ్చారు. 'కేవలం వ్యవసాయంపైనే పూర్తిగా ఆధారపడిపోకండి. ఇతర వృత్తులను కూడా చేపట్టండి.'

ఎగుమతులు లక్ష్యంగా సాగే వ్యవసాయంలో కార్పొరేట్ రంగం

మరింత విస్తరించడానికి వీలుగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు జ్యూరీ సభ్యులకు దిగ్భ్రాంతి కలిగించాయి. అవసరాల కోసం జరిగే ఉత్పత్తికీ, లాభకరమైన ఎగుమతుల మార్కెట్ కోసం జరిపే ఉత్పత్తికీ ఉన్న ఘర్షణ ఔషధ మొక్కల విషయంలో బైటపడింది.

ప్రొ॥ ఎమ్.వి.రావు; ఔషధ మొక్కల విషయానికొస్తే మన దేశంలో వీటికి లోటులేదు. ఇప్పుడు మీకు దళారీల బాధ ఎక్కువగా ఉంది. రైతుకూ, కంపెనీకి నేరుగా సంబంధం ఉండాలి. ప్రభుత్వం ఇందుకోసం కృషిచేస్తోంది. 80 వేల కోట్ల రూపాయల వరకూ మనం ఈ ఎగుమతుల ద్వారా (ఔషధ మొక్కల) సంపాదించుకోవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వం నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొందరు రైతులకు ఔషధ మొక్కలు పెంచడానికి కోటి రూపాయల వరకూ ఇస్తోంది (ఎగుమతి కోసం).

దేశీయ వైద్యవిధానంలో ఔషధ మొక్కల ప్రాధాన్యత గురించి జ్యూరీ సభ్యులు ప్రస్తావిస్తూ, మనుషుల ఆరోగ్య పరిరక్షణలోనూ, పశుసంపదను కాపాడుకోవడంలోనూ ఔషధ మొక్కల ప్రాధాన్యాన్ని జ్యూరీ సభ్యులు నొక్కి చెప్పారు. జ్యూరీ వ్యాపారాన్ని వ్యతిరేకించడం లేదనీ, అయితే విధానాలు ముందుగా మనుషుల అవసరాన్ని గుర్తించి ఆ తరువాతే మిగతావాటి గురించి ఆలోచించాలని ఫిలిప్ స్పష్టంచేశాడు.

'ముందు మనం వాటిని మన అవసరాల కోసం వాడుకోవాలి. వాటికి కావాల్సిన ఉత్పాదకాలు ఇవ్వండి. ఎలా వాడాలో శిక్షణ ఇవ్వండి ఆ తరువాతే మిగులు ఎగుమతి చేయండి.'

ఆంధ్రప్రదేశ్ వాణిజ్యం చేసుకుంటూ, స్థానిక, రాష్ట్రస్థాయి అవసరాలు తీరిన తరువాత మిగిలిన దానిని ఎగుమతి చేసుకోవచ్చునన్నది జ్యూరీ అభిప్రాయం. బాహ్య ప్రపంచంతో ఆలోచనలు పంచుకోవడం, వస్తువుల, సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపు వంటివి జ్యూరీ అంగీకరిస్తున్నది. ఎగుమతులు విస్తృతస్థాయిలో సామాజిక ప్రయోజనాలను కాపాడాలనీ, వాటిమీద సమాజ నియంత్రణ, అవసరమైన సమయంలో ప్రభుత్వ జోక్యం ఉండాలన్నది జ్యూరీ అభిప్రాయం. ఈ విషయంలో ఎగుమతులకు సంబంధించి జ్యూరీ అంతిమతీర్పు విలువలకూ, సమాన న్యాయానికీ ప్రాధాన్యతనిచ్చింది.

నరసమ్మ ఇలా చెప్పింది.

- ఔషధ మొక్కల ఎగుమతిని మేం వ్యతిరేకిస్తున్నాం.
- ఆహార ధాన్యాల ఎగుమతిని నిషేధించాలి.

## 3.1.9 స్థానిక సంస్థలు, ప్రభుత్వం

మేం కోరుతున్నది

- ఉత్పత్తి అమ్ముకోవడానికి స్థానికంగా కేంద్రాలు, ఉత్పాదకాల కోసం స్థానిక మార్గాలు.
- రైతులకు ప్రాతినిధ్యం వహించే సంస్థల ఏర్పాటుకు వీలు కల్పించడం.
- వివిధ ప్రాంతాల్లోని రైతులతో సంబంధాలు ఏర్పరచాలి.
- రాష్ట్ర ఉద్యోగులందరూ (అటవీశాఖ అధికారులతో సహా) మాకు జవాబుదారీగా ఉండాలి.
- మౌలికమైన సేవలు అందించడంలో ప్రభుత్వం బాధ్యతపడాలి. మంచినీరు, ధరల పర్యవేక్షణ, వ్యవసాయంలో ఉన్నవారు ఒకవేళ ప్రాణం పోగొట్టుకున్న పక్షంలో నష్టపరిహారం ఇవ్వడం, చిన్నకారు, సన్నకారు, భూమిలేని రైతులకు రుణాలు ఇవ్వడం, కల్తీ క్రిమిసంహారక మందులను నిషేధించడం.
- విదేశీ సహాయం (తెల్లవాళ్లనుంచి వచ్చేది) ఈ రకమైన విజన్‌తో నిరుపేదలకు లాభాన్ని చేకూర్చేదిగా ఉండాలి.

సామాజిక, ఆరోగ్య అంశాలను విస్తృతంగా ప్రస్తావించిన సాక్షులు, స్థానిక సంస్థలు, పాలనకు సంబంధించిన అంశాలపై చాలా తక్కువగా ప్రస్తావనలు చేశారు. అయినప్పటికీ, సామాజికంగా అన్యాయంగా ఉన్న పాలనా విధానాల గురించి జ్యూరీ సభ్యులు, సాక్షులకు సంబంధించిన ప్రశ్నల్లోనూ, తీర్పు ముందు జరిపిన చర్చల్లోనూ ప్రస్తావనలు చేశారు. వాళ్ల అంతిమ నిర్ణయాలు ఆరు కోరికలను ప్రకటించాయి. ఇవన్నీ కూడా స్థానిక సంస్థలు, పాలనకు ప్రత్యక్షంగా సంబంధం ఉన్నవే. (పైన చూడండి).

స్థానిక, ప్రాంతీయ, జాతీయ సంస్థల్లో ప్రస్తుతం ఉన్న లోపాలను విశ్లేషించడం నుంచి, తమ జీవితాలను, కమ్యూనిటీలను చక్కదిద్దే వాస్తవిక పరిష్కారాల వరకూ జ్యూరీ సభ్యులు ప్రస్తావించారు. అయితే, దారిద్ర్యంలో మగ్గుతున్న గ్రామీణ ప్రజలకు ఒక అంశంమీద ఉన్న అసలు సిసలైన ఆగ్రహం జ్యూరీ సభ్యుల నుంచి మరోమారు బయటకు వ్యక్తమైంది. ప్రభుత్వ అవినీతికరమైన, జవాబుదారీతనంలేని విధానాల వల్ల డబ్బు పూర్తిగా తప్పుడు దోవలు పడుతోందన్నది వాళ్ల కోపం. చివరి పత్రికా సమావేశంలో, అప్పటి వరకూ జ్యూరీ నిర్ణయాలను సమోదుచేస్తూ వచ్చిన అంజమ్మ జ్యూరీ సభ్యుల ఆవేదనను పునరుద్ఘాటించకుండా వుండలేకపోయింది.

డబ్బు (నిధులు) ఎక్కడనుంచి వస్తోందో, ఎవరికి పోతోందో మాకు తెలియదు. అది మాకు మాత్రం అందడం లేదు. మేం ఎప్పుడు ప్రభుత్వం దగ్గరకెళ్లినా వాళ్లు హాయిగా చేతులెత్తేసి ఏ మాత్రం బాధ్యతపడరు.

# 4. ప్రజాతీర్పు ప్రక్రియ: మూల్యంకనం

## 4.1 ప్రాతినిధ్యం, సంప్రదింపులు

జ్యూరీ సభ్యులను ఎంపిక చేసేటప్పుడు, ఆ ఎంపిక గ్రామీణ ఆంధ్రప్రదేశ్ వాస్తవికతను ప్రతిఫలించేట్లు ఉండాలని ప్రయత్నించడం జరిగింది. (బాక్స్ 3 చూడండి) అందువల్ల ఈ పౌర జ్యూరీలో చిన్న, సన్నకారు రైతులు, ఆహార తయారీదార్లు, ఒక పట్టణ వినియోగదారులైన స్త్రీ ఉన్నారు. జ్యూరీలో అధిక సంఖ్యాకులు ఆదివాసీలు, దళితులు. వినియోగదారుల ప్రతినిధి ఒక మధ్య తరహా పట్టణం నుంచి వచ్చిన చదువుకున్న యువతి, మూడు వంతుల మంది జ్యూరీ సభ్యులు స్త్రీలు. రాయలసీయ, తెలంగాణా, కోస్తా ఆంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలు, రాష్ట్రంలోని ఏడు వ్యవసాయ పర్యావరణ జోన్ల జ్యూరీలో ప్రాతినిధ్యం పొందాయి. (టేబుల్ 1, పటం 1 చూడండి)

ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాలు



తాము కేవలం ప్రాతినిధ్యం వహించడానికి లేమని, తాము సంప్రదింపులు జరపవలసి ఉందని జ్యూరీ సభ్యులు అర్థం చేసుకోవడం ముఖ్యం. జ్యూరీ సభ్యులను వేరువేరు వ్యవసాయ నేపథ్యాల నుంచి ఎంపికచేసినప్పటికీ వారికి కేలం 'ప్రతినిధులు'గా మాత్రమే పరిగణించలేదు. వారు కేవలం వరి పండించే వారికో, భూమిలేని వారికో, దళితులకో, ఆదివాసిలకో, తాము ఏ శ్రేణికి చెందితే దానికి ప్రాతినిధ్యం వహించడం కాక - మొత్తం గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌కు ఏది మంచిది అన్నదాని మీద దృష్టి పెట్టమని సూచించడం జరిగింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు చెందిన ఆకాంక్షలను జాబితా చేయడం కన్నా, ఆహార వ్యవసాయ విధానాల భవితవ్య దృశ్యథాన్ని రూపొందించడం కీలకమని వేం విశ్వసించాము. జ్యూరీకి సమకూరిన ఆమోదం వాళ్ల వాళ్ల సంకల్పాల నుంచి కాక వాళ్లందరికీ కలిసి ఒక ఉమ్మడి సంకల్పం ఏర్పడిన ప్రక్రియ - అంటే సంప్రదింపుల ప్రక్రియ - నుంచి సమకూరింది. అందువల్ల సాక్ష్యాధారాలను విమర్శనాత్మకంగా పరీక్షించడమో, సాక్షులను, వారు వారి సొంత పద్ధతిలో సమస్యలను చూడడానికి అవకాశాలూ - రెండూ కూడా ప్రజాతీర్పులో భాగంగా ఉన్నాయి.

- సాక్షుల బృందం (లేదా స్పెషలిస్టుల బృందం)లోని సభ్యుల ఎంపికలో వైవిధ్యం ఉన్నది. సమాజంలోని అన్ని కీలక రంగాల వారి అభిప్రాయాలు ప్రజాతీర్పు ప్రక్రియలో భాగం పంచుకునేందుకు వీలుగా సాక్షుల బృందం ఎంపిక ఉన్నది. జ్యూరీకి సాక్ష్యం ఇచ్చిన సాక్షులు మూడు ఆహార, వ్యవసాయ విజన్‌లకు మొత్తం మీద బాగా ప్రాతినిధ్యం వహించారు. కొందరు ముఖ్య సాక్షులు హాజరుకాకపోతే, ఒక నిర్దిష్ట భవితవ్య విజన్‌కు అక్కడ వేదిక లభించనట్టు అవుతుంది. ఆహ్వానించిన సంస్థల్లో మూడు ప్రజాతీర్పులో పాల్గొనడానికి రాకపోవడం ఈ సందర్భంగా ప్రత్యేకంగా పేర్కొనదగ్గది.

- ప్రపంచ బ్యాంకు: విజన్ 2020 అవసరాన్ని, అమలును సమర్థిస్తున్న పెద్ద మద్దతుదారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అత్యధిక మొత్తంలో రుణసహాయం చేస్తున్న అతి పెద్ద దేశీయేతర అభివృద్ధి సంస్థ. 1999-2000 సంవత్సరంలో ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 26 కోట్ల 62 లక్షల అమెరికన్ డాలర్ల సహాయం (సుమారు 1300 కోట్ల రూపాయలు) అందించింది.

- బ్రిటన్‌కు చెందిన అంతర్జాతీయ అభివృద్ధి విభాగం (డిఎఫ్ఐడి): ఈ సంస్థ నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలతో పని చేస్తున్నది. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, బ్రిటన్ నుంచి అతి పెద్దమొత్తంలో అభివృద్ధి సహాయాన్ని పొందుతున్న దేశం భారతదేశం అయితే, భారతదేశానికి కేటాయించిన మొత్తం సహాయ ధనంలో 60 శాతం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే చేరుతున్నది. వచ్చే రెండు సంవత్సరాలలో

భారతదేశానికి అందించే సహాయాన్ని రెట్టింపు చేయాలని (30 కోట్ల పౌండ్ల దాకా) డిఎఫ్ఐడి అనుకుంటున్నది.

అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం (అంతర్జాతీయ వాణిజ్య సంస్థ, అంక్టాడ్ సంయుక్త నిర్వహణలోనిది): ప్రకృతి పద్ధతుల ద్వారా చేసే వ్యవసాయానికి, ఆ వ్యవసాయోత్పత్తుల వర్తకానికి ఎంతో ఎగుమతి మార్కెట్ ఉన్నదని నొక్కి చెప్పే గ్లోబల్ సంస్థ.

పై సంస్థలకు దేశంలో ఉన్న ప్రతినిధులకు, ఆయా సంస్థల ప్రధాన కార్యాలయాలకు పదేపదే ఆహ్వానాలు పంపినా, వారు ప్రజాతీర్పు కార్యక్రమంలో పాల్గొనడానికి అంగీకరించలేదు. సమన్వయ బృందం పంపిన ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నట్టు ప్రజాతీర్పు కార్యక్రమం ప్రారంభం కావడానికి మూడు రోజుల ముందు ప్రపంచ బ్యాంకు అధికారికంగా తెలియజేసింది. అంత తక్కువ సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సాధ్యం కాలేదు. అనేక అంతర్జాతీయ ఏజెన్సీలు, కార్పొరేషన్లు, కొన్ని ఎన్‌జీవోలు, చివరికి ప్రజాస్వామిక ప్రభుత్వాలు - వీరందరితో సహా అనేకమంది రాజకీయ పాత్రధారులు ప్రజాతీర్పు ప్రాజెక్టులో ఉపయోగించే ప్రజాస్వామిక భాగస్వామ్య ప్రక్రియను చూసి, పౌర బాధ్యతని చూసి భయపడి ఉంటారని మాకు తెలుసు.

## 4.2 పరిశోధనకూ విముక్తికి మధ్య సమతూకం

ఆహార, వ్యవసాయ భవితవ్యాల గురించి, చిన్న, సన్నకారు రైతుల అభిప్రాయాల గురించి ఒక గుణాత్మక పరిశోధనా అభ్యాసంగా ప్రజాతీర్పు ఎంతో అద్భుతమైన అవగాహనను అందిస్తుంది. ఆహార, వ్యవసాయ భవితవ్యాల మీద ప్రజాతీర్పు భాగస్వాములు ఏమి అనుకుంటున్నారో మేము ఉపయోగించే నూతన, భాగస్వామ్య పద్ధతులు కేవల సామాజిక పరిశోధనల కన్నా మెరుగుగా వెల్లడి చేయగలనని మొదటినుంచి మాకు నమ్మకంగా ఉన్నది. అయితే, ఈ భాగస్వామ్య పద్ధతుల విజయానికి కొంత కారణం - సమావేశకర్తల, సమన్వయకర్తల బృందం అనుసరించిన సానుకూల వైఖరి. ప్రజాతీర్పు భాగస్వాములకు వారి అభిప్రాయాలకు వినిపించే హక్కు ఉన్నదని, ఈ పౌరులు తమ నిర్ధారణలను అధికారంలో ఉన్నవారు పట్టించుకోవాలని బలంగా ఆకాంక్షిస్తున్నారని సమావేశకర్తలు, సమన్వయ కర్తలు గుర్తించారు. పేదలకు, అణగారిన వారికి సహాయపడే విధానపరమైన నిర్ణయాల కోసం ఒత్తిడి తేవడానికే సమావేశకర్తలు తమకు సహాయపడుతున్నారని జ్యూరర్లు గుర్తించారు. ఫలితంగా జ్యూరీ సభ్యులకు, సమావేశకర్తలకు మధ్య పరస్పర విశ్వాసం నెలకొన్నది, ఆ విశ్వాసం ఈ నివేదికలోని విశిష్టమైన పరిశీలనకు దోహదం చేసింది.

సామాజిక శాస్త్ర పరిశోధకులు తరచు తమను తాము ఏ విలువలూ అంటని నిష్పక్షపాత శాస్త్రవేత్తలుగా భావించుకుంటారు. అభిప్రాయలలోని వైవిధ్యాన్ని కుదించి, ఇతర పరిశోధకులకు, విధాన నిర్ణేతలకు అర్థమయ్యే రూపంలో వ్యక్తం చేయడం వారి పని. అభిప్రాయ సేకరణ పోల్‌లలో ఈ పని సాపేక్షంగా సీదాసాదాగానే ఉంటుంది. కాకపోతే, కస్టమర్‌కు కావలసిన సమాధానాన్ని పొందడానికి సర్వే సహాయ పడుతుందా లేదా అన్నది ప్రశ్నలను రూపొందించిన పద్ధతి మీద ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.

ఫోకస్‌గ్రూప్ పద్ధతి, ఇంకా విస్తృతంగా ఉపయోగించే మరి కొన్ని ఇతర భాగస్వామ్య పద్ధతులతో ప్రయోజనం ఏమిటంటే - అవి నిపుణులైన పరిశోధకులు చర్చలో పాల్గొనే వారి మనసులోతుల్లోకి వెళ్లడానికి అనుమతిస్తాయి. వాళ్లు చెప్పే మాటలకు, వాళ్ల మనసులోని అభిప్రాయాలకు ఉన్న సంబంధాన్ని, వాళ్లు చేయబోయే పనులను పరిశోధకుడు వివరిస్తాడు. ఫోకస్ గ్రూప్ చర్చ పద్ధతి అత్యుత్తమ ప్రమాణాలతో నిర్వహిస్తే, అది చర్చలో పాల్గొనే వారి మనస్తత్వాలను విశ్లేషించడానికి పరిశోధకులకు అవకాశం ఇస్తుంది. పాల్గొనే ప్రతి ఒక్కరి సొంత లక్ష్యాలు, విలువలు, అభిప్రాయల దృష్టినుంచి సామాజిక ధోరణుల అంతరార్థాన్ని వ్యాఖ్యానించడానికి వీలు కల్పిస్తుంది. (కెర్, కనింగ్‌హామ్-బర్లీ 2000)

అభిప్రాయ సేకరణ పోల్‌లకు, ఫోకస్ గ్రూప్ పద్ధతికీ, తదితర మార్కెట్ రీసర్చి సాధనాలకి ఉమ్మడిగా ఉన్న లక్షణం ఏమిటంటే - వారు సమాచారాన్ని, అనుభవాలను, పరిజ్ఞానాన్ని రాబట్టుకుంటారు. ఏ ప్రతిఫలమూ ఇవ్వకుండా, కొన్నిసార్లు ఎంతో కొంత డబ్బు రూపేణా ఇస్తారు. చాలా సందర్భాలలో, జనం నుంచి అధికారాన్ని తీసేసుకోవడమే ఇది. మేం ప్రజల నుంచి వారి అభిప్రాయలను మాత్రమే గ్రహించామని ప్రభుత్వాలు, కంపెనీలు, పైకి అనవచ్చును. కానీ తమ విధానాలను సమర్థించమనో, తమ సరుకును కొనుగోలు చేయమనో సమాజాన్ని ఒప్పించడానికి ఆ అభిప్రాయాలను వినియోగిస్తారు. (హంఫ్రైస్, 2000, వాలస్, 2001). సర్వేల్లో, పోల్‌లలో, ఫోకస్‌గ్రూప్‌లలో పాల్గొనే వారికి తమ జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే దిశగా కొత్త సామర్థ్యం ఏమీ సమకూరదు. దీన్నే - పిండుకునే పరిశోధన అంటారు. పరిశోధనా ప్రక్రియలలో పాల్గొనేవారికి ఏమీ దక్కదు. (బాక్స్టర్, 2001)

మార్కెట్ పరిశోధకులు ప్రజాభిప్రాయాన్ని మనస్తత్వ ప్రకటనగా పరిగణిస్తారు తప్ప రాజకీయ ధోరణిగా చూడరు. ఏదైనా ఒక విషయం గురించి అభిప్రాయ సేకరణ చేస్తున్నప్పుడు ఒక అభిప్రాయదాత 'తనకు ఆ విషయం గురించి తగినంతగా తెలియదు' అన్న సమాధానం ఇచ్చాడనుకోండి. భాగస్వామ్య పరిశోధకుడు అయితే, ఆ సమాధానాన్ని మరింత వివరించమని

## టేబుల్1 జ్యూరీ సభ్యుల సామాజిక, వ్యవసాయ నేపథ్యాలు

| ప్రాంతం | జిల్లా | పేరు | స్త్రీ పురుషులు | భూమి (ఎకరాలలో) | | | | కుటుంబ సభ్యుల సంఖ్య | కులం | పశువులు | ఇతర ఆదాయం | పంటలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | తరి | మెట్ట | కౌలు | మొత్తం | | | | | |
| రాయల | కర్నూలు | మరియమ్మ | స్త్రీ | 2.5 | 2 | | 4.5 | 9 | మాల 10(కో) | 2(గే), 1 (గే.దూ) | -- | కంది, జొన్న, వరి, సీమ దోస, మిరప |
| | కర్నూలు | దీవెనమ్మ | స్త్రీ | 0.5 | 1 | | 1.5 | 9 | మాల | 1(గే), 1 (గే.దూ) 10(కో) | -- | వరి, కంది, జొన్న |
| | చిత్తూరు | దానమ్మ | స్త్రీ | 0.5 | 2 | | 2.5 | 7 | మాల | 1(కో) | -- | వేరుశనగ, కంది, సజ్జ, అనుములు, ఉడ్డలను, పెసర, వరి, మిరప, కూరగాయలు |
| | చిత్తూరు | బేబి | స్త్రీ | | 2 | | 2 | 5 | మాల | 0 | దినవేతనం | శనగలు, అలసందలు, అనుములు, కంది, పెసర, ఉడ్డలు, ఉలవలు, జొన్న |
| | చిత్తూరు | ఆనందమ్మ | స్త్రీ | | 6.5 | | 6.5 | 8 | మాదిగ | 5 (గొ) | -- | ఉలవలు, జొన్నలు |
| | కడప | లక్ష్మమ్మ | స్త్రీ | | | | 0 | 8 | మాల | 3 (ఆ), 3 ఆ.దూ) | దినవేతనం | శనగ, వరి |
| | కడప | రామయ్య | పురుషుడు | | 2 | | 2 | 14 | మాల | 6 (గే) | పాలవ్యాపారం | పసుపు, శనగ, వరి |
| కోస్తా | తూ. గో. | మంగాయమ్మ | స్త్రీ | 2 | 2 | | 4 | 7 | కొండరెడ్డి | 4(ఎ), ఎ (ఆ), | దినవేతనం | సజ్జ, వరి, అలసంద, కంది, బొబ్బర్లు, బొడుమ |
| | తూ.గో. | నర్సమ్మ | స్త్రీ | | 5 | | 5 | 8 | దొరలు | 2(ఎ). 2(ఆ), | -- | సజ్జ, కొబ్బరి కొర్రలు, జొన్నలు, అలసందలు, ఉలవలు, బొబ్బర్లు, వరి, కంది, కూరగాయలు |
| | గుంటూరు | కోటరత్నమ్మ | స్త్రీ | | 0.5 | | 0.5 | 6 | మాల | 1(గే) | పాలవ్యాపారం | వరి, మినుములు, కూరగాయలు |

| | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | గుంటూరు | ఫిలిప్ | పురుషుడు | | 1.5 | | 1.5 | 5 | మాల | 0 | -- | తమలపాకు, వరి, మినుములు, పసుపు, కూరగాయలు, మామిడి, అల్లం |
| | విశాఖ | అమ్మాజి | స్త్రీ | 2 | 2 | | 4 | 5 | గవర్లు | 1(గే), 2 (ఎ) | దినవేతనం | వరి, చోళ్ళు, బొబ్బర్లు |
| | విజయ నగరం | శాంతమ్మ | స్త్రీ | 1 | 1 | | 2 | 2 | జాతాపు | 2(గే), 2 (ఎ) | దినవేతనం | వరి, సజ్జ, జొన్న, ఉడ్డలు కొర్రలు, రాగి, జడుములు |
| | ప. గో. | గణేశ్ రావు | పురుషుడు | 2 | 3 | | 5 | 6 | మాల | 0 | -- | కొబ్బరి, వరి, వేరుశెనగ |
| తెలంగాణా | మెదక్ | అంజమ్మ | స్త్రీ | 2 | 2 | | 4 | 17 | గౌడ | 2(గే), 2(ఎ) | దినవేతనం | కొబ్బరి, మిరప, కూరగాయలు, జొన్న, కంది, ఆలసంద, పసుపు, వరి, మినుములు, ఉల్లి |
| | వరంగల్ | బాయక్క | స్త్రీ | 2 | 1 | | 3 | 8 | దొరలు | 0 | -- | వరి |
| | వరంగల్ | పాపారావు | పురుషుడు | 4 | 3 | | 7 | 8 | కోయ | 4 (ఎ), 2 (ఆ.దూ) | -- | వరి, కొబ్బరి |
| | వరంగల్ | సమ్మయ్య | పురుషుడు | 2 | 1 | | 3 | 8 | దొరలు | 0 | దినవేతనం | వరి |
| | మెదక్ | గీతామూర్తి | స్త్రీ | | | | | 3 | బ్రాహ్మణ | 0 | దినవేతనం | మిరప, రాగి, నువ్వులు, సామ |

ఎ- ఎద్దు, ఆ- ఆవు గే- గేదె కో.దూ. - కోడెదూడ ఆ.దూ. - ఆవుదూడ గే.దూ. - గేదెదూడ గొ-గొర్రెలు కో - కోళ్ళు

ప్రాంతాల వారీగా
రాయలసీమనుంచి - 7గురు రైతులు, 3 జిల్లా నుంచి
కర్నూలు - 2
చిత్తూరు - 3
కడప - 2
కాస్తా ఆంధ్ర నుంచి 7 గురు రైతులు, 5 జిల్లాల నుంచి
తూర్పు గోదావరినుంచి - 2
గుంటూరు - 2
విశాఖ -1
విజయనగరం -1
పశ్చిమగోదావరి - 1
తెలంగాణా నుంచి 4గురు రైతులు, 2 జిల్లాల నుంచి
మెదక్ నుంచి - 1
వరంగల్ - 3
పట్టణ వినియోగదారుగా మెదక్ నుంచి - 1
స్త్రీ పురుషుల ప్రాతినిధ్యం
మగ రైతులు -5 గురు
మహిళారైతులు - 13
మహిళావినియోగదారు - 1

జ్యూరీ సభ్యుల సామాజిక నేపథ్యం గురించి వివరణ

మాల, మాదిగ కులాల షెడ్యూల్డు కులాలలో భాగం. దళితులుగా వ్యవహరించే ఈ కులాలవారు సాధారణంగా వ్యవసాయకార్మికులుగా పనిచేస్తారు. గవర్లు, దొరలు షెడ్యూల్డు తెగల కిందికి వస్తారు, వీరు అడవిలో నివసిస్తారు, అడవిమీద ఆధారపడి జీవిస్తారు. వీరిని ఆదివాసులుగా వ్యవహరిస్తారు. జ్యూరీలో ఉన్న ఈ తెగల వారు వ్యవసాయదారులుగాను, కూలీలుగానూ కూడా ఉన్నారు. దొరలు, కొండరెడ్లు, జాతాపు, కోయలు, - వీరందరూ అడవుల దగ్గర జీవిస్తూ వ్యవసాయం చేసే ఆదివాసీ తెగలవారు. గౌడలు తరతరాలుగా కల్లుగీత వృత్తిలో ఉన్నవారు, వ్యవసాయదారులు కూడా.

కోరవచ్చు. ఫలానా నిబంధన మీద నమ్మకం లేదనో, విధాన ప్రక్రియను ఎట్లా ప్రభావితం చేయగలమో చూసేందుకు మరింత అవగాహన అవసరమనో - ఏదో ఒక సమాధానం దగ్గరికి తీసుకుపోగలడు. మార్కెట్ పరిశోధకుడు అట్లా కాదు. 'నాకు తెలియదు' అన్న సమాధానం మాత్రమే అతను అంగీకరిస్తాడు. రీసర్చి చేస్తే వ్యక్తి దగ్గర ఉన్న కాయితాల మీద తగిన సమాధానపు గడి లేకపోతే, నిస్సహాయత ఫీలింగ్‌ను ఒక అభిప్రాయదాత ఎట్లా వ్యక్తం చేయగలడు? అది ఎట్లా నమోదు అవుతుంది? (ఇర్విన్, 1995, 2001)

జ్యూరీ భాగస్వాముల చర్చ చట్రాన్ని తామే నిర్ణయించి, తమ సొంత పద్ధతిలో తామే తుది నిర్ధారణలు చేయనివ్వడం శాస్త్రీయంగా నిష్పక్షపాతమైన ప్రక్రియ కాదని అనేకమంది సామాజిక పరిశోధకులు అంటారు. దీని అర్థం ఏమిటంటే, హేతుబద్ధంగా ఆలోచించే పరిశోధకుడు తన దగ్గరి అధికారాన్ని జ్యూరీప్రక్రియలో పాల్గొనే వారికి అందిస్తే, దాన్ని, అందుకున్నవారు విశ్లేషణా ప్రక్రియకు దోహదకారి కాని పద్ధతిలో ఆ అధికారాన్ని వినియోగిస్తాడు.

నిష్పక్షపాతంగా ఏది సత్యం అన్న దానికి, భవిష్యత్తు ఎట్లా ఉండాలి అన్న అభిప్రాయాలకు మధ్య శాస్త్రవేత్తలు చూసే తేడాను పౌరులు చూడరు. (ఫిషర్ 2001). సామాజిక శాస్త్రవేత్తలు మాత్రమే, వారి సొంత ప్రవర్తనా నియమావళి ప్రకారమే నిష్పక్షపాతంగా ప్రజాభిప్రాయంలో ఏది సత్యమో దాని గురించి మాట్లాడాలి. పౌరులు తమ వాస్తవికత గురించి తామే అంచనా వేసుకుని, దాన్ని మార్చడానికి అవకాశాలు కల్పించుకోవడానికి కృషి చేయాలి. ఈ క్రమంలో సామాజిక పరిశోధకులు కేవలం దోహదకారులుగానే వ్యవహరించాలి. వారు అటువంటి ప్రత్యామ్నాయ నమూనాను అనుసరించకుండా అవరోధాలే ఉన్నాయి. (బోర్డీ 2001, 2002) ఇందుకు భిన్నంగా ప్రజాతీర్పు ప్రజలను సాధికారం చేసే ప్రక్రియను అనుసరించింది. సంబంధిత అంశాలమీద మెరుగైన అవగాహన సాధించడానికి సామాజిక శాస్త్రవేత్తల అవసరాన్ని విస్మరించకుండాను అలక్ష్యం చేయలేదు. ఈ వైఖరి కారణంగా కొద్దిపాటి ఆవేశకావేశాలు, రాజీలు, అపరిపక్వతలు ఎదురయిన మాట నిజమే. అయితే, జ్యూరర్లకు, సమావేశకర్తల బృందానికీ, పర్యవేక్షక బృందానికి మధ్య రోజూ జరిగిన సమీక్షా సంభాషణల వల్ల సమస్యలను సాధ్యమైనంతగా వెంటనే పరిష్కరించగలిగారు.

## 4.3 ఫెసిలిటేషన్ - సమావేశ దోహదం

జ్యూరీ సభ్యులను పౌరులుగా సమావేశకర్తల వైఖరి ఒక కీలకాంశం. చర్చల్లో వారిని ఎంతగా భాగస్వాములను చేస్తామన్నది ఆ వైఖరి మీద ఆధారపడి ఉంటుంది. సమస్యలను వారికి ఇష్టమైన పద్ధతిలో చర్చించడానికి జ్యూరీ సభ్యులకు అవకాశం ఇవ్వడం ఇందులో ఒక ముఖ్యభాగం. విధాన నిర్ణేతలకు అవసరమైన దృక్పథాన్ని అందించడం, తాము సందర్భోచితం అనుకున్న అనుభవాలను, దృష్టికోణాలను ఉపయోగించుకుని సమస్యలను తమ సొంత పద్ధతిలో చూసే అవకాశాన్ని ఇవ్వడం ద్వారా ప్రక్రియ మీద జ్యూరర్లకు అదుపు ఇవ్వడం - ఈ రెంటి మధ్య సమావేశకర్తలు సమతూకాన్ని పాటించవలసి వచ్చింది. ప్రజాతీర్పులో జ్యూరీ సంప్రదింపులు చాలా కొద్ది సమయంలో జరిగాయన్నది గమనించాలి. అందువల్ల ప్రజలు వారి ఆసక్తులను, సలహాలను ప్రకటించడానికి అనేక అవకాశాలను ఇచ్చే వివిధ భాగస్వామ్య సాధనాలను ఉపయోగించడం ముఖ్యం.

ఆశించిన ఫలితాల కోసం, ఫెసిలిటేషన్ ఈ కింది వాటిని సాధించాలి, రాబట్టాలి.

- జ్యూరీలో తమలో తమకు, జ్యూరీకి స్పెషలిస్టు సాక్షులకు మధ్య వారి అనుభవాల మీద, జ్ఞానాల మీద ఆధారపడి ప్రామాణికమైన చర్చ జరిగేటట్టు చూడడం.
- స్థానికంగా ఉనికిలో ఉన్న భవిష్యత్ దృష్టికోణాల గురించిన కొత్త పరిజ్ఞానం, వాటి సాధనకు ఉన్న అవరోధాలు, అవకాశాలు.
- అవసరమైన మార్పులను సాధించడానికి ఎవరేమీ చేయాలో వివరించే విధాన ప్రతిపాదనలను రూపొందించాలి.

సమావేశకర్తలు కొన్ని ప్లీనరీ సమావేశాలను కొన్ని చిన్నచిన్న ఫోకస్ గ్రూప్ చర్చలను ఉపయోగించారు. జ్యూరర్లు ఈ కింది అంశాలలో సహాయం చేసేందుకు వారు ఆ మిశ్రమ సమావేశ పద్ధతులను అనుసరించారు.

- వారు విన్నదానిని / చూసినదానిని గురించి పరిశీలించడానికి, ఆలోచించడానికి.
- ఆయా విషయాలలో స్పెషలిస్టులయిన వారిని అడిగే ప్రశ్నలను రూపొందించుకోవడానికి, జ్యూరీలో తమలో తాము చర్చించుకోవడానికి ప్రశ్నలను తయారుచేసుకోవడానికి
- ఇంగ్లీషులో చేసిన ప్రసంగాలలోని వాదాలను అర్థం చేసుకోవడానికి, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో మాట్లాడే వేరువేరు తెలుగుభాషలను అర్థం చేసుకోవడానికి
- జ్యూరీలో విభిన్న అభిప్రాయాల విషయంలో, ఘర్షణకు అవకాశమున్న అభిప్రాయాల విషయంలో ఏదో ఒక కనీస ప్రాతిపదిక మీద ఏకాభిప్రాయాన్ని వారి మీద రుద్దకుండా సమస్యలను పరిష్కరించుకోవడానికి

- ప్రతిరోజూ విచారణలు ముగిసిన తరువాత వారి వారి అభిప్రాయాలను, ఫీలింగ్స్‌ను, సందేహాలను జ్యూరర్లు అందరూ కలిసి కలబోసుకోవడానికి
- తమ ముందుకు వచ్చిన సాక్ష్యాలన్నిటిని సమీక్షించిన తరువాత సంప్రదింపులకు
- ఏది శ్రేయస్సు, ఏది మంచి వ్యవసాయం, ఏది మంచి ఆహారం, ఏది మంచి పాలన వంటి అంశాలలో కొన్ని సూచికలను రూపొందించి, అంగీకరించడానికి
- అంగీకరించిన సూచికల ఆధారంగా ఆహార, వ్యవసాయ భవితవ్యాలను ఊహించి, వర్ణించడానికి
- కోరుకుంటున్న ఆహార, వ్యవసాయ భవితవ్యాల సాధనకు విధాన దిశానిర్దేశాన్ని, సిఫారసులను రూపొందించడానికి
- జ్యూరీ తీర్పునకు సంబంధించిన పద్ధతులను నిర్ణయించడానికి, ప్రజాతీర్పు చివరిరోజున ఎవరు పరిశీలకులకు వివరిస్తారు, ఎవరు పత్రికలు సమాచార సాధనాలవారికి, ప్రభుత్వానికి వివరిస్తారు అన్న అంశాల మీద అంగీకారం సాధించడానికి.
- మొత్తం జ్యూరీ ప్రక్రియలోని బలాలను, పరిమితులను సమీక్షించి, అంచనా వేయడానికి ఒక్కొక్కళ్లుగా చేసినా, కలసికట్టుగా చేసినా సమావేశకర్తల మదింపు ప్రక్రియ మరింత మెరుగైన రీతిలో సాగడానికి, పౌరజ్యూరీ విచారణలో గుర్తించిన సమస్యలను అధిగమించడానికి సహాయం చేశాయి. ఒక్కొక్కళ్ళుగా చేసినా, కలిసికట్టుగా చేసినా సమావేశ కర్తలు మొత్తం ప్రక్రియను సున్నితంగా, అంకితభావంతో నడిపించారు. పర్యవేక్షక బృందం చేసిన మూల్యాంకనం, సమావేశ కర్తల మదింపు ప్రక్రియ మరింత మెరుగైన రీతిలో సాగడానికి, పౌరజ్యూరీ విచారణలో గుర్తించిన సమస్యలను అధిగమించడానికి సహాయం చేసాయి.

సమావేశం మొదటిరోజు ఫెసిలిటేషన్ కాస్త 'అతి' అయింది. చిన్న ఫోకస్ గ్రూపుల దగ్గర సమావేశకర్తలు ఎక్కువ కేంద్రీకరించినట్లు కనిపించింది. పర్యవేక్షక బృందంలోని ఒకరు సమావేశకర్తలు ఎక్కువ కనిపిస్తున్నారని వ్యాఖ్యానించారు కూడా. 'వారు సమావేశాలను జరగనివ్వాలి తప్ప కల్పించుకోగూడదు' (నాయుడు). అయితే మొదటి రోజు సమావేశాలు ముగిసేనాటికి ఆ సమస్య తీరిపోయింది. జ్యూరీ సభ్యులు స్వతంత్రంగా చిన్న గ్రూపులుగా విడిపోయి సంప్రదించుకోవడం, తమ సొంత ప్రశ్నలను రూపొందించుకోవడం, ఏ ప్రశ్న ఎవరు వేయాలి అని నిర్ణయించుకోవడం జరిగిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొన్ని ప్రాంతాలకు చెందిన తెలుగులో ఒక ఫెసిలిటేటర్ ధారాళంగా మాట్లాడలేక పోయారు. దీనివల్ల అనువాదాల్లో, చిన్న గ్రూపు చర్చల్లో అపార్థాలకు ఆస్కారం ఏర్పడింది. ఇది చిన్న సమస్యే అయినప్పటికీ, సమావేశకర్తలు తమ పని విభజనను మార్చుకుని, రెండో రోజు నుంచి తెలుగులో ఎక్కువ ధారాళంగా మాట్లాడగలిగే వారిని ప్రధానపాత్ర వహించమని కోరారు. చెప్పినదానికి జ్యూరీ సభ్యులు బాగా అర్థం చేసుకుంటేనే ఫెసిలిటేషన్ విజయవంతం అవుతుందని అందరూ గుర్తించారు. అనువైన టెక్నాలజీ అవసరం ఏమిటో మొదటిరోజే తెలిసి వచ్చింది. ప్రశ్నలు - జవాబులు సెషన్‌లో మైక్రోఫోన్‌ను ఫిక్స్‌చేసి ఉంచడం వల్ల అందుకు అనుగుణంగా వ్యవహరించవలసి వచ్చింది. రెండో రోజు నుంచి నాలుగు మొబైల్ మైక్‌లను తీసుకురావడంతో, జ్యూరీ పోడియం మీద రకరకాలుగా కూర్చోవడం మొదలు పెట్టారు. స్పెషలిస్టులతో జ్యూరీ సభ్యులు అప్పటికప్పుడు స్పందించడానికి, ప్రశ్నలు వేయడానికి మొబైల్ ఫోన్ సదుపాయంగా ఉండింది.

అనువైన వాతావరణాన్ని కల్పించడానికి సమావేశకర్తలు తీసుకుంటున్న చొరవను పర్యవేక్షక బృందం, ఇతర పరిశీలకులు కూడా గమనించారు. సమావేశకర్తలు తమ పట్ల చూపిస్తున్న గౌరవానికి జ్యూరీ సభ్యులు చలించిపోయారు. జ్యూరీ సభ్యుల్లో విశ్వాసం, నిర్మాణాత్మక ఉత్సాహం ఏర్పడడానికి సమావేశకర్తల దోహదం ఎంతో ఉన్నది. ఈ విషయంలో ఫెసిలిటేషన్ ఉత్తమంగా ఉన్నది. దళితులు, ఆదివాసీలు, చిన్నరైతులు వంటి దీర్ఘకాలంగా అణగారిన, అప్రధానం చేయబడిన గ్రూపులతో పని చేసేటప్పుడు, వారి పట్ల నిజాయితీగా, మనసావాచాకర్మణా గౌరవం చూపించే సమావేశకర్తల మీదనే ఆధారపడాలి. అప్పుడే సాధారణ వృత్తిపరమైన పద్ధతులను మార్చవచ్చు. (చాంబర్స్ 1993, 1997)

అనేక అంశాల మీద గుర్తించదగిన ఏకాభిప్రాయం జ్యూరీ సభ్యులలో రూపొందింది. ప్రాధాన్యాలలో కొన్ని తేడాలు ఉండవచ్చు. వేరువేరు వ్యవసాయ పర్యావరణ మండలాలలోని వారి మధ్య ముఖ్యంగా మెట్ట వ్యవసాయంలో ఉన్నవారికి, సాగునీటి ప్రాధాన్యాలు కనిపించవచ్చు. మరింత సమయం ఉండి ఉంటే ఈ విభేదాలను కూడా తగ్గించడం సాధ్యపడేది. సమయం లేకపోవడం వల్ల ఎక్కువ మంది అంగీకరించిన సిఫారసులనే సూచించమని జ్యూరీ సభ్యులను సమావేశకర్తలు సూచించారు.

## 4.4 వివిధ రకాల నియంత్రణలు

వచ్చే 20 సంవత్సరాలలో ఆహార ఉత్పత్తి, పంపిణీ, మార్కెటింగ్‌లలో మౌలికమయిన మార్పులు తేవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. దీని ఫలితంగా ఆహార, వ్యవసాయ భవితవ్యాల గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలు చర్చనీయాంశాలయ్యాయి. పౌర జ్యూరీలో ప్రతిపాదించిన అంశాలు కూడా ఇంతే చర్చనీయాంశాలు.

(అనుబంధం 1) అందువల్ల ఈ సంప్రదింపుల విధానాలు అన్నీ కూడా పారదర్శకంగా ఉండడము, వేరువేరు సామాజిక లక్ష్యాలు, ప్రయోజనాలు ఉన్న సంస్థల ప్రతినిధుల నియంత్రణలో ఈ ప్రక్రియలు జరగడమూ చాలా ముఖ్యం.

ఆంధ్రప్రదేశ్ ఆహార, వ్యవసాయ భవితవ్యాల మీద జరిగిన పౌర జ్యూరీలో కనీసం మూడు స్థాయిల్లో ఈ పారదర్శక నియంత్రణ, ఎకౌంటబిలిటీ ఉండేటట్టుగా ప్రయత్నం జరిగింది.

### 1. పర్యవేక్షక బృందం (ఓవర్ సైట్ ప్యానెల్)

ఈ ప్యానెల్‌కి ఒక స్పష్టమైన బాధ్యత ఉన్నది. ప్రజాతీర్పులో న్యాయం, అనేక అభిప్రాయాలకు ఆస్కారం ఉండడం, ప్రజాతీర్పు విశ్వసనీయతను కాపాడడం, ఈ ప్యానెల్‌లో పౌర సమాజం ప్రతినిధులు, ఇండియన్ సివిల్ సర్వీసు ప్రతినిధులు, అంతర్జాతీయ దాత సంస్థల ప్రతినిధులు, ఆదివాసీ ప్రజల గ్రూపుల ప్రతినిధులు ఉన్నారు. (అనుబంధం 3 చూడండి) ఈ ప్యానెల్‌లో డిఎఫ్ఐడి ప్రతినిధులని, కార్పొరేటు రంగం ప్రతినిధులని కూడా చేర్చాలని ప్రయత్నం జరిగింది. దురదృష్టవశాత్తూ డిఎఫ్ఐడి కానీ ఇండియన్ టుబాకో గ్రూపు కానీ మా ఆహ్వానాన్ని అంగీకరించలేకపోయాయి. అయినా కూడా పర్యవేక్షక బృందం వివిధ రకాల ప్రయోజనాలకి ప్రాతినిధ్యం వహించింది. ఈ ప్యానెల్ అధ్యక్షులు రిటైర్డ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి. పక్షపాతాలు ఉండే అవకాశాన్నీ, కార్యక్రమం తీరులో క్రమం లోపించే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని మొత్తం ప్రక్రియను పర్యవేక్షక బృందం పర్యవేక్షించింది. ప్రతిరోజూ కూడా ఐఐఇడి, ఐడిఎస్ ప్రతినిధులు పౌర జ్యూరీ పనిపద్ధతి గురించి పర్యవేక్షక బృందంతో చర్చలు జరిపారు. వివిధ రకాల ప్రాతినిధ్యాలకి ఆమోదనీయతని సాధించడం ఈ చర్చల ద్వారా సాధ్యమైంది.

### 2. మీడియా పర్యవేక్షకులు, విలేకరులు

ప్రజాతీర్పు విచారణని, తీరు&ఎపని డాక్యుమెంటు చేయడానికి సమాచార, ప్రసార సాధనాలని ఆహ్వానించారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్', 'టైమ్స్ ఆఫ్ ఇండియా', 'హిందూ' 'దక్కన్‌క్రానికల్' పత్రికలు విలేకరులును పంపించాయి. ఈ విలేకరులు ప్రజాతీర్పు ప్రక్రియను వివిధ స్థాయలలో చూసి, వార్తలు రాశారు. వివిధ తెలుగుపత్రికలు కూడా ఆహ్వానించినా మెదక్ జిల్లాకు వారు తమ విలకరులను పంపించలేపోయారు. స్టార్‌న్యూస్, దూరదర్శన్ ఈ రెండు చానెల్స్ ఈ కార్యక్రమానికి హాజరయ్యాయి. దూరదర్శన్ ఈ ప్రక్రియ ఆరంభం నుంచి మొత్తం మూడుసార్లు, ఆరంభంలోను, మధ్యలోను చివరా కూడా చిత్రీకరణకు, జ్యూరీ సభ్యులను ఇంటర్వ్యూ చేయడానికి వచ్చింది. వార్తా ప్రసార సాధనాలు, పత్రికా ప్రతినిధులు ఈ ప్రక్రియను గమనిస్తూ ఉండడం కూడా పారదర్శకతకు అవసరమైన నియంత్రణగా పనిచేసింది. జాతీయ పత్రికల్లో వెలువడ్డ కథనాలు/వార్తలూ కూడా ప్రజాతీర్పు ప్రక్రియ విశ్వసనీయతను పెంచాయి. చర్చలన్నీ పక్షపాతరహితంగా జరిగి తీర్పు వెలువడడానికి దోహదం చేశాయి. ఆసక్తికరంగా జ్యూరీ సభ్యులతో ముందే తయారుచేసిన సమాధానాలు చెప్పించారని ఎలా అయినా నిరూపించడానికి ఒక చిన్న ప్రతినిధుల బృందం ప్రయత్నించింది. కానీ వాళ్ళు జ్యూరీ సభ్యులని ఇంటర్వ్యూ చేస్తున్నప్పుడు ఈ అభిప్రాయానికి బలమైన వ్యతిరేకత వచ్చింది. జ్యూరీ సభ్యురాలు బేబీ మాటల్లో "ఇది మా చావుకి బతుక్కి సంబంధించిన సమస్య. మేం ఏం చెప్పాలో మాకు మరెవర్నీ చెప్పనీయం".

### 3. నిశ్శబ్ద పరిశీలకులు

చాలామంది ఇతర పరిశీలకులను కూడా ఆహ్వానించడం జరిగింది. సాక్ష్యాలు, జ్యూరీచర్చలు సాగుతున్నప్పుడు మౌనంగా ఉండడానికి అంగీకరించి వాళ్లందరూ వచ్చారు. ఈ పరిశీలకులలో రైతులు, ఎన్జీవో ప్రతినిధులు, కార్పొరేట్ రంగం ప్రతినిధులు ఉన్నారు. ఇందులో చాలా మంది రెండు మూడు రోజులే ఉన్నారు. కొంతమంది మాత్రం పూర్తి ప్రక్రియలో పాల్గొన్నారు. అందరూ కూడా జ్యూరీ విధానం బలాల మీద, బలహీనతల మీద తమ అభిప్రాయాలని పర్యవేక్షక బృందంతోను, సమన్వయ కర్త బృందంతోను, వార్తాపత్రికలతోను పంచుకున్నారు. ఈ నిశ్శబ్ద పర్యవేక్షకులు 'ప్రజాతీర్పు' పారదర్శకత పెంచడానికి మరింత తోడ్పడ్డారు.

ధనసహాయం అనేక మార్గాల ద్వారా రావడం కూడా ప్రజాతీర్పు మీద బహుళ నియంత్రణ ఉండడానికి దోహదం చేసింది. వేరు వేరు ప్రయోజనాల్నువారు, వేరువేరు టెక్నాలజీలను సమర్థించే వారు ఈ కార్యక్రమానికి ధనసహాయం చేశారు. అందువల్ల బహుళ అభిప్రాయాలకు ప్రజాతీర్పు వేదిక కాగలిగింది. ప్రజాతీర్పు ప్రక్రియకు ఈ కింది సంస్థల నుంచి సహాయం తీసుకోవడం జరిగింది.

- నెదర్లాండ్స్ ప్రభుత్వ ఓవర్‌సీస్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (డిజిఐఎస్). ఈ సహాయం ఐఐఇడి లోని సస్టెయినబుల్ ఎగ్రికల్చర్ అండ్ రూరల్ లైవ్‌లీహుడ్స్ ద్వారా వచ్చింది.
- ఐడిఎస్ ఎన్విరాన్‌మెంట్ గ్రూపు ద్వారా రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ నిధులు
- ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య పరిరక్షణా సంఘటన
- అఖిల జీవవైవిధ్య వ్యూహ కార్యాచరణ ప్రణాళిక

దాదాపు 65 శాతం నిధులు డిజిఐఎస్ నుంచి వచ్చాయి. రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ 30 శాతం నిధులు సమకూర్చింది. జాతీయ స్థాయి భాగస్వాముల నిధులు తక్కువే అయినా (సుమారు 5 శాతం) వాళ్ల మానవశ్రమ, ఇతర సేవలు మొత్తం ప్రక్రియలో నిర్ణయాత్మక పాత్ర పోషించాయి. ప్రజా తీర్పు ప్రక్రియకి బలమైన స్థానిక, జాతీయ నియంత్రణని అందించడం ద్వారా ఇది సాధ్యమైంది.

## 4.5 సమస్యలను చూసే చట్రం, పరిధి

డిప్స్ ప్రక్రియ వ్యక్తిగత విషయాలకు మించి విస్తృత అంశాలను చర్చించడానికి ఎంతవరకు ఉపయోగపడుతుంది? అవి ప్రత్యామ్నాయాలుగాను, సామాజిక న్యాయ దృక్కోణాలుగాను ఉండగలవా అనే అంశం డిప్స్ ఏ మేరకు ప్రజాసాధికారతను సాధించగలవు అన్న అంశం మీద ఆధారపడి ఉంటుంది. ఈ ప్రక్రియలన్నీ స్థిరపడి ఉన్న అధికార నిర్మాణాలకు మరింత ఆమోదం ఇవ్వడానికి, వారి సాంకేతికతలను సమర్థించడానికి, వాళ్ల విధాన కార్యక్రమాలను సమర్థించడానికి పనికివచ్చేవా, ప్రజలకు సాధికారతను కల్పించేవా అన్నదాని మీద డిప్స్ ప్రయోజనం ఆధారపడి వుంటుంది. సమాచారం ఆధారంగా నడిచే చర్చలు, సాక్ష్యాలు, ప్రశ్నలు కూడా పౌరులు భవిష్యత్తు గురించిన తమ సొంత విజన్‌లు రూపొందించుకోవడానికి ఎంతవరకు అవకాశం ఉంది అనే అంశాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రజాతీర్పు ప్రక్రియ చాలా భాగస్వామ్య పద్ధతుల కంటె భిన్నంగా జ్యూరీ సభ్యులు ప్రతిపాదిత వ్యవసాయ సాంకేతికతని ఒక విస్తృత సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యంలో చూసే అవకాశం కల్పించింది. భూకమతాల స్థిరీకరణో, జన్యుమార్పిడి పంటలలో, అటవీ ఉత్పత్తుల్లో - ఏదో ఒక విషయం మీద దృష్టి కేంద్రీకరించడం కాకుండా, సాక్ష్యాలు, వాటి నుంచి జరిగిన చర్చలు కూడా గ్రామీణ జీవనాధారాలకు సంబంధించిన వివిధ అంశాలని జ్యూరీ సభ్యులు చర్చించారు. ఈ అంశాలన్నీ ముఖ్యమైనవని జ్యూరీ సభ్యులు భావించారు. ఇంతకు ముందు ఇలాంటి ప్రక్రియలని నిర్వహించినప్పుడు అనుభవంలోకి వచ్చినట్టే ఇప్పుడు కూడా స్పెషలిస్టుల కంటె స్పెషలిస్టులు కాని వాళ్లు వివిధ రకాల అంశాలను లేవనెత్తగలిగారు. గతంలో జరిగిన ఇటువంటి కార్యక్రమాలలో లాగానే ప్రజాతీర్పులో కూడా స్పెషలిస్టులు, విధానకర్తల కంటె సాధారణ ప్రజలు వ్యక్తం చేసిన ఆసక్తులే ఎక్కువ వైవిధ్యంతో ఉన్నాయి. వివిధ శాస్త్ర రంగాల మధ్య ఉన్న సరిహద్దులను పెద్దగా పట్టించుకోకుండా ప్రజలు చేసే చర్చలు ఎక్కువ అవగాహనతో, విశాలదృష్టితో ఉంటాయి. వివిధ విషయాల మధ్య ఉండే సరిహద్దుల వల్ల మసకబారే అంశాలు కూడా ఈ వైఖరి వల్ల సుస్పష్టం అవుతాయి. ఆహార, వ్యవసాయ రంగ భవితవ్యాల గురించి మూడు ఊహాచిత్రాలు మూడు స్పష్టమైన అభిప్రాయలను చిత్రీకరించినా, సమావేశకర్తలు వీటిని ఒక విస్తృత చర్చకు ప్రేరణగా మాత్రమే వాడుకునే వారు. ఏదో ఒక భవిష్యత్ ఊహాచిత్రాన్ని ఎంచుకొమ్మని కోరలేదు.

వివాదాస్పదమైన జన్యుమార్పిడి పంటల వంటి అంశాలలో జీవసాంకేతికత, కార్పొరేటు నియంత్రణ, స్థానిక అధికార వ్యవస్థలు - వీటి మధ్య ఉన్న సంబంధం అర్థం చేసుకోవడానికి ఊహాచిత్రాల పద్ధతి ఉపయోగకరం. జన్యుమార్పిడి టెక్నాలజీని మీరు అంగీకరిస్తారా అంగీకరించరా అని అడగడం కంటె కూడా సినేరియా పద్ధతి ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది. ప్రజాతీర్పు ప్రక్రియలో జ్యూరీ సభ్యులు మూడు ఊహాచిత్రాలను పోల్చి చూసుకోగలిగారు. ప్రతి ఊహాచిత్రం కూడా కొన్ని పరస్పరాధారిత విలువలకు, ఊహలకు, అంచనాలకు ప్రతిరూపం. ఊహాచిత్రాలు ఒకదానితో ఒకటి విభేదిస్తున్నాయి. కాని ఊహాచిత్రాల ప్రక్రియలోని దృశ్యాల వల్ల జ్యూరీ సభ్యులు వాటిని మూల్యాంకనం చేయగలిగారు. ఈ విధంగా జన్యు మార్పిడి పంటలని కేవలం ఒక అంశంగా కాక అవి ఒక విశాల చట్రంలోనో లేదా అభివృద్ధి నమూనాలోనో భాగంగా చర్చించడం జరిగింది. అధికోత్పత్తి విత్తనాలతో వాళ్లకున్న అనుభవంతో వాళ్లు జన్యుమార్పిడి పంటలు పురుగుమందులు అవసరం లేకుండా చేస్తాయనే అంశాన్ని విమర్శించారు. "అదే నిజమైతే పురుగు మందుల కంపెనీలు జన్యుమార్పిడి పంటని ఎందుకు రానిస్తాయి?" అని ఒక జ్యూరీ సభ్యురాలు ప్రశ్నించింది.

మూడు వీడియోలు కూడా భవిష్యత్తుకి సంక్షిప్త రూపాలు. ఎగుమతి ఆధారిత సహజ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌ని సూపర్ మార్కెట్లు హస్తగతం చేసుకుంటాయని రెండవ సినేరియా చూపిస్తోందని, కానీ అధికంగా ఉన్న ఉత్పత్తినే ఎగుమతి చేయవచ్చని ప్రతిపాదించవచ్చని అప్పుడు మార్కెట్ల మీద ఆధిపత్యం స్థానికుల చేతుల్లోనే ఉంటుందనీ డాక్టర్ డేనియల్ సూచించారు. వీడియోల మీద ఇటువంటి స్పందనలు చర్చల పరిధిని పెంచడానికి ఉపయోగించాయి. ఆహార, వ్యవసాయ భవితవ్యాల మీద వివిధ దృశ్యాలని చూపించడం ద్వారా వీడియో చర్చలను మరింత ప్రయోజనకరం చేశారు. ఆలోచనలను ప్రేరేపించడం, ఏ ఏ అంశాలకు సంబంధం ఉన్నదనే అంశాలను స్ఫురింపజేయడం వీడియోలు చేయగలిగాయి. పర్యవేక్షక బృందం సభ్యుడు నాయుడు మాటల్లో:

ఆహార వ్యవసాయ భవితవ్యాల మీది మూడు వీడియోలు కూడా కొన్ని విధాన నిర్ణయాల ఫలితాలను చాలా ఎక్కువ చేసి చూపించాయి. ఇది ఒక వ్యంగ్య చిత్రం లాంటిది. కానీ ఇది అవసరం. జ్యూరీ సభ్యులకు వాస్తవపరిస్థితిని కళ్లకు గట్టడానికి ఇది అవకాశం కల్పిస్తుంది.

## 4.6. ప్రక్రియ-సందర్భం

తక్షణ అవసరాలను మించి నిర్ణయాలు చేయగల రాజకీయ, ఆర్థిక పరిమితుల్లో పనిచేస్తూ, దీర్ఘకాలికంగా ఎదురయ్యే ప్రమాదాలను అందివచ్చే అవకాశాలను పరిశీలించగల సామర్థ్యం పౌరులకి ఉండడం డిప్స్‌ప్రక్రియకు చాలా అవసరం. చర్చాంశాలు చాలా రకాల శాస్త్ర సాంకేతికాంశాలతో కూడి ఉన్నప్పుడు ఇది మరింత ముఖ్యం. వేగంగా పెరుగుతున్న ప్రపంచీకరణ వల్ల డిప్స్‌లో పాల్గొనేవారికి స్థానిక, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంబంధాల గురించి తెలియాలి.

ప్రజాతీర్పు సాక్షుల్లో ఆంధ్రప్రదేశ్ సామాజిక, వ్యవసాయ, పర్యావరణ పరిస్థితుల గురించి క్షుణ్ణమైన అవగాహన ఉన్నవాళ్లు ఉన్నారు. అలాగే, జీవనాధారాల మీద ప్రపంచ ఆర్థిక వాణిజ్య సంబంధాల ప్రభావం గురించిన స్పెషలిస్టులూ ఉన్నారు. జ్యూరీ సభ్యులకి ప్రపంచ పెట్టుబడుల గురించి ఎంత తెలుసో మాలిక్యులర్ బయాలజీ గురించి, జన్యుమార్పిడి పంటల గురించి తప్ప, అంతే తెలుసు. అయినా కూడా రైతులు తమ స్థానిక పరిస్థితులకి బహుళజాతి కంపెనీల శక్తులకీ మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోగలిగారు. అందువల్లే వాళ్ల తీర్పులో ముందు మొక్కలు, ఆహార పంటల ఎగుమతి లాంటి పెద్ద విషయాలు మాట్లాడగలిగారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విజన్ 2020 ఇరవై సంవత్సరాలకి సంబంధించిన డాక్యుమెంటు కావడం వల్ల, ఫలానా ఎంపిక దీర్ఘకాలికంగా ఎటువంటి ప్రభావం వేస్తుంది వంటి చర్చకు ఆస్కారం కలిగింది. రేషన్‌కార్డులు, గోల్డెన్‌రైస్‌లాంటి ప్రత్యేక విధానాంశాలకు కట్టుబడిపోకుండా జ్యూరీ నుంచి పెద్ద రైతులకు ప్రాతినిధ్యం వహించే ఒక బలమైన రైతు సమాఖ్య అధ్యక్షుడు. సమన్వయ బృందం ఆయనను ఒప్పించి ప్రశ్నల సమయం వరకు ఉండేలా చేసింది కానీ, ఆయనకు కింది కులాల వ్యక్తులతో సంభాషణ మీద నమ్మకం లేదని చాలా మంది జ్యూరర్లకు అర్థమైపోయింది.

కొందరు స్పెషలిస్టు సాక్షులు చెప్పిన అంశాలు, లేదా ఆ సాక్షులు చెప్పిన అంశాల అంతరార్థాలు తమను తక్కువ చేసినట్టు జ్యూరీ సభ్యులు కొన్ని సందర్భాలలో ఫీలయ్యారు. సాక్షులు చేసిన అనేక వ్యాఖ్యలు, వారి వైఖరులు అంతస్తుల అధికార సంబంధాలను ప్రతిఫలించాయి. ఆ వైఖరులను స్థూలంగా టెక్నోక్రాటిక్ వైఖరులుగా పిలవవచ్చు (ప్రత్యేక ఉదాహరణల కోసం బాక్స్ 7 చూడండి)

ఈ సంఘటనలు మినహా, మొత్తం మీద ప్రజాతీర్పు చర్చలు జూరర్లు అర్థవంతంగా పాలు పంచుకోవడానికి వీలుగా, పరస్పర అనుకూలమైన సంబంధాల మధ్య, ఎటువంటి తారతమ్యాలు లేని వాతావరణంలో జరిగాయి. పర్యవేక్షక బృందం సభ్యుల అభిప్రాయాలు చూడండి:

నాయుడు: జ్యూరీ భాగస్వామ్యం చాలా ప్రోత్సాహకరంగా ఉన్నది. వారు వెంటవెంటనే స్పందించారు.

సావిత్రి: స్త్రీ జ్యూరర్లు దృఢంగా ఉన్నారు. సమావేశాల నిర్వహణలో, సమాచారాన్ని ఇతరులతో పంచుకోవడంలో వారు చాలా విశ్వాసంతో మెలిగారు.

జస్టిస్ సావంత్: ఈ రైతులు ఇంతబాగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం నాకు చాలా ఆనందం కలిగించింది. ముఖ్యంగా స్త్రీ భాగస్వామ్యం బాగుంది. వీరందరూ ప్రభుత్వ విధానకర్తలను ముప్పుతిప్పలు పెట్టారు.

సభ్యులు ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యాలయిన “30 శాతం మందిని భూముల నుంచి, ముఖ్యంగా చిన్నసన్నకారు రైతులను, నిర్వాసితులను చేయడం గురించి” చర్చించారు.

## 4.7 అంతస్తులు, సొంత సెన్సార్‌షిప్

మన దేశంలో మామూలుగా ఎక్కువ సామాజిక స్థాయి నుంచి వచ్చినవాళ్లు చర్చలలో ఎక్కువగా పాల్గొంటారనీ, అదే తక్కువ స్థాయి కులాలనుంచి వచ్చినవాళ్లు చర్చలలో పాల్గొనడానికి జంకుతారనే అభిప్రాయం ఉంది. ప్రజాతీర్పు ప్రక్రియలో పాల్గొన్న తెలుగు వాళ్లందరికీ స్పష్టంగా కనిపించేదేమిటంటే, చర్చలలో పాల్గొనడంలో ఈ సామాజిక స్థాయి ఏ విధంగానూ అడ్డు కాలేదని, జాగ్రత్తగా జరిగిన జ్యూరీ సభ్యుల ఎంపికలో గ్రామీణ ప్రాంతాల వారు అత్యధికంగా ఉండేట్టు, వారిలో మహిళలు, ఆదివాసీలు, దళితులు ఎక్కువగా ఉండేటట్టు చూశారు. జ్యూరీ సభ్యుల్లో ఒక్కరు మాత్రమే పట్టణ ప్రాంతం నుంచి, ఎక్కువ కులం నుంచీ వచ్చారు. జ్యూరీలో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ. సాధారణంగా స్త్రీల విషయంలో చూపే వివక్షకు వ్యతిరేకంగా చూపించిన సానుకూల వివక్ష జ్యూరీ సభ్యుల మధ్య సంబంధాలను పెంపొందించే ఎక్సర్‌సైజులు కూడా చాలా ఉపయోగంగా ఉన్నాయి. అణగారిన ప్రజల గ్రూపులతో పనిచేయడంలో వృత్తిపరమైన నైపుణ్యం కలిగిన సమావేశకర్తలు జ్యూరీ సభ్యులతో ఒకరోజంతా గడిపారు.

ఫలితంగా జ్యూరీలో గ్రూపు సంబంధాలు సమానత్వ ప్రాతిపదికమీద, పరస్పర గౌరవ సహకారాల మీద నిలబడ్డాయి. కాస్త ఎక్కువ అక్షరాస్యులయిన మగవాళ్లు కానీ, స్త్రీలు కానీ పెత్తనం చేయడమో, జ్ఞానాన్ని ప్రదర్శించడమో చేయలేదు. అలాగే బ్రాహ్మణకులానికి చెందిన జ్యూరర్ కూడా ఎటువంటి ఎక్కువ ప్రభావాన్ని ప్రదర్శించలేదు.

మొత్తం ప్రజాతీర్పు ప్రక్రియ జరిగినన్ని రోజులూ జ్యూరీ సభ్యులు ఎంతో సానుకూలతతో, ఒకరికొకరు మద్దతుతో వ్యవహరించారని సమావేశకర్త కవితా కురుగంటి వ్యాఖ్యానించారు.

తమలో కొందరు ఎక్కువ మాట్లాడుతున్నారని, కొందరు ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉంటున్నారని రెండు రోజుల తరువాత జ్యూరీ సభ్యులు గుర్తించారు. బాగా మాట్లాడేవారు కొందరు ఈ సంగతిని గమనించి, తక్కినవారిని కూడా మరునాడు రంగంలోకి లాగుదామని నిర్ణయించుకున్నారు. వాళ్లొక నియమం పెట్టారు. మాట్లాడకుండా ఉన్నవారికి ఆ రోజు మొదట మాట్లాడే అవకాశం ఇస్తామని. అది పని చేసింది. మూడో రోజు చూస్తే, జ్యూరీ సభ్యులందరూ మాట్లాడుతూనే ఉన్నారు. తమ సంభాషణను తామే నిర్వహించుకుంటున్నారు కూడా.

జ్యూరర్లు తమలో తాము సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారు, ఒకరినొకరు

## బాక్స్ 7. టెక్నికల్ బుర్రలు

కొంత మంది నిపుణులతో నేను మాట్లాడినప్పుడు వాళ్లు ప్రధానంగా టెక్నోక్రాట్స్ (సాంకేతిక నైపుణ్యమే సర్వస్వం అని నమ్మి, అటువంటి నైపుణ్యం కలిగిఉన్నందుకు తమను తాము అధికంగా భావించుకునేవారు) అని అనిపించింది. సమస్యలనెప్పుడు వాళ్లు సాంకేతిక అంశంగానే అర్థం చేసుకుంటారు. సమస్యకొక సామాజిక కోణం ఉంటుందని కాని సమస్యల వల్ల ఉత్పన్నమయ్యే ఇతర సమస్యల గురించి కాని వాళ్లకు తెలియనే తెలియదు. ఎప్పుడైనా వీటి గురించి ఆలోచించారా అని అడిగితే వాళ్లు 'లేదు' అని చెబుతారు. దీన్ని పట్టించుకోవలసిన అవసరం చాలా ఉంది.

ఈ అభిప్రాయాన్ని జస్టిస్ సావంత్ వ్యక్తపరచారు. జ్యూరీ సభ్యుల అవగాహన, సమగ్ర దృష్టికోణంతో కొంతమంది సాక్షుల సంకుచిత టెక్నోక్రాట్ మనస్తత్వాన్ని పోల్చినప్పుడు ఆయనకి ఈ అభిప్రాయం కలిగింది. కొంతమంది సాక్షులు వాళ్ల టెక్నోక్రాట్ మనస్తత్వాన్ని మర్యాద చాటున దాచుకున్నా, వాళ్లు తాము ప్రశ్నించడానికి వీల్లేని నిజాలని జ్యూరీ సభ్యులు తెలుసుకోవాలని అది తెలియజేయడానికి వచ్చామని భావించారు.

ఒక జ్యూరీ సభ్యురాలు జన్యుమార్పిడి పంటల గురించి ప్రశ్నించినప్పుడు డాక్టర్ దాస్‌గుప్తా స్పందించిన పద్ధతిలో అది స్పష్టంగా కనిపించింది. ఉదాహరణలతో కూడా స్పష్టంగా జ్యూరీ సభ్యురాలు విషయాన్ని పాయింట్ అవుట్ చేస్తే దాస్ గుప్తా మాత్రం తను చెప్పిన విషయాన్ని జ్యూరీ సభ్యురాలికి అర్థమే కాలేదన్నట్టు మాట్లాడతారు.

థాంక్యూ, ఒక విషయం నేనే చెప్పడానికి ప్రయత్నిస్తున్న విషయంలో మీకు ఏమీ అర్థం అయిందో నాకు అర్థం కావడం లేదు. నేను చెప్తోందేమిటంటే ఒక విజ్ఞానశాస్త్రం ఏ విధంగా అభివృద్ధి చెందింది, ఒక ప్రత్యేక సాంకేతికత ఏ విధంగా పెరుగుతోంది అనే విషయం. మీకు నేను చెప్పేది పూర్తిగా అర్థమయినట్టు లేదు.

శాస్త్రవిజ్ఞానం మీద ప్రజాఅవగాహనను పెంచే సాంకేతిక చర్చల మీద జరిగిన అధ్యనాలు ఈ ధోరణిని 'కొరత మోడల్'గా అభివర్ణించాయి. ప్రభుత్వాలు, కార్పొరేషన్లు పౌరులతో మాట్లాడేటప్పుటు ముఖ్యంగా ఆ విషయాల్లో సాంకేతిక పరిజ్ఞానం ముఖ్యమైనప్పుడు ఈ ధోరణి అన్ని సంబంధాలలోను విస్తరించి ఉంటుంది. (ఇర్విన్ అండ్ వైన్ 1996)

ఈ 'కొరత మోడల్' ఏమిటంటే సమాచార సాంకేతికత కానీ, జన్యుమార్పిడి పంటలు కానీ ప్రభుత్వ అభివృద్ధి విధానాల గురించి ప్రజలకు సరయిన సమాచారం లేకపోవడం వల్లనే భయాలు ఏర్పడతాయన్న వాదం. విధాన చర్చలో ప్రజలు పాల్గొనాలంటే వాళ్లకి సరయిన, సరిపడా సమాచారం ఉండాలనేది ఈ వాదన సారాంశం. వాళ్లకి ఈ సమాచార లోపం అనేది పూరించబడ్డప్పుడు ప్రజలు ఈ కొత్త పరిణామాల గురించి ఎక్కువ భయపడరు.

ప్రభుత్వ శాస్త్రవేత్తలు తన ట్రాన్స్‌నేషనల్ కార్పొరేషన్లు కూడా ఏమాత్రం పొరపాటు జరగని పద్ధతుల్లో టెక్నాలజీ అభివృద్ధి చేస్తారనీ తప్పంతా రైతులదీ, సంబంధిత విస్తరణాధికారులదీనని డాక్టర్ దాస్‌గుప్తా స్పష్టంగా అనుకుంటారు.

పంట కోయడానికి ముందు పురుగుమందులు వాడడం మానేయండి. అట్లా అయితే మనం ఆ పంటని బయటి దేశాలకు ఎగుమతి చేసేటప్పుడు అందులో పురుగు మందుల అవశేషాలు ఉండవు. లేకపోతే, వాళ్లు పురుగు మందుల అవశేషాలు ఉన్నాయని ఆ పంటలని తిరస్కరిస్తారు. మనం నేర్చుకోవాల్సినవి ఇటువంటి విషయాలు, టెక్నాలజీ సరయింది కాకపోవడం కాదు, మనం దాన్ని వాడుతున్నాము, ఎవరూ దాని గురించి మనకు చెప్పలేదు. ఇది వ్యవసాయ నిపుణుల తప్పు. విస్తరణాధికారులు మీకు ఆధునిక సాంకేతికతని ఎట్లా వాడుకోవాలో చెప్పాలి. వాళ్లు మీదకు విషయాలు పూర్తిగా చెప్పలేద... అంటే ఎలాంటి భద్రతాచర్యలు తీసుకోవాలి, ఎంత పరిమాణంలో వాడాలి లాంటివి మనం నేర్చుకోవాలి. అంతే తప్ప మొత్తం టెక్నాలజీయే తప్ప అని అనుకోకూడదు.

టెక్నోక్రాట్స్ స్టైల్లోని సాక్షులు జ్యూరీ సభ్యులతో వ్యవహరించిన తీరులో కనిపించిన మరొక అంశం స్పష్టంగా ఓవర్‌సైట్ ప్యానెల్ దృష్టిలోకి వచ్చింది. ఏమిటంటే ఈ టెక్నోక్రాట్స్ ప్రశ్నలు అడిగే వాళ్లని బుజ్జగిస్తున్నట్టు మాట్లాట్టమూ, అవమానిస్తున్నట్టు మాట్లాట్టమూ లేదా, ఉద్దేశ్యపూర్వకంగా ప్రశ్నని దాటవేయటమూ. అక్కల రావుకి ఇద్దరు జ్యూరీ సభ్యులకి మధ్య జరిగిన సంభాషణ దీనికి మంచి ఉదాహరణ:

అమ్మాజీ: ఎరువులు, పురుగుమందులు వాడవద్దని చెప్పారు. వాటికి మేము అలవాటు పడ్డాము. మా భూములు కూడా అలవాటు పడ్డాయి. మేము వాటిని వాడకపోతే పంటలు పండవు. సహజ వ్యవసాయం చేయాలంటే భూమిని తయారు చేయడానికి సమయం పడుతుంది. అప్పటిదాకా మేము బతికేది ఎట్లా?

జవాబు: నీకు జ్వరం వస్తే రెండురోజులు ఏం తినవు. రెండు రోజులు తినకపోతే చచ్చిపోవు కదా, చస్తామా చెప్పు. పూర్తిగా ఎరువులు మానేయమని మేము నీకు చెప్పడం లేదు. అవసరమైనంతే వాడమని చెబుతున్నాము... మీ భయాల్ని పరీక్ష చేయించుకుని కావలసినంత వాడు.

జ్యూరీ సభ్యుల భయసందేహాలకి జవాబు చెప్పకుండా ఉండడానికి టెక్నోక్రాట్స్ అనుసరించే మరొక టెక్నిక్ ఏమిటంటే, అది మా డిపార్టుమెంట్‌కు సంబంధించిన విషయం కాదు అని దాటవేయడం. అడిగిన సందేహాలను సరిగా నివృత్తి చేయకుండా, అక్షలరావు, తనను ప్రశ్నిస్తున్నవారిని వేరే డిపార్టుమెంటు అధికారినీ కనుక్కోమని విదిలించడమో, లేదా వ్యవసాయం దైవాధీనమని చెప్పి చేతులు దులుపుకోవడమో చేశారు.

రామయ్య: వరదలొచ్చి మా ప్రాంతంలో అన్నీ కొట్టుకు పోయాయి. వరదల వల్ల మాకు చాలా సమస్యలు వచ్చాయి. ఎన్ని సార్లు వేడుకున్నా కనీసం స్థానిక అధికారులు కూడా మా ప్రాంతానికి రాలేదు. ఇంత బాధ్యతారహితంగా వాళ్లెందుకు ప్రవర్తిస్తున్నారు?

అక్షలరావు: ఈ విషయం వ్యవసాయ శాఖ పరిధిలోకి రాదు. జిల్లా కలెక్టరు, రెవిన్యూ డిపార్ట్‌మెంట్ దీనికి బాధ్యులు. మేం నీకు విత్తనాలు, ఎరువులు ఇస్తాం. నాకో ఉత్తరం రాసివ్వు, నేనది ప్రభుత్వానికి పంపిస్తాను.

అనందమ్మ: మీరు మాకు విత్తనాలు ఇవ్వవచ్చు. వానలు కురవకపోతే పంటరాదు. ప్రభుత్వం ఏ బాధ్యతా తీసుకోదు. రైతులకి ఏ విధమైన సాయమూ చేయదు. మేమేం చేయాలి?

అక్షలరావు: వానలు మా చేతుల్లో లేవు. వ్యవసాయమే భగవంతునితో జూదం ఆడడం లాంటిది. ఓపిక పట్టడం, వానలకోసం భగవంతుడిని ప్రార్థించడం తప్ప మనం చేయగలిగిందేమో లేదు. మన చేతుల్లో ఏమీ లేదు. అంతా భగవంతుడి దయ.

ప్రొఫెసర్ ఎం.వి.రావు కూడా ఇదే పద్ధతిని అనుసరించారు

విజన్ 2020 ప్రకారం 2007 నాటికి ఆకలినీ, ఆకలి చావుల్నీ లేకుండా చేస్తుంది అని చెప్పాక సాంకేతికేతర విషయాలకి వేటికి ఆయన జవాబు చెప్పలేదు.

వరంగల్ నుంచి వచ్చిన జ్యూరీ సభ్యుడు: మా గ్రామంలో అందరిదీ ఒకే కులం. మేం చేయడానికి ఏ విధమైన పని లేదు. చాలామందిర ఐతులు అప్పుల్లో కూరుకుపోయి ఉన్నారు. మేం అన్నీ పోగొట్టుకుని ఉన్నాము. రెండేళ్ల నుంచీ మేం చేస్తోందల్లా అప్పులు తీర్చడమూ, అప్పుల గురించి ఆలోచించడమూ, ఇప్పుడు మిగిలిందల్లా మనుషులమే. మిగతా అన్నీ పోయినయ్యి. దయచేసి మాకు అందుబాటులో ఉండే విత్తనాలు పంటలు ఇయ్యండి. అప్పులేని ధాన్యం, పెద్ద పెట్టుబడులు అక్కర్లేనీ పంటలు కావాలి.

ప్రొఫెసర్ రావు: కిసాన్ మేళాలకు వెళ్లు. నీ ప్రశ్నలన్నిటికీ జవాబు దొరుకుతాయి.

బేబీ: ఒక వేళ మీరు చెప్పినవన్నీ మేం వింటాము అనుకోండి. మా కమతాలన్నిటినీ ఏకం చేస్తాము. అయినప్పటికీ మేం విత్తనాల మీదే ఖర్చు పెట్టవలసి వస్తుంది. ప్రభుత్వం ప్రొఫెసర్ ఎం.వి.రావు: మీరసలు విత్తనాలు ఎందుకు అమ్ముతారు? మీరు వాటిని తరువాత పంటకు ఉంచుకోవాలి కదా?

బేబి: అమ్మక తప్పదు. వైద్యాలు, వేరే ఖర్చులు ఉంటాయి. మా కింకేమీ వనరులు లేవు. బతకడం కోసం అమ్ముకోక తప్పదు. ఈ విషయంలో ప్రభుత్వం మాకు సహాయం చేయాలి.

ప్రొఫెసర్ రావు: అవన్నీ సామాజిక సమస్యలు.

ప్రభుత్వం నుంచి కార్పొరేటు రంగం నుంచి వచ్చిన సాక్షులు జ్యూరీ సభ్యుల 'అజ్ఞానాన్ని' చిన్నచూపు చూశారు. కొందరు టెక్నోక్రాట్లు వాస్తవాలుగా చెబుతూ అందించిన సమాచారం మాత్రం స్వేచ్ఛగా వ్యాఖ్యానించడానికి అనువుగా ఉన్నది. జన్యుమార్పిడి పంట మీద ఇచ్చిన సాక్ష్యాలను తరువాతి సాక్షులు ఖండించారు. కొన్ని ప్రకటనలు జ్యూరీని తప్పుదోవ పట్టించే అవకాశం కలిగినవి కూడా.

అక్షలరావు ప్రకటన చూడండి:

రెండు రూపాయలకు కిలో బియ్యంతో ఆహారంలో వచ్చిన మార్పుల వల్ల రకరకాల జబ్బులు వస్తున్నాయి. ఎయిడ్స్ కూడా వాటిలో ఒకటి. తరువాత జ్యూరీ సభ్యుల్లో ఒకరు పొగాకు పండించడం మొదలు పెట్టిన తరువాత తమ గ్రామాల్లో కేన్సర్ వ్యాధి పెరిగిందని చెబితే, తాను ఆ విషయం మొదటిసారి వింటున్నానని అక్షలరావు అన్నారు.

వేళాకోళం ఆడుకోవడం, వేరే పేర్లు పెట్టడం, జోకులు వేయడం వంటివి చేశారు. తమలో ఎవరికయినా ఆరోగ్యం బాగాలేకపోతే పట్టించుకున్నారు. వారి నేపథ్యాలన్నీ వేరు వేరు అయినప్పటికీ వారి ఐక్యత ప్రశంసనీయంగా ఉంది.

జ్యూరర్లతో పోల్చినప్పుడు, స్పెషలిస్టు సాక్షులు ఎక్కువ విద్యావంతులు, డబ్బున్నవారు కొందరయితే బలమయిన సంస్థలకు, కులాలకు ప్రతినిధులు. ఇటువంటి అసమాన సంబంధాలున్నప్పటికీ జ్యూరర్లు తొట్రుపడకుండా, గౌరవంగా వ్యవహరించారు. సామాజిక అంతస్తులలో ఉన్న తేడాలను చూపించిన సంఘటనలు కొన్ని జరిగాయి.

1. జ్యూరీని ఉద్దేశించి ప్రసంగించడానికి తనకు ఒక కుర్చీ టేబుల్ కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ శాఖ డిప్యూటీ కమిషనర్ అడిగారు. జ్యూరీ ముందు నిలబడి తమ వాదాన్ని వినిపించాలని, క్రాస్ ఎగ్జామినేషన్‌ను ఎదుర్కొనాలని ముందే తెలిసినప్పటికీ ఆయన అట్లా పట్టుబట్టారు. బ్యూరోక్రాట్ తన స్థానంలో కూర్చుని ఉపన్యాసాలిచ్చే దృశ్యాన్ని ఆయన తిరిగి ఇక్కడ కల్పించి అంతస్తుల అధికారాన్ని ప్రతీకాత్మకంగా ప్రదర్శించారు. జ్యూరర్లు అడిగిన ప్రశ్నకు దురుసుగా, తలబిరుసుగా స్పెషలిస్టు సాక్షులు సమాధానాలు చెప్పిన ఉదంతాలు ఇంకా సీరియస్ ప్రభావం వేశాయి. ప్రమాదకరమైన క్రిమిసంహారకాలు వాడడం వల్ల కలిగే ప్రాణనష్టం గురించి అడిగినప్పుడు ఈ ప్రభుత్వ ఉన్నతాధికారి ఇలా చెప్పారు: మేం ఏమీ చేయలేము, అంతా దేవుడి చేతిలో ఉంది' దీనితో జ్యూరర్లు నొచ్చుకుని తిరిగి ప్రశ్నలు వేయడానికి నిరాకరించారు.

2. ముందు అంగీకరించినట్టుకాక, ఆంధ్రప్రదేశ్ రైతుల సమాఖ్య ప్రతినిధి తనసాక్షి ప్రసంగం అయిపోగానే వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాడు. జ్యూరీ సభ్యుల క్రాస్ ఎగ్జామినేషన్‌కు ఆయన సమయం ఇవ్వదలచుకోలేదు. ఆ సాక్షి రాష్ట్రంలోని ఉన్నత కులాలకు, మధ్యతరగతి రైతుల మధ్య తరగతి, పెద్ద రైతులతో కూడిన సమాఖ్య అధ్యక్షుడు. క్రాస్ ఎగ్జామిన్ సహాయం వరకు వేచి వుండి, తమ ఒప్పందాన్ని గౌరవించాలని సమన్వయ బృందం ఆయనకు నచ్చచెప్పగలిగింది. అయితే కిందికుల వ్యక్తులతో పరస్పర సంప్రదింపులతో కూడిన నిర్మాణాత్మక చర్చకు ఆయన అంతగా సుముఖంగా లేరని అత్యధిక జ్యూరర్లకు అప్పటికే స్పష్టమైంది.

3. కొన్నిసార్లు కొందరు నిపుణులైన సాక్షులు చెప్పిన లేక ఉదహరించిన అంశాలు తమను వేరుపరిచేదిగా లేక తమకు అంతగా విలువ నివ్వనివిగా వున్నాయని జ్యూరీ సభ్యులు భావించారు. పలు సాక్షుల వ్యాఖ్యలు, వైఖరులు పెత్తందారీ అధికారంతో కూడినవిగా వున్నాయి. (నిర్దిష్ట ఉదాహరణలకు బాక్స్ 7 చూడండి)

ఈ ఘటనలు ఎలా వున్నా ఆంధ్రప్రదేశ్‌లో ఆహారం, వ్యవసాయం భవితవ్యంపై అర్థవంతమైన చర్చలో పాల్గొనేందుకు జ్యూరర్లకు ఎటువంటి సంకోచం కలిగించని రీతిలో సంబంధాలు, వాతావరణం వుంది.

నాయుడు: జ్యూరీ భాగస్వామ్యం చాలా ప్రోత్సాహకరంగా, సమయస్ఫూర్తితో వుంది.

సావిత్రి: మహిళలు ఎక్కువ కృతనిశ్చయం ప్రదర్శించారు. సమావేశాలు నిర్వహించేందుకు, ఇతరులతో సమాచారం పంచుకునేందుకు అవసరమైన పరస్పర విశ్వాసంతో మెలిగారు.

జస్టిస్ సావంత్: ఈ రైతులు ముఖ్యంగా మహిళలు ఇంత నిర్మొహమాటంగా మాట్లాడగలుగుతుండడం చూస్తే నాకు ఆనందంగా వుంది. ప్రభుత్వ విధాన నిర్ణాయకులను వారు ప్రశ్నలతో ముప్పతిప్పలు పెట్ట గలిగారు.

## 4.8 జ్ఞానాన్ని గుర్తించడం

తమకు ప్రత్యక్ష అనుభవంలో లేని శాస్త్ర, సాంకేతిక రంగాల సంక్లిష్ట సమస్యల గురించిన చర్చలు చేయవలసి వచ్చినప్పుడు జ్యూరీ సామర్థ్యం ప్రశ్నార్థకమవుతుంది. ఇక్కడ ప్రజాతీర్పులో కూడా అటువంటి సందర్భం ఎదురయింది. సామాన్య ప్రజలకు సైన్సు విషయాలు ఏమీ తెలియవని అనేక సర్వేలు చాటి చెబుతుంటాయి. కానీ, ఎన్నో సాంకేతికాంశాలు ముడిపడిన కోర్టు కేసుల మీద జరిగిన కొన్ని అధ్యయనాలు అందుకు భిన్నమైన వాస్తవాన్ని చెబుతాయి. సాధారణ ప్రజలు అనేక సాంకేతిక సమస్యల విషయంలో కనీసం న్యాయమూర్తుల పాటిగా అయినా వ్యవహరించగలుగుతారు. న్యాయస్థానాల జ్యూరీ విషయంలో లాగా, ఇతర పౌర జ్యూరీల విషయంలో లాగానే - ప్రజాతీర్పులో కూడా సాక్ష్యాన్ని స్పష్టంగా సులువుగా తెలియజెప్పవలసిన భారాన్ని సాక్షుల మీదనే ఉంచడం జరిగింది. సాక్ష్యంలో అనేక శాస్త్ర సంబంధ అంశాలున్నాయన్న కారణంతో జ్యూరీ ద్వారా విచారణ అన్నది తగినది కాదని అనుకున్న సందర్భాలలో కూడా, సాక్ష్యాన్ని వెల్లడించే పద్ధతి మీద కాస్త శ్రద్ధ వహిస్తే సాంకేతిక సమస్యలను అధిగమించవచ్చునని అనేక అధ్యయనాలు తెలియజేశాయి. (ఎడ్మండ్ అండ్ మెర్సర్ 1997)

సాంకేతికంగా ఎంతో సంక్లిష్టంగా ఉన్న కేసు విషయంలో జ్యూరీకి తగినంత పరిజ్ఞానం లేకపోవడాన్ని చూపించి, తాము కేసు ఓడిపోవడానికి అదే కారణమని ఒక పక్షం అంటుంది. నిజానికి వారు కేసు ఓడిపోయేది జ్యూరీకి తగిన సామర్థ్యం లేకపోవడం వల్ల కాదు, కేసులో తమ వాదాన్ని జ్యూరీ ముందు ఉంచడంలో తగిన నైపుణ్యాన్ని ప్రదర్శించలేకపోవడం వల్ల, కాబట్టి, జ్యూరీ సమర్థతను మదింపు వేయడం ఒక రాజకీయ ప్రక్రియ. ప్రజాతీర్పు

ప్రాజెక్టులో పాల్గొన్న భాగస్వామ్యులలో కొందరు జ్యూరీ తీర్పు గురించి వ్యక్తం చేసే అభిప్రాయాలను పరిశీలించేటప్పుడు, ప్రాజక్టు భాగస్వాములలో విరుద్ధ ప్రయోజాలున్నవారున్నారని గుర్తుపెట్టుకోవాలి. న్యాయశాస్త్రంలో నిష్ణాతులైనవారు, జ్యూరర్లు తీసుకున్న నిర్ణయాలను తులనాత్మకంగా పరిశీలించి చేసిన అధ్యయనాలలో తేలినదేమంటే - నూటికి 75-80 తీర్పులు రెండు రకాల వారివీ ఒకటే. (లెంపర్ట్, 1993). ఈ నిష్పత్తి అన్ని కేసుల విషయంలోను ఒకే రకంగా ఉంది. సంక్లిష్టమైన కేసులు, తక్కువ సంక్లిష్టమైన కేసులు అన్న తేడా ఏమీ లేదు.

ప్రాథమిక విద్య కూడా పూర్తిచేయనివారు, లేదా నిరక్షరాస్యులు అధికంగా ఉన్న రైతులు తమకు మునుపు తెలియని ఉన్నత సాంకేతిక సమస్యల గురించి కూడా చర్చించగలరని ప్రజాతీర్పు నిరూపించింది. తమ జీవనాధారాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రతి సాక్షి నుంచి శ్రద్ధగా సేకరించడం ద్వారా వారు దీనిని సాధించగలిగారు. డెవలప్‌మెంట్ ఆర్థిక శాస్త్రం గురించో, జన్యుశాస్త్రం గురించో ప్రాథమిక పరిజ్ఞానం సమకూర్చుకోవడానికి వారు ప్రయత్నించ లేదు. భూమికి మళ్లీ సారం చేరడం, తమ పంటను తరచు ఎగుడుదిగుళ్లకు లోనయ్యే మార్కెట్ ధరల కోరల నుంచి రక్షించడం - ఇవి తమ అవసరాలని, ఈ అవసరాలను విజన్ 2020 తీర్చ గలుగుతుందా, 'కొత్తరకం వంగడాలు' తీర్చగలుగుతాయా - అని వారు అడిగారు.

రైతులు తమ జ్ఞానాన్ని ఎలా నిర్ధారించుకున్నదీ, బయటివారి జ్ఞానాన్ని ఎట్లా అంచనా వేసిందీ వ్యాఖ్యానిస్తూ పర్యవేక్షక బృందానికి చెందిన ఒక సభ్యుడు ఇలా అన్నారు.

పాల్ టెర్‌వీల్: ఎంతో ఆసక్తికరమైన సంగతి ఏమిటంటే, రైతులు వారి జ్ఞానం వారి తెలివి, వారి ఫీలింగ్స్ వీటి మీద ఆధారపడి స్పందించారు.... తమ ముందు ఎవరున్నారు, తాము ఎవరితో వ్యవహరిస్తున్నారు అన్న అంశాల మీద కాకుండా... నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం - తమ ముందుకు వచ్చిన విషయం పనికి మాలినదా, ఉట్టి ప్రచారమా, లేదా అందులో ఏదైనా పనికి వచ్చేది ఉన్నదా అన్నది వారు వెంటనే పసిగట్టగలగడం. ఏది ఉపయోగకరం, ఏదీ అసలైనది, ఏదీ కాదు అన్న వాటిని నిర్ధారించగలగిన వివేకం ఇంకా మిగిలే ఉన్నదనేది నాకు ఎంతో ఆశకలిగిస్తున్నది.

సాక్షులు చెప్పినది విన్న తరవాత, ఆయా అంశాల గురించి జ్యూరీ సభ్యులు తమలో తాము సంప్రదించుకున్న తరువాత, తమ సొంత జీవితాలనుభవం నుంచి, సొంత జీవనాధారాల సందర్భం నుంచి ప్రశ్నలను రూపొందించి అడిగారు. చాలాసార్లు ఆయా విషయాల మీద స్పెషలిస్టులయిన వారి వాదనల కంటె జ్యూరీ సభ్యుల ప్రశ్నలే సమగ్రతను ప్రతిబింబించాయి. స్పెషలిస్టు సాక్షుల ప్రసంగాలకు జ్యూరీ సభ్యుల ప్రతిస్పందన కొన్ని ఉదాహరణలు:

- తక్కువ ఆహారోత్పత్తి, అధిక జనాభాయే సమస్య అయితే, నా దగ్గర ఎంతో అదనపు ఉత్పత్తి సరైన మార్కెట్ లేక మూలుగున్నదేమీ? మా ఊళ్లో అందరి దగ్గరా అదే సమస్య! ఉత్పత్తిని తగ్గించమని మన ముఖ్యమంత్రి ఎందుకు అడిగినట్టు? (సమయ ఈ ప్రశ్న అడిగారు. పెరుగుతున్న మానవ జనాభా ఆహార అవసరాలకు జన్యు మార్పిడి టెక్నాలజీకి సింజెంటా ప్రతినిధి ముడిపెట్టినప్పుడు అడిగిన ప్రశ్న).
- పొగాకు నుంచి, పత్తినుంచి ఎవరికైనా ఏమి దొరుకుతుంది? ప్రభుత్వం ఎందుకు ఆ పంటలకు సహాయపడాలి? (ఫిలిప్ అడిగారు ఈ ప్రశ్నని. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాధికారులు భవిష్యత్ అందలాల గురించి వివరిస్తూ ఈ రెండు పంటల ఉత్పత్తి గణాంకాలకు సగర్వంగా చదివినప్పుడు వేసిన ప్రశ్న)
- మరి ప్రాణనష్టం మాటేమిటి? (దీవెనమ్మ అడిగిన ప్రశ్న. కల్తీ విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారకాలు అమ్మినప్పుడు జరిగే పంటనష్టానికి పరిహారం ఇచ్చేట్టుగా వ్యవసాయ రసాయన కార్పొరేషన్లతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ - డిప్యూటీ కమిషనర్ ప్రకటించినప్పుడు వేసిన ప్రశ్న)

విధానపరమైన లేదా సాంకేతికమైన ప్రతిపాదనల సామాజిక, పర్యావరణ పర్యవసానాల లాభనష్టాల గురించి రైతులు అడిగినప్పుడు సమాధానం చెప్పడానికి అనేకమంది స్పెషలిస్టులకు వారి జీవితానుభవం, జ్ఞానం సరిపోలేదు. ఇది ప్రత్యేకంగా గుర్తించవలసిన విషయం. పర్యవేక్షక బృందం అధ్యక్షుడు జస్టిస్ సావంత్ వ్యాఖ్యానించినట్టుగా:

నేను కూడా కొందరు నిపుణులతో సంభాషించాను. సారాంశంలో వారు టెక్నోక్రాట్‌లని అర్థం అయింది. వారు సమస్యను సాంకేతిక దృక్పథం నుంచి మాత్రమే చూశారు. సమస్యలకు సంబంధించిన సామాజిక కోణం గురించి కానీ, ఇతర పర్యవసానాల గురించి కానీ వారికే మాత్రం అవగాహనలేదు. ఈ విషయం నువ్వు పరిశీలించావా అని అడిగితే వారు లేదు అని చెబుతారు. ఈ విషయం ఆలోచించాలి.

సాక్ష్యాలు విన్నతరువాత, తమలో తాము సంప్రదించుకున్న తరువాత జ్యూరీ సభ్యులు విజన్ 2020లోని విధానాలు, సాంకేతికతలు తమకు అంగీకారం కావని తెలుసుకున్నారు. కానీ వారు తమ నిరాకరణను మాత్రమే తీర్పుగా చెప్పలేదు. ఆహార - వ్యవసాయ రంగాలలో భవితవ్యం ఎట్లా ఉండాలో శ్రద్ధగా యోచించి రూపొందించుకున్న తమ దృష్టికోణాన్ని ముందుకు తెచ్చారు. తమ దృష్టికోణాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం, పౌర సమాజ

సంఘాలు, విదేశీ సహాయ సంస్థలు ఏ చర్యలు తీసుకోవాలో వివరంగా డిమాండ్ల రూపంలో ప్రకటించారు. ఒక ఉమ్మడి దృష్టికోణాన్ని సాధించడమే చెప్పుకోదగ్గ విజయం. తమ పరిజ్ఞానాన్ని నిర్ధారించుకుని, రకరకాల అభిప్రాయాలను ఒక ఉమ్మడి తీర్పుగా మలచడంలో గొప్ప కృషి ఉన్నది. సమావేశకర్త కవితా కురుగంటి చెప్పినట్టు తీర్పు అద్భుతమైన తీరులో సమగ్రంగా ఉన్నది. ఎన్నో విభేదాలను, రకరకాల వ్యవసాయపర్యావరణ వ్యవస్థలను, విభిన్న స్థానిక ఆర్థిక వ్యవస్థలను, సాంస్కృతిక నేపథ్యాలను, సామాజిక నేపథ్యాలను జీర్ణించుకుని రూపొందిన తీర్పు. జ్యూరీ కూడా అంతటి వైవిధ్యపూరితమైనదే. కానీ, మొత్తం (వారి అవసరాలు, కోరికలు, డిమాండ్లు అన్నీ) అంతా కలగలసిపోయి ఒకే ఉమ్మడి దృష్టి కోణంలోని విశిష్ట లక్షణాలుగా అవతరించాయి.

ప్రజాతీర్పు జ్యూరీలో ఒక విశేషమున్నది. ఒకే ఒక్క పట్టణ వినియోగదారు తప్ప తక్కిన జ్యూరర్లు అందరూ వ్యవసాయ నేపథ్యం నుంచి వచ్చినవారే. జ్యూరీ సభ్యుల్లో మెజారిటీ స్త్రీలు అయి ఉండడం అంటే అర్థం ఆహార తయారీ గురించి, నిల్వ ఉంచే టెక్నాలజీ గురించి, కుటుంబ ఆహార భద్రత గురించిన ఇతర కోణాల గురించి స్థానికమయిన పరిజ్ఞానం అందుబాటులో ఉన్నదన్నమాట. ఈ విశేషాల సాయంతో ప్రజాతీర్పు పద్ధతి పండితులకు, పామరులకు తరతరాలుగా ఉన్న ఒక అధికార అంతరాన్ని తలకిందులు చేయగలిగింది. కొందరిని నిపుణులని పరిగణిస్తూ, మరి కొందరిని అజ్ఞానులుగా ఇంకా తెలుసుకోవలసి ఉన్నవారిగా పరిగణించే పద్ధతిని తారుమారు చేయగలిగింది. అభివృద్ధి ఆర్థికశాస్త్రం, వ్యవసాయ జన్యుశాస్త్రం, వ్యవసాయ విధానం వంటి అంశాలు ఎంతో సాంకేతికమయిన అంశాలుగా ఉన్నాయి. పురుషులు పెత్తనంలో ఉండే రంగాలుగా ఉన్నాయి. బహిరంగ పరీక్షకు నిలబడనక్కరలేని రంగాలుగా ఉన్నాయి.

అభివృద్ధి ఆర్థిక శాస్త్రంలో, శాస్త్ర విజ్ఞానంలో, విధాన నిర్ణయాలలో శిక్షణ లేని పౌర న్యాయమూర్తులు 'అధికారిక' జ్ఞానం గురించి, విధాన ప్రక్రియల గురించి ఎంతో హుందాగా లోతైన విమర్శనాత్మక అవగాహనను అలవరచుకోవడం విశేషం. చెర్నోబిల్ సంఘటన నేపథ్యంలో బ్రిటన్‌లోని కుంబ్రియాలో గొర్రె పెంపకందారుల దేశీయ పరిజ్ఞానం మీద చేసిన ఆంత్రోపలాజికల్ అధ్యయనం (వైన్ 1996), "పౌర దూరదృష్టి: జన్యు మార్పిడి ఆహారం జెనెటిక్స్ ఫోరమ్ పౌర జ్యూరీ" (సిటిజన్ ఫోర్‌సైట్: డి జెనెటిక్ ఫోరమ్స్ సిటిజన్ జ్యూరీ ఆన్ జి ఎమ్ ఫుడ్ - జెనెటిక్ ఫోరమ్ 1999) అన్న పాలసీ అధ్యయనం ఈ ప్రజాతీర్పు ప్రతిఫలించిన వాస్తవానికే అద్దం పట్టాయి. అభివృద్ధి నిపుణులు చెప్పే పరిష్కారాలకి, స్థానిక వాస్తవాలకి ఎక్కడా పొంతనే ఉండడం లేదు. (చాంబర్స్ 1993)

మూడో ప్రపంచ దేశాలలో గత మూడు దశాబ్దాలలో భాగస్వామ్య అభివృద్ధి పద్ధతులను, పౌర-శాస్త్రవిజ్ఞాన సంభాషణ (ఇర్విన్ అండ్ వైన్, 1996)లోని సామాజిక శాస్త్ర విమర్శలను గమనిస్తే - విధాన విషయాల మీద పనిచేస్తున్న వారిలో ఒక గుర్తింపు పెరిగింది. అదేమిటంటే - పౌరులకు ఎంత తెలుసును అన్న విషయం చాలా సందర్భాలల్లో స్పెషలిస్టులు సొంతంగా చేసే నిర్ధారణగా ఉంటుంది. పైగా పౌరులకు ఏమీ తెలియదు అని నిరాకరించడంలోనే ఈ స్పెషలిస్టు కాని పౌరుడి అభిప్రాయం వెనుక పరిజ్ఞానం ఉన్నదని అంగీకరిస్తే, స్పెషలిస్టు కానివాడికి కొంత ఆమోదనీయత ఇచ్చినట్టవుతుంది. అంతేకాదు, స్పెషలిస్టు తన సొంత అధికారాన్ని పౌరుడికి వదులుకోవలసి ఉంటుంది.

పౌరుడు - శాస్త్ర విజ్ఞానం నమూనా భాగస్వామ్యం గురించిన కొన్ని అంశాలను పటం 2లో చూడవచ్చు. జ్యూరర్లు సాక్షులను ఎట్లా ప్రశ్నించిందీ, సాక్ష్యాలను ఎలా విశ్లేషించిందీ 4.9 సెక్షన్‌లో చదవవచ్చు.

వ్యవసాయం, ఆహార మార్కెటింగ్ గురించిన ఆచరణాత్మక విషయాలు సాక్షులకంటె రైతులకు ఎక్కువ తెలిసి ఉండడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అయితే, బయటి పరిజ్ఞానాన్ని జ్యూరీ సభ్యులు గుర్తించి, గౌరవించారు. వీడియోల ద్వారా, సాక్షుల ప్రసంగాల ద్వారా తమ ముందుకు వచ్చిన సమాచారం విషయంలో జ్యూరీ సభ్యులు ఎంతో ఆసక్తి, శ్రద్ధను ప్రదర్శించారు. అట్లాగే, ఇంతకు మునుపు భాగస్వామ్య ప్రక్రియలలో పాలు పంచుకొని కొందరు సాక్షులు రైతుల పరిజ్ఞానాన్నీ, జ్యూరర్లు తమను అడిగిన ప్రశ్నల తీరును రెంటినీ ప్రశంసించారు. వ్యవసాయ విధానాలలో ప్రభుత్వానికి సీనియర్ సలహాదారుడైన ఒక సాక్షి, సింజెంటా కంపెనీ ప్రతినిధి అయిన ఒక సాక్షి జ్యూరీ పరిజ్ఞానాన్ని ఈ విధంగా ప్రశంసించారు:

ప్రొఫెసర్ ఎమ్.వి.రావు: ఇది ఒక కొత్త అనుభవం. అంటే మేం మా ఐడియాలను, వ్యూహాలను చెబుతున్నాము, జ్యూరీ గ్రూపు వారి నుంచి, ఆడవాళ్ల నుంచి మగవాళ్ల నుంచి వెంటనే ప్రతిస్పందన వస్తున్నది. వారి ఆసక్తిని, వారి కుతూహలాన్ని, వారి జ్ఞానాన్ని చూసి ఆనందం వేసింది.

డాక్టర్ పార్థదాస్ గుప్తా: ఇక్కడ నేను నేర్చుకుంటున్నాను. వాళ్లు ప్రశ్నలు అడుగుతున్న తీరు ఊహించలేనిది. వాళ్ల ఫీలింగ్స్ ఏమిటో, వాళ్ల అనుభవాలేమిటో, వాళ్లు ఎటువంటి ప్రశలు అడగబోతున్నారో ఏవీ నాకు తెలియదు. ఇదంతా నాకు పూర్తిగా కొత్త అనుభవం.

జస్టిస్ సావంత్: ప్రజాతీర్పు ద్వారా స్థానికమయిన, బయటి పరిజ్ఞానాలను మిళితం చేయడం విద్యావిలువల రీత్యా, విధానాలకు చేసే దోహదం రీత్యా ఎంతో విలువైనదని పాల్గొన్నవారు, పర్యవేక్షకులు ఇద్దరూ భావిస్తున్నారు. ఈ పరస్పర సంభాషణ ఏం చేయాలో

## పటం 2. సాంప్రదాయక సంప్రదింపుల పద్ధతికి, పౌరశాస్త్ర తరహా ప్రజా భాగస్వామ్యానికి ఉన్న విరుద్ధ లక్షణాలు (ఆధారం: ఇర్విన్-వైన్ 1996)

| సాంప్రదాయక సంప్రదింపులు | 'పౌర-శాస్త్ర' నమూనా ప్రజాభాగస్వామ్యం |
| --- | --- |
| జనం అంటే విడివిడిగా ఉన్న వ్యక్తుల సమూహం | జనంలో రకరకాల ప్రజలు ఉంటారు. వారి సొంత సంస్కృతులలోను, ఉమ్మడి సంస్కృతులలోను వేరు వేరురకాల ప్రజలు ఉంటారు. |
| 'అజ్ఞానం' అంటే బౌద్ధిక అసమర్థత ఫలితం. | అజ్ఞానం అనేది పౌరుల సామాజిక స్థాయికి సంబంధించిన నిర్మాణం. శాస్త్ర సాంకేతిక వ్యవస్థలతో సాపేక్షమైన ఐడెండిటీ. |
| జ్ఞానశూన్యత. పెద్ద సంఖ్యలో 'సాంకేతిక వాస్తవాలను' తెలుసుకోవడం ద్వారా ఈ శూన్యాన్ని భర్తీ చేసుకోవచ్చు. | |
| శాస్త్ర సాంకేతి రంగాల విలువల వంటివే పౌర విలువలు కూడా. ప్రాణిప్రపంచం మీద, భౌతిక ప్రపంచం మీదా సాధ్యమైనంత అదుపును కోరుకోవడం, భవిష్యత్ ఊహలు చేయడం | పౌరులెప్పుడూ ప్రమారహితమైన క్షేమమైన విషయాలనే కోరుకుంటారనడానికి దాఖలాలు ఏమీ లేవు. నిపుణులతో పనిచేసే సంస్థలను విశ్వసించాలనే వారు అనుకుంటారు. వారి సమస్యఅల్లా అటువంటి విశ్వాసం కొరవడుతోందనే. |
| నిశ్చితి కావాలని, ప్రమాదం ఉండకూడదని శాస్త్రవేత్తలు కానివారు కోరుకుంటారు. సైన్స్ అంటే వారికి ఉత్సాహం లేకపోవడానికి కారణం అదే. | అధికారానికి, పరాధీనతకు సంబంధించిన వివిధ నిర్మాణాలతో సమాజం నిండి ఉంది. ప్రజల ఆలోచనల మీద, వారి ఆచరణ మీద ఈ నిర్మాణాల ప్రభావం ఉంటుంది. |
| అందుబాటులో ఉన్న జ్ఞానాన్ని వినియోగించడానికి సామాజిక అవకాశాలు సమాజం అంతా ఒకేరకంగా ఉంటాయి. | |

రైతుకు చెబుతున్నది. విధానాలు సరైన దారిలో ఉన్నయో లేదో చూసుకొమ్మని విధాన నిర్ణేతలకు చెబుతున్నది. ఇ ఇద్దరూ ఒకరినుంచి ఒకరు నేర్చుకుంటున్నారని నేను అనుకుంటున్నాను.

సామాజిక శాస్త్రాల నుంచి, ప్రకృతి శాస్త్రాల నుంచి దృక్పథాలకు, రైతుల జ్ఞానానికి, స్థానిక వనరులను వినియోగించే వారి పరిజ్ఞానానికి ప్రజాతీర్పు ఒక వేదిక కల్పించింది. ఆ వేదిక మీద ఆ పరిజ్ఞానాలన్నీ ఘర్షించుకున్నాయి, చర్చించుకున్నాయి. విధాన భవితవ్యాల రూపకల్పనకు సమన్వయం పొందాయి. ఆహార వ్యవస్థల గురించి, జీవనాధారాల గురించి, పర్యావరణం గురించి వేర్వేరు రూపాల జ్ఞానం ఉంటుందని, ప్రతిదీ పాక్షికమూ అసమగ్రమూ అనీ ఈ ప్రక్రియ గుర్తించింది. భాగస్వామ్య పద్ధతుల ద్వారా నేర్చుకోవడం, కలుపుకుపోవడం, సంభాషణ, జాగ్రత్తగా జరిపిన సంప్రదింపులు - అన్నీ కలిసి ఈ వివిధ విభిన్న వాస్తవికతలను ఒకచోట చేర్చి, బయటివారి బలాన్ని, స్థానిక పరిజ్ఞానాన్ని సమ్మిళితం చేశాయి.

'విస్తృత సోదర కమ్యూనిటీల'ను కలుపుకుని ప్రక్రియలను, సైన్సును ప్రజాస్వామీకరించడం అవసరం. (ఫంటోవిజ్, రావెజ్ 1993) విస్తృతసోదర కమ్యూనిటీలు అంటే - రైతులు, పశుపెంకందారులు, అటవీ వాసులు, మత్స్యకారులు, గ్రామీణ, పట్టణ ప్రజలు. ఉత్పత్తిలోను, తమ జీవితాలను ప్రభావితం చేసే పరిజ్ఞానాన్ని పంచుకోవడంలోనూ వీరందరినీ కలుపుకోవాలి. (ఇర్విన్ 1995, క్లాపెన్‌బర్గ్, 1991, పింబర్ట్ 1994). ఈ దిశగా ప్రజాతీర్పు కొత్త పరిజ్ఞానాన్ని అందించింది. దాన్ని నిరూపించింది కూడా. ఆహార, వ్యవసాయ రంగాలకు సంబంధించిన విధాన నిర్ణయం ప్రక్రియలను ఎట్లా ప్రజాస్వామికీకరించవచ్చునో, పౌరులకు అవి ఎట్లా బాధ్యత వహించేటట్టు చేయవచ్చునో ప్రజాతీర్పు చేసి చూపించింది.

## 4.9 సంభాషణలు, సంప్రదింపులు, ప్రశ్నలు, విచారణలు

ఒక సమస్య తీరుతెన్నులను అర్థం చేసుకోవడానికి సమాచారం పొందడానికి ఉన్న అవకాశాలకూ దగ్గరి సంబంధం ఉన్నది. రాతపూర్వకంగా ఉన్న స్టేట్‌మెంట్లను చదివేవారు గానో, స్పెషలిస్టుల సాక్ష్యాలను మౌనంగా ఆలకించేవారుగానో ఉండడం కన్నా, పౌరులు తమకు కావలసిన సమాచారాన్ని సాక్షుల దగ్గరినుంచి రాబట్టడానికి ఎంతగా అవకాశం ఉన్నదన్నది ముఖ్యం. దీన్ని తెలుసుకోవడానికి ఒక సులువైన పద్ధతి. మొత్తం ప్రక్రియలో

సాక్షుల సాక్ష్యాల సమర్పణకు ఎంత సమయం పట్టిందీ, సాక్షులను జూరర్లు విచారించడానికి, ప్రశ్నించడానికి ఎంత సమయం పట్టింది పోల్చిచూడడం. ప్రజాతీర్పు ప్రక్రియలో ఈ నిష్పత్తి 1:1గా ఉన్నది. సాక్షులు సాక్ష్యం సమర్పించిన అంశాల గురించి తగిన అవగాహనతో నిర్ణయాలు చేయడానికి జ్యూరర్లకు, పరిశీలకులకు ఈ సమయం సరిపోయినట్టే కనిపిస్తున్నది. జనాభిప్రాయాన్ని సేకరించే ఇతర పద్ధతులలో పోల్చినప్పుడు కూడా ఇది మెరుగుగా ఉన్నది. (వేక్‌ఫోర్డ్ 2001) రెడ్డి, దాస్‌గుప్తా వంటి సాక్షులు తమ సాక్ష్యంలో ఉపయోగించిన సంశయాస్పదమైన 'వాస్తవాల'ను ఊకదంపుడులను, పోలికలను తమ అనుభవంతో ఎదుర్కొనడానికి జ్యూరర్లకు 'ప్రశ్నించే సమయమే' ఉపయోగపడింది.

డాక్టర్ దాస్‌గుప్తా: (సాక్ష్యం ఇవ్వడానికి ముందు) నేను కూర్చుని ఉన్నప్పుడు నా కాళ్లకు చెప్పులు లేవు. దీన్ని (మైక్రోఫోన్‌ను) పట్టుకుని మాట్లాడేటట్టయితే, నా కాళ్లకు చెప్పులుంటేనే మంచిదని, లేకపోతే షాక్ కొడుతుందని వాళ్లు చెప్పారు. ఇది (మైక్రోఫోన్) కొత్త టెక్నాలజీ. దీనివల్ల నా గొంతు పెద్దగా వినిపిస్తోంది, అందరూ వినగలుగుతున్నారు. అయితే, ఇది కూడా కరెంటుతోటే నడుస్తోంది. కరెంటుతో ఎట్లా ఉండాలో నాకు తెలియకపోతే, ఉపయోగం కాస్తా అపకారం అయిపోతుంది. షాక్ కొడుతుంది. ఇప్పుడు నా కాళ్లకు రబ్బరు ఉన్నది కాబట్టి నాకు షాక్ కొట్టదు. మీరు రసాయనాలను పట్టుకునేప్పుడు, డాక్టర్లు ఆపరేషన్లు చేసేటప్పుడు చేతులకు తొడుగులు తొడుక్కుంటారు. ఒక కొత్త టెక్నాలజీని ఉపయోగించేటప్పుడు, జాగ్రత్తలను కూడా పాటించాలి. ఇది పాత పద్ధతి వంటిది కాదు. పాత పద్ధతులలో ప్రమాదం లేదు కానీ, అది మనకిప్పుడు చాలదు.

జన్యు మార్పిడి పంటల వల్ల కలిగే ప్రయోజనాల గురించి డాక్టర్ దాస్‌గుప్తా చెప్పింది విన్న తరువాత జ్యూరీ సభ్యులు ఒకరు తన సొంత పోలికలతో ఇలా బదులిచ్చారు.

జ్యూరీ సభ్యురాలు: (కొత్త పంట రకాల మీద) మీరు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఏదో చేస్తున్నారంటే అందులో మీకు అంతకన్నా ఎక్కువ లాభం ఉండి తీరాలి. మీకు ఒక పోలిక చెబుతాను. ఇంతకు మునుపు మాకు దూరదర్శన్ (ప్రభుత్వ టెలివిజన్ కేంద్రం) ఒక్కటే ఉండేది. ఇప్పుడు మాకు జెమిని, ఈటీవీ, ఇంకా ఇతర టీవీ ఛానెళ్లు ఉన్నాయి. మేం కాసేపు జెమిని, కాసేపు ఈటీవి చూస్తూ మారుస్తూ ఉంటాము. కానీ ఏదో ఒకదాన్ని ఎంచుకోలేక పోతున్నాము. అలాగే, మీరు చాలా చెబుతుంటారు, ఇవాళ ఈ రకం మంచిది అని చెబుతారు. మరుసటి రోజు వచ్చి కాదు, మరో రకం మంచిదంటారు, మరొకరు వచ్చి టెలివిజన్‌లో ఒక బొమ్మ చూపించి ఈ రకం మంచిదంటారు. అందువల్ల చాలా అయోమయం.

డాక్టర్ దాస్‌గుప్తా: 'కరెంటు పోలికను కొనసాగిస్తూ సుదీర్ఘంగా మాట్లాడుతున్నప్పుడు మధ్యలో)... దీపం వెలిగించడం ఎలాగో నాకు తెలుసు. ఈ కరెంటు ఎందుకు తెస్తారు అని అడగవచ్చు. కరెంటు వద్దు అని నిరాకరించవచ్చు. అది నా ఇష్టం. ఎవరూ బలవంతం చేయరు. కానీ మీపొరుగువారికి కరెంటు ఉంటే, మీరు కూడా కోరుకుంటారు. ఎవరూ బలవంతం చేయరు. మీరీ కొత్త టెక్నాలజీని వాడండి అని ఎవరూ మీ దగ్గరికి వచ్చి చెప్పరు.

జ్యూరీ సభ్యురాలు: నేను మరో ఉదాహరణ చెబుతాను. నేనేమో అంబలి తాగుతుంటాను. పొరుగింటి ఆవిడ హార్లిక్స్ తాగుతుండవచ్చు. కొన్ని రోజులు ఆమె మనసులో తాను డబ్బున్నదాన్ననీ, ఆరోగ్యానికీ ఎంతో మంచిదయిన హార్లిక్స్‌ను తాను తాగుతున్నానని అనుకోవచ్చు. నన్ను తక్కువగా చూడవచ్చు. కొంతకాలం అయిన తరువాత ఆమెకు తెలిసి వస్తుంది, హార్లిక్స్ కంటె అంబలే మంచిదని, ఆ విషయం ఆమెకు తెలిసే లోపు ఆమె మరింత ఆరోగ్యాన్ని కోల్పోతుంది, బలహీన పడుతుంది. ఆమె హార్లిక్స్‌ను వదలి అంబలి దగ్గరికి రావలసిందే. అయితే, ఈ మార్పుకోసం పట్టే సమయం ఖరీదైనది. (కొత్త పంటలతో) సమస్య ఉన్నదని గుర్తించేనాటికి మేం చాలా నష్టపోయాము.

జ్యూరీ సభ్యురాలు అభిప్రాయం ఏమిటో తనకు పూర్తిగా అర్థం కాలేదని చివరగా దాస్‌గుప్తా అన్నారు. ఆమెకు తెలుసుకునే హక్కు ఉన్నదని నొక్కి చెబుతారు కానీ, జ్యూరీ సభ్యురాలు చెబుతున్న పంట నష్టం గురించి, తరువాత పడ్డ కష్టం గురించి దాస్‌గుప్తా పట్టించుకోలేదు. అయితే, మొత్తం మీద జ్యూరీ సభ్యులకు, సాక్షులకి మధ్య జరిగిన సంభాషణకు లభించిన అవకాశం ప్రజాతీర్పు సంప్రదింపులు ఉత్తమస్థాయిలో జరగడానికి తోడ్పడింది.

## 4.10 ప్రక్రియ ఫలితాలు

ప్రజాతీర్పు ప్రక్రియ మొత్తాన్ని మదింపువేయడానికి ఏర్పడిన పర్యవేక్షక బృందంలో గౌరవనీయమైన సభ్యులు ఉండడం ఒక ముఖ్యమైన విశేషం. ప్రపంచ వ్యాప్తంగా, భారతదేశంలోనూ ఆహార, వ్యవసాయ భవితవ్యాల మీద జరుగుతున్న చర్చ మీద ప్రజాతీర్పు ప్రక్రియ గట్టి ప్రభావం వేయడానికీ అది తోడ్పడింది. దీనితో పాటు, ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు, ఒక ప్రధాన బహుళజాతి కార్పొరేషన్ ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు, ఒక ప్రధాన బహుళజాతి కార్పొరేషన్ (సింజెంటా) ప్రతినిధి పాల్గొనడం వల్ల ప్రజాతీర్పు ఫలితం విశ్వసనీయత పెరిగింది. ఏకపక్షంగా సమన్వయ బృందం కావలసిన 'ఫలితాన్ని' రాబట్టిందన్న విమర్శను నివారించినట్టయింది.

జ్యూరీ సభ్యులు తాము విని ఉన్న నినాదాలనే వల్లించడం లేదంటారా అని అడిగినప్పుడు, పర్యవేక్షక బృందం చాలా ఖచ్చితమైన

సమాధానం చెప్పింది. జ్యూరీ సభ్యుల మీద బయటవారి ప్రభావం కానీ, ఒత్తిడికానీ ఏమీ లేవని స్పష్టం చేసింది.

పాల్‌టెర్‌వీల్: లేదు లేదు. వారు చెబుతున్నవి వారి మనసులోని మాటలే. వారిలో హత్తుకుపోయి ఉన్న అభిప్రాయాలని, తాము దేని గురించి మాట్లాడుతున్నారో, ఏమి చేస్తున్నారో వారికి తెలుసును.

విధాన భవితవ్యాల గురించిన ఈ భాగస్వామ్య అంచనా విధాన ప్రక్రియలలోని అనేక ప్రబలమైన ధోరణులను తలకిందులు చేసంది. సాధారణంగా కనిపించే పద్ధతులన్నిటిని తారుమారు చేసింది. (అ) రైతాంగం అభిప్రాయాలు, ప్రాధాన్యాలు, నిర్ణయాలు - వీటికి ప్రధాన స్థానం కల్పించడం, తగిన మెథడాలజీని వినియోగించడం (ఆ) ఈ మొత్తం ప్రక్రియను ఒక గ్రామీణ వేదిక మీద వ్యవసాయ క్షేత్రం మధ్య నిర్వహించడం (ఇ) కొత్త టెక్నాలజీల మంచి చెడులను వివరించడానికి ప్రభుత్వాధికారులు, శాస్త్రవేత్తలు, ఇతర స్పెషలిస్టు సాక్షులు. వీరంతా రైతాంగం దగ్గరికి వచ్చి సాక్ష్యం చెప్పడం, (డి) ఈ మొత్తం ప్రక్రియలో, ఫలితాలలో దాపరికాలు లేకుండా ఉండడానికి, సమాచారం స్వేచ్ఛగా వినిమయం కావడానికి టెలివిజన్, విడియో టెక్నాలజీని వినియోగించడం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ శాఖ డిప్యూటీ కమిషనర్ - డైరెక్టర్ ప్రజాతీర్పు సాధించిన ముందడుగును ప్రశంసించారు. విధాన నిర్ణయాల ప్రక్రియలో ఒక ముఖ్యమైన సంప్రదాయాన్ని నెలకొల్పిందని వ్యాఖ్యానించారు.

అక్బల్‌రావు: ఇది అపూర్వం. ఇటువంటిది నేనెక్కడా చూడలేదు. మేం రైతులతో అనేక శిక్షణాకార్యక్రమాలు నిర్వహించాము. వ్యవసాయానికి సంబంధించిన వివిధ సాంకేతిక అంశాలమీద వేలాదిమంది రైతులు ఏటా శిక్షణ పొందుతున్నారు. ఇటువంటి కొత్త పద్ధతిని ప్రవేశ పెట్టినందుకు, రైతుల సమస్యలను వెల్లడిచేసి వాటికి పరిష్కారాలను వారినుంచి తెలుసుకునే ప్రయత్నం చేసినందుకు ధన్యవాదాలు.

దీర్ఘకాలిక దృష్టితో చూసే, విమర్శనాత్మకంగా చర్చించే, భవిష్యత్తును ఊహించే గలిగే ఆ ప్రక్రియలో భిన్నమయిన పాత్రధారులను, భాగస్వాములను చేయడం గురించి చాలామంది పరిశీలకులు వ్యాఖ్యానించారు. పర్యవేక్షక బృందం సభ్యులొకరు ఇలా అన్నారు.

సందీప్ చక్ర: ఇక్కడ అనుసరించిన మెథడాలజీ గొప్పది. ఈ సూత్రాలను ఇతర పరిస్థితులలో కూడా ఎలా అన్వయింప చేయవచ్చునో నేనిప్పటికే చూడ గలుగుతున్నాను. ఆంధ్రప్రదేశ్‌లో భూమిలేని కూలీల వంటి ఇతర సామాజిక గ్రూపులతో కూడా ఆహార, వ్యవసాయ భవితవ్యాల గురించిన పౌర జ్యూరీ ప్రక్రియను నిర్వహించ వచ్చును. భారతదేశంలోని జౌళిరంగం గురించి, సెక్స్ వర్కర్‌ల పరిస్థితి గురించి కూడా ఈ మెథడాలజీని అనుసరించి జ్యూరీలు నిర్వహించవచ్చును.

ప్రజాతీర్పులో ఉపయోగించిన మెథడాలజీలు వెంటనే ఆకట్టుకోవడం, వాటిని వివిధ సందర్భాలలో స్థానికంగా వినియోగించుకోవచ్చునన్నుకోవడం - ప్రజాతీర్పు సాధించిన ఒక ముఖ్యమైన ఫలితం. ఈ నివేదిక రాసే సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా అనేక పౌర సమాజ సంఘాలు ప్రజాతీర్పు కోసం రూపొందించిన మూడు వీడియోలను ప్రదర్శిస్తూ, గ్రామ స్థాయిలో పౌర న్యాయస్థానం భవిష్యత్ ఊహాచిత్రాల వర్క్‌షాపులను అనువర్తింప జేసుకుంటున్నారు. జ్యూరీలోని ఒక ఆదివాసీ సభ్యురాలు తూర్పుగోదావరిలోని స్వస్థలానికి వెళ్లిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుముల ప్రాంతం అంతా పర్యటించి ప్రజాతీర్పు జరిగిన పద్ధతి గురించి ఊరూరా వివరించారు. ప్రజాతీర్పు ప్రక్రియ ద్వారా తాను నేర్చుకున్న కొత్త విషయాలను ఆ సభ్యురాలు ఆదివాసీలే నిర్వహించే ఒక స్థానిక ఎన్‌జివో 'గిరిజన దీపిక' సహాయంతో అనేక గ్రామాలలో పంచుకొన్నారు. భవితవ్యాన్ని ఊహించే కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో నిర్వహించారు.

విస్తృతమైన విధానపరమైన నెట్‌వర్క్‌లతోను, విధానపరమైన మార్పుల ప్రక్రియతోను సంబంధం ఉన్నవారినే భాగస్వామ్య సంభాషణలలో పాలు పంచుకోవడానికి ఎంపిక జరిగేట్టు ప్రజాతీర్పు నమూనా జాగ్రత్త పడింది. ప్రజాతీర్పు ప్రక్రియనూ దాని ఫలితాన్నీ రెంటినీ కూడా విధాన నిర్ణయాలతో సంబంధం ఉన్న సివిల్ అధికారులను, సాంకేతిక సంస్థలను, సలహా మండళ్లను ప్రభావితం చేయడానికి చురుకుగా ఉపయోగించడం జరిగింది.

- జ్యూరీ తీర్పు, దానికి భారతదేశంలోనూ, ఇంగ్లండ్‌లోను లభించిన ప్రచారం ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యమకారులకు ఎంతో తోడ్పడ్డాయి. విజన్ 2020, దాని అంగాలైన కాంట్రాక్ట్ వ్యవసాయం, జన్యుమార్పిడి టెక్నాలజీలు, చిన్న రైతులను నిర్వాసితులను చేయడం వంటి వారికి వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాన్ని బలోపేతం చేయడానికి ప్రజాతీర్పు, దాని ప్రచారమూ ఉపకరించాయి.
- ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) వారి మానవాభివృద్ధి నివేదిక 2001ను ప్రజాతీర్పులో పాల్గొన్నవారు, పరిశీలకులు అనేకులు విమర్శించారు. జన్యుమార్పిడి పంటల గురించి పేదల అభిప్రాయాలను యుఎన్‌డిపి నివేదిక పట్టించుకోలేదని, పేదల వ్యవసాయ అవసరాలు తీర్చడానికి కొత్త బయోటెక్నాలజీలు ఉపకరిస్తాయని (డబ్ల్యు డబ్ల్యుడబ్ల్యు. యుఎన్‌డిపి.ఓ ఆర్‌జి/ హెచ్‌డిఆర్ 2001) యథాలాపంగా భావించిందని వారు తప్పు పట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 150 సంస్థలు మానవాభివృద్ధి నివేదిక రచయితలకు ఒక లేఖ పంపారు. ప్రజాతీర్పు ప్రక్రియ గురించి, జ్యూరీ తీర్పు గురించి (2001

జులై 10 నాడు నివేదిక వెలువడక మునుపే) ఆ లేఖలో వివరించారు. మానవాభివృద్ధి నివేదికను లండన్‌లో విడుదల చేసిన పత్రికా కార్యక్రమంలో ఉద్యమకారులు, జర్నలిస్టులు కూడా ప్రజాతీర్పు తీర్పును ప్రస్తావించి, ఎంతో ప్రభావవంతమైన మానవాభివృద్ధి నివేదిక ద్వారా యుఎన్‌డిపి కూడా పేద దేశాలలోని పేదల గొంతును వినిపించ వచ్చును కదా అని సూచించారు.

- బ్రిటన్‌లో, ఫ్రాన్స్‌లో పత్రికలలో వచ్చిన వార్తలు కూడా విధాన ప్రక్రియలను ప్రభావితం చేశాయి. విజన్ 2020లోని విధానపరమైన, సాంకేతికమైన చోదకాంశాలకు అంతర్జాతీయ అభివృద్ధి విభాగం (డిఎఫ్ఐడి) సహాయం అందిస్తున్నదని పత్రికలలో వార్తలు వచ్చాయి. (ది గార్డియన్, 7 జులై 2001, ది ఎకాలజిస్ట్, సెప్టెంబర్ 2001, లె మాండె, 20 డిసెంబర్ 2001) ఫలితంగా, బ్రిటిష్ విదేశాంగ మంత్రి, డిఎఫ్ఐడి అధిపతి క్లారా షార్ట్ పత్రికా విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం చెప్పవలసి వచ్చింది. (ది గార్డియన్ 11 జులై, 2001), తరువాత బ్రిటీష్ కామన్స్ సభలో ఒక ఎం.పి. సభ్యుడి ప్రశ్నకు కూడా వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. (రడ్డక్ 2001).

## 4.11 సాధికారత, అడ్వొకసీ

ప్రపంచ మీడియా మీద, లాబీయింగ్ రంగాలలోను జ్యూరీ ప్రక్రియ ఫలితాలు గణనీయమైన ప్రభావాన్ని వేశాయి. అయితే, ఈ ప్రభావం భారతీయ పేద ప్రజల జీవితాల మీద పనిచేస్తున్న గణనీయమైన శక్తులైన వ్యాపార కార్పొరేషన్ల మీద, దోనర్ల మీద, జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాల మీద తగినంతగా పడడం లేదు. పౌర జ్యూరీలో తుది నిర్ధారణలు చేసిన తరువాత వారికీ, మార్పులను సాధించగల అధికారం ఉన్న వారికీ మధ్య మధ్యవర్తి వ్యక్తులు, మధ్యవర్తి మార్గాలు పనిచేయడం ఆవశ్యకం.

**ఈ మధ్యవర్తి వ్యక్తులు, మార్గాలు చేయవలసిన పనులలో**

- ప్రజాతీర్పులో భాగస్వామ్యం వహించిన వ్యక్తులు, సంఘాల సంఘటన ఒకటి ఏర్పడాలి. విధాన నిర్ణేతల మీద ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను ఈ సంఘటన సమన్వయపరచాలి.
- గ్రూపుల మధ్య, అంటే అణగారిన ప్రజలు, విధాన నిర్ణేతలు, శాస్త్రవేత్తలు వంటి గ్రూపుల మధ్య నిర్మాణాత్మకమైన సంభాషణ జరగడానికి అనువుగా స్థానిక, రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలలో బహుళ భాగస్వామ్యంతో నేర్చుకునే బృందాల (మల్టీ స్టేక్ హోల్డర్స్ లెర్నింగ్ గ్రూప్స్)ను ఏర్పాటు చేయాలి. (ఐఐఇడి, ఐడిఎస్ 2000)
- చిన్న, సన్నకారు రైతులు తమ కమ్యూనిటీలలో తాము సంప్రదించుకునే వీలు కలిగించాలి. అధికారం మీద విశ్లేషణకు, సాధికారతకు మార్గాల అన్వేషణకు అక్షరాస్యతా కార్యక్రమాలతో సంబంధం కల్పించాలి.

ఎన్‌జీవోలు, రైతు సంఘాల సమాఖ్యలు, వినియోగదారుల సంఘాలు నిర్వహించగలిగిన ముఖ్యమైన పాత్ర ఇక్కడ ఉన్నది. జ్యూరీ నిర్ధారణలను వారు తమ ఉద్యమ ప్రచారానికి, లాబీయింగ్ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. ఈ కర్తవ్యాన్ని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన గిరిజనదీపిక సంస్థ ఈ పాటికే స్వీకరించింది. దీర్ఘకాలిక సాధికారతా ప్రక్రియల్లో ప్రజాతీర్పు వంటివి ఎట్లా భాగం కాగలవో చూపడానికి ఈ ఎన్జీవో ఉదాహరణగా నిలిచింది. రాష్ట్రంలోని అతి అట్టడుగున ఉన్న కొన్ని కమ్యూనిటీలలో అక్షరాస్యతా, సాధికారతా కార్యక్రమాలను గత పది సంవత్సరాలుగా గిరిజనదీపిక నిర్వహిస్తున్నది. హరిత విప్లవం పద్ధతుల వల్ల ఎదురైనవాటి సమస్యలతో సహా తమ అన్ని సమస్యలను ఆదివాసీలు తామే విశ్లేషించుకునే అవకాశం గిరిజన దీపిక కల్పిస్తున్నది. స్వయం సహాయ పథకాల ద్వారా కానీ, ప్రభావశీలమైన గ్రామీణ ఉద్యమం ద్వారా కానీ, ప్రదర్శనా కళారూపాల ద్వారా కానీ ఈ సంస్థ సమస్యలకు పరిష్కారాల సాధనకు ప్రయత్నిస్తున్నది. హరిత విప్లవం కాలంలో కోల్పోయిన దేశీయ పరిజ్ఞానాన్ని రైతాంగం తిరిగి స్వీకరించే విస్తృత, దీర్ఘకాలిక ప్రక్రియలో ప్రజాతీర్పు భాగం కావాలని పర్యవేక్షక బృందం సభ్యులు పౌల్‌టెర్ వీల్ ఆకాంక్షించారు.

ఇటువంటి నేర్చుకునే ప్రక్రియలు దీర్ఘకాలికంగా ఉండడానికి నేను ఎక్కువ అనుకూలుడిని. కమ్యూనిటీలో దీర్ఘకాలిక అభ్యసన ప్రక్రియలకు బలపరచాలని కూడా నేను అంటున్నాను. ఇటువంటివి కూడా అప్పుడుప్పుడు జరగవచ్చు. 20, 30 సంవత్సరాలుగా రైతాంగం మీద వ్యవసాయ విస్తరణ జ్ఞానాన్ని పైనుంచి రుద్దుతున్నారు. వారికి అందించే సమాచారం కూడా వక్రీకరించిన సమాచారమే. శిక్షణలని, పర్యటనలని చెప్పి రైతులకు ముక్కముక్కలుగా చెబుతారు. వ్యవసాయానికి కొత్త జీవం అందించాలని మీరు నిజంగా కోరుకుంటే, పర్యావరణ వ్యవస్థను పునరుజ్జీవింప చేయాలని మీరు భావిస్తే - చేయవలసింది నేర్చుకునే వాతావరణాన్ని రైతులకు అందించడం. రైతులు ప్రకృతితో తమ సంబంధంలో నుంచి తమను తాము కొత్తగా తెలుసుకోవాలి, అటువంటి నేర్చుకునే వాతావరణాన్ని అందించగలగాలి. మనం కావాలనుకుంటే, రైతులు చెప్పేది వినాలని మనం నిజంగా అనుకుంటే, వారిమీద రుద్దడం అయిపోయిన తరువాత తిరిగి వారికి తేరుకోవడానికి అవకాశం ఇవ్వాలి, పోయిన శక్తిని కూడ గట్టుకోవడానికి అవకాశం ఇవ్వాలి. తరతరాలుగా వారు చేస్తూ వచ్చిన పద్ధతిలో వ్యవసాయం చేయడానికి, పర్యావరణ వ్యవస్థను గమనించి, నేల అవసరాలను పట్టించుకుని, ఈ వాతావరణానికి,

నీటి లభ్యతకు ఎటువంటి పంటలు సరిపోతాయో గుర్తించి చేసే వ్యవసాయాన్ని రైతును చేయనివ్వాలి.

## 4.12 భవిష్యత్ చర్యలు

రానున్న 20 సంవత్సరాలలో రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన వ్యూహం - విజన్ 2020 వల్ల రాష్ట్ర ప్రజలలో కొన్ని శ్రేణులకు నష్టం, కొన్నిటికి ప్రయోజనం ఉండడం స్పష్టంగా కనిపిస్తున్నందున, దాని మీద తీవ్రమయిన చర్చ కొనసాగుతూనే ఉంటుంది. విధానపరమైన చర్చలలో భాగస్వామ్యం లభించని గ్రామీణ ప్రజానీకానికి విజన్ 2020 అంటే ఏమిటో చెప్పి, మరికొన్ని ప్రత్యామ్నాయ విజన్‌లను కూడా పరిచయం చేసి, వారు సొంతంగా తమకు ఒక విజన్ రూపొందించుకోవడానికి వీలు కల్పించడం ప్రజాతీర్పు ఉద్దేశం.

4.11లో సూచించిన అడ్వొకసీ వ్యూహాలకు తోడు, ఆంధ్రప్రదేశ్‌లోను, భారతదేశంలోని తక్కిన ప్రాంతాలలో, విదేశాలలోను గ్రామీణ జీవనాధారాలు, ఇతర సమస్యలపైన ప్రజాతీర్పు నమూనాలో మరికొన్ని ప్రక్రియలను నిర్వహించవచ్చును, అట్లా నిర్వహించగలిగే సామర్థ్యం ఆ నమూనాకు ఉన్నది. అనేక మంది పాత్రధారులు, అనేక రంగాలు భాగస్వామ్యం వహించే ప్రజాతీర్పు అందరినీ కలుపుకుపోతూ, సాధికారతను అందించేదిగా రూపొందింది. అయితే, దీనికి మానవ వనరుల రీత్యా, భౌతిక వనరుల రీత్యా, డబ్బు రీత్యా కూడా ఎంతో ఖర్చయింది. అయితే, విజన్ 2020 అమలుకోసం ఇప్పటికే మొదలయిన వందలాది కోట్ల డాలర్ల వ్యయంతో పోలిస్తే, ప్రజాతీర్పుకు జరిగిన వ్యయం నామమాత్రం.

తమ అభివృద్ధి నమూనా ప్రజాభాగస్వామ్యంతో కూడుకున్నదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రపంచబ్యాంకు, డిఎఫ్ఐడి చెప్పుకునే దానిలో నిజం ఉంటే, ప్రజాతీర్పులో ఉపయోగించిన ప్రక్రియలలోని కీలక అంశాలను ఆ సంస్థలు నెత్తిన పెట్టుకోవాలి. మరింత విశాలమైన పరిధిలో సమస్యల గురించిన సమాచారం ఇవ్వవలసి వస్తున్నప్పటికీ, జన్యుమార్పిడి టెక్నాలజీ వంటి నిర్దిష్ట అంశాల జోలికి విడిగా పోకుండా ఉండడం ప్రజాతీర్పు చేసిన మంచిపని అని విశ్వసిస్తున్నాము. అందువల్లనే జ్యూరీ సభ్యులు సమర్థంగా సంప్రదింపులు జరుపగలిగారు. ఆ టెక్నాలజీల గురించి విడిగా కాకుండా, పూర్తి ఆర్థిక, సామాజిక, పర్యావరణ సందర్భాలనునుంచి చూసి, అవి వచ్చే ఇరవై సంవత్సరాలలో తమ ఆహార వ్యవసాయాలను ఎలా ప్రభావితం చేస్తాయో చర్చించిన తరువాతే వారు ఒక నిర్ధారణకు రాగలిగారు. కాబట్టి, కేవలం వ్యవసాయ బయోటెక్నాలజీ మంచి చెడ్డల గురించి విడిగా చర్చించే ఫోకస్ గ్రూపులు, పిఆర్ఎలు, లేదా పౌరజ్యూరీలు - తక్కువ ఖర్చుతో జరుపవచ్చును కానీ, సమగ్రమైన ప్రజాస్వామిక ప్రక్రియలుగా జరుపలేము.

మొదటి ప్రజాతీర్పు ప్రక్రియలో పాలు పంచుకున్నవారు, ఈ నివేదికను చదివేవారితో కలసి భాగస్వామ్య అభివృద్ధిలో ఇటువంటి ప్రక్రియల శక్తి ఎంత, భవిష్యత్ కార్యక్రమాల కోసం దీని నుంచి నేర్చుకోవలసింది ఎంత అన్నది విమర్శనాత్మకంగా చర్చిస్తారని ఆశిస్తున్నాము. సామాజికంగా న్యాయమైన, పర్యావరణపరంగా సుస్థిరమైన, పౌరులే రూపుదిద్దే భవితవ్యాల కోసం పనిచేయడానికి సంప్రదింపుల పద్ధతుల ద్వారా పని చేయాలనుకునే వారికి ఈ జ్యూరీలో పాల్గొన్న 19 మంది జ్యూరర్ల విజయం ప్రేరణ అవుతుందని కూడా ఆశిస్తున్నాము.

## 4.13 పర్యవేక్షక బృందం మూల్యాంకనం

ప్రజాతీర్పు ప్రక్రియలో ఉన్న వివిధ దశలను పర్యవేక్షక బృందం విమర్శనాత్మకంగా మదింపు చేసింది.

ప్రతిరోజూ జ్యూరీ సంప్రదింపులు ముగిసిన తరువాత పర్యవేక్షకులు తమ పరిశీలనలను సమన్వయబృందంతో పంచుకున్నారు. ప్రజాతీర్పు కార్యక్రమ లాంఛనంగా ముగిసిన తరువాత మొత్తం కార్యక్రమం మీద కూడా పర్యవేక్షక బృందం తమ మూల్యాంకనాన్ని నిర్వహించింది. పర్యవేక్షక బృందం సభ్యులు చేసిన కొన్ని వ్యాఖ్యలను, సిఫారసులను ఇక్కడ చూడవచ్చు:

పౌర జ్యూరీలో చిన్నరైతుల ప్రాతినిధ్యం గురించి:

జస్టిస్ సావంత్: సమాజంలోని వివిధ వర్గాల నుంచి ప్రతినిధులను తీసుకుని రైతు జ్యూరీని కూర్చారు. వారందరూ చిన్న, సన్నకారు రైతులు కావడం నాకు సంతోషంగా ఉన్నది. పెద్ద భూస్వామ్య వర్గానికి చెందినవారు కానీ, ప్రభుత్వానికి విధాన నిర్ణయాలలో సలహాదారులుగా ఉన్నవారు కానీ జ్యూరీలో ఎవరూ లేరు.

నాయుడు: జ్యూరీని ఎంపిక చేసిన పద్ధతిలో ఎటువంటి లోపమూ లేదు.

ఆంధ్రప్రదేశ్‌లోని చిన్న రైతాంగానికి ప్రాతినిధ్యం వహించే జ్యూరీ ఇది. ఇది ఎంతో మెచ్చుకోదగ్గది.

చర్చలో అర్థవంతమైన భాగస్వామ్యాన్ని తీసుకునే శక్తి జ్యూరీకి ఉన్నదా అన్న అంశం మీద:

నాయుడు: జ్యూరీ భాగస్వామ్యం ఎంతో అంకిత భావంతో పాలు పంచుకున్నారు. సమావేశాలు నిర్వహించడానికి, సమాచారాన్ని ఇతరులతో పంచుకోవడానికి వారికి ఎంతో ఆత్మ విశ్వాసం ఉంది.

పాల్ టెర్‌వీల్: ఎంతో ఆసక్తికరమైన సంగతి ఏమంటే, రైతులు వారి జ్ఞానం, వారి తెలివి, వారి ఫీలింగ్స్ వీటి మీద ఆధారపడి స్పందించారు... తమ ముందు ఎవరున్నారు, తాము ఎవరితో వ్యవహరిస్తున్నారు అన్న అంశం మీద కాకుండా.... నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం - తమ ముందుకు వచ్చిన విషయం

పనికిమాలినదా, ఉట్టి ప్రచారమా, లేదా అందులో ఏదైనా పనికివచ్చేది ఉన్నదా అన్నది వారు వెంటనే పసిగట్టగలగడం. ఏది ఉపయోగకరం. ఏది అసలైనిది, ఏది కాదు అన్న వాటిని నిర్ధారించగలిగిన వివేకం ఇంకా మిగిలే ఉన్నదనేది నాకు ఎంతో ఆశ కలిగిస్తున్నది.

జస్టిస్ సావంత్: ఈ రైతులంతా తమకేది కావాలో గట్టిగా చెప్పగలవారు కావడం, ముఖ్యంగా ఆడవారు చెప్ప గలగడం నాకు సంతోషంగా ఉన్నది. ప్రభుత్వం నుంచి వచ్చిన విధాన నిర్ణేతలను వారు ఇరకాటంలో పడవేశారు. ఈ నిపుణులనేవారికి ఒక పార్శ్వానికి సంబంధించిన జ్ఞానమే, ఒక దారికి సంబంధించిన జ్ఞానమే ఉన్నది. ప్రజా తీర్పు ప్రక్రియ విశ్వసనీయత గురించి, నిజాయితీ గురించి:

జ్యూరీ సభ్యులు తాము విని ఉన్న నినాదాలనే వల్లించడం లేదంటారా అని అడిగినప్పుడు, పర్యవేక్షక బృందం చాలా ఖచ్చితమైన సమాధానం చెప్పింది. జ్యూరీ సభ్యుల మీద బయటివారి ప్రభావం కానీ, ఒత్తిడి కానీ ఏమీ లేవని స్పష్టం చేసింది.

పౌల్ టెర్‌వీల్: లేదు లేదు. వారు చెబుతున్నవి వారి మనసులోని మాటలే. వారిలో హత్తుకుపోయి ఉన్న అభిప్రాయాలవి. తాము దేని గురించి మాట్లాడుతున్నారో, ఏమి చేస్తున్నారో వారికి తెలుసును.

స్పెషలిస్టు సాక్షుల ప్రసంగాల మంచి చెడ్డల గురించి:

సందీప్ చక్ర: నిపుణ సాక్షుల ప్రసంగాలు సమతూకంగా, న్యాయంగా ఉన్నాయి. ఒకటి రెండు మినహాయింపులు తప్ప, నిపుణ సాక్షుల తర్కం మీదే, ఆధారాలమీద ఆధారపడి తమ వాదాన్ని వినిపించారు తప్ప, ప్రచారపు ఎత్తుగడలకు, చాకచక్యాలకు పాల్పడలేదు.

ప్రజాతీర్పులోని విద్యాసంబంధమైన విలువ గురించి, ఈ ప్రక్రియ దోహదం చేసిన వాతావరణం గురించి:

సావిత్రి: చాలామంది రైతులు మారుమూల పల్లెల నుంచి వచ్చారు. విజన్ 2020 లేదా జన్యుమార్పిడి పంటల పర్యవసానాలేమిటో వారికి తెలియదు. ఒక కార్యక్రమం తమ జీవితాలను ఎంతగా ప్రభావితం చేయగలదో తెలుసుకోవడం వారికి ఇదే ప్రథమం. ఇటువంటి వేదికలు, సమావేశాలు విస్తృతంగా నిర్వహించాలి.

నాయుడు: ఆహార వ్యవసాయ రంగాలకు సంబంధించిన విధాన నిర్ణయాల పర్యవసానాలు ఎట్లా ఉండబోతాయో చెబుతూ తీసిన మూడు విడియోలలో కొన్ని అంశాలు అతిశయోక్తులుగా ఉన్నాయి. వెక్కిరింత కోపం చేసిన అతి ఉంది కానీ, దాని వల్ల ప్రయోజనం ఉన్నది! సమస్యల గురించి అవగతం చేసుకోవడానికి, వాటి విశ్వరూపాన్ని తెలుసుకోవడానికి అది పనికి వచ్చింది.

జస్టిస్ సావంత్: సంభాషణ, సాక్ష్యం, విచారణ, సంప్రదింపు ఈ ప్రక్రియ అంతా ఏం చేయాలో తెలుసుకునేందుకు రైతులకు, తమ విధానాలు సరి అయిన దిశలోన్నాయో లేదో ఆలోచించేందుకు విధాన నిర్ణేతలకు సహాయం చేసింది. ఇద్దరూ పరస్పరం ఒకరి నుంచి ఒకరు నేర్చుకున్నారు.

సందీప్‌చక్ర: ఇక్కడ అనుసరించిన మెథడాలజీ గొప్పది. ఈ సూత్రాలను ఇతర పరిస్థితులలో కూడా ఎలా అన్వయింపజేయవచ్చో నేనిప్పటికి చూడ గలుగుతున్నాను. ఆంధ్రప్రదేశ్‌లో భూమిలేని కూలీల వంటి ఇతర సామాజిక గ్రూపులతో కూడా ఆహార, వ్యవసాయ భవితవ్యాల గురించిన పౌర జ్యూరీ ప్రక్రియను నిర్వహించవచ్చును. భారతదేశంలోని జౌళిరంగం గురించి, సెక్స్‌వర్కర్‌ల పరిస్థితి గురించి కూడా ఈ మెథడాలజీని అనుసరించి జ్యూరీలు నిర్వహించవచ్చును.

ఈ ప్రక్రియను మెరుగుపరచడం గురించి:

సావిత్రి: ఈ ఫోరమ్‌లు, సమావేశాలు ఆంధ్రప్రదేశ్ అంతా విస్తృతంగా నిర్వహించాలి. మరింత ఎక్కువ మంది మహిళలు ఇందులో పాల్గొనేలా ప్రోత్సహించాలి.

పౌల్ టెర్ వీల్: బయటి ప్రపంచం గురించి కొంత తెలిసిన వారు, కొంత ప్రయాణాలు చేసిన వారు, గ్రామ సభల్లో కానీ తమ గ్రామంలోని మరే వేదికలో గానీ అంతకంటె పెద్ద స్థాయిలో కానీ ఎంతో కొంత పాలుపంచుకునేవారు. ఇటువంటి వారు జ్యూరీలో ఉండేట్టు ఎంపికచేయడం ముఖ్యమని నా అభిప్రాయం... కమ్యూనిటీలో ఇంకా ఉన్న సామర్థ్యానికి ఈ ఎంపిక ప్రతిబింబించకపోవచ్చును కానీ, నా ప్రాధాన్యం దీర్ఘకాలికమైన నేర్చుకునే ప్రక్రియకే. కమ్యూనిటీలోనే నేర్చుకోవడానికి సహాయపడాలి. ఆ తరువాత ఇటువంటి జ్యూరీలను ఎప్పుడో ఒకసారి నిర్వహించాలి.

# 5. ప్రజాతీర్పు విస్తృత ప్రాధాన్యం - కొన్ని విమర్శనాత్మక ఆలోచనలు

ఇంకా రూపొందుతూనే ఉన్న ఈ కేంద్రీకృత ఆహారవ్యవస్థను ప్రపంచప్రజలు ఎప్పుడూ కోరుకోలేదు. అతి కొద్దిమంది అధికారం గల వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న నిర్ణయాల ఫలితం ఇది. ఈ ఒక్క వ్యవస్థ తప్ప గత్యంతరం లేదనడానికి లేదు. మన ఆహార వ్యవస్థని కొన్ని కీలక ప్రశ్నలు అడగడానికి ఇది తరుణం కాదా? ఈ తరానికి ముందు తరాలకు ఏది ఉత్తమమైనదీ తేల్చుకోవలసిన సమయం ఇది కాదా?

*విలియం హెఫర్ నాన్*
*కన్‌సాలిడేషన్ ఇన్‌ది ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ సెక్టర్ (1999)*

ఆంధ్రప్రదేశ్‌లో ఆహారవ్యవస్థ, జీవనాధారాలు, పర్యావరణం గురించి ప్రజాతీర్పు ముఖ్యమయిన ప్రశ్నల్ని లేవనెత్తుతోంది. ప్రజాతీర్పు లేవనెత్తుతున్న కొన్ని కీలక ఆలోచనలను ఈ కింది శీర్షికలకింద ఇస్తున్నాము.

- ఆధునికీకరణ, నిర్బంధం, నిరాదరణ
- అభివృద్ధి సహాయం పేదలకి ఉపయోగించడం
- నాగరికత ఎక్కువ మార్కెట్ తక్కువగా ఉండే విజన్

## 5.1 ఆధునికీకరణ, నిర్బంధం, నిరాదరణ

నిర్వాసితులైన వాళ్లలో ఎక్కువ శాతం ఆదివాసీలు (నర్మదా ప్రాజెక్టు). నిర్వాసితులైన దళితుల్ని కూడా లెక్కిస్తే ఆ సంఖ్య భరించలేనిదిగా తయారవుతుంది. షెడ్యూలు కులాల, తెగల కమిషనర్ లెక్క ప్రకారం నిర్వాసితుల్లో ఆదివాసీలు, దళితులు అరవై శాతం. భారతదేశ జనాభాలో ఎనిమిది శాతం ఆదివాసీలు, పదిహేను శాతమే దళితులు అనుకుంటే ఈ లెక్కలు మరో కొత్త కథ చెప్తాయి. తమ బాధితులు ఇతర 'జాతి' వారు కావడం జాతినిర్మాతల భారాన్ని తేలిక చేస్తుంది. వేరే వాళ్లు బిల్లులు కడితే ఖర్చు పెట్టుకునే పద్ధతి యిది. వేరే దేశాల ప్రజలు వేరే ప్రపంచాల ప్రజలు, భారతదేశంలో పేదవాళ్లు అతి ధనవంతుల జీవితాలకి సబ్సిడీ సమకూరుస్తున్నారు... రాజ్యం గుట్టుమట్టులను కొన్నిటినైనా విప్పవలసిన అవసరం వచ్చింది. అసమర్థమైనది, చేతగానిది, తడబడేది, అవినీతిమయమయింది అయినా మొత్తం మీద సామరస్యపూరితమైనదీ, ప్రధానంగా ప్రజాస్వామికమైనది అయిన భారత రాజ్యం గురించిన భ్రమలను పటాపంచలు చేయాలి. అదృశ్యమయిన 5 కోట్ల మంది ప్రజలను అలక్ష్యం ఖాతాలో జమవేయలేము. మనల్నిమనం మోసపుచ్చుకోవద్దు. ఇదంతా ఒక పద్ధతిప్రకారం జరుగుతున్నది. గురిపెట్టి మరీ జరుగుతున్నది. అవిశ్రాంతంగా జరుగుతున్నది. ఇది నూటికి నూరుశాతం మనుషులు చేస్తున్న నేరమే.

(అరుంధతీరాయ్ (1999)

చాలా వలసదేశాలలో లాగానే భారతదేశానికి కూడా, శాస్త్రవేత్తలు, ప్రణాళికావేత్తలు, బ్యూరోక్రాట్స్ కలసి ఒక శిష్ట ఆధిపత్యం ఉన్న పాలనావ్యవస్థ వారసత్వంగా వచ్చింది. ఈ శిష్ట వర్గానికి పేదలతో ఉన్న సంబంధం అతి తక్కువ (అల్వరాస్ 1992, విశ్వనాథన్ 1997). దళితులని ఇంకా వేధిస్తూనే ఉన్న కులవ్యవస్థ దీనికి కొంత కారణం. పైన అరుంధతీరాయ్ వర్ణించినట్లు, వెలికాబడ్డవారి విషయంలో భారతదేశపు సివిల్ సర్వెంట్ల అభిప్రాయాలు వలసపాలకుల అభిప్రాయాల కంటే అన్యాయంగా ఉంటాయి. వాస్తవికతలోని ఈ అంతరాన్ని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ కి చెందిన ఎ. ఆర్. వాసవి వ్యవసాయాభివృద్ధి సందర్భంలో అద్భుతంగా విశ్లేషించారు. (బాక్స్ 8 చూడండి)

దక్షిణ భారతదేశంలోని నిరుపేద రైతాంగం మీద హరిత విప్లవం (గ్రీన్ రివల్యూషన్ - జిఆర్) వేసిన అనేక ప్రమాదకరమైన ప్రభావాలను, తనను తాను కొనసాగించుకునే ప్రభావాలను వాసవి అధ్యయనం చూపుతోంది. సామాజికంగా కొన్ని వర్గాలను మినహాయించడం అన్న విశ్లేషణ చట్రంలో నుంచి దీన్ని మరింత బాగా అర్థంచేసుకోవచ్చు.

గ్రూపు ప్రవర్తన, స్వీకరణ (ఇన్‌క్లూషన్), నిరాదరణ (ఎక్స్‌క్లూషన్) క్రమాన్ని నిర్ణయిస్తుంది. (కబీర్ 2000). 'వ్యవస్థీకృతమైన పక్షపాతం' ఇందులో మొదటిది. ప్రబలంగా ఉండే విలువలు, నమ్మకాలు, ఆచారతతంగాలు, వ్యవస్థాగతమైన పద్ధతులు (ఆట లోని రూల్లన్నమాట) అన్నీ కూడా ఒక పద్ధతి ప్రకారం ఎప్పుడూ ఇతరులను పణంగా పెట్టి కొద్ది మంది ప్రయోజనాలని నెరవేరుస్తూ ఉంటాయి. ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే బీదర్‌లోకి గాని ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు గానీ (చౌదరి 2000) హరితవిప్లవ సాంకేతికతలు రావడంలో అంతర్జాతీయ సంస్థలు మొదలుకొని, స్థానిక ఏజెంట్ల దాకా కొన్నిసార్లు తెలియకుండా అయినా, స్పష్టంగా పెద్ద రైతులకు, ఇంగ్లీషు మాట్లాడే రైతులకి

## బాక్స్ 8. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం - 1997-98లో దక్షిణాదిలో రైతుల ఆత్మహత్యలు

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని బీదర్ జిల్లా మెట్ట ప్రాంతం. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండి వర్షపాతం తక్కువగా ఉండే ప్రాంతం. డిసెంబర్ 1997, మే 1998 మధ్య కాలంలో బీదర్, దాని పొరుగు జిల్లా గుల్బర్గాలో 23 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వాసవి ఒక పరిశోధకురాలు. ఆ ప్రాంతంలో వ్యవసాయం, మానవ చరిత్ర గురించి అనేక సంవత్సరాలుగా అధ్యయనం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో కొత్తగా మొదలైన ఆత్మహత్యలు, అక్కడ నెలకొన్న నిరాశాజనకమైన పరిస్థితులపై అధ్యయనం చేయడానికి తిరిగి బీదర్ వచ్చారు. భారతదేశంలోని పేద ప్రాంతాలన్నింటిలోను గత్తరలాగా వ్యాపించిన ఆత్మహత్యల్లో బీదర్-గుల్బర్గా ఆత్మహత్యలు ఒక చిన్నభాగం. భారతదేశంలోని మెట్ట ప్రాంతాలలో విశ్వరూపం దాలుస్తున్న సంక్షోభానికి ఇదొక సూచిక అని వాసవి నిర్ణయానికి వచ్చారు (వాసవి 1999 బి) (చౌదరి సంపాదకత్వం, 2000 కూడా చూడండి)

బీదర్‌లోని మొత్తం వైశాల్యంలో 82 శాతం సాగులో ఉంది. అందులో 8 శాతం ప్రాంతానికి మాత్రమే కాలువల ద్వారా నీటి సదుపాయం ఉంది. మిగతా ప్రాంతం అంతా వర్షపాతం మీద ఆధారపడాల్సిందే. ధనిక రైతులకి, విద్యుత్ ఛార్జీలు భరించగలిగిన వారికి బావులున్నాయి. దక్షిణాదిలో అత్యంత పేద జిల్లాలలో బీదర్ కూడా ఒకటి. అక్కడ రైతులలో ఎక్కువశాతం రెండు హెక్టార్ల కన్నా తక్కువ భూమి కలిగి ఉన్నవారే. కౌలు వ్యవసాయం ఎక్కువ. హరిత విప్లవానికి ముందు అక్కడ పూర్తి మెట్ట వ్యవసాయమే వుండేది. ఈ వ్యవసాయంలో వివిధ రకాల జొన్నలు, నూనెగింజలు, గోధుమలు ఇతర ధాన్యాలతో కలిసి పండించే వారు. ఎరువు పంటలైన సన్‌హెంప్, డైన్‌చా ఎక్కువంగా పండించడంతో భూసారాన్ని పరిరక్షించడం, తెగుళ్ల జబ్బులు తక్కువగా రావడం జరిగేది. ఇట్లాంటి వ్యవసాయం వల్ల వ్యవసాయ వుత్పాదకాలతో చాలా వరకు స్వయం సమృద్ధి వుండేది.

1966-67 కాలంలో శాస్త్రజ్ఞులు వరి, గోధుమలు, చెరకులో క్రొత్త రకాలను ప్రవేశ పెట్టారు. ఈ శాస్త్రజ్ఞుల అనుభవమంతా ఎక్కువ వర్షపాతం వుండే ప్రాంతాల నుంచి వచ్చింది. 1972-74లో ఈ ప్రాంతంలో దీర్ఘకాలం కరువు నెలకొంది. ఈ కరువు వల్ల కొరత ఏర్పడింది. స్థానిక రైతులపై ఈ క్రొత్త రకాల ప్రభావమేమిటి అన్న విషయాన్ని అంచనా వేయడానికి బదులు అక్కడ ప్రభుత్వం ఎక్కువ రసాయనాల అవసరం కల అధిక వుత్పత్తి, హరిత విప్లవ రకాలనే ప్రోత్సహించింది.

ధనిక రైతులు, వ్యవసాయ అసిస్టెంట్ల నుంచి, కంపెనీ ప్రతినిధుల నుంచి - ఒకరి నుంచి ఒకరు నేర్చుకున్న విషయాలను నిమ్న కులాలకు చెందిన పేదరైతులకు తెలియజేసే అవకాశం లేదు. ఎటువంటి అధికారిక సూచనలు లభించని నేపథ్యంలో పేద రైతులు, లాభాలను ఆర్జిస్తున్న ధనిక రైతులు ఏం చేస్తున్నారనేదాన్ని ఊహించడం, చూస్తూ ఉండటం మినహా మరేమీ చేయలేదు. హరిత విప్లవ పంటలను ప్రోత్సహించే వారి నిర్లక్ష్యం మూలంగా పేద రైతులు, ఎక్కువ దిగుబడినిచ్చే రకాలను పండించి తక్కువ దిగుబడులు పొందాల్సి వచ్చింది. సరయిన పద్ధతి, రక్షణా లేకుండా వాడిన రసాయనాల వల్ల వచ్చిన ఆరోగ్య సమస్యలు అదనంగా వచ్చి చేరినయి. ఈ రసాయాల చాలాసార్లు విషపూరితాలు. తమ సమస్యలన్నీ తమ అజ్ఞానం వల్లే వచ్చాయి అని అంటుంటే ఈ నిమ్నజాతి వ్యవసాయదారులు తమకి తరచుగా వచ్చే సంక్షోభాలని నిస్సహాయంగా ఎదుర్కోవాల్సి వస్తుంది. 1997-98లో ఆత్మహత్యల పరంపరకు ప్రధాన కారణం పచ్చపురుగు తెగులు. ఈ కీటకం వ్యాప్తి చేసిన తెగులుతో చిన్న రైతుల పంటలన్నీ దాదాపు నాశనం అయ్యాయి. దానితో వారు అప్పు పాలయ్యారు. ఈ అప్పులకి కారణం రైతులకి పురుగు మందుల విషయంలో లభించిన తప్పుడు సలహాలే. ఈ తెగుళ్ల వ్యాప్తికి వాతావరణ పరిస్థితులే కారణమైనప్పటికి అధిక వుత్పత్తి కంది పంటలన్నీ ప్రోత్సహిస్తున్న ఏజెన్సీలు దానికి అవసరమైన వుత్పాదకాలు రైతులని ఈ తెగుళ్ల విషయంలో నిస్సహాయమైన పరిస్థితిలో నిలబెడుతున్నాయి. స్థానిక పంటలనీ, స్థానిక జ్ఞానాన్ని కాదని, హరిత విప్లవకారులు కొత్తరకం వ్యవసాయాన్ని, దానికి సంబంధించిన విషయాలని సరిగా తెలియచేయకముందే, అలవాటు చేయకముందే ప్రవేశ పెట్టారు. చివరికి నిరాశా, నిస్పృహలకు గురైన రైతులకు ఏ మద్దతు లభించక, ఏ వ్యవస్థ సహకారం అందించడానికి ముందుకు రాకపోవడంతో వారు తమ ప్రాణాలను బలి పెట్టుకున్నారు. హెక్టారుకు వందల కొద్దీ అమెరికా డాలర్ల విలువైన పంట నష్టాన్ని చవిచూసిన వారికి కొన్ని వందల రూపాయల నష్టపరిహారాన్ని మాత్రమే అందించి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన చెక్కులు సొమ్ము చేసుకుంటే కనీసం బస్సు టిక్కెట్టుకు సరిపోని దుస్థితిని రైతులు ఎదుర్కొన్నారని వాసవి చెప్పారు.

చిన్న సన్నకారు రైతులు ఉమ్మడి కుటుంబాలతోను, తన సాటి కులంవాళ్లలోను ఇంతకు ముందు వ్యవసాయ పద్ధతులని, జ్ఞానాన్ని పంచుకునే వాళ్ళు. హరిత విప్లవ సాంకేతికత వాళ్లని ఈ 'సహాయ వ్యవస్థ' నుంచి దూరం చేసి ఏకాకులను చేసింది. పొరుగువాళ్లతో కంటె మార్కెట్‌లో దగ్గర సంబంధాలు ఏర్పడ్డాయి. పంట నష్టపోతే కుటుంబమంతా కలిసి దాన్ని ఎదుర్కోవటం కాక, అదొక వ్యక్తిగత సంక్షోభంగా మారింది. పంటలు పోయినప్పుడు, అప్పులు పెరిగిపోయినప్పుడు అందరి గౌరవానికి ఒకే విధంగా నష్టం జరగడం కాకుండా ఈ మొత్తం విషాదం కుటుంబాలకే పరిమితమవుతోంది. మొదలే సామాజికంగా నిరాదరణకు గురయిన వారికి ఈ అవమానం భరించరానిది అవుతోంది.

అనుకూలంగా పనిచేశారు. నిరక్షరాస్యులో లేదా తమ సొంత భాషలో మాత్రమే అక్షరాస్యులైనవారో అయిన చిన్న రైతులకు ఈ టెక్నాలజీ, వ్యవస్థాగత పక్షపాతం రెండూ హాని చేశాయి.

వెలిగా ఉంచడానికి మరొక పద్ధతి 'సామాజిక నిరాదరణ'. 'దీని ద్వారా సామాజిక సమూహాలు వనరులకు అవకాశాలకు ఉన్న అందుబాటును అదుపు చేసి ఎక్కువ ప్రతిఫలాలను సాధించాలనుకుంటాయి'. (కబీర్ 2000లో ఉటంకించిన పార్కర్) వ్యవస్థాగత పక్షపాతం మాదిరిగా కాకుండా, ఈ సామాజిక నిరాదరణ అనేది ఉద్దేశ్యపూర్వకంగా ఏ గ్రూపునైనా కానీ, భాష, కులము, అక్షరాస్యత, జాతి, సామాజిక మూలం, మతమూ ఏ ప్రాతిపదికమీదనైనా మినహాయించవచ్చును. బీదర్‌లో కానీ, ఆంధ్రప్రదేశ్‌లో కానీ టెక్నాలజీకి సంబంధించిన మౌఖిక, లిఖిత సమాచారం అంతా ఇంగ్లీషులోనో, హిందీలోనో మాత్రమే ఉండడం, చిన్న రైతుల్ని నిర్లక్ష్యం చేసేంతగా వ్యవసాయ అసిస్టెంట్లు పెద్ద రైతుల మీదే దృష్టి నిలపడం ఈ సామాజిక నిరాదరణకి ఉదాహరణలే. నిజానికి సాంప్రదాయ వ్యవసాయ విధానాలని అనుసరిస్తున్న చిన్న రైతులకి తమసొంత నెటవర్క్‌లని ఏర్పరుచుకోవడం సాధ్యమే. బీదర్‌లోను, మెదక్ జిల్లాలోను ఈ చిన్న రైతుల నెట్‌వర్క్‌లు చాలా చిన్న స్థాయిలో అయినా సఫలీకృతం అయినాయి. (సతీష్, పింబర్ట్ 1999). అయితే, హరిత విప్లవ సాంకేతికతల వల్ల ఏర్పడ్డ బలమైన శక్తులు తమ ప్రయోజనాలకి భంగం కలుగుతోందని గుర్తించగానే ఈ ప్రయత్నాలని తుంచేయడానికి ప్రయత్నించారు.

వెలి జరిగే మూడో పద్ధతి - నియమాలను తుంగలో తొక్కడం అంటే అధికారిక నియమాలకీ వాటి అమలుకీ మధ్య దూరం ఉండడం. పబ్లిక్ సెక్టార్‌లోను, న్యాయవ్యవస్థలోను కూడా ఇది సమస్యే. కోర్టులు 'వాళ్లు రూల్సు పాటించాలి అనుకున్నప్పుడే రూల్సు పాటిస్తాయి. ఒక వర్గాన్ని, ఒక జెండర్‌ని, ఒక జాతి (ఎథ్నిక్) ప్రయోజనాలని రక్షించాలనుకున్నప్పుడు జ్యుడిషియరీ అందుకు అనుగుణంగా నియమాలను వంచుతుంది. నిష్పక్షపాతంగా ఉన్నట్టు కనిపించడానికి నియమాలను ఝళిపిస్తుంది.' ప్రైవేటు సెక్టారులాగా కాకుండా పబ్లిక్ సెక్టారుకు కమ్యూనిటీలోని సామాజిక అవసరాలను పట్టించుకోవలసిన అధికారిక బాధ్యత ఉంటుంది. నియమాలను పక్కన బెట్టడం ఇక్కడ ఎక్కువ జరిగే అవకాశం ఉన్నది. కింది కులాల వారు భూములను అన్యాయంగా అమ్ముకోవడానికి అనుమతించడమే కాక ప్రభుత్వ విభాగాలు బీదర్‌లో 1997-98 లలో జరిగిన రైతుల ఆత్మహత్యల మీద దారుణమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. ప్రభుత్వం ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషను తయారుచేసిన నివేదిక 1998 చివరిలో వెలువడింది. ఈ రిపోర్టు చాలా ఆత్మహత్యలు ఆత్మహత్యలు కాదనీ ఇతరేతర కారణాల వల్ల సంభవించిన మరణాలను నష్టపరిహారాల కోసం ఆత్మహత్యలుగా చూపిస్తున్నారని అన్నది. ఈ ఆత్మహత్యలు 1999, 2000, 2001లలో కూడా కొనసాగాయి. ప్రభుత్వంలోని ఇతర శాఖలు ఈ సంక్షోభానికి పరిష్కారం ఆ ప్రాంతానికి మనస్తత్వ శాస్త్రవేత్తలను పంపించడమని సూచించాయి. 'మానసిక కారణాలు' అనే వాదన పెట్టడం ఇటువంటి సంక్షోభంలో వెనుక ఉన్న ఆర్థిక, సామాజిక కారణాలను నిరాకరించడమే. ప్రభుత్వ విధానాల్లోని సారాంశం, వైఖరి అంతా కూడా హరిత విప్లవ సాంకేతికతలనే ప్రోత్సహిస్తున్నాయని, అవి అప్పటికే ఉన్న సామాజిక నిరాదరణలను మరింత ఎక్కువ చేస్తున్నాయని గుర్తించకుండా దృష్టి మళ్లించడమే.

సామాజిక రంగంలో ఉన్న నిరాదరణే సహజవనరుల ప్రపంచంలోను ప్రతిఫలిస్తోంది. ఆహార, వ్యవసాయ విధానాలకి అవసరమైన జీవవైవిధ్యాన్ని పంటపొలాల్లోనుంచి, పచ్చిక బయళ్లనుంచి, నీటి నుంచి, అడవుల నుంచి గెంటివేశారు. ఉమ్మడి పరిజ్ఞానం, పర్యావరణ నిర్దిష్టమైన పరిజ్ఞానం, వ్యవసాయానికి ఉన్న స్థానిక సాంస్కృతిక భూమిక - ఇవి అంతరించిపోయాక ఇక సంక్లిష్టమైన వ్యవసాయపర్యావరణం అంతా పలచబడిపోతుంది. జీవవైవిధ్యం అంతరించిపోతుంది. ప్రభుత్వాలు, వ్యవసాయ వ్యాపార కార్పొరేషన్లు కలిసి వ్యవసాయ ప్రాధాన్యాలన్నీ మార్చేస్తుంటే, వ్యవసాయ సంస్కృతులన్నీ కూడా ఒక ప్రపంచ వ్యవసాయ వ్యవస్థలో సంలీనం అయిపోతున్నాయి. ఈ ప్రపంచ వ్యవసాయ వ్యవస్థ పర్యావరణ పరంగాను, సామాజికంగాను సుస్థిరతను కాక, సంపన్న వర్గాల వినియోగాన్ని, వారికి పెట్టుబడులను అందుబాటులోకి తేవడాన్ని ఇష్టపడుతుంది. ఈ క్రమంలో వ్యవసాయానికి ఉన్న బహుళరూపాలు, స్థానిక పరిస్థితులకు అనువైన పశురకాలు, అనేక పంటరకాలు, అటవీ ఆహారాలు, ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌లో అణగారిపోవడమో, అంతరించిపోవడమో గణనీయంగా జరుగుతున్నది. ఈ మధ్య కాలంలో జాతీయ జీవవైవిధ్య వ్యూహం, కార్యాచరణ ప్రణాళిక జరిపిన అధ్యయనాలలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్నోచోట్ల రకరకాల వ్యవసాయాలు ఉన్న చోట్ల, ఆహారానికి వ్యవసాయానికి అవసరమైన జీవవైవిధ్యం నశించిపోతున్నట్టు ఎన్నో సాక్ష్యాలు కనిపించాయి. సుస్థిర జీవనాధారాలకి, భూవినియోగానికి అవసరమైన ఇతర సహజ వనరులు కూడా అలాగే నశించిపోతున్నాయి. ఉదాహరణకు ఎగుమతులకోసం పండించే చెరుకు లాంటి పంటలకు నీరు ఎక్కువఅవసరం. నీరు ఎక్కువ అవసరమైన ఇలాంటి పంటలు జలవనరులను ఆక్రమించుకోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి.

ప్రజాతీర్పు హరిత విప్లవం వల్ల వచ్చిన దుష్పరిణామాలు కొన్నిటిని ధ్రువీకరించింది. హరితవిప్లవపు దుష్పరిణామాలు అనుభవించిన వాళ్లు విజన్ 2020లో వున్న ఈ సామాజిక, పర్యావరణ

## బాక్స్ 9. విజన్ 2020 - ఆంధ్రప్రదేశ్‌లో ఆహార, వ్యవసాయ ఆధునికీకరణ

విజన్ 2020 ఆహార, వ్యవసాయ ప్రణాళికలు హరిత విప్లవ నమూనా వ్యవసాయాభివృద్ధే. విజన్ 2020/ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, ఆహార విధానాలను తిరిగి అమలుచేయడం విజన్ 2020 ప్రణాళిక. ఉత్పాదకత పెంపుదలకు ప్రాధాన్యత, ఆధునికీకరణ, బాహ్యవనంలో ఉపయోగం, జాతీయ అంతర్జాతీయ మార్కెట్లపై ఆధారపడటం... ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రధాన చర్యలు. ఆహార, వ్యవసాయ విధానాలపై కొన్ని ముఖ్య లక్ష్యాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

- వ్యవసాయ రంగం సగటున 6 శాతం వాస్తవ అభివృద్ధి రేటును సాధించడం, అభివృద్ధి చెందడానికి ఎక్కువ సామర్థ్యం గల రంగాలపై మరింతగా దృష్టి సారించడం, విలువ ఆధారిత (వేల్యు యాడెడ్) ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి ప్రయత్నించడం. ఈ వృద్ధిచోదకాలలో వరి, కోళ్ళ పరిశ్రమ, పాడి పరిశ్రమ, పండ్లతోటల పెంపకం, చేపల పెంపకం వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఉన్నాయి. విత్తనాలు, నూనె గింజలు, ప్రత్తి, చెఱకు, పొగాకు, మొక్కజొన్న లాంటి వాటి అభివృద్ధికి కూడా ప్రాధాన్యత.
- వచ్చే 20 సంవత్సరాలలో రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాలు, వ్యవసాయంపై ఆధారపడే జనాభా 40 నుంచి 45 శాతానికి తగ్గిపోతుంది. యంత్రీకరణ, భూకమతాల ఏకీకరణ వల్ల తమ ఉపాధిని పోగొట్టుకునే 2.5 కోట్ల మందికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించవలసి ఉంటుంది. అనుబంధ రంగాలనుంచి మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయి స్త్రీలు తమ వంతు లబ్ధిని పొందేందుకు నైపుణ్యాన్ని మెరుగు పరచుకోవాలి.
- ఎక్కువ దిగుబడినిచ్చే జన్యుపరంగా రూపాంతరం చెందిన పంటలు, పశుసంపదతో సహా క్రొత్త బయోటెక్నాలజీ అభివృద్ధి చేసి ఆహార, వ్యవసాయ విధానాలలోకి ప్రవేశ పెట్టడం.
- మొత్తంగా పెట్టుబడిని రూ.1,60,000 కోట్లుగా అంచనా వేయగా అందులో రూ. 1,25,000 కోట్లు నీటిపారుదల రంగానికే కేటాయింపు.
- ప్రభుత్వ వనరులు చాలా పరిమితమైనందువల్ల ఈ పెట్టుబడిలో చాలాభాగం ప్రైవేటు రంగం నుంచే రాబట్టడం. కార్పొరేషన్లు, సహకార సంస్థలు, రైతులు, పారిశ్రామిక వేత్తలతో సహా అన్ని రకాల ప్రైవేటు వ్యక్తుల నుంచి కూడా పెట్టుబడి లభించే విధంగా వ్యవసాయ విధానాల రూపకల్పన.
- వ్యవసాయ రంగంలోకి ప్రైవేటు పెట్టుబడిని ఆహ్వానించడం అంటే అర్థం - స్వేచ్ఛాయుతమైన, మరింత సమర్థమైన మార్కెట్లను సాధ్యం చేసే విధానాన్ని అనుసరించడం. ఈ విధానంలో వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, మందులు, విత్తనాలు, పనిముట్లు వంటి వాటి ధరలను, వ్యవసాయోత్పత్తి ధరలను (ఉదాహరణకు- బియ్యం మార్కెట్ల మీద ఆంక్షలను తొలగించడం) నియంత్రిండం: వ్యవసాయాధార ఉత్పత్తుల ఎగుమతుల కోసం నిలకడైన విధానాలు (ఉదా: ఎగుమతి మార్కెట్లను క్రమపద్ధతి ప్రకారం నిర్మించడానికి దీర్ఘకాలిక బియ్యం ఎగుమతి). అందుబాటులో పరపతి, వ్యవసాయాధార పరిశ్రమకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించడం, అభివృద్ధి చేయడం (ఉదా: కోల్డ్ స్టోరేజి యంత్రా మీద కస్టమ్స్/ఎక్సైజ్ సుంకం తగ్గింపు, కోల్డ్ స్టోరేజి చట్టం సవరణ)
- రైతులు, కార్పొరేషన్ల మధ్య ప్రత్యక్ష కాంట్రాక్టు పద్ధతిన వ్యవసాయం ద్వారా రైతులకు, కార్పొరేట్ రంగానికి ప్రత్యక్ష సంబంధ బాంధవ్యాలను ప్రోత్సహించే విధానాలను అమలు పరచడంతో కార్పొరేట్ రంగం నుంచి మరింత పెట్టుబడులను పొందగలగడం. వ్యవసాయ/పరిశ్రమలకు పెద్ద ఎత్తున పెట్టుబడులను ప్రోత్సహించడానికి రాయితీలనివ్వడం (ఉదాహరణకు ప్రాసెసింగ్ జరిగిన ఆహార పదార్థాలపై అమ్మకం పన్ను ఎత్తివేత).

ఆధారం..... Goa0 1999 2000A 2000B, 2001A, 2001B
www.andhrapradesh.com

నిరాదరణలని గుర్తించగలిగారు. ఆహార, వ్యవసాయ ప్రణాళికలు ఈ సామాజిక, పర్యావరణ నిరాదరణలని వారు గుర్తించ గలిగారు. పౌర న్యాయస్థానం ఖచ్చితంగా ఈ అభివృద్ధి నమూనాని తిరస్కరించింది. ఏ అభివృద్ధి నమూనా అయితే తమని తమ ప్రధాన జీవనాధారాలైన భూమి, నీరు, అడవులు, పశుసంపదల నుంచి విడదీస్తాయో, మినహాయిస్తాయో ఆ అభివృద్ధి నమూనాని వాళ్ళు తిరస్కరిస్తున్నారు. ఈ అభివృద్ధి నమూనా జీవవైవిధ్యాన్ని, స్థానిక నియంత్రణనీ, ఆధునికీకరణ పేరుతో అప్రధానం చేసేస్తుంది. వెనక్కి నెట్టేస్తుంది. ప్రజాతీర్పు భవిష్యత్తు ఆకాంక్షంతా ఆంధ్రప్రదేశ్‌లో కూడా స్థానిక, వైవిధ్య ఆహార వ్యవస్థలని తిరిగి చిగురింపజేయడమే. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలలో విస్తారంగా జీవవైవిధ్యాన్ని, ఇతర అంతర్గత వనరులని వాడుకోవడం, సహాయకారిగా ఉండే మార్కెట్లు ఉండడం, వెసులుబాటుతో కూడిన సహజవనరుల యాజమాన్యం, రాష్ట్రవ్యాప్తంగా వికేంద్రీకరించిన పరిపాలన - ఇవన్నీ కూడా ప్రజాతీర్పు నొక్కిచెప్పిన విలువలు.

## 5.2 అభివృద్ధి సహాయం పేదలకు ఉపయోగపడేలా చేయడం

ప్రజాతీర్పు విధానము, ఫలితాలూ కూడా ఆంధ్రప్రదేశ్‌లోని అభివృద్ధి సహాయం మీద అనేక ప్రభావాలు వేస్తుంది. నిజానికి తమ ఆహార వ్యవసాయ భవితవ్యాల ఆకాంక్షను బలపరచవలసిందిగా ప్రజాతీర్పు విదేశీ సహాయ సంస్థలకు పిలుపునిచ్చింది. ఈ అట్టడుగునుంచి వచ్చిన అభిప్రాయాలను అంగీకరించాలంటే తాము అసలు ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు సహాయం చేస్తున్నామో చాలా సహాయ సంస్థలు పునరాలోచించుకోవలసి వస్తుంది.

ప్రపంచబ్యాంకు, బ్రిటీషు ప్రభుత్వానికి చెందిన అంతర్జాతీయ అభివృద్ధి సహాయ విభాగం (డిఎఫ్‌ఐడి) ఆంధ్రప్రదేశ్‌లో విదేశీసహాయాన్ని అందిస్తున్న ప్రధానసంస్థలు . పేదరికాన్ని తగ్గించడానికి, ప్రపంచీకరణా వాణిజ్యమూ అవసరమని ఆ సంస్థలు భావిస్తున్నాయి. అధికార డాక్యుమెంట ప్రకారం ఈ రెండు సహాయ సంస్థలు కూడా రాష్ట్రాన్ని ప్రపంచ మార్కెట్లతో అనుసందానించే విజన్ 2020 ప్రయత్నానికి సహాయపడుతున్నాయి. డిఎఫ్‌ఐడి అంతర్జాతీయ అభివృద్ధి మీద ఒక శ్వేతపత్రాన్ని తయారుచేసింది. ప్రపంచీకరణ పేదవారికోసం పనిచేసేట్టు చేయడం అన్న పేరుతో తయారు చేసిన ఆ శ్వేతపత్రం పేదరికాన్ని తగ్గించడానికి, సుస్థిరఅభివృద్ధికి ఇంతకు మునుపు ఎన్నడూ లేని అవకాశాలను ప్రపంచ వాణిజ్యం కల్పిస్తుందని అన్నది. (డిఎఫ్‌ఐడి 2000). ఇదే విధంగా ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు పేదరికాన్ని తగ్గించడానికి ఉపయోగపడతాయని ప్రపంచబ్యాంకు భావిస్తోంది. (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వరల్డ్‌బ్యాంక్.ఓఆర్‌జి) పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రపంచీకరణ కావాలని మూడో ప్రపంచదేశాల ప్రజలు కోరుకుంటున్నారని ప్రపంచబ్యాంకు, డిఎఫ్‌ఐడి కూడా వాదిస్తున్నాయి. 'పేదప్రజల గొంతు వినాలని' ఆ రెండు సంస్థల అధికారులు అంటున్నారు. తమ దేశాల్లో ప్రపంచీకరణకు వ్యతిరేకంగా వినిపిస్తున్న విమర్శలను కొట్టిపారేస్తున్నారు.

అయినప్పటికీ ప్రపంచబ్యాంకు గానీ, డిఎఫ్‌ఐడి కానీ ఈ 'పేదల గొంతు' వినబడడానికి అవసరమైన మెథడాలజీని తమ కార్యక్రమాల రూపకల్పనలో ఉపయోగించుకుంటున్నానడానికి, పేదప్రజల ప్రాధాన్యాలకి చోటు కల్పించడానికి అవసరమైన మెథడాలజీని ఒక పద్ధతి ప్రకారం విస్తృతంగా వాడింది లేదు.

అవసరాలని గుర్తించడంలోను, ప్రాధాన్యాలను రూపొందించడంలోను ఈ 'దాతలు' అనుసరిస్తున్న పద్ధతులని పర్యవేక్షించడానికి ఏవిధమైన స్వతంత్రమైన సదుపాయాలు, పేదలకి, అణగారినవారికీ స్థానమున్న సదుపాయాలు లేవు. ఈ దాతలే వాళ్ల మేధావులు వాడుతున్న పద్ధతులు ఎంతవరకు నమ్మదగినవి, నిష్పక్షపాతమైనవి, సందర్భానుకూలమైనవి? సమానస్థాయిగలిగినవారిచేత ఒక సమీక్ష కానీ, బయటివారి మదింపు కానీ, స్వతంత్ర పర్యవేక్షణ కానీ లేకుండా ఈ కార్యక్రమాలు రూపొంది అమలుజరుగుతున్నప్పుడు ఈ సహాయాన్ని అంతటినీ కొన్ని శక్తులే కబ్జా చేయవని నమ్మకం ఏమిటి? దాతలు పేదల ప్రాధాన్యాలని అర్థంచేసుకోవడానికి వారి వివేకం మీద ఆధారపడి కార్యక్రమాలు రూపొందించడానికి తగినంత సమయం, అవకాశం తీసుకున్నారా? ఈ ప్రాధాన్యాలనీ, వివేకాన్నీ అర్థంచేసుకోవడానికి అవసరమైన 'డిప్స్' పద్ధతులను ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాలలో సహాయం అందించడానికి చర్చలు జరపడంలో ప్రణాళికారచనలో ఉపయోగించారా? పౌర న్యాయస్థానాలు, పౌరప్యానెల్‌లు, కమిటీలు, ఏకాభిప్రాయసాధన ప్రయత్నాలు, సినేరియో వర్క్‌షాప్‌లు, భవిష్యత్ ఊహాచిత్రాలతో వర్క్‌షాప్‌లు, సంప్రదింపులతో కూడిన పోలింగ్, ఫోకస్ గ్రూపులు, బహుళ ప్రమాణాల మేపింగ్, బహిరంగ సభలు, భాగస్వామ్య అభ్యాసన, కార్యాచరణ పద్ధతుల (పిఎల్‌ఏ), విజనింగ్ ఎక్సర్‌సైజులు - ఇటువంటివన్నీ పేదల తెలివితేటల మీద ఆధారపడి వారి ప్రాధాన్యాలను గుర్తించేందుకు పనికి వచ్చే పద్ధతులు.

ఈ పరిశీలనలు అన్నీ కూడా ప్రతిపాదించేదేమంటే, ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచబ్యాంకు కానీ, డిఎఫ్‌ఐడి కానీ, ముందే తీసుకున్న వైఖరులతో, చాలా సామన్యీకరించిన ఆర్థికసూత్రాలతోటి, పేదవాళ్ల అవసరాల మీద ఏ మాత్రమూ నిరూపితం కాని ఆలోచనలతోటి కార్యక్రమాలను రూపొందిస్తున్నారని. ఇందుకు ఒక చెప్పకోదగిన ఉదాహరణ ఏమిటంటే -- ఆధునికీకరణ పెరుగుతున్న కొద్దీ, రాష్ట్రంలో వ్యవసాయం మీద ఆధారపడి జీవించే వారి సంఖ్య శీఘ్రంగా తగ్గుతుందని లెక్కవేసి మరీ ఈ రాష్ట్రానికి సహాయం అందుతున్నది. అటువంటి పరిణామమే ఆర్థిక సమర్థత అన్న అభిప్రాయం ఈ సహాయాల వెనుక ఉన్నది. ఈ ఉద్దేశ్యాలకు అనుగుణంగానే పెట్టుబడులు వ్యవసాయేతర జీవనాధారాలకీ, అధిక పెట్టుబడులు అవసరమైన సదుపాయాలకీ తరలిపోతోంది. అన్ని సహాయకార్యక్రమాల్లోను సుస్థిరత కలిగిన ఆహారవ్యవస్థల, స్థానిక ఆర్థిక వ్యవస్థల పునః ప్రతిష్ట నిర్లక్ష్యానికి గురవుతోంది. నిజానికి ప్రజాతీర్పు, ఆహార, వ్యవసాయ భవితవ్యాల గురించి న్యాయనిర్ణేతల అభిప్రాయాలు కూడా ఆంధ్రప్రదేశ్‌కి సహాయం అందిస్తున్న ప్రపంచబ్యాంకు, డిఎఫ్‌ఐడి, ఇతర దాతసంస్థలు కార్యక్రమాలలో కూడా పేదవాళ్ల అభిప్రాయాలు పరిగణనలోనికి రావడం లేదు.

పేదవాళ్ల ప్రాధాన్యాలకి, అభివృద్ధి కార్యక్రమాలకీ పొంతన లేకపోవడం అది భారతదేశంలోను, మరి కొన్ని చోట్ల కూడా ప్రామాన్యం అయింది. పాల్ రిచర్డ్స్, రాబర్ట్ చాంబర్స్ చేసిన అనేక అధ్యయనాల్లో నిపుణులు సామాజిక మినహాయింపుకి గురయిన వారి పరిస్థితులేమిటో అర్థం చేసుకోలేకపోవడం వల్ల అభివృద్ధి నిధులు ఎలా వృధా అవుతున్నాయో, ఒక్కొక్కసారి ఈ కార్యక్రమాలు వాళ్లకి హానికరంగా ఎలా తయారవుతున్నాయో వివరించారు. వాళ్లిద్దరు

తమ రచనలలో ఈ అభివృద్ధి రంగంలో ఉన్న వాళ్లు చేసే తప్పులు వాళ్ల వాళ్ల నమ్మకాలలో, ఆలోచనలలో, పనులలో ఎంతగా వేళ్లూనుకొని ఉన్నాయో అని దానికి ఎన్నో ఉదాహరణలు చూపించారు. ఈ అభివృద్ధిరంగ నిపుణులలో, ఎన్నో సంస్థల్లో పనిచేస్తున్న మేనేజర్లు, శాస్త్రవేత్తలు, ప్రణాళికావేత్తలు, విద్యావేత్తలు, కన్సల్టంట్లు మొదలైనవారున్నారు. వివిధరంగాలలో పనిచేస్తున్నవాళ్లున్నారు. సహాయసంస్థల్లోను, జాతీయ బ్యూరోక్రసీలోను, పరిశోధనాశిక్షణాసంస్థల్లోను, విశ్వవిద్యాలయాల్లోను, కాలేజీల్లోను ప్రైవేటు సంస్థల్లోనూ ఉన్నారు. అంతమంది ఎలా తప్పు చేయగలిగారు? ఇంతకాలం ఎలా తప్పు చేయగలిగారు? ఈ పొరపాట్లు ఎట్లా సాధ్యమయ్యాయి ? ఇవి సుస్థిరంగా ఎలా కొనసాగుతున్నాయి ? (చాంబర్స్ 1993:30)

ఈ పరిశీలకులు అంతా మొదలు వాళ్ల సొంత అభిప్రాయాలనుంచి, ఆకాంక్షల నుంచీ సమాధానాలు సాధిస్తారన్నది చాంబర్స్ నిర్ధారణ. అంతేతప్ప వాళ్లు తెలుసుకునే కమ్యూనిటీల గురించిన, పద్ధతులగురించిన వాస్తవపరిస్థితి పట్ల ఒక సానుభూతితో కాదు. ఒకసారి ఒక మాయ సృష్టించబడినతరువాత పైన చెప్పినవాళ్లలో ఆ భ్రమని కొనసాగించడం ద్వారా లాభపడే వాళ్లే ఎక్కువమంది ఉంటారు. తప్పు అని తెలిసినా వాదనలని కొనసాగించడం తప్పనిసరి అవుతుంది. ప్రాజెక్టుల్లో ఈ అబద్దాలని కొనసాగించేవాళ్ల జీతాలని కొనసాగించడానికీ అది అవసరమవుతుంది. సాటివారి నుంచి వచ్చే ఒత్తిడిగురించి కూడా చాంబర్స్ మాట్లాడారు. ఒక విషయంలో పాండిత్యం సాధించడం, దాని వల్ల ఆ సబ్జక్టులో ప్రత్యేకమైన డిగ్రీలు లేనివాళ్ల దృష్టికోణాలను నిర్లక్ష్యం చేయడం - వీటి గురించి కూడా ఉదాహరణలిచ్చారు. గ్రామీణ పేదవారి జీవనసత్యాలకి, పట్టణ మధ్యతరగతికీ మధ్య వ్యవస్థీకృతమైన దూరం ఉంది. ఈ పట్టణ మధ్యతరగతి నిపుణులు గ్రామీణ పేదల సజీవవాస్తవికతను పట్టించుకోకుండా, ప్రాథమికం కాని సమాచారం మీద ఆధారపడతారు. అందుతున్న నిధుల వల్ల, సమకూరుతున్న నైపుణ్యం వల్ల ఈ గ్రూపులవారికి సంక్రమించే అధికారం గురించి వ్యాఖ్యానిస్తూ చాంబర్స్, అభివృద్ధి ప్రాజెక్టుల అమలులో ఆ అధికారానికి వాస్తవికత గురించి ఒక నిర్దిష్టమైన అవగాహన ఉంటుందని, ఎదురయ్యే భిన్న వాస్తవికతలను అంగీకరించలేని అంధత్వం సమకూరుతుందని అంటారు.

ప్రజాతీర్పు వెలుగులో ప్రపంచబ్యాంకు, డిఎఫ్ఐడి సమర్థిస్తున్న 'పేదలకు అనుకూలమైన వాణిజ్యం', ప్రపంచీకరణని, విజన్ 2020ని అమలుపరచడం అన్నది తీవ్ర సమస్యగా మారింది. అభివృద్ధి రంగంలోని ప్రొఫెషనల్స్, విద్యావేత్తలు తరచుగా పేదవాళ్లని బలహీనులుగా, మినహాయించినవారనీ ఎలా తప్పుగా ప్రకటిస్తారో లీటన్ చెప్పినది ఇక్కడ ఎంతో సందర్భశుద్ధికలిగినది.

ఈ అభిప్రాయాలన్నీ దాదాపు మేధోపరమైన నిర్మాణాల నుంచే వస్తున్నాయి. వ్యవసాయదారుల జీవితాలని ఒక చక్కటి చట్రంలో ఇమిడ్చే మేధోపరమైన నిర్మాణాలు ఇవి. ఈ చట్రాలు అన్నీ కూడా సమస్యల పరిష్కారానికి మార్పులు తేవడానికీ సర్వరోగనివారిణులను ప్రతిపాదిస్తాయి. రైతుల అభిప్రాయాలకీ, అందులోనూ పేదరైతుల, రైతుకూలీల అభిప్రాయాలకి, ఉద్దేశ్యాలకి ఎప్పుడూ కూడా గుర్తింపు రాదు. ఈ పరిస్థితులకు అన్వయించిన వివిధ చట్రాల వైఖరులన్నీ పైనుంచి రూపొందినవి మాత్రమే. అభివృద్ధికి లక్ష్యం అయిన పేద గ్రామీణ స్త్రీపురుషులు తమ గురించి మేధావులు రాసిన మాటలు చదవడం తటస్థిస్తే ఏమనుకుంటారో తెలుసుకోవడానికి ఎప్పుడన్నా ఒకసారి ప్రయత్నం జరుగుతుంది. వాళ్లు చెప్పేది 'వింటున్నారంటే' 'ఆధునికీరణ' (లేదా తరువాత ప్రపంచీకరణ) ప్రక్రియవారికి పరిచయం కాబోతున్నదన్నమాట. పెట్టుబడిమార్కెట్‌ల వ్యవస్థను, వ్యక్తిగత ఆర్థిక కార్యకలాపాలను వారికి రుచిచూపించబోతున్నారన్నమాట. అభివృద్ధిని అందుకునే వారు 'గేమ్‌రూల్స్' ప్రకారం ఆట ఆడాలి. ఒక అసమానమైన మైదానంలో ఆటగాళ్లుగా తయారుచేయడానికి మాత్రమే 'వారిని వినడం'. (లీటన్ 2002)

ప్రజాతీర్పు వల్ల తెలిసిందేమిటంటే పేదవాళ్లకీ అనుకూలమైన ఆటస్థలాలు, విలువైన అభివృద్ధి ఎంపికలు సాధ్యమవుతాయి. పౌరులు వాళ్ల విధాన భవితవ్యాన్ని తన సొంత ఎంపికలతో నిర్ణయించుకున్నప్పుడు ఇదిసాధ్యమవుతుంది. పేదరికం నిర్మూలనకి ప్రపంచీకరణ, అంతర్జాతీయ వాణిజ్యమూ, పెట్టుబడిదారీ సంబంధాల విస్తృతి మాత్రమే సహకరిస్తాయని సంప్రదింపుల ప్రక్రియ భావించలేదు. విదేశీ దాత సంస్థలన్నీ కూడా విజన్ 2020ని సమర్థించడం మానుకుని, ఆహార, వ్యవసాయ రంగాల క్షేమానికి స్థానిక అర్థాలను గౌరవించమనీ ఈ జ్యూరీ పిలుపునిచ్చింది.

## 5.3 విపణుల్ని తగ్గించి నాగరికతను పెంచాలి :

ప్రజాతీర్పుకు వచ్చిన పౌరులు ఆహార, వ్యవసాయరంగాల విధాన భవిష్యత్తుల్ని నిర్మించారు. మేధోపరంగానూ, హృదయాల తోటి కూడా ఒకళ్లనొకళ్లు ఎదుర్కొంటూ ఒక మెట్టుమీద మెట్టుగా తార్కికంగా ఈ విధాన భవిష్యత్తుల్ని తయారుచేశారు. ఇతరుల అభిప్రాయాల గురించి, భావాల గురించి మాటల్లో, భౌతిక వ్యక్తిగత సామీప్యతతో కలసి నిర్ణయాలు తీసుకునే మార్గంలో ఒకళ్ల గురించి ఒకళ్లు తెలుసుకున్నారు. సాంకేతిక విషయాలు స్పష్టంగా అర్థమయ్యేటట్టు వాళ్లకు వివరించినప్పుడు, వాళ్లు రాజకీయనిర్ణయాలు తీసుకున్నారు. ఈ అర్థంలో ప్రజాతీర్పు పౌరసత్వం గురించి, రాజకీయాలు, నాగరికత గురించిన ఒక ఉత్తమశ్రేణి దృష్టి గురించిన లోతైన ఆలోచనలను ప్రజాతీర్పు లేవనెత్తింది.

రాజకీయాలు, నాగరికత అన్న మాటలను కూడా ప్రాచీన గ్రీకులు, రోమన్లు మొదట నిర్వచించిన అర్థంలో వాడడం జరిగింది. పౌరులనే భావనకి ప్రపంచ నాగరికతలోనే వేళ్లున్నాయి. పొలిటిక్స్

(రాజకీయం) అన్నమాటే గ్రీకునుంచి పుట్టింది. పొలిస్ అనే గ్రీకు మాటకు అర్థం పబ్లిక్ అనీ, సమాజంలో ప్రజలు పాల్గొనడం అనే అంశానికి సంబంధించింది. అరిస్టాటిల్ మొదట నిర్వచించిన ప్రకారం రాజకీయం అంటే ప్రత్యక్ష ప్రజాస్వామ్యమే. ఈ సాంప్రదాయిక అర్థాన్నే ప్రజాతీర్పు ప్రతిధ్వనించింది. జ్యూరీ విచారణ పాతపద్ధతే. ఈ పాతపద్ధతులు ఈ నాటినిర్ణయాలకి ఎంత అవసరమో ప్రజాతీర్పు తెలియజేసింది. నాగరికత విస్తరణ ప్రత్యక్ష ప్రజాస్వామ్యమనే వాటి మీద ప్రజాతీర్పు ఆధారపడింది.

ఈ రోజు నాగరికతను అభివృద్ధిచేయడమంటే సమాజంలోని పౌరులందరు నిజమైన పౌరులుగా ఉండడానికి, వారి శక్తిని బహిర్గతం చేసుకోవడానికి కావలసిన స్వేచ్ఛ తద్వారా వాళ్లకి కావలసిన చట్టాలనీ, నిబంధనలనీ ఇతరులతో కలసి రూపొందించుకోవడం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ప్రతి వ్యక్తికీ నిత్యజీవితంలో కలసి బతకడానికి అవసరమైన నిబంధనలని రూపొందించుకోవడంలో పాల్గొనే అవకాశం, పాల్గొనే స్వేచ్ఛని నిరంతరం అనుభవిస్తూ సామాజిక, రాజకీయ, ఆర్థిక సంబంధాలని మరింత నాగరికం చేసేందుకు పునరాలోచిస్తూ ఉండే అవకాశాన్నివ్వడం. (మేడా 2000, మా అనువాదం)

ఆంధ్రప్రదేశ్ ఆహార, వ్యవసాయ భవితవ్యం గురించి మాట్లాడుతూ జ్యూరీ సామాజిక, ఆర్థిక జీవితానికి ప్రాథమిక సూత్రాలుగా న్యాయం, ధర్మం, మానవత్వం, ప్రజాస్వామ్యాలను పేర్కొనడం గమనార్హం. ఆర్థిక సామర్థ్యం, మార్కెట్ల గురించిన మాటలు దాదాపుగా లేవు. ఉన్నా కూడా సమాజ పౌరుల అవసరాలకీ, హక్కులకీ లోబడి ఉన్నాయి. జ్యూరీ దక్షిణ ఆసియాలో నిరాదరణకు గురిఅయిన ఎందరివో గొంతులను వినిపించింది. (లైటెన్ 2002). మహాత్మాగాంధీ కల, స్వరాజ్యానికి నారు మడి అయిన వ్యవసాయం, స్వయం పోషకత్వం నైతికంగా విలువల పరంగా వేదిక అయిన భారతదేశాన్ని వలసవాదం నుంచి రక్షించడమే కాక ఒక కొత్త నాగరికతను చిగురింపజేస్తుంది. (గాంధీ 1936)

ప్రజాతీర్పు ఆర్థికాంశాల మీద రాజకీయాంశాల ఆధిక్యాన్ని గుర్తించింది. మానవుల ప్రాథమిక అవసరాలని తీర్చడానికి అవసరమైన మార్గాలని ఎన్నుకోవడంలో ప్రజాస్వామిక చర్చ పౌరుల ఎంపికకి ఉన్న ప్రాధాన్యాన్ని పునరుద్ఘాటించింది. మానవుల ప్రాథమిక అవసరాలు ఒకటే అయినా అవి తీరే మార్గాలు, సంస్కృతి, ప్రాంతం, చారిత్రక స్థితిగతులను బట్టి మారుతూ ఉంటాయి. (మాక్స్-నీఫ్ 1989)

ఎంత పెత్తనం చెలాయిస్తున్నా, కార్పొరేట్ సెక్టారు నాయకత్వంలో జరిగే ప్రపంచీకరణే మానవ అవసరాలను తీర్చడానికి ఏకైకమార్గమనే వాదనను అధికారవర్గాలు సవాలు చేస్తున్నాయి. (బాక్స్ 10) అభివృద్ధి ఆర్థికతత్వాన్నే మౌలికంగా పునరాలోచించే

## బాక్స్ 10. నయా సరళీకరణ సిద్ధాంతం, ప్రపంచీకరణ : అంతర్గత భిన్న అభిప్రాయాలు

ప్రస్తుతం అమలువుతున్న సరళీకరణ విధానాల దుష్ఫలితాలకి బలమైన సాక్ష్యాలు లభిస్తున్నాయి. సాధారణంగా అమలులో ఉన్న సరళీకృత విధానాల దుష్ఫలితాల మీద ఇప్పటికే బలమైన అనుభవ సాక్ష్యం దొరుకుతోంది. అభివృద్ధి ఆర్థికశాస్త్రం గతంలో తరచుగా అడిగే ప్రశ్న. “ప్రామాణిక పారిశ్రామిక, ఆర్థిక వ్యవస్థ నమూనాలో ఏ ఏ మార్పులు చేస్తే అది అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకి ఆచరణీయంగా వుంటుంది? స్టాండర్డ్‌గా వాడే నమూనా ఏమిటంటే సమతౌల్య పోటీ నమూనా. ఈ నమూనాకున్న పరిమితులు ఈ రోజు విస్తృతంగా గుర్తించబడ్డాయి. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ఉపయోగకరమైన నమూనా కాదు. ఈ రాజ్యమేలుతున్న నమూనాని సవాలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ పట్ల అసంతృప్తి పెరిగింది. ప్రపంచీకరణ లోని లోపాలు ప్రస్ఫుటం అవడం మొదలైంది” - జోసెఫ్ స్టిగ్‌లెట్జ్, మాజీ ప్రధాన ఆర్థిక వేత్త, ప్రపంచబ్యాంక్ (స్టిగ్‌లెట్జ్ 2001)

ప్రపంచీకరణ అంటె అధికారమూ, నియంత్రణ, సరిహద్దులు లేని రూపంలోని ప్రపంచాన్ని మార్చేసే అతి శక్తివంతమైన సెంట్రల్ బ్యాంకులు, వ్యాపార బ్యాంకులు, బహుళజాతి కంపెనీల నియంతృత్వంలోకి తేవడం. వంద సంవత్సరాల సామాజిక ప్రగతిని నాశనం చేసి ఆదాయ పంపిణీలని అసమానత్వం నుంచి అమానవీయ స్థాయికి తీసుకువెళ్లడం - పాల్ హేలియర్, మాజీ ఉప ప్రధాని, కెనడా.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థని సమర్థించే వాళ్ళు, అభివృద్ధి చెందుతున్న దేశాలు వాణిజ్యానికి పెట్టుబడులకి తలుపులు తెరిస్తే అనుభవించబోయే ఐశ్వర్యాల గురించి “ఉటోపియా” వూహలు చేస్తారు. ఈ బూటకపు హామీలు పేద దేశాల దృష్టిని, వనరులని దృష్టిని మళ్లిస్తాయి. ఆర్థికాభివృద్ధికి అవసరమైన స్థానిక ఆవిష్కరణలు నిర్లక్ష్యానికి గురవుతాయి - ప్రొఫెసర్ డానీ రోడ్రిక్, హార్వర్డ్ యూనివర్సిటీ, యు.ఎస్.ఎ. (రోడ్రిక్, 2001).

ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. (ఉదా. చూడండి. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యుయుఎన్ఆర్ఐఎస్డి.ఓఆర్జి, మారెచల్ 2000). ఈ సందర్భంలో పౌరులు సాధికారతతో, 'మంచి జీవితం' అంటే తమ అభిప్రాయమేమిటో కనుగొనేందుకు, దాన్ని సాధించుకునేందుకు అనుగుణమైన విధానాలను రూపొందించేందుకు, 'సంప్రదింపులు, కలుపుకుపోయే పద్ధతి (డిఏ్స)' సైద్ధాంతికంగాను, ఆచరణరీత్యాను ఎంతో సందర్భోచితమైనది.

ప్రజాతీర్పు భాగస్వామ్య సాధికారతా ప్రక్రియ విలువ ఏమిటో స్పష్టంగా చూపించింది. అట్టడుగు స్థాయిలో సుస్థిర, సమన్యాయ, స్వయంపోషక వ్యవసాయ జీవనాధారాలు వచ్చే ఇరవై సంవత్సరాలలోను ఏ విధంగా ఉంటాయన్న విషయాన్ని ప్రజాతీర్పు ప్రదర్శించింది. ఈ ప్రజాతీర్పు విధానంలో పొరపాట్లు దొర్లే ఉంటాయి. కాని మా ఆశ ఏమిటంటే, ఈ ప్రజాతీర్పు ఇతరులను ప్రభావితం చేస్తుంది, వాళ్లు ఈ ప్రక్రియను కొనసాగించి 'డిఏ్స'ను సరికొత్తగా ఉపయోగిస్తారని మా ఆశ. ఈ ఆకాంక్షనే ప్రభుత్వేతర సంస్థలు, దాతసంస్థలు కూడా వ్యక్తపరిచాయి. (కన్వే, 1997, డిఎఫ్ఐడి, ప్రపంచబ్యాంకు 2002). చిన్న సన్నకారు రైతుల జీవనాధారాలని నాశనం చేయడానికి విజన్ 2020కి ఇతర భారీప్రాజెక్టులయిన నర్మదాడ్యామ్కి, హరిత విప్లవానికి ఉన్నంత శక్తి ఉంది. భారతదేశంలోని, ప్రపంచం లోని అభిప్రాయనిర్మాతలకి, నిర్ణయాధికారులకి, మా విజ్ఞప్తి. ప్రజాతీర్పు మీద ప్రతిస్పందించండి. ప్రజాతీర్పు గ్రామీణ భవిష్యత్తు మీద వెలిబుచ్చిన అభిప్రాయలని సమీక్షించండి. ఇలాంటి ప్రజాస్వామిక ప్రక్రియలని ముందుకు తీసుకువెళ్లండి.

# ప్రస్తావనలు (REFERENCES)

Abramson J (2000)
we the jury: The jury System and the ideal of democracy. Harvard Universityb Press. USA.

Alvares C (1992)
'Science' in W Sachs (ed) The Development Dictionary. Zed Books. London: (also in T Wakeford and M Walters (eds), Science for the Earth, Wiley, ChiChester, (UK)

Atkinson R And J Flint (2001)
'Accessing Hidden and Hard-to-Reach Populations: Snowball Research Strategiesr' in Social Research Update. Sociology Department, University of Surrey (Download from: www.soc.surrey.au.uk/sru/sru.html).

Baxter L, L. Thorne and A Mitchell (2001)
Small Voices Big Noises: Lay involvement in health researcj: lessions from other fields. Report to Consumers in the NHS, Help for Health Trust, UK. (Download from: www.hfht.org/ConsumersinNHS Research)

Bourdieu P (2001)
Science de la science et reflexivite. Raisons d'Agir, Paris.

Bourdieu P (2002)
'Pour un saviour engage' in Le Monde Diplomatique, February 2002, p.3. Paris.

Brock K, A Cornwall and J Gaventa (2001)
Power, Knowledge & Political Spaces in the Framing of Poverty Policy. Institute of Development Studies Working Paper 143, IDS, University of Sussex. (Download from: www.ids.ac.uk)

Buhler W. S Morse A Beadle and E Arthur (2002)
Science, Agricultrure and Research: A Compromised Participaton? Earthscan, London.

Chambers R (1993)
Challenging the Prgfessions. Frontiers for rural development. Intermediate Technology Publications, London.

Chambers R (1997)
Whose Reality Counts? Putting the First Last. Intermediate Technology Publications, London.

Chowdary KR. A Prasad Rao and M Koterswara Rao (2000)
'Distress of farmers X-rayed. A case of Andhra Pradesh'. Report of Andhra Pradesh Rythu Sangam, Hyderabad, AP., India

Conway G (1997)
Doubly Green Revolution: Food for All in the Twenty-First Century. Penguin, London.

Coote A and J Lenaghan (1995)
Citizens' Juries: From Theory to Practice. IPPR, London.

Devlin P (1966)
Trial by Jury. Hamlyn Lexture Series, Stevens, London.

DFID (2000).
Making Globalisation Work for the World's Poor. UK Government White paper on International Development, DFID, London.

DFID (2001)
Andhra Pradesh: State Strategy Paper, DFID India, New Delhi.

Edmond G and D Mercer (1997)
'Scientific Literacy and the Jury: Reconsidering Juruy "competence" in Public Understanding of Science 6:327-59.

Fischer F (2001)
Citizens, Experts, and the Environment. Duke University Press. USA.
Funtoxicz SO and

J Ravetz (1993)
'Science for the post normal age' in Futures 25(7): 739-55

Genetics Forum (1999)
Citizen Foresight: A tool to enhance democratic ploicy making. Genetics Forum and Univertisy of East London, London.

GoAP (1999)
Vision 2020: Swarna Andhra Pradesh. See: www.andhrapradesh.com

GoAP (2000a)
'Swarna Andhra Pradesh Vision 2020'. Working Paper on Agriculture Development Policy, Agriculture Department, Goverment of Andhra Pradesh.

GoAP (2000b)
'Swarna Andhra Pradesh Vision 2020': Working paper on Agriculture Development Policy, Agriculture Department, Goverment of Andhra Pradesh.

GoAP (2001a)
'Strategy Paper of Agriculture and Allied Departments'. Government of Andhra Pradesh.

GoAP (2001b)
'Biotechnology Policy 2001. Andhra Pradesh, Beyond tomorrow'. Department of Industries and Commerce, Governement of Andrha Pradesh, India.

GoAP (2002)
www.andhrapradesh.com
Gandhi M (1936)
Hind Swaraj and Other Writings: Canbridge University Press, UK.

Hefferman WD with M Hendrickson and R Gronski (1999)
'Consolidation in the food and agricultural system'. Report to the National Farmers Union. February 5, 1999. Department of Rural Sociology. University of Missouri, Columbia, Missouri.

Humphries B, DM Mertens and C Truman (2000)
'Argument for an 'emancipatory' research paradigm' in C Truman, DM Mertens and B Humphries Resraech and Inequality. UCL Press, London.

IIED and IDS, 2000
'Institurionalising Participation in Natural of Reveiw Workshop. Hyderabad. India', International Institute for Environment and Development (IIED), London and the Institute for Development Studies (IDS). University of Sussex, UK.

Irxin A (1995)
Citizen Science, A study of people, expertise and sustainable development. Routledge, UK.
Irwin A (2000)
'Citizen engagment in science and technology, a commentary on recent UK experience in Pimbert and Wakeford (eds). ibid.

Irwin A and B Wynne ( 1996)
Misunderstanding Science. Cambridge University Press. Cambridge.

Kabeen N (2000)
'Social Exclusion, Poverty & Discrimination: Towards and analytical framewrok', IDS Bulletin: 31:83-97 (available from www.ids.ac.uk)

Kermpf H (2001)
'Les scientifiques pesent les benefices et les risques des OGM pour la sante'. Le Monde December 20.

Kerr A and
S Cunningham -Burley (2000)
'On ambivalence & risk: reflexive modernity & the new human genetics, Sociology 34:283-304.

Kerr A. S. Cunningham-Buriey and AAmos (1998)
'Drawing the line: An analysis of lay people's discussions about the new genetics'. Public Understanding of Science 7:113.

Kloppenburh J (1991)
'Social theory and the de/reconstrucion of agricultural science: Local knowledge for an alternative agriculutre, Rural sociology 56(4): 519-48.

Lempert R (1993)
'Civil juries and complex cases: Taking stock after 12 years' in Verdict Assessing the Civil Jury System. R Litan (ed). Brookings Instriturions, Washingtaon Dc.

Lieten GK (2002)
'State and People in South Asia: Villange Views on Development in India and Pakistan'. UNRISD Occasional Paper. United Nations Reserach Institure for Social Developments (UNRISD), Geneva

Marechal JP (2000)
Humaniser I'economic. Descless de Brouwer, Paris.

Max-Neef M, A Elizade, M Hopenhayn,
F Herrera, H Zemelman, J Jataba and
L Weinstein (1989)
'Human scale development: An option for the future., Development Dialogue 1:5-80

Medda D (2000)
Qu'est ce que la richesse? Champs Flammarion. Paris p.376-68.

National Bidodiversity Strategy and
Action Plan (NBSAP) (2002)
Draft reoprt on Biodiversity
in Andhra Pradesh, NBSAP, New Delhi

National Consumenr Council (2002)
'Feeding into Food Ploicy: A submission to the Policy Commission on the Future of Farming and Food on the view of low-income consumers' NCC. London. (available from www. ncc.org.uk/pubs/pdf/feeding_in.pd)

Pimbert MP (1994)
'The need for another research paradigm' in Seedling 11(2): 20-25

Pimbert MP and T Wakeford (eds) (2001)
'Deliberative democracy and citizen empowerment', PLA Notes 40. IIED London with the Commonwealth Foundation, ActionAid, DFID, and Sida.

Richards P (1985)
Indigenous agricultural revolution: Ecology and food production in West Africa. Hutchinson. London.

Rodrik D (2001)
'Trading in illusions' in Foreign Plocy, March - April 2001.

Roy A (1999)
'Lies, dam lies and statistics'. Guardian, June 5 (available on www.guardian. co.uk)

Ruddock J (2001)
Written parlimentary questions to the Secreatry of State, DFID, in Hansard 20 July; Column: 477W (available from www.parliament.uk).

Satheesh PV and MP Pimbert (1999)
'Reclaming diversity. restoring livelihodds' in Seedling Vol. 16 (2): 11-23 (available from www.grain.org)

Stiglitz JE (2001)
'An agenda for the new development economics'. Paper prepared for the UNRISED meeting on the 'The need to retnink development economies', 7-9 September 2001.

Cape Town, South Africa. United Nations Reserach Institute on Social Development (UNRISD). Genevea.

Stiriling A (1998)
'Risk at a turning point?'. Journal of Risk Research, 1:97-110.

Stirling A and S Mayer (1999)
Rethining Risk: A pilot multi-criteria mapping of a genetically modified crop in agricultural systems in the UK. Science Policy Research Unit (SPRU). University of Sussex. UK (available from www.sussex.ac.uk/spru/).
Thompson EP (1963)
The making of the English Wroking Class. Harmondsworth, London.

United Nations (1948)
Universal Declaration of Human Rights. www.un.org.Overview/rights.html.

Vasavi AR (1999a)
Harbingers of Rain' Land & Life in South India. Oxford University Press, New Delhi.

Vasavi AR (1999b)
'Agrarian Deistress in Bidar: Market, State and Suicides'. Economic & Political Weekly, August 7, 2263-69.

Vishvanatham S (1997)
A Carnival for Science : Essays on science, technology and development. Oxford University Press, UK/India.

Wakeford T (1999)
'Indian Farmers Judge GM Crops'. Action Aid. London (available from: www. actionaid. org/resources/foodrights/ foodrights.shtml)

Wakeford (2001)
'Who's Framming Who?' PLA Notes 40:79-80. IIED, London.

Wallace H (2001)
'The issue of framing and consensus conferences'. PLA Notes 40:61-63. IIED. London.

Woolgar S (1997)
The Luddites: Diablo ex Machina' in K Grint and S Woolgar The Machine at Work: Technology, Work and Organization. Polity Press. Cambridge.

World Bank (2002)
For more information on the World Bank's loans and support to the Government of Andhra Pradesh see www. worldbank. org.

Wynne B (1996)
'Where Sheep may safely graze? In A Irwin and B wynne Misunderstanding Science. Cambridge University Press. Cambridge.

# అనుబంధం 1

## ఆంధ్రప్రదేశ్ ఆహార, వ్యవసాయ భవితవ్యాల మీద వీడియోలు

ఆంధ్రప్రదేశ్‌కు సంక్రమించనున్న ఆహార, వ్యవసాయ భవితవ్యాలు మూడింటిని పోల్చిచూసుకుని తారతమ్యాలను తెలుసుకోవడానికి వీడియోలను ఉపయోగించడం జరిగింది. వీడియోల కోసం కావలసిన నేపథ్య పరిశోధనను ఐఐఇడివారి సుస్థిర వ్యవసాయ, జీవనాధారాల కార్యక్రమం నిర్వహించి, స్క్రిప్ట్ రూపురేఖలను తయారుచేసింది. వీడియోలను తీయడానికి హైదరాబాద్‌కు చెందిన కమ్యూనికేషన్స్ గ్రూప్ 'డెవలప్‌మెంట్ పర్‌స్పెక్టివ్స్'ను నియమించారు. భారతదేశంలోనూ, బ్రిటన్‌లోనూ ఉన్న టెలివిజన్, మీడియా నిపుణులతో సంప్రదిస్తూ డెవలప్‌మెంట్ పర్‌స్పెక్టివ్స్ మూడు ఫిల్ములచిత్రీకరణను, ఇంటర్వ్యూలను, ఎడిటింగ్‌ను పూర్తిచేసింది.

- 2020 నాటికి ప్రతి ఒక భవిష్యత్ ఊహాచిత్రం కింద జీవితం ఎట్లా ఉంటుందో ఏ పక్షపాతమూ లేకుండా, కుదురైన చిత్రీకరణ చేయడం కోసం డెవలప్‌మెంట్ పర్‌స్పెక్టివ్స్ డైరెక్టర్ ఐఐఇడికి చెందిన సమావేశకర్తతో కలిసి పనిచేశారు. విజన్‌ల మధ్య పోలికలు అర్థవంతంగా ఉండడం కోసం, ప్రతి ఊహాచిత్రం లేదా సినేరియోను ఒక క్రమపద్ధతిలో ఈ కింది దృక్పథాలనుంచి అందించాలని భావించాము.
- ఆహారోత్పత్తికి సంబంధించిన పర్యావరణం (ఎకాలజీ)
- ఆహార మార్కెటింగ్‌కు సంబంధించిన పర్యావరణం
- ఆహారం, ఆర్థికవ్యవస్థ
- ఆహారం, కమ్యూనిటీ
- పరిపాలన, ఆహారభద్రత

ఆహార, వ్యవసాయ భవితవ్యాల చిత్రీకరణలో మరింత ఏకసూత్రత సాధించడం కోసం కరెంట్ అఫైర్స్ నమూనాలో వీడియోలను చిత్రీకరించాము. టెలివిజన్ చానెళ్లలో అటువంటి కార్యక్రమాలను నిర్వహించే విలేఖరులతో, యాంకర్లు, న్యూస్‌కాస్టర్లతో ఈ మూడు వీడియోలూ తీయడం జరిగింది. అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతిలో ఇమడడం కోసం మొదట రూపొందించిన స్క్రిప్ట్‌లో మార్పులుచేర్పులు చేశాము. ఒక్కొక్క వీడియో సారాంశం ఇక్కడ ఇస్తున్నాము :

## వీడియో 1 : విజన్ 2020

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజన్ 2020 అమలు ప్రారంభించి కడచిన 20 సంవత్సరాలలో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ గుర్తుపట్టనిరీతిలో ఆధునికీకరణ చెందాయి.

కమతాలు చాలా వరకు పెద్దవి. పొలాలలో పెద్ద ఎత్తున యంత్రాలు వాడుతున్నారు, భారీ ఉత్పత్తి విధానాలను అనుసరిస్తున్నారు. వ్యవసాయం ఇప్పడు ఎక్కువగా మెరుగుపరిచిన విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు, తెగుళ్లనాశనులు, ఇతర పురుగుమందుల మీద ఎక్కువ ఆధారపడింది. పశుపోషణ కూడా ఇప్పడు భారీ ఎత్తున జరుగుతోంది. వరుసగా ఏర్పాటు చేసిన భారీ పశుపోషణ క్షేత్రాలకు భారీ మొత్తంలో ధాన్యం, దిగుమతిచేసుకున్న దాణా అవసరమవుతోంది. పబ్లిక్, ప్రైవేట్ రంగాల మధ్య భాగస్వామ్యం వల్ల వ్యవసాయంలో అనేక కొత్త పంటరకాలు వచ్చాయి. కలుపుమొక్కలను, హానికారకమయిన మొక్కలను చంపే మందుల వల్ల దెబ్బతినని పంటరకాలు వచ్చాయి. అలాగే అధిక ఉత్పత్తినిచ్చే జన్యుమార్పిడి పశురకాలుకూడా వచ్చాయి. రైతులు ఇప్పడు పేటెంట్‌చేసిన కొత్తవిత్తనాలను, మెరుగుపరచిన పశువులను ప్రతిఏటా కొంటున్నారు. విత్తనాలను పొలాల్లోనుంచి తీసుకోవడం ఎప్పటిదో పాతమాట అయిపోయింది.

ప్రమాణీకరించిన ఉత్పత్తికే మార్కెట్‌లో డిమాండ్ ఉండడం, ఉత్పత్తికి దీర్ఘకాలం అమ్ముకోవడానికి వీలు ఉండడం, సుదీర్ఘ ప్రయాణాలను కూడా తట్టుకోగలిగే అవకాశం ఉండడం వల్ల కొన్ని రకాల పంటలు మాత్రమే, ఎంతో ప్రత్యేక సదుపాయాలతో పండించే పంటలు మాత్రమే మిగిలి తక్కినవన్నీ అంతరించిపోయాయి. పాతరకం ఆవులు, కోళ్లు ఇప్పడు పోయి కొత్తపశు, కోళ్ల జాతులు వచ్చాయి. మార్కెట్ నిర్వచించిన ప్రకారం ఏది ఆకర్షణీయమో ఆ వ్యవసాయాన్ని అనుసరించడానికి రైతు ఉవ్విళ్లూరుతున్నాడు.

కార్పొరేట్ వ్యవసాయాధార వ్యాపారంకూడా రాష్ట్రంలో బాగా పెరిగిపోయింది. వ్యవసాయదారులకు కావలసిన క్షేత్ర సాధనాలు, ఇంధనం, విత్తనాలు, యాంటీబయాటిక్స్, ఎరువులు, క్రిమిసంహారకాలు అన్నీ సరఫరా చేయడానికి భారతీయ కంపెనీలు, బహుళజాతి కంపెనీలు సర్వదా సిద్ధంగా ఉంటున్నాయి. కంపెనీలు మధ్యదళారులుగా, ప్రాసెసర్లుగా, పంపిణీదారులుగా,

చిల్లర వ్యాపారులుగా కూడా వ్యవహరిస్తాయి. వారు వ్యవసాయోత్పత్తులను కొంటారు, ప్యాక్ చేస్తారు, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అమ్ముతారు. ఎగుమతి మార్కెట్లకోసం కాంట్రాక్ట్ వ్యవసాయం ఆంధ్రప్రదేశ్‌లో సాధారణమై పోయింది. ఈ కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని విదేశీ ఆహార వ్యాపార సంస్థలు అదుపు చేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, గ్రామీణ సమాజంలో మార్పునకు అంతర్జాతీయ పోటీ ఒక ముఖ్యమైన చోదకశక్తి అయింది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి మూలన తక్కువ ఉత్పత్తిచేసే చిన్నతరహా, మధ్య తరహా ఉత్పాదకులంతా గ్లోబల్ పోటీని తట్టుకోలేక వ్యాపారాలు విరమించారు. మధ్యతరహా, పెద్ద రైతులు పెద్ద కార్పొరేషన్లతో ఉత్పత్తిలో, మార్కెటింగ్‌లో పోటీపడడం నేర్చుకున్నారు. ఇరవై ఒకటో శతాబ్దపు గ్లోబల్ ఆహార ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉత్పత్తిని అనుసంధానం చేస్తున్నవి- ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలు, అత్యాధునిక సమాచార సాంకేతికత.

ఆహారమార్కెటింగ్, పంపిణీ పూర్తికేంద్రీకృతమై, కొందరు మధ్యదళారీలు, పెద్దకంపెనీల అదుపులోకి వెళ్లింది. ఆహారం మీద ఖర్చు అయిన ప్రతిరూపాయిలో రైతుకు దక్కేది అతి స్వల్పం. ఇవాళ ఆహారం మీద ఖర్చు పెట్టే ప్రతిరూపాయిలో, ఫుడ్ ప్రాసెసింగ్‌వారికి, ఆహార వ్యాపార గొలుసులోని చిల్లర వ్యాపారులకు పెద్దమొత్తం వెడుతున్నది. ఇరవయ్యేండ్ల కిందట వారికి వచ్చేదానికన్నా ఇప్పుడు రైతులకు చాలా తక్కువ వాటా అందుతున్నది.

గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో గత రెండు సంవత్సరాలుగా ఆహార ఉత్పాదకరంగంలో, తయారీ రంగంలో, పంపిణీ రంగంలో, అమ్మకాలలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. వీటన్నిటి మూలంగా ఒకనాడు ఆంధ్రప్రదేశ్ మొత్తం జనాభాలో 70 శాతం ఉన్న గ్రామీణ జనసంఖ్య 2021 సంవత్సరం నాటికి 40 శాతానికి పడిపోయింది. గ్రామీణజనం పనుల కోసం, జీవనోపాధుల కోసం పట్టణాలకు తరలిరావడం వల్ల హైదరాబాద్, వరంగల్ వంటి పట్టణాల జనాభా విపరీతంగా పెరిగిపోయింది.

ఆంధ్రప్రదేశ్‌లోని సగటు వినియోగదారుడు ఇప్పుడు ప్రపంచపు నలుమూలలనుంచి వచ్చిన ఆహారపదార్థాలను ఇక్కడి సూపర్‌బజార్లలో కొనుగోలు చేయగలరు. యూరోప్‌నుంచి వచ్చిన చౌకపాలు, అమెరికాలో పండిన సోయాబీన్స్ నుంచి తీసిన వంటనూనె, వియత్నాం నుంచి వచ్చిన బియ్యం... ఇవన్నీ ఇక్కడ దొరుకుతాయి. సుదూర ప్రాంతాలకు కూడా ఏర్పాటుచేసిన రవాణా వ్యవస్థ వల్ల, కమ్యూనికేషన్‌ల వ్యవస్థ వల్ల వ్యవసాయ ఉత్పత్తులు వినియోగదారులకు ఎప్పుడంటే అప్పుడు లభ్యమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్థిక కార్యకలాపాలలో ఆహారపదార్థాల ఎగుమతులు, దిగుమతులదే ఇప్పుడు ఎక్కువ భాగం. అంతర్జాతీయ వర్తకం రానురాను పెరుగుతున్నందున ఇది సాధ్యపడుతున్నది.

కొత్త వ్యవసాయం వ్యవసాయ రసాయనాల మీద, సుదూరరవాణా మీద ఆధారపడి ఉన్నది. ఫలితంగా, ఆంధ్రప్రదేశ్‌లోని ఆహారవ్యవస్థ పెట్రోలియం ఇంధనాలను, విద్యుత్తును అత్యధికంగా వినియోగించుకుంటున్నది. ఆహారప్రాసెసింగ్ అధిక ఇంధనం వాడుకోవాలి. దూరప్రాంత రవాణాలో ఆహారం చెడిపోకుండా నిల్వ ఉండాలంటే రిఫ్రిజిరేషన్ అవసరం. అందుకు చాలా ఇంధనం ఖర్చు అవుతుంది, ఆహారాన్ని ప్రాసెస్ చేయడానికి చాలా విద్యుత్ ఖర్చు అవుతుంది, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని జాగ్రత్తగా ప్యాక్ చేయవలసి ఉంటుంది. ప్యాకేజింగ్ ఫ్యాక్టరీలు చాలా విద్యుత్తును వినియోగిస్తాయి. ఆంధ్రప్రదేశ్ మొత్తానికి ఆహారవ్యవస్థకి కావలసిన భారీ విద్యుత్ ఉత్పాదక సదుపాయాల అభివృద్ధి, విజన్ 2020 వ్యవసాయమూ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి సాగుతున్నాయి.

ఈ గణనీయమైన మార్పులో ప్రపంచబ్యాంకు, ఇతర దాతలు రాష్ట్రప్రభుత్వానికి ఉత్సాహంగా సహాయంచేశారు. ఇవాళ సంప్రదాయ ఆర్థికశాస్త్రవేత్తలకు, అంతర్జాతీయ బ్యాంకులకు విజన్ 2020 ఒక ఘనవిజయం. అయితే, గ్లోబల్ ఆహారవ్యవస్థతో అనుసంధానం చెందిన ఆహారవ్యవస్థ దిశగా విధానం మారడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ నిర్ణయాధికారంలో, పౌరసత్వం కూడా మౌలికంగా మారిపోయాయి. కేంద్రీకృత ఆహారపంపిణీ వ్యవస్థమీద, దూరప్రాంత మార్కెట్లు, అతిపెద్ద బహుళజాతి కార్పొరేషన్లు- వీటి మీద ఆధారపడడం పెరిగినందువల్ల ప్రజలు రాజకీయ, ఆర్థికశక్తులను ప్రభావితంచేసే శక్తిని గణనీయంగా కోల్పోతారు.

2020ని ఆచరణ సాధ్యం చేయడానికి దోహదం చేసిన విధానాలు- సారాంశం

- భూకమతాల స్థిరీకరణకు అనుకూలమైన విధానాలు, ప్రోత్సాహకాలు. వ్యవసాయ పారిశ్రామిక రంగాల మధ్య అనుసంధానానికి, ఎగుమతి మార్కెట్లలో పట్టుకోసం కార్పొరేట్, కాంట్రాక్ట్ వ్యవసాయానికి ప్రోత్సాహం.
- వ్యవసాయపారిశ్రామికరంగాలను సమీకృతం చేయడానికి, ఎగుమతిమార్కెట్‌లను అందుకోవడానికి అనువైన కార్పొరేట్, కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా విధానపరమైన, ద్రవ్యపరమైన సంస్కరణలు.
- గుణాత్మకమైన ఉపాధికి, ఎదుగుదలకు అవకాశమున్న రంగాలను గుర్తించి వాటికి విధానపరమైన మద్దతును, పెట్టుబడులను అందించడం. గుర్తించినరంగాలు- వరి,

కోళ్లపరిశ్రమ, పాడిపరిశ్రమ, తోటల పెంపకం, చెరకు, చేపలపెంపకం, వ్యవసాయాధార పరిశ్రమలు. సాగునీటి సదుపాయం ఉన్న ప్రాంతాలకు అధిక పెట్టుబడులు (1,25,000 కోట్లు)

- మారుతున్న మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా వ్యవసాయ పరిశోధన, విస్తరణ విద్యా రంగాలను తీర్చిదిద్దడానికి వీలుగా వాటిని ప్రయివేటురంగంలో, ప్రభుత్వ-పారిశ్రామిక బాగస్వామ్యంలో నిర్వహించడం.
- విజన్ 2020లోని వ్యవసాయ లక్ష్యాలను అందుకోవడానికి అవసరమైన పెట్టుబడుల్లో (1,60,000 కోట్లు) అధికభాగాన్ని ప్రయివేటు రంగం నుంచి సమీకరించడానికి అవసరమైన విధాననిర్ణయాలు, ప్రోత్సాహకాలు.
- వ్యవసాయరంగంలో యంత్రాల వినియోగానికి ప్రోత్సాహకాలు అందించడం ద్వారా, అధికోత్పత్తి వంగడాలను, పశుజాతులను వినియోగించడం ద్వారా ఉత్పాదకతను, పోటీతత్వాన్ని పెంచడం. కొత్తగా వస్తున్న జన్యుఇంజనీరింగ్ సాంకేతికతతో పాటుగా, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను, ఇరిగేషన్‌ను, రసాయన ఎరువులను సమర్థవంతంగా వినియోగించడం కూడా ప్రభుత్వ విధానాలలో భాగమే.
- వ్యవసాయాధార జీవినోపాధి నుంచి ఇతర ఉపాధులలోకి ప్రజల తరలింపు. గతంలో మొత్తం జనాభాలో 70 శాతం మంది వ్యవసాయం పై ఆధారపడి ఉండగా విజన్ 2020 ద్వారా దాన్ని 40 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ తరలింపును సాధ్యం చేయడానికి ఇతర రంగాలలో ఉపాధిఅవకాశాల కల్పన.
- మార్కెట్‌లు సమర్థవంతంగాపనిచేయడానికి కావలసిన విధాన సంస్కరణలు, ఎరువులు, పురుగుమదులు, విత్తనాలు వంటి వ్యవసాయ పెట్టుబడులు ధరలు, వ్యవసాయోత్పత్తుల ధరలు న్యాయంగా, సమర్థవంతంగా ఉండేట్టు చూడడం. ఫుడ్ ప్రాసెసింగ్‌లో, రీటెయిల్ మార్కెటింగ్‌లోనే భారీ పెట్టుబడులకు ప్రోత్సాహం ఇవ్వడానికి విధానపరమయిన ఏర్పాట్లు
- కొత్త బయోటెక్నాలజీలలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు, ఆహార వ్యవసాయరంగాలలో జన్యుమార్పిడి సాంకేతికత వినియోగానికి విధానాలు, ప్రోత్సాహాలు
- దూరప్రాంత రవాణా, వర్తకాలకు అనువుగా రహదారి వ్యవస్థను, ఇంధన తయారీ వ్యవస్థలను పెద్ద ఎత్తున నిర్మించడం.

## వీడియో 2 : మార్కెట్లకోసం ప్రకృతి వ్యవసాయం

ప్రకృతి వ్యవసాయానికీ, దాని ద్వారా జరిగే ఉత్పత్తులకీ గత ఇరవైఏళ్ల కాలంలో దశ తిరిగింది. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ పెరగడం 1990 దశాబ్దం చివరి సంవత్సరాలలో మొదలైంది. అప్పటినుంచి క్రమంగా, భారతదేశంలోనూ, విదేశాలలోనూ ఉన్న పట్టణ వినియోగదారులనుంచి ఆ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతాంగం ప్రకృతి వ్యవసాయ పద్ధతులలోకి మారడానికి ప్రధాన కారణం అదే.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2001 సంవత్సరం నుంచి ప్రకృతి అనుకూలంగా పండించిన ఉత్పత్తులను, వాటిమార్కెటింగ్‌ను చురుకుగా ప్రోత్సహిస్తోంది. తాజాపళ్లు, పళ్లతయారీ పదార్థాలు, కూరగాయలు, పలుకులు, నూనెపంటలు, ధాన్యాలు, చెరకు, మూలికలు, మసాలా దినుసులు- మొదలైన రంగాలలో ప్రకృతిసిద్ధ వ్యవసాయపద్ధతులద్వారా ఉత్పత్తిని, ఆ ఉత్పత్తుల వర్తకాన్ని ఈ నూతన విధానం ప్రోత్సహించింది. ఈ విధానాల్ల, ప్రోత్సాహకాల వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడానికి తగిన ఉత్సాహం లభించింది. రసాయనాలను చాలా ఎక్కువగా వినియోగించేతరహా వ్యవసాయం నుంచి చాలా పంటలు విముక్తి పెందాయి. రసాయన వ్యవసాయంనుంచి బయటపడిన పంటలలో వరి, పప్పులు, కూరగాయలు వంటి ఆహారపంటలే కాక, పొగాకు, పత్తి వంటి వ్యాపార పంటలు కూడా ఉన్నాయి. పాడిపశువులు, కోళ్లు వంటి వాటి పెంపకంలో కూడా ప్రకృతి పద్ధతులను అనుసరించడం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సానుకూలవిధానాలను ప్రవేశపెట్టడం వల్ల స్థానిక మార్కెట్‌కోసం, జాతీయ, గ్లోబల్ మార్కెట్‌లకోసం చిన్న, పెద్ద రైతాంగం ప్రకృతి వ్యవసాయం చేపట్టడానికి ప్రోత్సాహం లభించింది.

మొదటి పదిసంవత్సరాల కాలంలో మన రాష్ట్రంలోని మెట్ట వ్యవసాయంలో, సాగునీటి వ్యవసాయంలో అనేక రకాల పంటలను, అనేక రకాల పశుజాతులను తిరిగి ప్రవేశపెట్టడం జరిగింది. వ్యవసాయంలో ఉపయోగించే పంటరకాలలో, పశుజాతులలో జీవవైవిధ్యం అన్నది ఒక ముఖ్యమైన అంశంగా ఉండింది. వ్యవసాయ క్షేత్రాలలో ఒక మిశ్రమ పర్యావరణ వ్యవస్థ నిర్మాణమైంది. రసాయన వ్యవసాయం నుంచి ప్రకృతి వ్యవసాయానికి మారిన క్షేత్రాలలోకి పక్షులు, పురుగులు, చిన్న చిన్న జంతువులు తిరిగి వచ్చాయి. ఫలితంగా ఈ క్షేత్రాలలో తెగుళ్లు, క్రిమి కీటకాలు లేకుండా పోయాయి.

క్రిమిసంహారకాలపైనా, కృత్రిమ ఎరువులపైనా సబ్సిడీలు తొలగించడంతో పాటు, ఆహార భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేయడంతో ప్రకృతి వ్యవసాయానికి అనుగుణ్యమైన పరిణామం సాధ్యపడింది. 2002 సంవత్సరంలోనే దూరదృష్టి ప్రదర్శించి బిటి

పత్తి వంటి జన్యుమార్పిడి పంటలను నిషేధింపజేసినందుకు ఆంధ్రప్రదేశ్ సినియర్ ప్రభుత్వాధికారుల దూరదృష్టిని అభినందించాలి. రైతులు తమ విత్తనాలను తాము కాపాడుకోవడానికి, తమ పశుజాతులను పరిరక్షించుకోవడానికి హక్కులకు ప్రభుత్వం ఈ విధానం ద్వారా పూచీ పడింది. ఇందువల్ల రైతులు తమ నేలలకు, వాతావరణానికి, ఇతర స్థానిక పరిస్థితులకు, తమ కుటుంబ అవసరాలకు ఏది అనువైనదో ఆ పంటనే వేయడానికి వెసులుబాటు ఏర్పడింది.

బహుళజాతి ఆహార వ్యాపార సంస్థలు, భారతీయ వ్యవసాయాధార వ్యాపారం 1990 దశాబ్దం చివరలో ఆహార మార్కెట్‌లో ప్రవేశించాయి. తరువాతి 20 సంవత్సరాలలో చిన్న చిన్న వ్యాపారులను, ప్రకృతి వ్యవసాయోత్పత్తుల వ్యాపారాన్ని బడా సంస్థలే కొనుక్కున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ విధానాలు, అది అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహకాలు రాష్ట్రంలో ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు అవకాశం కల్పించాయి. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ చురుకుగా ఉండడానికి, ఆహార ఎగుమతి దిగుమతుల రంగం వృద్ధి చెందడానికి ఇది కీలకంగా భావించారు. 2010 సంవత్సరం నాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఆహార కొత్త ధోరణులు అవతరించాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా ఉత్పత్తి అయిన ఆహారానికి సంబంధించిన చిల్లరదుకాణాల నెట్‌వర్క్‌ను బడా వ్యాపార సంస్థలే ఆక్రమించాయి. అదే కాదు, ఆంధ్రప్రదేశ్‌లోకి ఆహారం ఎగుమతి, దిగుమతుల వర్తకాన్ని కూడా ఆ కంపెనీలే చేజిక్కించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఆహార వ్యవస్థను గుప్పిటిలో పెట్టుకున్న వారిగా ఈ కంపెనీలు ప్రకృతి వ్యవసాయం, వర్తకం ఎలా జరగాలో నిర్దేశించే స్థితికి వచ్చారు.

భారీ రీటెయిలర్ల మీద ఆధారపడుతున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు ప్రత్యేకతరహా ఉత్పత్తి చేయాలని తీవ్రమయిన ఒత్తిడిని ఎదుర్కొనవలసి వచ్చింది. ఫలితంగా చాలా క్షేత్రాలలో వైవిధ్యం కొరవడింది. పర్యావరణపరంగా మిశ్రమలక్షణం లోపించింది. వైవిధ్యాన్ని పెంపొందించడానికి ఈ శతాబ్ది ప్రథమదశాబ్దంలో ప్రారంభమైన సానుకూల ధోరణి ఇప్పుడు తలకిందులు కాసాగింది. ఇప్పటికీ పురుగుమందులు, ఎరువుమందుల వినియోగం మీద నిషేధం ఉన్నప్పటికీ, చాలా ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు కొన్ని పంటలనే పండించేవిగా మారిపోయాయి. అలాగే, సహజ పశుసంతతిలో కూడా మార్కెట్ ఇష్టపడే కొన్నిరకాల ఆవులు, గొర్రెలు, కోళ్లు, ఇతర పెరటి పశువుల రకాలే ఎక్కువ కనిపిస్తున్నాము. ఫలితంగా ప్రకృతి వ్యవసాయక్షేత్రాలలో, ఆచుట్టుపక్కలా జీవవైవిధ్యం తగ్గిపోసాగింది.

ప్రకృతి వ్యవసాయాన్ని, వర్తకాన్నీ ప్రోత్సహించడానికి ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయం వల్ల చిన్న, సన్నకారు రైతాంగం, చిన్నవ్యాపారులు మొదట లాభపడినప్పటికీ, గత దశాబ్దం కాలంగా అనేకమంది వ్యవసాయంనుంచి, వ్యాపారం నుంచి తప్పుకోవలసి వచ్చింది. పెద్ద వ్యాపారులు రంగంలోకి వచ్చారు. చిన్న కమతాలుపోయి భారీ వ్యవసాయ క్షేత్రాలలో యాంత్రిక వ్యవసాయం రావడంతో రైతాంగానికి కూలిపనులుకూడా దొరకడం లేదు. ప్రకృతి వ్యవసాయోత్పత్తులను మార్కెటిలో అమ్మడానికి ఎన్నో నియమనిబంధనలను పాటించవలసి ఉంటుంది. ప్రకృతి వ్యవసాయోత్పత్తులంటే ఏమిటో అంతర్జాతీయంగా ఉన్న నిర్వచనాలు, పాటించవలసిన ప్రమాణాలు ఎన్నో ఉంటాయి. వీటి వల్ల చిన్న, మధ్యతరహా రైతాంగం పెద్దరైతులతో పోటీపడే అవకాశాలు తక్కువ. ప్రకృతి ఆహారోత్పత్తిలో పాటించవలసిన కఠినమైన ఆహారభద్రతా ప్రమాణాలు, సుదూర మార్కెట్లకోసం మాంసాన్ని, కూరగాయలను రవాణా చేయవలసి వచ్చేటప్పుడు ఉత్పత్తిలోనూ, ప్రాసెసింగ్‌లోనూ పాటించవలసిన నిబంధనలు 2010 నాటికి మార్కెట్లను చిన్నరైతాంగానికి అంటుబాటులో లేకుండా చేశాయి.

ప్రకృతి వ్యవసాయం వల్ల, ప్రకృతి వ్యవసాయోత్పత్తుల వల్ల, వాటి అమ్మకాలు పంపిణీ వల్ల ఏర్పడిన ఉపాధి అంతా బహుళజాతి కంపెనీల గొలుసుకట్టు సూపర్‌మార్కెట్‌లు మింగేశాయి. టెస్కోస్, నెస్లె, సెయిన్స్‌బరీస్ వంటి బహుళజాతి ఆహారకంపెనీలు ఆంధ్రప్రదేశ్ అంతటా సూపర్ మార్కెట్లను, పెద్ద పెద్ద ప్రకృతి ఆహార దుకాణాలను నెలకెల్పారు. అందువల్ల చిన్న చిన్న దుకాణాలు, కుటుంబ పరిశ్రమలాగా నిర్వహించే ఆహారతయారీ కేంద్రాలు, స్థానిక రెస్టారెంట్లు మొదలైనవన్నీ సూపరమార్కెట్ల రాకతో, ప్రకృతి వ్యవసాయోత్పత్తుల ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల ఏర్పాటుతో దెబ్బతిన్నాయి.

పెద్ద పెద్ద క్షేత్రాలలో ఒకేరకం పంటలుపండించే ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలనుంచి ఆహారం చాలా దూరపు మార్కెట్లకు వెళ్లి, ఢిల్లీ బొంబాయి లండన్ వినియోగదారులకు చేరుతున్నాయి. దూరాన ఉన్న వినియోగదారులకు అందడానికి కాను ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి అయిన ప్రకృతి ఆహారాన్ని ప్యాక్‌చేస్తున్నారు, ప్రాసెస్ చేస్తున్నారు, నిల్వ ఉంచుతున్నారు.

వినియోగదారులు ఇప్పుడు కొనుగోలు చేసే ఆహారం ఎక్కువగా విషపదార్థాల అవశేషాలు లేనిది. ఎరువులు, పురుగుమందులతో కలుషితంకాని తాగునీరు మళ్లీ లభ్యమవుతున్నది. అయితే, రాష్ట్రంలోని ప్రకృతి వ్యవసాయోత్పత్తుల దూరరవాణా కోసం ఖర్చుచేస్తున్న పర్యావరణం ఎక్కువ. ఆంధ్రప్రదేశ్‌నుంచి భారీ రవాణావాహనాల ద్వారా రవాణా అయ్యే ఆహారపదార్థాలు 2001 సంవత్సరంనుంచి అనేక రెట్లు పెరిగాయి. అలాగే రవాణా విమానాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌నుంచి ప్రకృతి ఆహారం కూడా ఎగుమతయ్యే పరిమాణం కూడా పెరిగింది. ఇందుకోసం ప్రభుత్వం కొత్త రవాణా

వ్యవస్థలకు, ఇంధన వ్యవస్థలకు పెద్దపెట్టుబడులను పెట్టవలసి వచ్చింది. ప్రజల పన్నుల నుంచి వచ్చే ఆదాయం ద్వారానూ, విదేశాలనుంచి అప్పులు తేవడం ద్వారానూ ఈ పెట్టుబడులు పెట్టారు.

ప్రకృతి వ్యవసాయం చేసే స్థాయి, ఆ వ్యవసాయోత్పత్తుల వర్తకం స్థాయి పెరిగేకొద్దీ జాతీయ, బహుళజాతీయ కంపెనీల మీద ఆధారపడడం పెరిగిపోయింది. వారికి స్థానికసమాజాల బాగోగులతో నిమిత్తంలేదు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఉండే పర్యావరణ, ఆరోగ్య ప్రయోజనాలను ఇవాళ ఆంధ్రప్రదేశం ప్రజలు గుర్తించగలుగుతున్నప్పటికీ- తమ సొంత భవిష్యత్తును తామే నిర్ణయించుకునే హక్కును స్థానిక సమాజాలు, వ్యక్తులు కోల్పోయారన్నమాట మాత్రం వాస్తవం

ప్రకృతి వ్యవసాయానికి సానుకూల పరిస్థితులు కల్పించడానికి దోహదంచేసిన విధానాలు- సారాంశం

ప్రకృతి వ్యవసాయం, వ్యాపారం భవిష్యత్ దర్శనాన్ని సాధించడానికి దోహదం చేసే విధానాలు :

- ప్రకృతి వ్యవసాయాన్ని ప్రకృతి వ్యవసాయోత్పత్తుల వర్తకాన్ని అనుమతించే రాష్ట్ర విధానాలు
- కృత్రిమ ఎరువులకూ పురుగుమందులు యాంటీబయాటిక్స్ వంటి రసాయన పదార్థాలకూ ఇచ్చే ప్రత్యక్ష పరోక్ష సబ్సిడీలను రద్దుచేయడం, జన్యుమార్పిడిచేసిన వంటలను పశుజాతులను నిషేధించడం
- ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన శాస్త్రవిజ్ఞాన, సాంకేతిక కోణాలలో ప్రభుత్వ రంగ పరిశోధనాసామర్థ్యాన్ని పెంచడం, అందుకు కావలసిన ఆర్థిక సహాయాన్ని, విధానపరమైన సహాయాన్ని అందించడం
- ప్రకృతి వ్యవసాయం అవసరాలకు తగ్గట్టుగా వ్యవసాయ విస్తరణ సేవలను, శిక్షణను సంస్కరించడం, ప్రభుత్వ నిధులను కేటాయించడం
- ప్రకృతి వ్యవసాయోత్పత్తులను స్థానిక, ప్రాంతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అందుబాటులో ఉండేటట్టుగా తగినమార్కెటింగ్ వ్యవస్థలను రూపొందించడానికి నిధులను, విధానాలను రూపొందించడం
- ప్రకృతి వ్యవసాయోత్పత్తులను నిర్ధారించే ప్రమాణాలను, రాష్ట్రస్థాయి యంత్రాంగాన్ని రూపొందించడం. ప్రమాణాల నిర్ధారణ సరళంగా ఉండడం, ఒకే ఒకసారి తనిఖీ, ఒకే సర్టిఫికెట్, ఒక గుర్తింపు- అన్న సూత్రాన్ని పాటించడం

విత్తనాలను, పశుజాతులను కాపాడుకునే హక్కును రైతాంగానికి ఇస్తూ మేథోహక్కుల పరిరక్షణ చట్టం తేవడం

- వ్యవసాయంలో, ఆహారంలో జన్యుమార్పిడి జాతులను నిషేధిస్తూ జీవభద్రతా చట్టం ప్రవేశపెట్టడం
- సమర్థవంతమైన మార్కెట్లను నెలకొల్పడానికి, ప్రకృతివ్యవసాయానికి అవసరమైన సాధనాల, సరుకుల ధరలు న్యాయమైన స్థాయిలో ఉండడం, ప్రకృతివ్యవసాయోత్పత్తుల ధరలను న్యాయంగా, సమర్థవంతమైన రీతిలో నిర్ణయించడం. ఫుడ్ ప్రాసెసింగ్‌లో, ప్రకృతి ఆహారపదార్థాల చిల్లర దుకాణాలలో భారీస్థాయి పెట్టుబడులకు ప్రోత్సాహకాలను అందించడం.
- ప్రకృతి వ్యవసాయోత్పత్తుల దూరరవాణా వర్తకం కోసం అవసరమైన రవాణా, విద్యుత్ ప్రాజెక్టుల కోసం సబ్సిడీలు, సానుకూల విధానాలు

## వీడియో 3 : స్థానిక ఆహార వ్యవస్థలు

2000 సంవత్సరం మే నెలలో ఇంగ్లండ్‌లో పాలరేటు దారుణంగా పడిపోయింది. ఉత్పత్తి దారులు తమకు అయిన ఖర్చుకంటె పాతిక శాతం తక్కువ రేటుకు పాలను అమ్ముకోవలసి వచ్చింది. అమెరికాలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అక్కడ సాధారణ ప్రజలలో కంటే రైతులలో ఆత్మహత్యలు మూడు రెట్లు ఎక్కువగా జరుగుతున్నాయట. గాలికుంటు వ్యాధి ఇంగ్లండ్ పశుపోషణ పరిశ్రమను తీవ్రంగా దెబ్బతీసింది. దాని నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విధాన నిర్ణేతలు, రైతులు ఎన్నో గుణపాఠాలు నేర్చుకున్నారు. ఒక్క ఇంగ్లండ్‌లోనే ముప్పయి లక్షలకు పైగా గొర్రెలను, పాడిపశువులను చంపి, దహనంచేశారు. ఆ హృదయ విదారక దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా టెలివిజన్ ద్వారా ప్రసారమయ్యాయి. ప్రపంచ ప్రజానీకం దిగ్భ్రాంతికి లోనయింది, కలవరపడింది. ఇంగ్లండ్ పశుపోషణరంగం సంక్షోభం ఎంతటి తీవ్రమైనదో, దానికి కారణాలేమిటో అందరికీ తెలిసివచ్చింది. ఈ దృశ్యాలు చూసిన వారికి, ఈ సమస్యలను అర్థం చేసుకున్నవారికీ, పారిశ్రామిక వ్యవసాయం, గ్లోబలైజ్డ్ ఆహారం అంతరించిపోవడం ఒక గుణపాఠాన్ని నేర్పింది. పాశ్చత్యదేశాలు పారిశ్రామిక వ్యవసాయంలో ఎదుర్కొన్న సామాజిక, పర్యావరణసమస్యలు మన దగ్గర తలెత్తకుండా అనుసరించవలసిన కొత్త పద్ధతుల గురించి మన విధాన నిర్ణేతలు సీరియస్‌గా ఆలోచించారు. ఫలితంగా, స్థానికస్వభావం కలిగిన ఆహారోత్పత్తికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలకు అనుకూలంగా ఉండే విధానాలను 2001 సంవత్సరంలో ప్రవేశపెట్టారు.

ఇప్పుడు 2020 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో అనేక స్థానిక ఆహార వ్యవస్థలను చూడవచ్చు. అవి స్థానిక, ప్రాంతీయ వినియోగం కోసం

ఉద్దేశించినవి. అంటే, ఉత్పత్తి దారులకు, వినియోగదారులకు మధ్య 'ఆహారదూరం' సాపేక్షంగా తక్కువ.

స్థానిక ఆహార ఉత్పత్తిలో అనేక వ్యవసాయ, పశుపోషణ పద్ధతులు భాగంగా ఉంటాయి. ఎందుకంటే-స్థానికంగా ఎటువంటి సాగు పద్ధతులను అనుసరించాలన్నది అక్కడి ప్రత్యేక పర్యావరణ, సాంస్కృతిక పరిస్థితులను బట్టి ఉంటుంది. పశుజాతుల్లో, పంటరకాల్లో స్థానిక ఆహార వ్యవస్థ ఎక్కువ వైవిధ్యం ఉండేలా చూస్తుంది. కొన్ని కొన్ని లక్షణాలను బట్టి, కొన్ని కొన్ని గుణాల కోసం రైతులు వేలాది ఏళ్లుగా మొక్కలను, పంటలను, పశువులను ఎంపిక చేసుకుంటూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని అసంఖ్యాక స్థానిక ఆహార వ్యవస్థలలో వ్యవసాయ జీవవైవిధ్యం చాలా ఎక్కువ స్థాయిలో ఉన్నది. సాధారణంగా ఇక్కడి పంటపొలాలు చిన్నవి. ఫలితంగా అనేక ఆహారేతర జీవ జంతు జాతులు ఆహార వ్యవస్థతో పాటుగా సహజీవనం చేస్తున్నాయి. గరికపచ్చ భూములు, బీడుభూములు, చెట్లు, పొదలు, అడవులు, జలాశయాలు-అన్నీ కలసి అనేక జీవ, జంతుజాతుల ఉనికికి సహాయం చేస్తాయి. జీవవైవిధ్యం కొనసాగడానికి దోహదం చేస్తాయి. వైవిధ్యభరితమైన, చిన్న చిన్న వ్యవసాయభూముల మీద ప్రతీదానికీ అనేక ఉపయోగాలు ఉంటాయి. ఏదీ వృధాకాదు. పంటనుంచి మిగిలిన పరిగే, గడ్డీగాదం పశుగ్రాసంగా మారుతుంది. పచ్చిగడ్డి పశువులకు పరుపు అవుతుంది. చెత్తా, ఆకులూ కూరల వ్యర్థపదార్థాలు కోళ్లకు, బాతులకు దాణా అవుతుంది. భూసారాన్ని ఆరోగ్యంగా ఉంచడం కోసం రకరకాల రక్షక పంటలను వేయడం ద్వారా, నేలపైపొరలలోని తేమను రక్షించే చర్యలను చేపట్టడం ద్వారా, గాలిలోని నత్రజనిని పోషకాలుగా మార్చే మొక్కలను వేయడం ద్వారా, కంపోస్టింగ్ ద్వారా ప్రయత్నిస్తారు. ప్రకృతి వ్యవసాయానికి, సుస్థిర భూ వినియోగానికీ భూసార పరిరక్షణ ఎంతో కీలకమయినది.

పరిజ్ఞానాన్ని అధికంగా ఉపయోగించే, వైవిధ్యభరితమైన వ్యవసాయాన్ని పెంపొందించడానికి ప్రభుత్వ శాస్త్రవేత్తలు కూడా క్రియాశీలంగా మద్దతు ఇచ్చారు. స్థానిక జ్ఞానంలోని అత్యుత్తమ అంశాలను, వ్యవసాయపర్యావరణశాస్త్రంలోని ఆధునిక శాస్త్రీయ అంశాలను భాగస్వామ్యపరిశోధన, అభివృద్ధిపద్ధతుల ద్వారా మిళితం చేయడం జరిగింది. పరస్పర గౌరవం ఆధారంగా రైతులతో కలిసి నిజమైన భాగస్వామ్యంలో పనిచేయడానికి ప్రభుత్వ శాస్త్రవేత్తలకు ఇప్పుడు ప్రోత్సాహకాలు దొరుకుతున్నాయి.

ఆహారం మార్కెటింగ్ పూర్తిగా వికేంద్రీకరణ చెందింది. ఎప్పుడూ స్థానికమైన ఆహారమే తాజాగా వినియోగంలో ఉండడం వల్ల-ఆహారం ప్యాక్ చేయడం కానీ, ప్రాసెస్ చేయడం కానీ, రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం కానీ తరచుగా అవసరమైఉండదు. స్థానిక ఆహార వ్యవస్థలు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని, తాజా ఆహారాన్ని, పోషక విలువలున్న ఆహారాన్ని అందిస్తుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులంటే అర్థం - బయటినుంచి ఎరువులు, క్రిమిసంహారకాలు, విత్తనాలు మొదలైనవి అవసరంలేని వ్యవసాయం అని మాత్రమే అర్థం కాదు. ఈ వ్యవసాయం వల్ల ఉత్పత్తి అయ్యే ఆహారం - విషపదార్థాలు లేని, రసాయనాల మిగులు లేని ఆహారమన్నమాట.

ఆంధ్రప్రదేశ్ అంతటా రైతులు స్థానికంగా ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్)లను ఏర్పాటుచేసుకున్నారు. ఈ పంపిణీ వ్యవస్థలు స్థానికంగా ఉత్పత్తి అయ్యే ధాన్యాలను పంపిణీ చేస్తాయి. గ్రామస్థులే వాటిని నిర్వహించుకుంటారు, నియంత్రించుకుంటారు. ఎక్కడో దూరాన ఉన్న ప్రాంతాలలో ఉత్పత్తి అయ్యే బియ్యాన్ని, గోధుమలను పంపిణీ చేసే పాత పిడిఎస్‌ల స్థానంలో ఈ కొత్త పిడిఎస్, ప్రజలే నిర్వహించుకునే పిడిఎస్‌లలో బియ్యం, మొక్కజొన్నలతో పాటు మెట్ట ప్రాంతాల ధాన్యాలను కూడా పంపిణీ చేస్తారు. ఈ పద్ధతిలో ఏర్పాటయిన పిడిఎస్ వల్ల ఆహార భద్రత మెరుగుపడడమే కాదు, మెట్టప్రాంతాలలో స్థానికంగా పండించే జొన్నలు, చిరుధాన్యాల వంటివి, నీరున్న ప్రాంతాలలో వరి వంటివి పండించడానికి ప్రోత్సాహం లభిస్తుంది. స్థానికంగా పండే ధాన్యాల మీద ఆధారపడిన పిడిఎస్ కాబట్టి, అది బీడు భూములను ముఖ్యంగా రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలలోని బీడుభూములను తిరిగి సేద్యంలోనికి తీసుకురావడానికి ప్రోత్సాహం ఇచ్చినట్లయింది.

స్థానిక ఆహార, వ్యవసాయ వ్యవస్థల పునరుజ్జీవనం అంటే వర్తకానికి వ్యాపారానికి స్థానం లేదని కాదు. స్థానికంగానే ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉన్న సరుకుల విషయంలో దురప్రయాణాల వర్తకాన్ని తగ్గించడం మాత్రమే ఇక్కడ ఉద్దేశించారు. సాధ్యమయినంత ఎక్కువ వర్తకం ఉండడమే ఉత్తమమన్న ధోరణిలో కాకుండా, వర్తకానికీ స్థానిక ఉత్పత్తికీ ఉండవలసినంత ఆరోగ్యకరమైన సమతూకాన్ని సాధిస్తూ రాష్ట్ర ఆర్థిక విధానాలు రూపొందాయి.

రాష్ట్రంలోని వివిధప్రాంతాల నుంచి వచ్చిన నివేదికలలో చూసినట్టు - స్థానికీకరణ వ్యూహం వల్ల అనేక ప్రయోజనాలు సమకూర్చాయి. స్థానిక రైతులు, మిల్లర్ల వంటి స్థానిక ప్రాసెసర్లు, స్థానిక స్వతంత్ర దుకాణాలవారు, స్థానిక వినియోగదారులు, స్థానిక హోటళ్లు వంటి వారి మధ్య సన్నిహిత సంబంధాలను, తక్కువ దూరాలను సాధించడం జరిగింది. ఇప్పుడు అమలులో ఉన్న స్థానిక మార్కెట్లు, రైతుల అంగళ్లు మధ్యదళారుల సంఖ్యను గణనీయంగా తగ్గించివేశాయి. ఫలితంగా రైతులకు మరింత ఎక్కువ ఆదాయం లభిస్తోంది. వారి లాభం పాలు పెరిగింది. స్థానిక గ్రామ సమాజంలో ఇప్పుడు డబ్బు ఎక్కువగా ఆడుతోంది. కమ్యూనిటీ సభ్యుల మధ్య పరస్పర సంబంధాలు ఇప్పుడు పెరిగాయి. గత పది సంవత్సరాలలో గ్రామ ఆర్థిక వ్యవస్థలు గణనీయంగా పునరుజ్జీవనం పొందాయి. అత్యధిక సంఖ్యలో ప్రజలు నివసించేది ఈ గ్రామాలలోనే.

గ్రామ ఆర్థిక వ్యవస్థలు, సమాజాలు బలపడడం మొదలుపెట్టగానే, పట్టణాలలో నగరాలలో నివసించే వారిలో చాలా మంది తిరిగి గ్రామీణ ప్రాంతాలకు వచ్చేస్తున్నారు. మెరుగైన జీవితం, మంచి వాతావరణం కోసం వారు తిరిగి పల్లెలకు వస్తున్నారు. గ్రామాలలో ఆదాయమార్గాలు గణనీయంగా పెరిగాయి. వ్యవసాయేతర ఉపాధికి చాలా అవకాశాలున్నాయి. అలాగే, గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో జీవనప్రమాణాలు, విద్యాప్రమాణాలు పెరగడం వల్ల అనేక మంది యువకులకు ప్రయాణావకాశాలు, ఇతర అవకాశాలు ఏర్పడ్డాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థానిక ఆహార వ్యవస్థలకు అనుకూలంగా విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నందువల్ల - గ్రామీణ ప్రాంతాలలో తగిన సాంకేతిక పరిజ్ఞానాలు వృద్ధి చెందడానికి అది దోహదపడింది. ఉదాహరణకు, 2020 నాటికి గ్రామీణ ప్రాంతాలలో ఆధునిక కమ్యూనికేషన్లు, సమాచార సాంకేతిక సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే, ఆధునిక యంత్రపరికరాలు ఉత్పత్తిని, ఆదాయాలను పెంచాయి, స్థానిక పరిశ్రమలలో పనిపరిస్థితులను మెరుగుపరచాయి. చేతివృత్తులవారి, ఇతర నైపుణ్యకార్మికుల పరిజ్ఞానం, నైపుణ్యాలు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో ఆలోచించి -21 శతాబ్ది ప్రారంభంలో అందుబాటులో ఉన్న కొన్ని ఉత్తమమైన ఇంధనవ్యవస్థలలో పెట్టుబడిపెట్టింది. సాంకేతికంగా ఎంతో ఉన్నత స్థాయికి చెంది, వికేంద్రీకరణ పొందిన ఆ వ్యవస్థలు పర్యావరణానికి హానిచేయనివి, సమర్థవంతంగా ఇంధన అవసరాలను తీర్చేవి. 2020 నాటి వివిధ స్థానిక ఆహార వ్యవస్థల ఇంధన అవసరాలను ఈ వ్యవస్థలే ఇప్పుడు తీరుస్తున్నాయి.

స్థానికంగా ఉండే ఆహార వ్యవస్థలకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలు ఉండడం వల్ల రాష్ట్రంలోని రాజకీయాల స్వభావం, పౌరస్వభావమూ ఎంతో మారిపోయాయి. ముఖాముఖి సంప్రదింపులు, భాగస్వామ్య ప్రజాస్వామ్యము విస్తృతంగా వేళ్లూనాయి. ఏ పంటలను పండించాలి, ఎలా పండించాలి అన్న వాటిని ప్రజల అవసరాల ఆధారంగా, ప్రకృతి అనుకూలత ఆధారంగా, స్థానిక పరిస్థితుల ఆధారంగా నిర్ణయించడమే తప్ప, ప్రభుత్వాలు, అధికారులు, అంతర్జాతీయ రుణదాతల ఆదేశాల ప్రకారం కాదు. పంటల విషయంలో నియంత్రణ ఇప్పుడు పూర్తిగా స్థానిక సమాజాల చేతుల్లో ఉన్నది. ప్రభుత్వం విధానాల ద్వారానూ, ఆచరణ ద్వారానూ ఈ అధికారానికి వెన్నుదన్నుగా నిలిచింది.

స్థానిక ఆహార వ్యవస్థలను, ఆర్థిక సమాజాలను సాధించడానికి దోహదకారి అవుతున్న విధానాలు

- దేశీయ ఆర్థికసమాజాల కోసం రక్షణ చర్యలను తిరిగి ప్రవేశపెట్టడం. స్థానికంగా ఉత్పత్తి అయ్యే సరుకులను కానీ సేవలను కానీ దిగుమతి చేసుకోవడం మీద గతంలో ఉన్న ఆంక్షలను తిరిగి విధించాలి.
- ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రాంతీయంగానూ-ఆహార ఉత్పత్తి, ఆహార ప్రాసెసింగ్, తయారీ, సేవలు- వీటన్నింటినీ స్థానికంగానే మార్కెట్‌చేసేటట్టు "ఇక్కడివి ఇక్కడే" అనే విధానం రూపొందించుకోవాలి.
- డబ్బును స్థానికీకరించడం. అంటే ఇక్కడ సమకూరే ధనాన్ని ఇక్కడనే అధిక భాగం ఉంచడం వల్ల ఆర్థిక సమాజాలను, గ్రామసమాజాలను పునర్నిర్మించడం సాధ్యపడుతుంది.
- స్థానికంగానే వ్యాపార పోటీలను అనుమతించడం. తద్వారా రక్షిత ఆర్థికవ్యవస్థలనుంచి వచ్చి ఇక్కడ పోటీకి దిగే గుత్తసంస్థలను రంగంనుంచి తప్పించవచ్చు. ఉత్పత్తులు, సేవలు అన్నీ ఉత్తమ శ్రేణిలో ఉండేట్టు చూడడం.
- వ్యవసాయరంగానికి ప్రత్యక్షంగా, ప్రచ్ఛన్నంగా, పరోక్షంగా ఇస్తున్న సబ్సిడీలను అన్నిటినీ స్థానిక, చిన్న తరహా వ్యవసాయ ఉత్పత్తి దారులకు తరలించాలి. వైవిధ్యపూరితమైన, పర్యావరణ అనుకూలమైన, న్యాయమైన ఆహార వ్యవస్థల దిశగా స్థానిక, చిన్నతరహా రైతాంగాన్ని నడిపించడానికి ఈ సబ్సిడీలను వినియోగించాలి.
- ప్రభుత్వ రంగంలోని వ్యవసాయపరిశోధన, విస్తరణ సేవలకు కొత్త దృక్పథాన్ని అలవరచడానికి తగినన్ని నిధులను అందించాలి. భాగస్వామ్య వైఖరులను, ప్రాధాన్యాల నిర్ణయంలో, సాంకేతిక నిర్ధారణలలో ప్రజాస్వామ్యబద్ధమైన నియంత్రణను వారు స్వీకరించవలసి ఉంటుంది.
- ఆహారం సురక్షితా ప్రమాణాలను నిర్ధారించడానికి రెండు అంచెల వ్యవస్థను ఏర్పాటుచేయాలి. ఒకటి భారీ ఉత్పత్తి దారులకు, మార్కెటీర్లకు వర్తించేది. ఈ నిబంధనావళి కఠినంగా ఉండాలి. మరొకటి స్థానికంగా ఉండే చిన్న తరహా వర్తకసంస్థలకు వర్తించేది. ఇది సరళంగా, వెసులుబాటుతో ఉండాలి.
- గ్రామాలను, చిన్న టౌన్లను, వ్యవసాయ ఆర్థిక సమాజాలను పటిష్టం చేయడానికి అనువుగా సుస్థిర, వికేంద్రీకృత ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించాలి. నిరాంతరాయమైన ఇంధనాన్ని చిన్న తరహాలో ఉత్పత్తి చేయడానికి అవసరమైన పరిశోధనలను, ఆర్థిక సహాయాన్ని అందించాలి.
- భూసంస్కరణలను అమలుచేయాలి. మిగులుభూములను పంపిణీ చేయాలి. కౌలుదారులకు రక్షణ కల్పించాలి.
- ఆర్థిక సమాజాలు మరింత స్థానికీకరణ చెందుతున్న క్రమంలో పరివర్తన దశ కోసం, పర్యావరణ స్వయం

పునరుత్పాదన కోసం నిధులు అవసరమవుతాయి. వనరుల వినియోగం మీద పన్నులు వేయడం ద్వారా, లాభార్జన అవకాశాలున్న డబ్బు లావాదేవీల మీద పన్నులు విధించడం ద్వారా ఈ నిధులను సమకూర్చుకోవచ్చు.

- విత్తనాలను ఒక పంట నుంచి మరొక పంటకు కాపాడుకోవడానికీ, పంట రకాలను, పశురకాలను మెరుగుపరచుకోవడానికీ రైతులకున్న హక్కును పరిరక్షించాలి. జన్యువనరుల పేటెంటింగ్‌ను నిరోధించాలి.
- విదేశీ సహాయాలు, వర్తక నియమాలు- వీటి అంతిమ లక్ష్యాలు అంతర్జాతీయ పోటీతత్వాన్ని కాక, స్థానిక సమాజాలను, స్థానిక నియంత్రణను నిర్మించేటట్టుగా ఉండాలి. స్థానికంగా ఉత్పత్తి అయ్యే సరుకుల దిగుమతులను క్రమబద్ధంచేయడానికి వర్తకసుంకాలను అవసరాన్ని బట్టి విధించాలి.

# వీడియో ప్రొడక్షన్, కమ్యూనికేషన్స్ సాంకేతిక వర్గం

### డైరెక్షన్
పి.వి. సతీష్

### స్క్రిప్ట్
పి.వి. సతీష్
మిచెల్ పింబర్ట్

### ప్రొడక్షన్
డివిఎస్ఎస్ గోపాలకృష్ణ
వి. విజయకుమార్

### కెమెరా
విజేంద్రపాల్
నరసింహారెడ్డి
నారాయణమూర్తి
శ్రీకాంత్
గణేశ్
చిన్ననరసమ్మ
యేసు
మంజుల
శకుంతల
కవిత

### యాంకర్లు
దేవిక
ఆర్.వి. ప్రసాద్

### వార్తాప్రతినిధులు
ఇ. కృష్ణారావు
సరస్వతీ ప్రదీప్

### వీడియో ఎడిటర్
కె. పూజారి
అజయ్ కురియన్
పి ఎం కె రాజు

### రిసోర్సు వ్యక్తులు
వి. శ్రీనివాస్
కె. అనిత
జగ్జీవన్‌రామ్
కృష్ణమోహన్

### ఆఫ్ స్క్రీన్ వాయిస్
గాయత్రి
కురుప్

### స్క్రిప్ట్ అనువాదం
కె.శ్రీనివాస్

### సెట్ డిజైనింగ్
శిష్ట్లా
రామాచారి

### ఆర్టిస్టులు
బిడిఎల్ సత్యనారాయణ
బి వెంకటరావు
సాంబశివరావు

### మేకప్
చంటి

### సాంకేతిక పర్యవేక్షణ
వెంకటేశ్వర్లు
ఆర్ ఎమ్ స్వామి

### స్టూడియోలు
వీడియో సోర్స్, హైదరాబాద్
హైదరాబాద్ యూనివర్సిటీ
తరంగిణి వీడియో స్టూడియో
బార్స్ ఇ టోన్ టెలివిజన్ ప్రైవేట్ లి., పూణే

### అతిథి నిపుణులు
ప్రొఫెసర్ నరసింహారెడ్డి, డీన్, హైదరాబాద్ యూనివర్సిటీ, హైదరాబాద్
శివరామకృష్ణ, శక్తి (ఎన్జీవో), హైదరాబాద్
ఆర్. మురళి, మారి (ఎన్జీవో), వరంగల్
డాక్టర్ రామాంజనేయులు, సైంటిస్టు, డైరెక్టరేట్ ఆఫ్ సీడ్స్ ఇ రీసర్చి, హైదరాబాద్
ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్

### చిత్రాన్ని నిర్మించింది
డెవలప్‌మెంట్ పర్స్పెక్టివ్స్, హైదరాబాద్

### కృతజ్ఞతలు
హైదరాబాద్ యూనివర్సిటీ టీమ్‌కు
దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ టీమ్‌కు

# అనుబంధం 2 : ఆడియో విజువల్ రికార్డింగ్ బృందం

మొత్తం ప్రజాతీర్పు ప్రక్రియ, తక్షణ ఫలితాలు మొత్తం కూడా దృశ్య శ్రవణ సాధనాల ద్వారా డాక్యుమెంటు చేయడం జరిగింది. ఈ రికార్డింగు మొత్తం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లోని ఫైన్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం వారు చేశారు.

| | |
|---|---|
| ప్రొడ్యూసర్ | నిరుపమా సర్కార్ |
| కో ప్రొడ్యూసర్ | ఎ. వీణా ప్రసాద్ |
| ప్రొడక్షన్ అసిస్టెంటు | పి. సతీష్ |
| కెమెరామెన్ | గణేశన్, శ్రీకాంత్ |
| టీమ్ మేనేజర్ | మాధవరావు |
| టెక్నికల్ అసిస్టెంటు | నామ్‌దేవ్ (వీడియో సోర్సెస్) |

కార్యక్రమం జరుగుతుండగా అనేక కెమెరాలతో ఆన్‌లైన్‌గా చిత్రీకరించడం డిజిటల్ ఫార్మట్‌లో జరిగింది. కొత్త, మినియేచరైజ్డ్ వీడియో సాంకేతికత వల్ల వీడియో, ఆడియో ఆర్కైవ్స్ కోసం ఆన్‌సైట్ ప్రొడక్షన్ సాధ్యమైంది.

రికార్డింగు బృందం ఈ కింది పరికరాలు వాడింది.

1. డిజిటల్ కెమెరాలు 2
2. స్విచ్చర్ / విజన్ మిక్సర్ 1
3. డిజిటల్ రికార్డర్ 1
4. మానిటర్లు 3
5. ఫిక్స్‌డ్, మొబైల్ మైక్రోఫోన్లు

# అనుబంధం-3 : ఆంధ్రప్రదేశ్ ఆహార, వ్యవసాయ భవితవ్యాల మీద పౌరన్యాయ స్థానం తీర్పు

## ప్రజాతీర్పు

**జూన్ 26 నుంచి జులై 1, 2001 వరకు**

మేము, జూన్ 26 - జులై 1 మధ్య, సాక్ష్యాలు విని, చర్చించి ఈ కింది తీర్పు ఇస్తున్నాము.

## మా విజన్

**మేం కోరుకుంటున్నాం**

- ఆహారము, వ్యవసాయము స్వావలంబన కోసం వనరుల మీద కమ్యూనిటీకి ఆధిపత్యం ఉండాలి.
- ఆరోగ్యంగా ఉండే నేలలు, రకరకాల పంటలు, చెట్లు, పశువులు, మా దేశీయ పరిజ్ఞానం, నైపుణ్యాలు, స్థానిక సంస్థలు - కొనసాగాలి

**మేం వ్యతిరేకిస్తున్నాం**

- ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం మీద ఆధారపడ్డ వారి సంఖ్య 70 శాతం నుంచి 40 శాతానికి తగ్గించడాన్ని
- భూకమతాల స్థిరీకరణను, గ్రామీణులను నిర్వాసితులను చేయడాన్ని
- కాంట్రాక్టు వ్యవసాయాన్ని
- ఉపాధిని మింగేసే యాంత్రీకరణను
- జన్యుమార్పిడి పంటలను, విటమిన్-ఎ బియ్యాన్ని, బిటిపత్తిని
- మందు మొక్కల మీద అధికారం కోల్పోవడాన్ని, వాటిని ఎగుమతి చేయడాన్ని

## పూర్తి చిత్రం

### వనరుల అందుబాటు, వనరుల నియంత్రణ

#### 1. భూమి

**మేం కోరుకుంటున్నాం**

- మేం పనిచేసే భూములు మావే కావాలని
- భూపట్టాలు తిరిగి ఇవ్వాలని, అడవిమీద అధికారం కావాలని
- భూావంపిణీకి, భూాములను తిరిగిపొందడానికి (రిక్లమేషన్‌కి) పథకాలని

**మేం వ్యతిరేకిస్తున్నాం**

- భూకమతాల స్థిరీకరణను, గ్రామీణ ప్రజలను నిర్వాసితులను చేయడాన్ని
- కాంట్రాక్టు వ్యవసాయాన్ని

#### 2. నీరు

**మేం కోరుకుంటున్నాం**

- సాగునీటి చెరువుల పునరుద్ధరణ
- కరువుకాలంలో సాగునీరు
- చిన్న రైతులకు సంఘటిత యాజమాన్యం కింద బోరుబావులు

#### 3. విత్తనాలు

**మేం కోరుకుంటున్నాం**

- స్వావలంబన
- పొలాల నుంచి సేకరించిన విత్తనాలను తిరిగి వాడుకునే హక్కు

#### 4. మందు మొక్కలు

**మేం వ్యతిరేకిస్తున్నాం**

- మందు మొక్కల ఎగుమతి, వాటిమీద ఆధిపత్యం కోల్పోవడం

### వ్యవసాయ, ఆహార విధానాలు

**మేం కోరుకుంటున్నాం**

- మా రకరకాల పంటలను రకరకాల పశుజాతులను కాపాడుకోవడం
- మా వ్యవసాయంలో పశువుల పాత్రను కొనసాగించడం (మేకలతో సహా)
- భూమి సారాన్ని కాపాడే పద్ధతులు (పశుసంపద, పెంట ఎరువు, మిశ్రమ పంటలు, రక్షక పంటలు (కవర్ పంటలు) వేప చెక్క, వేరుశెనగ పొట్టు వంటి వాటితో సహా)

- తక్కువ పెట్టుబడుల వ్యవసాయ విధానాలు

స్థానిక వ్యవసాయం : పూడిక మన్ను, పెంట ఎరువు, సాంప్రదాయిక విత్తనాలు, మెరుగుపరచిన విత్తనాలు, మిశ్రమ-మార్పిడి పంటలు, పొలంలోని విత్తనాలు, విత్తనాల మీద అధికారం ఉన్న వ్యవసాయం

### జీవనాధార భద్రతను కల్పించే వ్యవసాయం

**మేం వ్యతిరేకిస్తున్నాం**

- ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం మీద ఆధారపడిన జనసంఖ్యను 70 శాతం నుంచి 40 శాతానికి తగ్గించడం

### సైన్సు టెక్నాలజీ

**మేం కోరుకుంటున్నాం**

- స్థానిక జ్ఞానానికి ఆవిష్కరణలకీ గుర్తింపు, గౌరవం
- చెరువుల పునరుద్ధరణ, దేశీయ నీటి యాజమాన్య పద్ధతుల పునరుద్ధరణ
- తగిన సాగునీరు

**మేం వ్యతిరేకిస్తున్నాం**

- జన్యుమార్పిడి పంటలు, విటమిన్-ఎ బియ్యం, బిటి పత్తితో సహా పనికిమాలిన సాంకేతికత పరిశోధనకోసం డబ్బు వృధా చేయడం. ఆ డబ్బును మా విజన్ కోసం ఖర్చుచేయకపోవడం
- ఉపాధిని దూరం చేసే యాంత్రీకరణ
- సహాయ, రక్షణ వ్యవస్థలు

**మేం కోరుకుంటున్నాం**

- అప్పులు లేని సేద్యం, సరిపడా పశుసంపద, నీటి వనరులు
- సహజ వ్యవసాయ ఉత్పాదకాల కోసం సబ్సిడీలు. పెంట ఎరువు, ప్రాకృతికమయిన పురుగుమందులు, పాత పంటరకాలు
- ఉత్పత్తికి స్థానిక మార్కెట్లు, ఉత్పాదకాలకి స్థానిక వనరులు
- ప్రజాపంపిణీ వ్యవస్థ - మా రేషన్ కార్డులు లాగేసుకోకుండా ఉండడం
- అంత్యోదయ కార్యక్రమం మాదాకా రావడం
- మా పనికి, ఉత్పత్తులకు తగినంత ప్రతిఫలం
- స్వావలంబనకి, స్థానిక నిర్ణయాలకి అవసరమైన మా సొంత వ్యవస్థలు

**మేం కోరుకుంటున్నాం**

- కమ్యూనిటీ పంటల ప్రణాళిక
- రైతుప్రతినిధుల సంఘాల ఏర్పాటు
- స్థానిక యాజమాన్యం, అందుబాటులో ధరలు, ధరల నియంత్రణ, మార్కెట్లు, మార్కెటింగు
- దేశీయ వనరుల నిర్వహణలో పునర్ శిక్షణ
- ఇతర ప్రాంతాల రైతులతో సంబంధాలు

**మేం వ్యతిరేకిస్తున్నాం**

- కాంట్రాక్టు వ్యవసాయం

### సంస్కృతి

**మేం కోరుకుంటున్నాం**

- మా సొంత సంస్కృతిని కాపాడే వ్యవసాయ విధానం (చెట్లు, పంటలు, పశువుల, పండగలతో సంబంధం ఉండేటట్టు)

**మేం అభ్యంతర పెడుతున్నాం**

- ఆహారంలో స్వావలంబన లేకపోవడం వల్ల ఆహార ధరలు ఆకాశాన్నంటుతున్నందువల్ల ఆతిథ్యం ఇచ్చే అవకాశం కోల్పోవడం

### పర్యావరణ - మానవ ఆరోగ్యం

**మేం కోరుకుంటున్నాం**

- మంచి, భద్రమైన ఆహారం (విషపదార్థాల అవశేషాలు లేనిది)
- పోషక విలువలున్న రకరకాల ఆహారం
- విషరసాయన పురుగుమందులు అవసరం లేని వ్యవసాయానికి మారడం
- రకరకాల చెట్లున్న దేశీయ అడవులు, ఒకేరకం చెట్లున్న ప్లాంటేషన్స్ (ఉదాహరణకు- యూకలిప్టస్) కాగూడదని

### ప్రభుత్వాల పాత్ర

**మేం కోరుకుంటున్నది**

- ప్రభుత్వ ఉద్యోగులందరూ- అటవీ అధికారులతో సహా- మాకు జవాబుదారీగా ఉండాలి.
- ప్రభుత్వాలకు ఈ కింది విషయాలకు బాధ్యత వహించాలి
- తాగునీరు వంటి ప్రాథమిక సదుపాయాలను కల్పించడం
- ధరని నియంత్రించడం
- వ్యవసాయంలో కనుక ప్రాణహాని కలిగితే నష్టపరిహారం చెల్లించడం
- చిన్న, సన్నకారు రైతులకు, భూమిలేని రైతులకి అప్పులు ఇవ్వడం
- నకిలీ పురుగుమందులను నిషేధించడం
- విదేశీనిధులు (తెల్లవాళ్లనుంచి వచ్చేవి) ఈ విజన్‌ను అనుసరించి పేదవాళ్లకి ఉపయోగపడడం